

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 122

బుధవారం 23-7-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'సమం' చేసే లక్ష్యంతో...

మాంచెస్టర్‌లో నేటి నుంచి ఇంగ్లండ్‌తో భారత్ నాలుగో టెస్టు -14లో



ఏం మాయ చేశావ్!

మెజీషియన్, మెంటలిస్ట్ సుహానీ షాకు 'బెస్ట్ మ్యాజిక్ క్రియేటర్' అవార్డు -13లో



'అపాచీ' ఆగయా..

15 నెలల నిరీక్షణకు తెర.. అత్యాధునిక ఏహెచ్–64ఈ అపాచీ హెలికాప్టర్లు అమెరికా నుంచి భారత్‌కు చేరుకున్నాయి.

వివరాలు 6లో ▸



ఫ్యాటీ లివర్.. పారాహుషార్!

మీ పొట్ట బాగా ముందుకు వచ్చినట్టు కనిపిస్తోందా? ఇలా పొట్ట ముందుకు వస్తే మొదట చూసుకోవాల్సింది కాలేయాన్ని!.

వివరాలు 2లో ▸



ఉద్యోగాలకు టాప్.. టాటా గ్రూప్

దేశీయంగా ఉద్యోగాలకు అత్యంత ఆకర్షణీయమైన బ్రాండ్లుగా టాటా గ్రూప్, గూగుల్ ఇండియా, ఇన్ఫోసిస్ నిలిచాయి.

వివరాలు 15లో ▸



'స్థానిక' పోరు.. కారు హుషారు

స్థానిక సంస్థల ఎన్నికలకు బీఆర్ఎస్ సిద్ధం అవుతోంది. అన్ని స్థాయిల్లో సమన్వయ కమిటీల ఏర్పాటుపై పార్టీ దృష్టి పెట్టింది.

వివరాలు 5లో ▸

మద్దతు కూడగడతాం



బీసీ రిజర్వేషన్ల బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదం పొందేలా పార్టీలను కోరతాం: డిప్యూటీ సీఎం భట్టి

అసెంబ్లీలో ఇచ్చిన మద్దతు పార్లమెంట్‌లో కూడా ఇస్తారన్న నమ్మకం ఉంది

బీసీ రిజర్వేషన్లు సహేతుకమని భావించే అన్ని పార్టీలనూ కలుస్తాం

- రాహుల్ ఆలోచనను కేంద్రం ఆమోదించాల్సిన పరిస్థితి వచ్చింది
- దేశంలో ఎక్కడ, ఎప్పుడు కులగణన జరిగినా తెలంగాణనే మోడల్‌గా ఉండబోతోంది.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి దళితులన్నా... బీసీలన్నా చులకన భావం ఉన్నట్టుంది
- లీగల్ నోటీసులకు భట్టి భయపడడు... నేను మాట్లాడిన దానికి కట్టుబడి ఉన్నా..

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోని వెనుకబడిన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అసెంబ్లీ ఆమోదించిన బిల్లుకు పార్లమెంట్ ఆమోదం కోసం ప్రయత్నిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సహేతుకమని భావించే ప్రతీ రాజకీయ పార్టీని కలుస్తామన్నారు. ఈ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదం పొందేలా సహకరించాలని అన్ని పార్టీలను కోరతామని, అందరి మద్దతూ కూడగడతామని చెప్పారు. మంగళవారం ఆయన సచివాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఢిల్లీ వెళ్లి జాతీయ స్థాయి పార్టీలను కలిసి మద్దతు కోరతామని చెప్పారు. శతాబ్దాల నుంచి అన్యాయం జరుగుతున్న వర్గాలకు న్యాయం చేసే దిశలో తాము మంచి సంకల్పంతో తీసుకున్న నిర్ణయానికి అందరూ సహకరిస్తారనే ప్రగాఢ నమ్మకం ఉందని చెప్పారు. ఈ బిల్లును అసెంబ్లీలో పెట్టి చర్చించినప్పుడు బీజేపీ, బీఆర్ఎస్ కూడా మద్దతిచ్చాయని, ఇప్పుడు పార్లమెంట్‌లో కూడా ఆ పార్టీలు మద్దతివ్వాలని కోరారు. ఈ బిల్లు విషయంలో కేంద్ర ప్రభుత్వం ఏ సమాచారం కోరినా ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

అన్నీ వివరిస్తాం

రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్ల పెంపు విషయంలో అనుసరించిన శాస్త్రీయ పద్ధతులను దేశంలోని పార్లమెంట్ సభ్యులకు

మిగతా 3వ పేజీలో ▶

నాడు అవసరం లేదన్న వారే..

అసలు కులగణన అవసరమే లేదని పార్లమెంటులో చెప్పిన ప్రధాని నరేంద్రమోదీ.. తెలంగాణలో జరిగిన సర్వే అనంతరం దేశవ్యాప్తంగా జరిగే జనగణనలో కులగణన చేయాలనే నిర్ణయానికి వచ్చారని భట్టి చెప్పారు. 'తెలంగాణలో జరిగిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల గణన (సీప్యాక్స్) దేశంలోనే ఒక చారిత్రక సర్వేగా నిలిచిపోనుంది. సర్వే వద్దన్న మోదీ తెలంగాణ సర్వేతోనే ఒప్పుకునే స్థితికి తీసుకొచ్చాం. ఈ ప్రక్రియకు ఆద్యుడైన రాహుల్‌గాంధీ ఆలోచనను కేంద్ర ప్రభుత్వం అనుసరించేలా చేశాం. ఇక దేశంలో ఎప్పుడు, ఎక్కడ, ఏ రాష్ట్రంలో సర్వే జరిగినా తెలంగాణను మోడల్‌గా తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎక్కడా ఎలాంటి పొరపాట్లు లేకుండా శాస్త్రీయంగా ఈ సర్వే చేశాం' అని భట్టి చెప్పారు.

రాజీపడలేకే..

జస్టిస్ వర్మ అభిశంసన అంశమే కారణమా?

- అభిశంసనపై విపక్షాల నోటీసును సమ్మతించిన జగదీప్ ధన్‌ఖడ్
- ఆ నోటీసుకు ఓకే చెప్పడాన్ని జీర్ణించుకోని ప్రభుత్వం!
- ఆ కారణంగానే బీఏసీ భేటీకి నడ్డా, రిజిజు డుమ్మా
- వీళ్ల గైర్హాజరీతో ఆగ్రహంతో రాజీనామా చేసిన ధన్‌ఖడ్!

- వివరాలు 6లో ▶





ఓటర్ల హక్కులను కాలరాస్తున్నారంటూ పార్లమెంట్ బయట నిరసన తెలుపుతున్న విపక్ష ఎంపీలు రాహుల్, అఖిలేశ్, కనిమొళి తదితరులు

రెండో రోజూ రగడ

పార్లమెంట్‌లో కొనసాగిన విపక్షాల ఆందోళన

- ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఆపరేషన్ సిందూర్‌పై వెంటనే చర్చించాలని పట్టు
- విపక్ష ఎంపీల తీరుపై స్పీకర్ ఆగ్రహం
- చర్చకు తాము సిద్ధమని, సభకు సహకరించాలని ప్రభుత్వం విజ్ఞప్తి
- పలుమార్లు వాయిదా పడిన ఉభయ సభలు

- వివరాలు 6లో ▶

న్యూస్‌రీల్

ట్యాంక్‌బండ్‌పై త్వరలో దాశరథి విగ్రహం



తెలంగాణ కీర్తికి ప్రతీక అయిన దాశరథి కృష్ణమాచార్య విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్ఠిస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఆయన శతజయంతి వేడుకల సందర్భంగా ప్రముఖ కవి అన్నవరం దేవేందర్‌కు మంత్రి దాశరథి పురస్కారాన్ని ప్రదానం చేశారు.

- వివరాలు 2లో ▶

4 కోర్సులతో మొదలు



భద్రాద్రి కొత్తగూడెంలోని మైనింగ్ కాలేజీని ప్రభుత్వం రూ. 500 కోట్ల బడ్జెట్‌తో ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా ఉన్నతీకరించడంతో ఈ విద్యా సంవత్సరం నుంచి 4 ప్రధాన కోర్సులు అందుబాటులోకి రానున్నాయి.

- వివరాలు 16లో ▶


టెట్‌లో 59,692 మంది పాస్



తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్షలో 59,692 మంది అర్హత సాధించారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి 2% ఎక్కువ మంది అర్హత సాధించారు. కాగా, టెట్ ఫలితాల ప్రకటనతో ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టులపై నిరుద్యోగుల్లో ఆశలు పెరుగుతున్నాయి.

- వివరాలు 16లో ▶

నెలాఖరులోగా నివేదిక




కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలపై సుదీర్ఘ విచారణ నిర్వహించిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఈ నెలాఖరులోగా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. జస్టిస్ ఘోష్ ఈ నెల 27న హైదరాబాద్‌కు రానున్నారు.

- వివరాలు 12లో ▶

ఆడబిడ్డ నిధిని ఇవ్వాలంటే..
ఆంధ్రాను అమ్మాలి

విజయనగరం సభలో మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టీకరణ
మహిళలకు కూటమి సర్కార్ మరో ధోకా...

- నాడు.. ఇంటింటికీ తిరిగారు.. బాండ్లు రాసిచ్చారు..సూపర్ సిక్స్ కింద మేనిఫెస్టోలో కూడా పెట్టారు..
- తొలి ఏడాది రూ. 32,400 కోట్లు ఎగ్గొట్టారు.. ఈ ఏడాదైనా ఇస్తారని ఆశగా ఎదురుచూస్తుంటే ఆంధ్రాను అమ్మితే తప్ప ఇవ్వలేమని చేతులెత్తేశారు.. ఆడబిడ్డ నిధి కింద ఈ 13 నెలల్లో మహిళలు కోల్పోయింది రూ. 35,100 కోట్లు..
- ఆంధ్ర మహిళా లోకాన్ని దారుణంగా దగా చేసిన చంద్రబాబు ప్రభుత్వం




మంత్రి వ్యాఖ్యలు.. కూటమి ప్రభుత్వ తీరుపై భగ్గుమంటున్న మహిళలు 12లో

పథకాల అమల్లో కలెక్టర్లే కీలకం

- పథకాల ఫలాలు పేదలకు చేరేలా పటిష్ఠ చర్యలు తీసుకోవాలి
- సంక్షేమ హాస్టళ్లలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలి
- వారంలో ఒకరోజు అధికారులంతా హాస్టళ్లలో బస చేయాలి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రుల ఆదేశం
- సమీక్షలో పాల్గొన్న మంత్రులు పొంగులేటి, పొన్నం, కొండా, అడ్లూరి

2లో



డిగ్రీ ఫిజిక్స్.. ఏఐ ట్రెండ్స్

డిగ్రీ ఫిజిక్స్ సిలబస్‌లో మార్పులు

- ఏఐతో అనుసంధానం చేసే చాప్టర్స్
- వైద్య రంగంలో విద్యార్థులను నిలబెట్టేలా సిలబస్
- ఆమోదం తెలిపిన వర్సిటీలు

సాక్షి, హైదరాబాద్

డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థి ఇక నుంచి కేన్సర్ చికిత్సలో కీలక పాత్ర పోషించబోతున్నాడు. హృద్రోగ చికిత్సలో ఎలక్ట్రికల్ వేవ్స్ మెకానిజం అందించబోతున్నాడు. బీఎస్సీ డిగ్రీ చేసిన విద్యార్థులే వైద్య రంగంలోని టెక్నికల్ విభాగంలో చక్రం తిప్పే వీలుంది. ఈ దిశగా డిగ్రీలో ఫిజిక్స్ పాత్రను తీర్చిదిద్దుతున్నారు. సిలబస్ మార్పుపై ఉన్నత విద్యా మండలి చైర్మన్ నేతృత్వంలోని కమిటీ కొన్నేళ్లుగా కసరత్తు చేస్తోంది. మారిన సిలబస్‌కు మంగళవారం మండలిలో జరిగిన సమావేశంలో

మిగతా 5వ పేజీలో ▶

మెడికల్ యూజీ, పీజీ పరీక్షల్లో జంబ్లింగ్



- ఇప్పటివరకు సొంత కాలేజీల్లోనే పరీక్షలు
- దీనివల్ల అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు
- వచ్చే ఏడాది నుంచి జంబ్లింగ్ అమలుకు నిర్ణయం
- ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో సీసీ కెమెరాలు?
- కాళోజీ వర్సిటీ వినతికి ప్రభుత్వం కూడా సమ్మతి
- ప్రైవేటు కళాశాలల నుంచి వ్యతిరేకత!

- వివరాలు 16లో



.. నొక్కకుండా ఉండటానికట!

బడి సంచి భారం కాదిక్కడ!

- కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని 40 ప్రభుత్వ పాఠశాలల్లో వినూత్న విధానం
- స్కూల్ బ్యాగు బరువు ఎక్కువుంటే తూకం వేసి అదనపు పుస్తకాలు తొలగింపు
- పిల్లలకు రెండేసి జతల పాఠ్య పుస్తకాలు అందజేత.. ఒక సెట్ బడిలో మరో జత ఇంట్లో..
- విద్యార్థులకు తగ్గిన భుజం, నడుం నొప్పులు




విద్యార్థుల పుస్తకాల సంచి బరువును కొలుస్తున్న ఎంఈవో ప్రభాకర్‌రావు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: స్కూల్ విద్యార్థులు నిత్యం బండెడు పుస్తకాలున్న బ్యాగ్‌లను భుజాన మోసుకుంటూ వెళ్లడం పరిపాటి. కానీ కరీంనగర్ జిల్లా గంగాధర మండల పరిధిలోని సుమారు 40 ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రం అందుకు పూర్తి భిన్నమైన, వినూత్న విధానం అమలవుతోంది. అక్కడి బడుల్లో కిలోల కొద్దీ పుస్తకాలను మోయలేక మోస్తూ బడికి వచ్చే విద్యార్థులు కనిపించరు. కేవలం చిన్నపాటి బడి సంచితో బడికివచ్చే బాలలే ఉంటారు. ఒకవేళ ఎవరైనా ఎక్కువ పుస్తకాలు తెస్తే వెంటనే అదనపు బరువును ఉపాధ్యాయులు తొలగించేస్తారు. ఇందుకోసం పాఠశాల ప్రాంగణంలో ఏర్పాట్లు చేశారు. దీంతో విద్యార్థులు ఆయా పాఠశాలలకు వెళ్లడాన్ని భారంగా భావించట్లేదు.

గతేడాది నుంచే..: గంగాధర మండలం ఎంఈవో ఏనుగు ప్రభాకర్‌రావు గతేడాది ఒద్యారం స్కూల్

మిగతా 5వ పేజీలో ▶



ఫ్యాటీ లివర్.. పారాహుషార్!

హై క్యాలరీలు, అధిక చక్కెరల ఆహారంతో చేటు

మద్యపానంతో కాలేయానికి మరింత ముప్పు

వ్యాయామం, జీవనశైలి మార్పులతో నివారణ

మీకు పొట్ట కాస్తో కూస్తో లేదా బాగా ముందుకు వచ్చో కనిపిస్తోందా? ఇలా పొట్ట ముందుకు వస్తే మొదట చూసుకోవాల్సింది కాలేయాన్ని! ఎందుకంటే.. పొట్ట పెరగడమన్నది 'ఫ్యాటీ లివర్' సమస్యకు ఒక సూచన కావచ్చు. అంటే కాలేయంలో క్రమక్రమంగా కాలేయ కణాల స్థానే కొవ్వు కణాలు వచ్చి చేరడం. ఈ 'ఫ్యాటీ లివర్'.. డయాబెటిస్, రక్తపోటు లాగే ఓ జీవనశైలి (లైఫ్‌స్టైల్) సమస్య. ముందే తెలుసుకుంటే జాగ్రత్త పడవచ్చు. భవిష్యత్తులో పూర్తిగా కొవ్వు కణాలతో నిండిపోయి.. ఒక దశలో చివరి స్టేజ్ లివర్ డిసీజ్, లివర్ కేన్సర్‌కూ దారితీసే ముప్పునూ తప్పించుకోవచ్చు.

- సాక్షి ఫీచర్స్, హెల్త్ డెస్క్

మన పొట్టలో కుడివైపున కాలేయం ఉంటుంది. మనం తీసుకుంటున్న ఆహారంలో క్యాలరీలు, చక్కెరలు పెరుగుతున్న కొద్దీ మనం చేసే శారీరక శ్రమలో దహించుకుపోయినవి తప్ప మిగతావన్నీ కొవ్వు రూపంలో కాలేయంలోనే నిల్వ అవుతుంటాయి. ఇలా చక్కెరలు పెరగడమూ, శారీరక శ్రమ తగ్గడంతో క్రమంగా కాలేయంలో కొవ్వు కణాలు పెరిగిపోయి కాలేయ కణాలు తమ సహజ గుణాన్ని కోల్పోతాయి. ఆరోగ్యకరమైన లివర్ కాస్తా కొవ్వు పేరుకుపోతున్న ఫ్యాటీలివర్ కండిషన్‌గా మారిపోతుంది. ఇలా కాలేయకణాలను కోల్పోతూ... కొవ్వుకణాలను నింపుకొంటున్న కండిషన్‌నే ఫ్యాటీ లివర్ అంటారు. కాలేయం 90 శాతం దెబ్బతినే వరకు తనకు సంబంధించిన లక్షణాలను బయటపడనివ్వదు. అంతేకాదు... జాగ్రత్తలు తీసుకుంటే మళ్లీ తనను తాను బాగుచేసుకోనూ గలదు.

ఫ్యాటీ లివర్ అంటే...

కారణాలేంటి?

ఈ మధ్యకాలంలో ఎక్కువగా హై క్యాలరీ ఫుడ్ తీసుకోవడం పెరిగింది. చక్కెర మోతాదులు చాలా ఎక్కువగా ఉండే వాటినీ తింటున్నారు. ఆ క్యాలరీలను దహించడానికి మాత్రం ఎలాంటి వ్యాయామాలూ చేయడం లేదు. మారుతున్న జీవనశైలిలో భాగంగా ఒకే చోట కూర్చుని చేసే ఉద్యోగాలూ, వృత్తులతో కూర్చుని కూర్చుని పొట్ట పెరుగుతోంది. మరికొందరికి మద్యపానం అలవాటు. ఇలాంటి జీవనశైలి మార్పులతో స్థూలకాయం, మధుమేహంతోపాటు ఫ్యాటీలివర్ కూడా చాలామందిలో కనిపిస్తోంది.



డాక్టర్ వీఆర్ సుమంత్ కుమార్

ఇవీ గ్రేడ్స్..: ఫ్యాటీ లివర్ సమస్య తీవ్రతను బట్టి ఇందులో గ్రేడ్స్ ఉంటాయి. మొదటి లేదా రెండో గ్రేడ్ వరకు కొంత నిరుపాయకరమని చెప్పవచ్చు. ఇక్కడ కొన్ని నిబంధనలు వర్తిస్తాయి. జీవనశైలిని మెరుగుపరచుకుంటూ ఆరోగ్యకరమైన లైఫ్‌స్టైల్ అలవరచుకుని కొంత క్రమశిక్షణతో మెలగడం, వ్యాయామం చేయడం ద్వారా మొదటి, రెండో దశలోని 'ఫ్యాటీ లివర్'ను అదుపులో పెట్టవచ్చు. మూడో గ్రేడ్, ఆపైన గ్రేడులకు చేరితే కాలేయమార్పిడి తప్ప మరో మార్గం ఉండకపోవచ్చు.

మొదటి దశ	రెండో దశ	మూడో దశ
ఇది సాధారణ ఫ్యాటీ లివర్ వ్యాధి. ఇందులో కాలేయ కణాల మధ్య కొవ్వు చాలా పరిమితంగా ఉంటుంది.	ఈ దశను నాష్ (ఎన్ఏఎస్‌హెచ్) అంటారు. ఇందులో కాలేయం కొద్దిగా దెబ్బతింటుంది. కొన్ని కాలేయ కణాలు నశిస్తాయి.	ఈ దశలో సిర్రోసిస్ వస్తుంది. అంటే కాలేయం పూర్తిగా తన స్వరూపాన్ని కోల్పోయి, గట్టిపడుతుంది.

నివారించగల కారణాలు

మద్యపానం చేసేవారికి ఫ్యాటీ లివర్ వచ్చే అవకాశాలు ఎక్కువ. ఈ అలవాటును మనం ప్రయత్నపూర్వకంగా పూర్తిగా అదుపులో పెట్టుకోవచ్చు. ఇక వ్యాయామం చేస్తూ బరువు తగ్గించుకోవడమూ మన చేతుల్లో ఉన్నదే. అధిక రక్తపోటు ఉన్నవారు దాన్ని అదుపులో ఉంచుకోవాలి. అధిక మోతాదులో మందులు వాడకాన్ని నివారించాలి. వైద్యులు సూచించిన ఆహారాన్ని తీసుకోవాలి.

నివారించుకోలేని కారణాలు

నివారించుకోలేనంత బరువు పెరగడం అన్నది మన చేతుల్లో ఉండదు. పొట్ట బాగా ముందుకు వచ్చినవాళ్లలోనూ, స్థూలకాయం ఉన్న 90 శాతం మందిలోనూ మొదటి దశ ఫ్యాటీలివర్ కనిపించడం చాలా సాధారణం. అలాగే స్థూలకాయం ఉన్న 20 శాతం వ్యక్తుల్లో రెండో దశ ఉంటోంది. ఫ్యాటీ లివర్ వచ్చిన వ్యక్తుల్లో ఎక్కువ శాతం మందిలో మధుమేహం వచ్చే ప్రమాదం ఉంటుంది.

ఇవీ లక్షణాలు

తొలిదశల్లో సాధారణంగా ఫ్యాటీలివర్ బాధితుల్లో ఎలాంటి లక్షణాలు కనిపించవు. అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేయించుకుంటే ఫ్యాటీలివర్ ఉనికి తెలుస్తుంది.

- కొందరికి కుడివైపు పొట్ట పైభాగంలో (రిబ్‌కేజ్ కింద) పొడుస్తున్నట్లుగా నొప్పి వస్తుంటుంది. కాలేయం క్రమంగా పెరగడమే ఇందుకు కారణం.

క్యాన్సర్ ముప్పు కూడా...

ఫ్యాటీ లివర్ వ్యాధి వచ్చాక తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే కాలేయం పూర్తిగా దెబ్బతినే సిర్రోసిస్ లేదా కొందరిలో లివర్ క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన పరిస్థితులకు దారితీయవచ్చు.

నివారణ ఇలా : బరువు నియంత్రించుకోండి : మీరు ఉండాల్సిన దాని కంటే ఎక్కువ బరువు ఉంటే మీ ఆహారంలో పిండి పదార్థాలను తగ్గించుకోవాలి. మీ బాడీ మాస్ ఇండెక్స్ (బీఎమ్ఐ) అనుగుణంగా శరీర బరువును నియంత్రించుకోవాలి.

ఆరోగ్యకరమైన ఆహారం : ఆహారంలో తప్పనిసరిగా తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఉండేలా చూసుకోండి. మాంసాహారంలో రెడ్‌మీట్‌కు బదులు మెత్తని మాంసంతో (లీన్) కూడిన చికెన్, చేపలు వంటివి తీసుకోవాలి. వంటల్లో నూనె వాడకం తగు మోతాదులో ఉండాలి. పొట్టుతీయని తృణ ధాన్యాలు ఎక్కువగా వాడాలి.



- డయాబెటిస్‌ను అదుపులో ఉంచుకోవాలి
- కొలెస్ట్రాల్ తగ్గించుకోవాలి.

వ్యాయామం : ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలకు తగ్గకుండా వ్యాయామం చేయాలి.



చికిత్స

అల్కహాల్ అలవాటు ఉన్న వారు పూర్తిగా మానేయాలి.



చాలా కొద్దిమందిలో మందులు, శస్త్రచికిత్స అవసరం కావచ్చు.



బాధితులు వాడుతున్న ఏవైనా మందుల వల్ల ఫ్యాటీ లివర్ వ్యాధి వచ్చిందేమో చూసుకోవాలి. అవసరమైతే డాక్టర్లు మందులను మారుస్తారు.

చివరిగా.. ఫ్యాటీ లివర్ వ్యాధి విషయంలో చికిత్స కంటే నివారణ మేలు.

క్లుప్తంగా...

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు టెండర్లు ఖరారు

రెండు దశల్లో 41.50 కి.మీ.

మొదటిదశ పనులు బీజేపీ ఎంపీ సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ సంస్థకు..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఫ్యూచర్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు (రతన్ టాటా రోడ్డు) పనులను రెండు ప్రముఖ నిర్మాణ సంస్థలు దక్కించుకున్నాయి.

- మొదటిదశలో రావిర్యాల (టాటా ఇంటర్ ఛేంజ్) నుంచి మీర్‌ఖాన్‌పేట్ వరకు నిర్మించనున్న 19.2 కిలోమీటర్ల రోడ్డును ఏపీకి చెందిన బీజేపీ ఎంపీ సీఎం రమేష్ సంస్థ రుత్విక్ దక్కించుకుంది.
- రెండోదశలో మీర్‌ఖాన్‌పేట్ నుంచి ట్రిపుల్ ఆర్ వద్ద ఆమన్‌గల్లు వరకు చేపట్టనున్న 22.3 కి.మీ రోడ్డు పనులను ఎల్అండ్‌టీ సంస్థ దక్కించుకుంది.
- గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం కోసం హెచ్ఎండీఏ చాలా రోజుల క్రితమే బిడ్డింగ్ ప్రకటించింది. కానీ హైకోర్టు స్టే కారణంగా ఫలితాల వివరాలను వెల్లడించలేదు. అయితే నిర్మాణ పనులను చేపట్టేందుకు వారం రోజుల క్రితం అనుమతి ఇవ్వడంతో బిడ్డింగ్ ఓపెన్ చేసినట్టు అధికారులు తెలిపారు.

27 పర్యాటక ప్రాంతాలు పీపీపీ పద్ధతిలో అభివృద్ధి

మంత్రి జూపల్లి కృష్ణారావు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పర్యాటకులను ఆకట్టుకునేందుకు గుర్తించిన 27 ప్రాంతాలను పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేయాల్సి ఉందని, దశలవారీగా వాటిని అభివృద్ధి చేయాలని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యాటకాభివృద్ధి సంస్థ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం రూపొందించిన పర్యాటక విధానానికి తగ్గట్టుగా ఆ రంగ పురోగతికి సత్వరం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సోమవారం హిమాయత్‌నగర్‌లోని సంస్థ కార్యాలయంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రైవేటు హోటళ్లు, ప్రైవేట్ ట్రావెల్స్ స్థాయిలో ఈ సంస్థ కూడా ఆదాయాన్ని సాధించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. స్థానిక ఉత్సవాలు, వేడుకలను దేశవిదేశీ పర్యాటకులను ఆకట్టుకునేలా ప్రణాళికాబద్ధంగా నిర్వహించాల్సి ఉందని, ఆ దిశలో చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పర్యాటకరంగం అభివృద్ధి చెందాలంటే అధికారులు ఫలితం వచ్చేలా చర్యలు చేపట్టాల్సి ఉంటుందని సూచించారు. సమావేశంలో పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ పాల్గొన్నారు.

పథకాల అమల్లో కలెక్టర్లే కీలకం

పథకాల ఫలాలు పేదలకు చేరేలా పటిష్ట చర్యలు తీసుకోవాలి

- సంక్షేమ హాస్టళ్లలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలి
- వారంలో ఒకరోజు అధికారులంతా హాస్టళ్లలో బస చేయాలి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రుల ఆదేశం
- సమీక్షలో పాల్గొన్న మంత్రులు పొంగులేటి, పొన్నం, కొండా, అడ్లూరి



కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న పొంగులేటి. చిత్రంలో పొన్నం, అడ్లూరి లక్ష్మణ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో జిల్లా కలెక్టర్లు ప్రధాన పాత్ర పోషించాలని మంత్రులు చెప్పారు. ఆయా సంక్షేమ పథకాల ఫలాలు పేదలకు చేరేలా చర్యలు తీసుకోవాలని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు.. వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, విభాగాధిపతులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, భూభారతి, రెసిడెన్షియల్ స్కూళ్లలో భోజన, మౌలిక వసతుల ఏర్పాటు, వన మహోత్సవంలో మొక్కలు నాటడం, మహాలక్ష్మి పథకం తదితర అంశాలపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిందని, వాటిని అర్హులకు చేరేలా కలెక్టర్లు, అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. దానికనుగుణంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు.

హాస్టళ్లలో నాణ్యమైన భోజనం

సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని కలెక్టర్లను మంత్రులు ఆదేశించారు. హాస్టళ్ల నిర్వహణపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి వారంలో ఒకరోజు అధికారులందరూ ఆ హాస్టళ్లలో బస చేసేలా చూడాలన్నారు. పెంచిన డైట్ చార్జీలకు అనుగుణంగా నాణ్యమైన భోజన వసతి కల్పించాలని చెప్పారు. హాస్టళ్లలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పించాలని, వారి నుంచి ఎలాంటి ఫిర్యాదులు రావొద్దన్నారు. ఈ సందర్భంగా మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులతో నెలకోసారి పేరెంట్స్ కమిటీ మీటింగ్‌లను ఏర్పాటు చేయాలని చెప్పారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ప్రగతి సాధించాలి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వ లక్ష్యాల మేరకు అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను కోరారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణంలో ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, లబ్ధిదారునికి ఎలాంటి భారం కలగకుండా చూడాలని ఆదేశించారు. భూభారతిలో నమోదైన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్లను ఆదేశించారు. వన మహోత్సవంలో భాగంగా విరివిగా మొక్కలు నాటాలని అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో ముఖ్య కార్యదర్శులు నదీమ్, ఎస్.శ్రీధర్, దానకిశోర్, నవీన్‌మిట్టల్, యోగితా రాణా, క్రిస్టినా చొంగ్తూ, కార్యదర్శులు లోకేశ్ కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చేసింది కూడా చెప్పుకోలేకపోతున్నాం!

ఏడాదిన్నరలో ఎన్నో అభివృద్ధి పనులు చేశాం

- వాటి గురించి ప్రజలకు అర్థమయ్యేలా చెప్పలేకపోయాం
- ప్రచార బాధ్యత జిల్లా పీఆర్ అధికారులదే: మంత్రి పొంగులేటి

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఏడాదిన్నరలోనే అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టినా.. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. గతంలో పదేళ్లు అధికారంలో ఉన్న ప్రస్తుత ప్రతిపక్ష పార్టీ గోబెల్స్ ప్రచారంతో ప్రజలను మభ్యపెడుతోందని దుయ్యబట్టారు. గత ప్రభుత్వం చేయని పనులు చేసినట్లు ప్రచారం చేసుకుంటే.. తాము చేసింది కూడా చెప్పుకోలేకపోతున్నామని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో మంగళవారం జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 వేల ఉద్యోగాలు భర్తీ చేసి దేశంలోనే తెలంగాణను అగ్రస్థానంలో నిలిపామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, పేదలకు సన్నబియ్యం, మహిళలకు రూ.500లకే వంటగ్యాస్ సిలిండర్, రైతుభరోసా, రుణమాఫీ, రేషన్‌కార్డుల పంపిణీ.. ఇలా రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమానికి ఎంతో చేశామని చెప్పారు. గత ప్రభుత్వం పదేళ్లలో చేయలేనిది తాము ఏడాదిన్నరలోనే చేసి చూపించామని అన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విరివిగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత జిల్లా స్థాయిలో పౌరసంబంధాల శాఖ అధికారులదే'అని స్పష్టం చేశారు. సమావేశంలో ప్రజా సంబంధాల ప్రత్యేక కమిషనర్ సీహెచ్. ప్రియాంక, సీపీఆర్వో జి.మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలు ఉన్నచోటే ఇళ్లు

హైదరాబాద్‌లో జీ+3 పద్ధతిలో 'ఇందిరమ్మ' నిర్మాణాలు ప్రారంభిస్తాం: మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: పేదలు ఉన్నచోటే ఇళ్లు నిర్మించేలా చూస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ముఖ్యంగా రాజధాని హైదరాబాద్ నగర శివార్లలో ఇళ్లు నిర్మించి ఇస్తే జీవనోపాధికి ఇబ్బంది వస్తుందనే ఉద్దేశంతో కొందరు లబ్ధిదారులు ఇళ్లు మంజూరైనా తీసుకోవట్లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇలా కేటాయించిన ఇళ్లలోకి పేదలు వెళ్లట్లేదని.. దీన్ని దృష్టిలో పెట్టుకొని త్వరలోనే నగరంలో పేదలు నివసిస్తున్నచోటే జీ+3 పద్ధతిలో ఇళ్లు నిర్మించి ఇవ్వడానికి కార్యాచరణను సిద్ధం చేస్తున్నట్లు ప్రకటించారు. సచివాలయంలో మంగళవారం హౌసింగ్ అధికారులతోపాటు జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్లతో పట్టణాలలో ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్రూం ఇళ్లపై మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా హౌసింగ్ కాలనీల తనిఖీ యాప్‌ను ఆయన ప్రారంభించారు.

ఇళ్లు మంజూరైనా నివసించకపోతే నోటీసులు: డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరైనా వాటిల్లో నివసించని లబ్ధిదారులకు నోటీసులు జారీ చేయాలని అధికారులను మంత్రి పొంగులేటి ఆదేశించారు. హైదరాబాద్ శివారులోని సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల్లో డబుల్ బెడ్రూం ఇళ్లు పొందినా లబ్ధిదారులు అక్కడ ఉండకపోవడం వల్ల దాదాపు 30 వేల ఇళ్లు ఖాళీగా ఉన్నాయన్నారు.

నడ్డా, రాజ్‌నాథ్‌లతో టీబీజేపీ అధ్యక్షుడి భేటీ

అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ బలోపేతంపై చర్చ



మంగళవారం ఢిల్లీలో రాజ్‌నాథ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న రామచందర్‌రావు

సాక్షి, న్యూఢిల్లీ: బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు మంగళవారం ఢిల్లీలో పలువురు పార్టీ పెద్దలను కలిశారు. హస్తినలో రెండో రోజు పర్యటనలో భాగంగా కేంద్రమంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌లతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేయడంపై కీలకంగా చర్చించారు. పార్టీ సంస్థాగత నిర్మాణంపై చర్చలు జరిగాయి. రాష్ట్రంలో ప్రధాని మోదీ నేతృత్వంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే దిశగా జాతీయ నాయకులు కీలక సూచనలు ఇచ్చారు. అనంతరం రామచందర్‌రావు తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరివెళ్లారు.

త్వరలో ట్యాంక్‌బండ్‌పై దాశరథి విగ్రహం

- 12 వేల గ్రామ పంచాయతీల్లో దాశరథి రచనలు పెడతాం: మంత్రి జూపల్లి
- కవి అన్నవరం దేవేందర్‌కు దాశరథి పురస్కారం ప్రదానం

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): తెలంగాణ కీర్తికి ప్రతీక అయిన దాశరథి కృష్ణమాచార్య విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్టించేందుకు త్వరలో కార్యాచరణ ప్రారంభించనున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో దాశరథి కృష్ణమాచార్య శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రముఖ కవి అన్నవరం దేవేందర్‌కు దాశరథి పురస్కారాన్ని ప్రదానం చేశారు. జూపల్లి మాట్లాడుతూ.. అణచివేతకు, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా నిలబడిన వ్యక్తి దాశరథి అని, ఆయన తెలంగాణ ఉద్యమంలో స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. 1944లో కవి సమ్మేళనం పెడితే నిజాం నిప్పు పెట్టించారని, అయినా బెదరకుండా అక్కడే సమ్మేళనం నిర్వహిచ్చారని గుర్తు చేశారు. రాష్ట్రంలోని 12 వేలకుపైగా గ్రామ పంచాయితీల్లో దాశరథి రచనలు అందుబాటులో ఉంచుతామని ప్రకటించారు. తెలంగాణ సాహితీమూర్తుల రచనలు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచేందుకు, యువతలో క్రీడలపట్ల ఆసక్తి కలిగించేందుకు నిధులను కేటాయిస్తామని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమం, సంస్కృతికి దాశరథి ఐకాన్ అని, ఆయన ప్రభావంతో ఎందరో కవులు సామాజిక స్పృహతో రచనలు చేశారని చెప్పారు.



అన్నవరం దేవేందర్‌కు దాశరథి పురస్కారాన్ని అందజేస్తున్న మంత్రులు జూపల్లి, పొన్నం

పురస్కార గ్రహీత దేవేందర్ మాట్లాడుతూ... దాశరథి అంటేనే ఒక ధిక్కారమని, నిరంకుశత్వంపై పోరాడారని గుర్తుచేశారు. అయన పేరిట నెలకొల్పిన అవార్డు తనకు రావడం సంతోషంగా ఉందన్నారు. 'మూడు దశాబ్దాలుగా కవితలు రాస్తున్నాను. సకల సమస్యలపై ప్రశ్నించడంపైనే నా కలం సాగుతుంది. నా కవితలన్నీ గ్రామీణ భాషలోనే ఉన్నాయి. తెలంగాణ మహనీయుల చరిత్ర పాఠ్యపుస్తకాల్లో ఉంది.. కానీ తెలంగాణ యాసలో పాఠ్యపుస్తకాలు లేవు'అని అన్నారు. ఈ కార్యక్రమంలో కవి అందెశ్రీ, ప్రజాకవి జయరాజు, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, దాశరథి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

200 కోట్ల జీరో టికెట్ల మైలురాయి అభినందనీయం

'ఎక్స్'వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి హర్షం



సాక్షి, హైదరాబాద్: మహిళల ఉచిత ప్రయాణ పథకం 18 నెలల కాలంలో 200 కోట్ల జీరో టికెట్ల మైలురాయిని చేరుకోవటం సంతోషంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ పథకంలో భాగంగా జారీ చేసిన జీరో టికెట్ల సంఖ్య బుధవారంతో 200 కోట్లకు చేరుకుంటున్న నేపథ్యంలో అన్ని డిపోల ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్లలో ప్రజాప్రతినిధులు, మహిళా సమాఖ్య ప్రతినిధుల సమక్షంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మహిళా ప్రయాణికుల అనుభవాలను వెల్లడించటంతోపాటు పలు రంగాల మహిళా ప్రయాణికులకు బహుమతులు అందించి సత్కరించనున్నారు. ఈమేరకు సీఎం 'ఎక్స్'వేదికగా సంతోషాన్ని వ్యక్తం చేశారు.

మహిళలకు రూ.6,700 కోట్లు ఆదా: ఉచిత ప్రయాణ పథకంలో 200 కోట్ల జీరో టికెట్లు జారీ అయ్యాయని, వాటి ద్వారా మహిళలు రూ.6,700 కోట్లు ఆదా చేసుకున్నారని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. వీటికి సంబంధించిన మొత్తాన్ని ఆర్టీసీకి ప్రభుత్వం ఎప్పటికప్పుడు రీయింబర్స్ చేస్తోందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పార్లమెంట్‌లో తెలంగాణ

వృద్ధులపై సైబర్ అటాక్స్

2018-2022 మధ్య 2.40 లక్షల కేసులు నమోదు

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: వృద్ధులను టార్గెట్‌గా చేసుకుని నేరగాళ్లు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని కేంద్ర హోం శాఖ తెలిపింది. ఈ సైబర్ నేరాలపై 2018–2022 మధ్య దాదాపు 2.40 లక్షల కేసులు నమోదైనట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ లోక్‌సభలో రాతపూర్వకంగా తెలిపారు. 2018లో 27,248, 2019లో 44,735, 2020లో 50,035, 2021లో 52,974, 2022లో 65,893 చొప్పున కేసులు నమోదైనట్లు ఎన్‌సీఆర్‌బీ నివేదిక చెబుతోందన్నారు. ఓటీపీ ఫ్రాడ్లు, లాటరీ, డిజిటల్ స్కాం తదితర కారణాలు చెబుతూ వృద్ధులను టార్గెట్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సైబర్ నేరాలను నియంత్రించేందుకు ఐ4సీ కృషి చేస్తోందని తెలిపారు. మోసగాళ్లు కాజేసిన డబ్బును ఫ్రీజ్ చేసేందుకు ఐ4సీ కింద 'సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (సీఎఫ్‌సీఎఫ్ఆర్ఎంఎస్)'ను 2021లో ప్రారంభించినట్లు బండి సంజయ్ చెప్పారు.

మెట్రో ఫేజ్-2పై చొరవ చూపండి: ఎంపీ చామల



సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్‌కు మెట్రో ఫేజ్–2 ప్రాజెక్టు మంజూరు చేయాల్సిన అవసరం ఉందని భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం లోక్‌సభలో రూల్ 377కింద ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే రూ.24,269 కోట్ల అంచనా వ్యయంతో 5 కారిడార్లను కవర్ చేసే హైదరాబాద్ మెట్రోరైల్ ఫేజ్–2 విస్తరణ ప్రతిపాదనను గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు సమర్పించిందని గుర్తు చేశారు. వీలైనంత త్వరగా ఈ ప్రతిపాదనలను ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

ఎలివేటెడ్ ఫ్లైఓవర్ నిర్మించండి: ఈటల



జాతీయ రహదారి 65 (హైదరాబాద్–విజయవాడ) విస్తరణ పనుల నేపథ్యంలో ఎల్బీనగర్ చౌరస్తా (చింతకుంట చెక్‌పోస్ట్) నుంచి ఆటోనగర్ వరకు ఎలివేటెడ్ ఫ్లైఓవర్ నిర్మించాలని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం లోక్‌సభలో రూల్ 377 కింద ఈ అంశాన్ని ప్రస్తావించారు. విస్తరణ పనులు జరగక ఎల్బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.

జనగణన సన్నాహాలు ప్రారంభమయ్యాయి..

జనగణన 2027 కోసం సన్నాహాలు ప్రారంభమయ్యాయని కేంద్రం స్పష్టం చేసింది. ఈ మేరకు మంగళవారం లోక్‌సభలో బీజేపీ ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర గృహ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ మౌఖిక సమాధానం ఇచ్చారు. ఈ అంశానికి సంబంధించి ఈ నెల 3, 4వ తేదీల్లో ఢిల్లీలో సమావేశాలు నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు.

పంట తెగులు నివారణకు కృషి చేస్తున్నాం...

దేశవ్యాప్తంగా పంటల తెగులు నివారణకు జాతీయ తెగులు నిఘా వ్యవస్థ (ఎన్‌పీఎస్ఎస్) కింద చర్యలు తీసుకుంటున్నామని కేంద్రం వెల్లడించింది. ఈ మేరకు మంగళవారం లోక్‌సభలో ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అడిగిన ప్రశ్నకు వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయమంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ మౌఖిక సమాధానం ఇచ్చారు. తెలంగాణలోని అన్ని జిల్లాల్లో ఎన్‌పీఎస్ఎస్ వినియోగంపై సీఐపీఎంసీ 32 శిక్షణా కార్యక్రమాలు నిర్వహించిందని తెలిపారు.

ఐదేళ్లలో రాష్ట్రంలో 2,088 కి.మీ.పైగా రోడ్ల నిర్మాణం

ఐదేళ్లలో ప్రధానమంత్రి గ్రామీణ్ సడక్ యోజన కింద తెలంగాణలో 2,088.05 కిలోమీటర్ల పొడవున రోడ్డు నిర్మించామని కేంద్రం తెలిపింది. ఇందులో భాగంగా పెద్దపల్లి జిల్లాలో 41.38 కిలోమీటర్లు నిర్మాణం జరిగిందన్నారు. లోక్‌సభలో పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ గడ్డం వంశీకృష్ణ అడిగిన ప్రశ్నకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రి కమలేశ్ పాశ్వాన్ మౌఖిక సమాధానం ఇచ్చారు.

ఎగరకముందే.. చెక్ పెట్టేస్తారు!

మనం వాడే బండిని క్రమం తప్పకుండా సర్వీసింగ్ చేయిస్తాం. బ్రేకులు సరిగా పడుతున్నాయా, టైర్లలో గాలి ఉందా, సరిపడా ఇంధనం ఉందా అని రోజూ చెక్ చేస్తాం. అలాంటిది గాల్లో ఎగిరే విమానం అయితే? మనం మన వాహనాన్ని చెక్ చేసినట్టే విమానాన్ని ఒక్క పైలట్ చెక్ చేస్తే సరిపోతుందా? అస్సలు కాదు.. కోట్లాది మందిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు విమానయాన సంస్థలు, ప్రభుత్వ విభాగాలు, థర్డ్ పార్టీ ఏజెన్సీల నిఘా కళ్లు ప్రతి క్షణం పర్యవేక్షిస్తుంటాయంటే ఆశ్చర్యం వేయకమానదు. ఈ సంస్థలు ఒక ప్రణాళిక ప్రకారం విమానాలు, విమానాశ్రయాలు, సర్వీసింగ్ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించడమే కాదు.. ఆకస్మిక తనిఖీలూ చేసి ఉల్లంఘనలపై ఉక్కుపాదం మోపుతున్నాయి.

- సాక్షి, స్పెషల్ డెస్క్



- విమానయాన రంగంలో కఠిన తనిఖీలు
- ప్రమాదాల నివారణకు నిరంతర నిఘా
- తీవ్ర లోపాలుంటే విమానం నిలిపివేత
- ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్న డీజీసీఏ

ఈ ఏడాది జూన్ 12న ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం తాలూకా చేదు జ్ఞాపకాలు భారతీయుల మదిలో ఇంకా మెదులుతూనే ఉన్నాయి. 275 మందికిపైగా ప్రాణాలను బలి తీసుకున్న ఘోర దుర్ఘటన నేపథ్యంలో దేశంలో అమలవుతున్న విమానయాన నిబంధనలు, భద్రత అంశం చర్చకు వచ్చింది. విమానయానంతో ముడిపడి ఉన్న ప్రభుత్వ కీలక సంస్థల పనితీరుపైనా ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఎయిర్ ఇండియా ప్రమాదానికి కారణం మానవ తప్పిదమా, సాంకేతిక సమస్యనా అన్నది పక్కన పెడితే.. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ), బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్), ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) వంటి ప్రభుత్వ సంస్థలు అంతర్జాతీయ ప్రమాణాలకు తగ్గట్టుగా ప్రయాణికుల భద్రత దృష్ట్యా అనుక్షణం అప్రమత్తంగా ఉంటున్నాయి. ఇందుకు ఈ సంస్థలు చేపట్టిన తనిఖీలే నిదర్శనం. 2023 జనవరి నుంచి 2025 ఏప్రిల్ వరకు 9,423 తనిఖీలు చేపట్టాలన్నది ప్రణాళిక కాగా రికార్డు స్థాయిలో 13,753 తనిఖీలు చేపట్టడం గమనార్హం.

రెక్కలు కట్టేస్తారు..: డీజీసీఏ బృందం అన్ని విమాన సంస్థలకు చెందిన విమానాల తనిఖీ చేపడుతుంది. విమానం సురక్షితంగా ప్రయాణం సాగించే స్థాయిలో ఫిట్‌గా ఉందా లేదా అని పరీక్షిస్తారు. లోపాలు, ఉల్లంఘనలు బయటపడితే డీజీసీఏ హెచ్చరికలు జారీ చేస్తుంది. తీవ్ర లోపాలు, ఉల్లంఘనలైతే విమానాలకు భద్రతా ధ్రువీకరణను తాత్కాలికంగా రద్దు చేస్తారు. అంటే విమానం ఎగరకుండా నిరోధిస్తారు. ఫిట్‌గా ఉందని తేలాకే సస్పెన్షన్ ఎత్తేస్తారు. అంతేకాదు, నిబంధనలను పాటించకపోతే భారీ పెనాల్టీలు విధిస్తారు. 2023 నుంచి 2025 జూలై 20 వరకు 597 విమానాలు సస్పెన్షన్‌కు గురయ్యాయంటే ఏ స్థాయిలో తనిఖీలు నిర్వహించారో అర్థం చేసుకోవచ్చు.

ఆకస్మిక తనిఖీలు..: విమానం, సిబ్బంది, ఆపరేటర్లు భూమిపై ఉన్నప్పుడు విమానయాన నిబంధనలు, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నారని నిర్ధారించుకోవడానికి డీజీసీఏ అధికారులు అప్రకటిత (ర్యాంప్ ఇన్‌స్పెక్షన్స్) తనిఖీలు నిర్వహిస్తారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా అకస్మాత్తుగా ఎంట్రీ ఇస్తారు. ఇలా భారత్‌లోని విమానాశ్రయాల నుంచి కార్యకలాపాలు సాగిస్తున్న దేశ, విదేశీ విమానాలకు సంబంధించి 2023 జనవరి నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు 1,188 ర్యాంప్ ఇన్‌స్పెక్షన్స్ జరిగాయి. ఈ తనిఖీల్లో 338 లెవెల్–2 స్థాయి లోపాలను గుర్తించారు.

ప్రతి ప్రయాణానికి ముందు విమానానికి తనిఖీలు తప్పనిసరి. విమానం సురక్షితంగా ఉందో లేదో నిర్ధారించుకోవడానికి పైలట్స్, నిర్వహణ సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తారు. అంతా బాగుంది అని నిర్ధారించుకున్నాకే విమానం గాల్లోకి లేస్తుంది. లేదంటే సర్వీస్ రద్దు అవుతుంది.

విమానం వెలుపల: విమానం నిర్మాణం, బాహ్య, నియంత్రణ ఉపరితలాలపై ఏదైనా నష్టం, లీకేజీ, అరిగిపోయాయా అని చూస్తారు.

అంతర్గత తనిఖీలు: కాక్‌పిట్‌లోని పరికరాలు, రేడియోలు, విద్యుత్ పరికరాలు, ఇతర ముఖ్యమైన భాగాల పనితీరును ధ్రువీకరిస్తారు.

పత్రాల ధ్రువీకరణ: లైసెన్సులు, రిజిస్ట్రేషన్, బీమా వంటి అన్ని అవసర పత్రాలు ఉన్నాయా లేదా అని చెక్ చేస్తారు.


ఇంధనం స్థాయిలు: తగినంత ఇంధనం, చమురు, తగు పాళ్లలో, నాణ్యంగా ఉన్నాయని నిర్ధారించుకుంటారు.

నియంత్రణ వ్యవస్థలు: విమాన నియంత్రణలు, బ్రేక్స్, ఇతర క్లిష్ట వ్యవస్థలు పనిచేస్తున్న తీరు, కార్యకలాపాలను పరీక్షిస్తారు.

వాతావరణ పరిశీలన: విమానం ఎగరడానికి, దిగడానికి అనుకూల వాతావరణ పరిస్థితులను అంచనా వేస్తారు. వాతావరణం పూర్తి అనుకూలంగా ఉందని నిర్ధారించుకున్నాకే విమానం వెళ్తుంది.


వార్నింగ్ నుంచి పెనాల్టీ వరకు

ప్యాసింజర్ విమానాల కార్యకలాపాల నిబంధనలు, మార్గదర్శకాల ఉల్లంఘనలపై ప్రభుత్వం తీసుకున్న చర్యలు



విమానాల రద్దు

ప్యాసింజర్ విమానాల కార్యకలాపాల నిబంధనలు, మార్గదర్శకాల ఉల్లంఘనలపై ప్రభుత్వం తీసుకున్న చర్యలు



తనిఖీలు, లోపాలు

ఈ ఏడాది ఏప్రిల్ వరకు దేశవ్యాప్తంగా చేపట్టిన తనిఖీలు, గుర్తించిన లోపాలు

సంవత్సరం	తనిఖీల సంఖ్య	లెవెల్-1 లోపాలు (తీవ్రమైనవి)	లెవెల్-2 లోపాలు
2023	5,745	112	15,997
2024	6,009	151	14,524
2025	1,999	41	5,137

ఆధారం : కేంద్ర పౌర విమానయాన శాఖ

క్లుప్తంగా...

మోసం చేయడంలో రేవంత్‌రెడ్డి పీహెచ్‌డీ

బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



నల్లగొండ టూటౌన్: ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి పీహెచ్‌డీ చేశాడని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఎద్దేవాచేశారు. మంగళవారం నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పి గజినీగా ఎందుకు మారావని ప్రశ్నించారు. నెల రోజులు కడుపు మాడ్చుకుంటే సంక్షేమ పథకాలకు రూ.40 వేల కోట్లు ఖర్చు చేయడం లెక్కకాదని చెప్పి ఎందుకు మాట తప్పావో సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని ఏలేటి డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించి అసెంబ్లీలో బీజేపీ సంపూర్ణ మద్దతిచ్చిందని, ఆర్డినెన్స్‌ను ఎందుకు బహిర్గతం చేయడంలేదని ప్రశ్నించారు. మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ పక్క రాష్ట్ర సీఎంతో లింకు ఉంది కాబట్టే సీఎం రేవంత్‌రెడ్డి బతికి బయటపడ్డాడని ఆరోపించారు. బీసీల పట్ల రేవంత్‌రెడ్డికి ప్రేమ, నిబద్ధత ఉంటే సీఎం సీటును బీసీకి అప్పగించాలన్నారు.

42 శాతం రిజర్వేషన్లు ఇవ్వమంటే నిందలు వేస్తారా?


బీజేఎల్పీ ఉపనేత పాయల్ శంకర్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి బీసీలను మోసం చేసేందుకు సిద్ధమైందని బీజేఎల్పీ ఉపనేత పాయల్‌శంకర్ మండిపడ్డారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని తాము కోరుతుంటే... బీజేపీపైనే నిందలు వేస్తారా అని ప్రశ్నించారు. ఒక పార్టీని బద్నాం చేసి పబ్బం గడుపుకోవాలని చూస్తే బీసీలు క్షమించరని హెచ్చరించారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో పాయల్‌శంకర్ మీడియాతో మాట్లాడారు. మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని తాము అసెంబ్లీలో ప్రశ్నించి ముస్లిం అనే పదాన్ని తొలగించాలని డిమాండ్ చేశామని గుర్తు చేశారు. మరోసారి బీసీలను మోసం చేస్తామంటే వారు కాంగ్రెస్‌ను క్షమించే ప్రసక్తి ఉండదన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వానికి బడ్జెట్‌లో బీసీలకు రూ.20 వేల కోట్లు కేటాయించడానికి ఏ షెడ్యూల్, ఏ కోర్టు అడ్డం వచ్చిందని నిలదీశారు. 'కాంగ్రెస్‌కు నిజంగా బీసీలపై ప్రేమ ఉంటే వెనుకబడినవర్గ నేతను ముఖ్యమంత్రి చేయండి. కేబినెట్‌లో 42 శాతం బీసీలకు మంత్రి పదవులు ఇవ్వడానికి, కార్పొరేషన్ పదవులు ఇవ్వడానికి ఏ షెడ్యూల్, ఏ సుప్రీంకోర్టు అడ్డం వచ్చింది' అని శంకర్ ప్రశ్నించారు. బీజేపీకి అవకాశమొస్తే మూడు సార్లు బీసీ నేతను ప్రధానిని చేసిందని, కాంగ్రెస్ పార్టీకి ఆ దమ్ముందా ? బీసీని ప్రధానిని చేయగలదా అని నిలదీశారు.

బీజేపీ బీసీ ద్రోహుల పార్టీ

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



కవాడిగూడ: బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం పంపించిన బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చడం కుదరదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఢిల్లీలో ప్రకటించడాన్ని బీసీలంతా ముక్తకంఠంతో ఖండిస్తున్నామని, బీసీ రిజర్వేషన్లు పెంచకపోతే బీజేపీ బీసీల ద్రోహుల పార్టీగా చరిత్రలో నిలిచిపోతుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం దోమలగూడలోని బీసీ భవన్‌లో ఇతర బీసీ సంఘాల నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. 48 గంటల్లోగా రాంచందర్‌రావు తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోకపోతే బీజేపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు.

కేసీఆర్‌కు పేరు రావొద్దనే 'కిట్లు' బంద్

- కేసీఆర్ కిట్ల నిలిపివేతతో మహిళలకు ఇబ్బందులు
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- రేపు సిరిసిల్లలో 5 వేల మంది తల్లులకు కిట్లు పంచుతామని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావుకు మంచి పేరు రావద్దనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం 'కేసీఆర్ కిట్ల'పంపిణీని నిలిపివేసిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆరోపించారు. బీఆర్‌ఎస్ హయాంలో ఇచ్చిన కేసీఆర్ కిట్లతో రాష్ట్రంలో మాతా శిశు మరణాల సంఖ్య గణనీయంగా తగ్గడంతోపాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగిందని తెలిపారు. తన పుట్టిన రోజు సందర్భంగా 'గిఫ్ట్ ఏ స్మైల్'పేరిట ఈ నెల 24న సిరిసిల్లలో 5 వేల మంది తల్లులకు కేసీఆర్ కిట్లు అందజేస్తున్నట్లు కేటీఆర్ ప్రకటించారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం హైదరాబాద్‌కు చెందిన పలువురు తల్లీ బిడ్డలకు కేసీఆర్ కిట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం కేసీఆర్ కిట్ల పంపిణీని 20 నెలలుగా నిలిపివేయడంతో మహిళలు బాధ పడుతున్నారని అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలు మార్చి ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్యను కేసీఆర్ పెరిగేలా చేశారని తెలిపారు. 2014కు ముందు నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు అని జనాలు భయపడేవారని, సీఎంగా కేసీఆర్ తీసుకున్న చర్యలతో ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు విశ్వాసం పెరిగిందని చెప్పారు.

ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై మోసం

ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనలో కాంగ్రెస్ మోసపూరిత వైఖరి అవలంబిస్తోందని బీఆర్‌ఎస్ నేతలు విమర్శించారు. బీఆర్‌ఎస్ బీసీ నేతలతో మంగళవారం మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ నివాసంలో కేటీఆర్ భేటీ అయ్యారు. బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని కేంద్రం ఆమోదించదని తెలిసినా, ఆర్డినెన్స్ పేరిట రాష్ట్ర ప్రభుత్వం కొత్త నాటకానికి తెరతీసిందని నేతలు విమర్శించారు. కులగణనలో బీసీల సంఖ్య తక్కువగా చూపడం, బీసీ డిక్లరేషన్ అమలు చేయకపోవడం వెనుక కాంగ్రెస్ దురుద్దేశం ఉన్నట్లు కనిపిస్తోందని అనుమానాలు వ్యక్తంచేశారు. బీసీ రిజర్వేషన్లపై కోర్టులు, చట్టపరమైన అంశాలను సాకుగా చూపుతూ కాంగ్రెస్ తప్పించుకునే ప్రయత్నం చేస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన కులగణనను మరింత శాస్త్రీయంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ.. తెలంగాణలో మాత్రం అత్యంత లోపభూయిష్టంగా నిర్వహించిందని విమర్శించారు. బీఆర్‌ఎస్ పాలనలో బీసీల కోసం ప్రారంభించిన పథకాలను రద్దు చేసి కాంగ్రెస్ మోసగిస్తోందని మండిపడ్డారు.



మహిళకు కేసీఆర్ కిట్‌ని అందిస్తున్న కేటీఆర్

మద్దతు కూడగడతాం

▶ మొదటి పేజీ తరువాయి

వివరిస్తామని భట్టి చెప్పారు. కాంగ్రెస్ ఎంపీలతోపాటు ఇతర పార్టీల ఎంపీలకు కూడా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అన్ని విషయాలను తెలియజేస్తామన్నారు. గతంలో జరిగిన సర్వేల అనుభవాలు, తాము నిర్వహించిన పైలట్ సర్వే, సర్వే ప్రశ్నావళి రూపకల్పన, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేసిన సమావేశాలు, ఎన్యూమరేషన్ ప్రక్రియ, డేటా ఎంట్రీతోపాటు ఈ సర్వేను స్వతంత్ర నిపుణుల కమిటీతో అధ్యయనం చేయించిన తీరును అందరికీ అర్థమయ్యేలా వివరిస్తామన్నారు. మొత్తం 88 కోట్ల పేపర్లలో నిక్షిప్తమైన కులగణన సమాచారాన్ని సరళీకృతం చేసిన అనంతరం అవసరమైన సమాచారాన్ని ప్రజలకు అందించామని చెప్పారు. నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికను కూడా అసెంబ్లీలో, కేబినెట్‌లో పెట్టి ఆమోదించిన తర్వాత ప్రజల ముందుకు తెస్తామని వెల్లడించారు.

ఆయన అడ్డుకునేలా మాట్లాడతారు..: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావుకు దళితులన్నా, బీసీలన్నా చిన్నచూపు ఉన్నట్టుందని భట్టి వ్యాఖ్యానించారు. అందుకే ఆయా వర్గాలకు మేలు చేసే ప్రయత్నాలు ఎప్పుడు జరిగినా ఆయన అడ్డుకునే విధంగా మాట్లాడతారన్నారు. గతంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో జరిగిన వ్యవహారంలో ఆయన పాత్ర ఏంటో అందరికీ తెలుసన్నారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని తాము చెప్పామని, చేశామని అన్న భట్టి.. తామే చెప్పాం కాబట్టి తామే చేసుకోవాలని రాంచందర్‌రావు వ్యాఖ్యానించడం సరైంది కాదన్నారు. తామేమీ బీజేపీ అంతర్గత వ్యవహారాల గురించి అడగడం లేదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య జరిగే ప్రక్రియ గురించి అడుగుతున్నామని చెప్పారు. రాంచందర్‌రావు పంపిన లీగల్ నోటీసులు అందాయా అన్న ప్రశ్నకు భట్టి సీరియస్‌గా స్పందించారు. 'లీగల్ నోటీసులకు భట్టి భయపడడు. నేను ఏం మాట్లాడానో దానికి కట్టుబడి ఉన్నా. సమయం వచ్చినప్పుడు కాంగ్రెస్ పార్టీగా, వ్యక్తిగా ఏం చెప్పాలో తెలుసు' అని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో తమ పార్టీకి చిత్తశుద్ధి లేకపోతే ఇంత ప్రక్రియ ఎందుకు చేస్తామని, ఈ అంశాన్ని ఇంత దూరం తీసుకొచ్చామంటేనే తమ చిత్తశుద్ధి ఏంటో ప్రజలు అర్థం చేసుకోవాలని భట్టి చెప్పారు.

అదేంటి.. రాంచంద్రా!

బీసీ రిజర్వేషన్ల అమలు సాధ్యం కాదన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండిపాటు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల అమలు సాధ్యం కాదనే రీతిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ మండిపడింది. మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్‌లు ఆదిశ్రీనివాస్, బీర్ల అయిలయ్య తదితరులు మంగళవారం వేర్వేరుగా మాట్లాడుతూ బీజేపీ వైఖరిని తూర్పారబట్టారు.

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మరోమారు తన నిజ స్వరూపాన్ని బయటపెట్టారని, అందుకే బీసీల రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చడం సాధ్యం కాదని అంటున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. తెలంగాణ బీజేపీ ఎంపీలు రాజీనామా చేస్తే ఎందుకు రిజర్వేషన్లు అమలుకావో చూస్తామన్నారు. కుల సర్వే ద్వారా రాష్ట్రంలో బీసీ జనాభా లెక్కలు తీశామని, అందుకు అనుగుణంగా అసెంబ్లీ, కేబినెట్‌లు ఆమోదించిన బిల్లును గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి పంపామని చెప్పారు. ఇప్పుడు దీనిపై కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని, మండల్ కమిషన్‌ను కమండల్ అన్న బీజేపీ మరోమారు తన వక్ర బుద్ధి, బీసీల పట్ల చేస్తున్న కుట్రను బయటపెట్టుకుందన్నారు.
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లకు రాంచందర్‌రావు వ్యతిరేకంగా కనిపిస్తున్నారన్నారు. రిజర్వేషన్లను ఆహ్వానిస్తున్నామని రాష్ట్రంలో చెప్పి ఢిల్లీ వెళ్లగానే మాట మారుస్తున్నాడని ఆరోపించారు.
- మరో విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ రాష్ట్రం నుంచి గెలిచిన ఎనిమిది బీజేపీ ఎంపీలు ఎలాగూ నిధులు తేలేకపోతున్నారని, ఇప్పుడు బీసీలకు రిజర్వేషన్లు కూడా తేలేకపోతున్నారని చెప్పారు. రాంచందర్‌రావు చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.
- బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయడంలో కుట్రలు పన్నితే బీజేపీ తెలంగాణలో భూస్థాపితం అవుతుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ హెచ్చరించారు.
- అధికార ప్రతినిధి గౌరి సతీశ్ మాట్లాడుతూ రాంచందర్‌రావు చేసిన వ్యాఖ్యలకు కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ బాధ్యత వహించాలని కోరారు.
- మరో అధికార ప్రతినిధి లింగం యాదవ్ మాట్లాడుతూ బీసీలకు 42% రిజర్వేషన్లు ఇవ్వకపోతే రాష్ట్రంలో బీజేపీ నేతలు తిరగలేరన్నారు.

బీసీలపై బీజేపీ వైఖరి బయటపడింది

బీసీ ఇంటెలెక్చువల్స్ ఫోరం చైర్మన్ టి.చిరంజీవులు

హిమాయత్‌నగర్: బీసీల విషయంలో బీజేపీ ద్వంద్వ వైఖరికి పాల్పడుతుందని బీసీ ఇంటెలెక్చువల్స్ ఫోరం చైర్మన్ టి.చిరంజీవులు విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు విషయంలో బీజేపీ, కాంగ్రెస్ చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదన్నారు. మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో బీసీ ఇంటెలెక్చువల్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో చిరంజీవులు మాట్లాడారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బీసీల లిస్టులో, కేంద్రంలోని ఓబీసీల జాబితాలో కూడా ముస్లింలు ఉన్నారు కదా? ఈ అంశంపై బీజేపీ ఎందుకు మాట్లాడదని ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఢిల్లీలో చేసిన ప్రకటనను తక్షణమే వెనక్కి తీసుకోవాలని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డిని, కాంగ్రెస్ పార్టీని గత కొద్ది నెలల నుంచి అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదన్నారు.



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న టి.చిరంజీవులు. చిత్రంలో జస్టిస్ ఈశ్వరయ్య తదితరులు

రాంచందర్‌రావుకు న్యాయపరమైన అవగాహన లేదు: జస్టిస్ వి.ఈశ్వరయ్య

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుకు న్యాయపరమైన అవగాహన లేదని, పూర్తి అజ్ఞానంతో వ్యాఖ్యలు చేశారని జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ వి.ఈశ్వరయ్య అన్నారు. తమిళనాడులో 4 సార్లు అఖిలపక్ష సమావేశం, 3 సార్లు తీర్మానం చేసి రాజ్యసభ, లోక్‌సభలో ఏకగ్రీవంగా ఆమోదం చేసి, బీసీ రిజర్వేషన్లను తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చారన్నారు. ఈ సమావేశంలో చామకూర రాజు, కేవీ.గౌడ్, చెన్నా శ్రీకాంత్, కిరణ్ కుమార్‌గౌడ్, శివ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.





మనకు ప్రియమైన వారు, మన పట్ల అప్రియంగా ప్రవర్తించినప్పుడు – మన హృదయంలో వారిపట్ల కరుణా భావం కలగాలి. వారి ప్రవర్తనను చూసి మన మనస్సులో విషాదం నింపుకుంటే, మన గత అకుశల కర్మల ఫలితాన్ని అనుభవించడమే కాకుండా, వర్తమానాన్ని కూడా ధ్వంసం చేసుకుంటాం. – బౌద్ధ ధర్మం

ఫోకస్

సాక్షి

బుధవారం, 23 జూలై 2025

కట్టుకథల కుట్ర సర్కార్!

కుట్రలు తప్ప తెలియనివాడికీ, వంచనతప్ప మరేదీ చేతగానివాడికీ మనుగడ కోసం కట్టుకథలను ఆశ్రయించటం తప్ప దిక్కులేదు. ఈవీఎంల మాయాజాలంతో ఏపీలో నిరుడు గద్దెనెక్కింది మొదలు కూటమి ప్రభుత్వం రౌడీలనూ, గూండాలనూ ప్రోత్సహించి హత్యలకూ, దౌర్జన్యాలకూ తెగబడటంతో పాటు తప్పుడు కేసులతో చెలరేగిపోతోంది. రెడ్ బుక్‌లో సరికొత్త అంకం లిక్కర్ స్కాం! ఆ పేరిట ఇప్పటికే కొంతమంది మాజీ అధికారులను జైలుపాలు చేసిన ప్రభుత్వం, తాజాగా వైఎస్సార్ కాంగ్రెస్ ఎంపీ మిథున్ రెడ్డిని అరెస్టు చేసింది. విద్యార్థి రాజకీయాల నాటినుంచీ తనకు బద్ధ వ్యతిరేకి అయిన మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డిపై కక్ష తీర్చుకోవటానికే ఆయన కుమారుడు మిథున్‌రెడ్డిని ఇందులో ఇరికించారన్నది బహిరంగ రహస్యం. 2014–19 మధ్య అధికారం వెలగబెడుతున్నప్పుడు తన బినామీలకూ, సన్నిహితులకూ నిబంధనలు కాదని డిస్టిలరీలు పెట్టుకోవటానికి, మద్యం ఉత్పత్తికి ఎడాపెడా అనుమతులిచ్చి చీకటి జీవోల సాక్షిగా దొరికిపోయిన ముఖ్యమంత్రి చంద్రబాబు కుంభకోణానికి ఆస్కారమే లేనిచోట ఏదో జరిగిపోయిందంటూ ఊదరగొడుతున్నారు. 'ఆత్రగాడికి బుద్ధి మట్టు' అనే నానుడి ఉత్తపుణ్యాన రాలేదు. ఎదుటివారిపై బురద చల్లి ఏదోరకంగా వారికి అవినీతి మకిలి అంటిద్దామని తండ్రీ కొడుకులు పడుతున్న తాపత్రయం వాస్తవాల ముందు బొక్కబోర్లా పడుతోంది.

వైఎస్సార్ కాంగ్రెస్ పాలనలో తీసుకొచ్చిన మద్యం విధానంలో కొత్తగా ఒక్కటంటే ఒక్క డిస్టిలరీకి అనుమతినిచ్చిన వైనం లేదు. సరిగదా... అంతకుముందు టీడీపీ ఏలుబడిలో చెలరేగిన మద్యం మాఫియా నడ్డి విరగ్గొట్టి, మద్యం దుకాణాలన్నిటినీ ప్రభుత్వపరం చేశారు. వాటి సంఖ్యను గణనీయంగా తగ్గించారు. మద్యం విక్రయ వేళల్ని కుదించారు. బాబు హయాంలో తామర తంపరగా పెరిగిపోయి, ఊరూవాడా జనం మూల్గులు పీల్చిన బెల్ట్ షాపుల జాడే లేకుండా చేశారు. పర్మిట్ రూమ్‌ల దందా అడ్డుకున్నారు. ఆ విధానం కారణంగా తమ అక్రమ సంపాదన నిలిచిపోగా లబోదిబోమని అప్పట్లో గగ్గోలు పెట్టింది తెలుగు దేశీయులే. మద్యపాన ప్రియుల్ని తగ్గించటానికి ఇన్ని చేసిన జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏకంగా రూ. 3,500 కోట్ల రూపాయల కుంభకోణానికి పాల్పడిందట! అందులో భారీమొత్తం డొల్ల కంపెనీల ద్వారా దుబాయ్‌కి తరలిపోయిందట!! ఇంగితజ్ఞానం వున్నవారెవరికైనా ఇందులోని కపట నాటకం అర్థమవుతుంది.

బురద చల్లటానికి వీళ్లకంటూ ఒక పద్ధతుంటుంది. ముందు ఎల్లోమీడియాలో తప్పుడు కథనాలు వండివార్చుతారు. ఏదో జరిగిపోయిందంటూ ఆ మీడియా పెడబొబ్బలు పెడుతుంది. వాటిని ఆధారం చేసుకుని కేసులు రూపొందుతాయి. వాటిపై దర్యాప్తుకంటూ సీఐడీ ఆధ్వర్యాన సిట్ ఏర్పాటవుతుంది. ఏం చేయడానికీ పాలుబోని సిట్... ఎల్లోమీడియా తప్పుడు కథనాలనే రీసైక్లింగ్ చేసి చార్జిషీట్లుగా రూపొందిస్తుంది. అవి న్యాయస్థానం మెట్లెక్కకుండానే ఎల్లోమీడియాకు చేరతాయి. తమకు విశ్వసనీయంగా తెలిసిందంటూ ఆ మీడియా పతాక శీర్షికలతో పండగ చేసుకుంటుంది. ఇంతకూ జనంలో ఇసుమంతైనా విశ్వసనీయత లేని ఈ మీడియాకు 'విశ్వసనీయంగా' చెప్పేవారెవరు? ఇంకెవరు... తండ్రీకొడుకులూ, వారి అడుగులకు మడుగులొత్తే వీర విధేయ అధికారులూ! తమ కథనాలే చార్జిషీట్లుగా అవతారమెత్తాయని, అవే న్యాయస్థానాల పరిశీలనకు పోతున్నాయని తెలియనట్టు, కొత్తగా ఆ రోజే బయట పడినట్టు ఎల్లోమీడియా వికృత విన్యాసాలకు తెగబడుతుంది. 13 వేల ఫోన్‌కాల్స్‌ట, వందలాది వాట్సాప్ చాటింగ్‌లట. దుబాయ్‌లో జల్సాలట. జనం నవ్విపోతారన్న వెరపే లేదు. వారిపట్ల జవాబుదారీతనం అసలే లేదు.

జనానికిచ్చిన వాగ్దానాల్లో ఒక్కటంటే ఒక్కటి కూడా నెరవేర్చకుండా ఏడాదికాలం మాయమాటలతో కాలక్షేపం చేసిన కూటమి సర్కారు ప్రజల దృష్టి మళ్లించటానికి ఎంచుకున్న సరికొత్త డ్రామా లిక్కర్ కుంభకోణం. పనిలో పనిగా ప్రత్యర్థులను ఇబ్బందిపెట్టడం దీని ఆంతర్యం. 2014–19 మధ్య అధికారం వెలగబెడుతుండగా తన అంతేవాసులకు అడ్డగోలుగా లబ్ధి చేకూర్చి ఖజానాను కొల్లగొట్టింది చంద్రబాబే. ఇది వైఎస్సార్ కాంగ్రెస్ ఆరోపణ కాదు. సాక్షాత్తూ రాజ్యాంగబద్ధ సంస్థ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) విప్పిచెప్పిన లోగుట్టు. గుట్టుచప్పుడు కాకుండా స్వయంగా సంతకాలు చేసిన బాబు నిర్వాకం కారణంగా ఖజానాకు 2015–19 మధ్య రూ. 5,200 కోట్ల మేర గండి పడిందని ఆ సంస్థ బయటపెట్టింది. ఇదిగాక ఎంఆర్‌పీ కన్నా 20 శాతం అధిక ధరలకు విక్రయించి మరో రూ. 20,000 కోట్లు కొల్లగొట్టారని బయటపడటంతో 2023లో కేసు నమోదైన కారణంగా బాబు, ఆయన అనుచరగణం బెయిల్ కూడా తీసుకున్నారు. మళ్లీ అధికారంలోకొచ్చాక ఈ దోపిడీ మరింత విశృంఖలంగా పెరిగింది.

తమ మద్యం కుంభకోణాన్ని చూసీచూడనట్టు వదిలేయకుండా కేసులుపెట్టి నడిబజారులో నిలబెట్టినందుకే బాబు కక్షతో రగిలిపోతున్నారు. పర్యవసానంగానే తాజా కేసు. జగన్ ప్రభుత్వ కొత్త మద్యం విధానంపై వాస్తవానికి 2021లోనే టీడీపీ కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)కు ఫిర్యాదుచేసింది. అందులో మొహం వాచేలా తీర్పు వెలువడింది. ఎలాంటి అవకతవకలూ జరగలేదని, మద్యం కొనుగోళ్ల విధానం పారదర్శకంగా వున్నదని సీసీఐ తేల్చిచెప్పింది. ఒకసారి ఛీకొట్టించుకున్నా బుద్ధిరాని పార్టీ ఇప్పుడు అధికారంలోకి ఎగబాకి నిస్సిగ్గుగా ఒక పెద్ద డ్రామాకు తెర లేపింది. ఈ ప్రహసనాన్ని జనం నిస్సందేహంగా తిప్పికొడతారు.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం; తిథి: బ.చతుర్దశి రా.2.23 వరకు, తదుపరి అమావాస్య; నక్షత్రం: ఆరుద్ర రా.6.36 వరకు; తదుపరి పునర్వసు; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: ఉ.11.39 నుండి 12.31 వరకు; అమృత ఘడియలు: ఉ.9.03 నుండి 10.36 వరకు; మాస శివరాత్రి

సూర్యోదయం : 5.39
సూర్యాస్తమయం: 6.33
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

చైనాలో ఇంత అభివృద్ధి ఎలా?



అభిప్రాయం

టంకశాల అశోక్

చైనా పేరు వినగానే సర్వసాధారణంగా తోచే ప్రశ్నలు కొన్నున్నాయి. అక్కడ ఇంతటి అభివృద్ధి ఎందుకు? మార్క్సిజం, సోషలిజం పరిస్థితి ఏమిటి? ప్రజలకు స్వేచ్ఛలు ఉంటాయా? వంటివి. ఇవి ఎంత ముఖ్యమైన ప్రశ్నలో వాటన్నింటి మధ్య గల పరస్పర సంబంధం కూడా అంత ముఖ్యమైనది. ఈ విషయాల గురించి ఎంతో చదువుతుంటాం, వింటుంటాం. కానీ అక్కడి పరిస్థితులను కళ్లారా చూడటం, వారితో మాట్లాడి తెలుసుకోవటం వేరు. చైనాలో కొద్ది వారాల పాటు పర్యటించిన తర్వాత కలిగిన అభిప్రాయాలు ఈ విధంగా ఉన్నాయి.



◆ చైనాకు సంబంధించి 1839 నాటి మొదటి నల్లమందు యుద్ధంతో మొదలై సరిగా 110 సంవత్సరాల తర్వాత 1949లో కమ్యూనిస్టు విప్లవం విజయవంతమయే వరకు గల కాలాన్ని కమ్యూనిస్టులు 'అవమానాల శతాబ్దం' అన్నారు. తమ నాయకత్వాన ఆ తర్వాతి నూరేళ్లు 1949 నుంచి 2049 కాలం 'పునరుజ్జీవన శతాబ్దం' కావాలని గట్టిగా తీర్మానించుకున్నారు. ఈ తీర్మానం ప్రకారం అన్ని ప్రభుత్వాలు ఏకదీక్షతో పని చేస్తూ వస్తున్నాయి.

రెండు శతాబ్దాలు

అభివృద్ధి గురించి మాట్లాడేవారు గుర్తించనిది ఏమంటే, ఈ భావనకు, అభివృద్ధి చెంది తీరాలన్న పట్టుదలకు మూలాలు చరిత్రలో ఉన్నాయి. అవి 1949 నాటి కమ్యూనిస్టు విప్లవంతో మొదలయ్యాయి. వారిలో విప్లవం కోసం ఎంత తపన ఉండేదో, బలమైన అభివృద్ధి కోసం అంత ఉండేది. ఆ మేరకు వారి ఆలోచనలు ఏమిటి? చైనా, భారతదేశం గొప్ప చరిత్ర, సంస్కృతి, ఆర్థికాభివృద్ధి ఉండిన దేశాలు. విదేశీయుల ఆధిపత్యం, దోపిడీ వల్ల దెబ్బ తిన్నాయి. చైనాకు సంబంధించి 1839 నాటి మొదటి నల్లమందు యుద్ధంతో మొదలై సరిగా 110 సంవత్సరాల తర్వాత 1949లో కమ్యూనిస్టు విప్లవం విజయవంతమయే వరకు గల కాలాన్ని కమ్యూనిస్టులు 'అవమానాల శతాబ్దం' (సెంచరీ ఆఫ్ హ్యూమిలియేషన్) అన్నారు. తమ నాయకత్వాన ఆ తర్వాతి నూరేళ్లు 1949 నుంచి 2049 కాలం 'పునరుజ్జీవన శతాబ్దం' (సెంచరీ ఆఫ్ రిజువనేషన్) కావాలని గట్టిగా తీర్మానించుకున్నారు.

చైనా చరిత్రను, సంస్కృతిని విస్తారంగా అధ్యయనం చేసినట్లు పేరున్న మావో కాలంలో జరిగిన ఈ తీర్మానం ప్రకారం ఈ రోజు వరకు అన్ని ప్రభుత్వాలు కూడా ఏకదీక్షతో పనిచేస్తూ వస్తున్నాయి. తమ లక్ష్యం సాధనకు అవసరమైన అవగాహనలు, ప్రణాళికలు, వాటి అమలులో పట్టుదల, అందుకు కావలసిన ఆర్థిక, శాస్త్ర–సాంకేతిక, మానవ వనరులు అన్నీ వారికున్నాయి. ప్రజల సహకారం ఉంది. అందువల్లనే, 'పునరుజ్జీవన శతాబ్దం' 1949లో మొదలై ఇప్పటికి 75 సంవత్సరాలు గడిచి ఇంకా 25 సంవత్సరాలు మిగిలి ఉన్న దశకు చేరేసరికి, చైనా ఇంతటి అభివృద్ధిని సాధించగలిగింది.

ఈ లక్ష్య సాధన కోసం వారు చేస్తున్న గమనార్హమైన ప్రయత్నం మరొకటి ఉంది. కమ్యూనిస్టు విప్లవానికీ, అవమానాల శతాబ్దం, పునరుజ్జీవన శతాబ్దం అనే భావనలకూ బీజాలు ఏ విధంగానైతే వారి చరిత్ర, సంస్కృతులలో ఉన్నాయో, అదే ప్రకారం ఆ చరిత్ర, సంస్కృతి, జాతీయ భావన, దేశభక్తి భావనల పునాదిగా ప్రజలను పాజిటివ్‌గా సమీకృతం చేస్తూ, వారిని ఈ అభివృద్ధి మహా యజ్ఞంలో భాగస్వాములను చేయగలుగుతున్నారు. ఆ అభివృద్ధి ఫలాలను మొత్తం మానవజాతి చరిత్రలోనే ఎక్కడా ఎప్పుడూ లేని విధంగా ప్రజలకు పంపిణీ చేస్తున్నారు. ఇది సాక్షాత్తూ ఐక్యరాజ్యసమితి మాట.

కళ్లకు కట్టిన అభివృద్ధి

ఇక ఆ అభివృద్ధి తీరుతెన్నులపై అనేక కథనాలు తరచు వెలువడుతున్నవే అయినందున, ఆ వివరాలు, గణాంకాలలోకి ఇక్కడ వెళ్లటం లేదు. వాటిలో పేర్కొననివి, నేను స్వయంగా చూసి సంభ్రమం చెందినవి కూడా అనేకం ఉన్నాయి. అందులో ఒకటి మాత్రం చెప్తాను. నేను బీజింగ్ నుంచి శియాన్ నగరానికి వెళ్లిన హైస్పీడ్ రైలు వేగం గంటకు 350 కి.మీ.లు. అది గాక 450 కి.మీ. రైలు మరొక మార్గంలో ఉంది గానీ అందులో ప్రయాణించలేదు. అయితే, 600 కి.మీ.ల రైలుపై ప్రయోగాలు జరుగుతున్నట్లు విన్నాను. చైనా నుంచి ఇండియా చేరిన తర్వాత 48 గంటలలో వచ్చిన వార్త ఆ ప్రయోగం విజయవంతమైందని, ఆ రైలు వేగం 620 కి.మీ.లకు చేరిందని. అక్కడి హైస్పీడ్ రైళ్లు ఏవీ నేలపై నడవవు. వందల, వేల కి.మీ.లు ఎలివేటెడ్ కారిడార్లలోనే (హైదరాబాద్ మెట్రో తరహాలో) నడుస్తాయి.

చైనా అభివృద్ధి లక్ష్యం 2049 నాటికి ప్రస్తుత రెండవ స్థానం నుంచి మొదటి స్థానానికి చేరాలని. అవమానాల శతాబ్ది, పునరుజ్జీవన శతాబ్దిగా మారాలన్న లక్ష్యం ఆ విధంగా నెరవేరగలదన్నది ఆలోచన. ప్రచారంలోకి రాలేదు గానీ ఈ ఆలోచన మావో కాలంలోనే మొదలై నేటికీ కొనసాగుతున్నది. ఆ రోజులలో అందుకు సవాళ్లు పలు అభివృద్ధి చెందిన అన్ని దేశాల నుంచి ఉండేవి. ఇపుడు మిగిలింది అమెరికా ఒక్కటే. ఇది అన్నింటికి మించిన సవాలు.

ఇక్కడి తరహా లోనే...

ప్రస్తుతానికి మాత్రం చైనా అభివృద్ధికి స్వల్పకాలిక, దీర్ఘకాలిక వ్యూహాలు సజావుగానే సాగుతున్నట్లు కనిపిస్తున్నది. అందువల్లనే ఆర్థికంగా రెండవ స్థానానికి చేరింది. పర్చేజింగ్ పవర్ పేరిట (సమానమైన సరకులు, సర్వీసులకు అయే ఖర్చు అమెరికా కన్న చైనాలో తక్కువ కావటం)లో అమెరికాను 2017లోనే మించిపోవటం, నౌకాబలంలో అమెరికాను దాటడం, వైమానిక శక్తిపై పెట్టుబడులు, ఆధునిక పరిశోధనలు గణనీయంగా పెంచుతుండటం, సైన్స్–టెక్నాలజీ రంగంలో దరిదాపులకు వస్తుండటం, కొన్నింటిలో ఇప్పటికే అమెరికా కన్న ముందుకు పోవటం వంటివి ఇప్పటికే కనిపిస్తున్నాయి.

ఏక ధ్రువ ప్రపంచం నుంచి బహుళ ధ్రువ ప్రపంచం అనే నినాదం, బ్రిక్స్, బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ (బిఆర్ఐ) వంటి సంస్థలు, ఇతర దేశాలతో అమెరికా కూటమికి భిన్నంగా విన్–విన్ పాలసీ (మీరు, మేము ఉభయులమూ లాభపడాలి) అనే ఆర్థిక సంబంధాలు, మీ అంతర్గత విషయాలలో అమెరికా కూటమి వలె జోక్యం చేసుకోబోమనే రాజకీయ విధానం, సైన్స్ – టెక్నాలజీ బదిలీలు మొదలైనవి దీర్ఘకాల ఆర్థిక – రాజకీయ వ్యూహాలు అవుతున్నాయి. అందుకు ఒక మంచి ఉదాహరణను చెప్పాలంటే, నేను చైనాలో ఉన్న రోజులలోనే బ్రిక్స్ సమావేశాలు బ్రెజిల్‌లో జరిగాయి. ఆ సంస్థలో చేరే దేశాలపై పెద్ద ఎత్తున అదనపు సుంకాలు విధించగలమని గతం నుంచి హెచ్చరిస్తుండిన ట్రంప్, అదే హెచ్చరిక తిరిగి చేశారు. కానీ, అదేమీ లెక్క చేయకుండా ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాల నుంచి మరొక 16 దేశాలు కొత్తగా చేరాయి. ఇవన్నీ అమెరికా పలుకుబడిని తగ్గించి చైనా పలుకుబడిని పెంచేవి. చైనా 2049 నాటికి అగ్రరాజ్యమయ్యేందుకు తోడ్పడగలవి.


ఇవే రంగాల గురించి తెలుసుకోగలది ఇంకా చాలా ఉంది గానీ అదంతా ఇక్కడ చెప్పుకోలేము గనుక మొదట ప్రస్తావించిన ప్రశ్నలలో రెండు ముఖ్యమైన వాటి గురించి కొద్దిగా చూద్దాము. అక్కడ మార్క్సిజం, సోషలిజం, క్యాపిటలిజం పరిస్థితి ఏమిటన్నది ఒకటి. ప్రజలకు గల స్వేచ్ఛలు ఏమిటన్నది రెండవది. క్యాపిటలిజం పెట్టుబడులు, వ్యాపారం, లాభాలు అక్కడి ప్రభుత్వపరంగా, సంపన్నులైన చైనీయులపరంగా, బయటి దేశాలతో ఉమ్మడి పెట్టుబడుల పరంగా బాగా వర్ధిల్లుతున్నాయి. ఈ విధానాలు డెంగ్ శియావో పింగ్ సంస్కరణలు, 2001లో డబ్ల్యూటీవోలో చైనా చేరటం నుంచి మొదలై సాగుతున్నాయి. ఆ విధంగా ఒనగూరే లాభాలు, సమాజంలో కింది స్థాయి వరకు లభిస్తున్న ఆదాయాలూ క్లాసికల్ సోషలిజానికి ప్రత్యామ్నాయంగా మారాయి. సోషలిజం విత్ చైనీస్ క్యారక్టరిస్టిక్స్ అన్న డెంగ్ సూత్రీకరణకు రూపం, సారం ఇదేననుకోవాలి.

అడుగడుగునా కెమెరాల నిఘాలు, మౌలికంగా వ్యవస్థకు వ్యతిరేకమైన చర్యలను సహించక పోవటం, ఒకే పార్టీ వ్యవస్థల వల్ల ఎన్నికలు గ్రామస్థాయిలో తప్ప ఇతరత్రా లేకుండటం మినహా, ఇక్కడ ఉన్న స్వేచ్ఛలన్నీ అక్కడా కనిపించాయి. చదువులు, ఉద్యోగ వ్యాపారాలు, దేశ విదేశాలకు ప్రయాణాలు, సంపాదనలు, ఖర్చులు, అవినీతి, విలాసాలు, కోరుకున్నట్లు బట్టలు వేసుకోవడం, కొన్ని అవలక్షణాలు, సంప్రదాయికమైన నమ్మకాలు, ఆచారాలు అన్నీ ఉన్నాయి. చివరకు నైట్ లైఫ్ వీధులు, మసాజ్ పార్లర్లు, సెక్స్ టాయ్ షాపులు సహా. సగటు మనిషికి ఇంతకన్న కావలసిన స్వేచ్ఛలేమిటి?

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ మీడియా

ఏమైనట్టు?



ఒకవేళ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌కు ఆరోగ్య సమస్యలుంటే ఆయన వర్షాకాల సమావేశాలకు ముందే ఎందుకు రాజీనామా చేయలేదు. అవి ముగిసేవరకైనా ఎందుకు ఆగలేదు? తన భారాన్ని ఆయన డిప్యూటీకి వదిలేసి ఉండొచ్చు, అయినా మొదటి రోజు అధ్యక్షత వహించడానికే ఎంచుకున్నారు. చూస్తుంటే ఆయన ఆరోగ్యం రాత్రికి రాత్రే పాడైనట్టుంది.

– కె.సి.సింగ్, మాజీ దౌత్యవేత్త

ఓపెన్ విజన్



ఉచిత సాఫ్ట్‌వేర్ ఉద్యమానికి మద్దతిచ్చిన వాడిగా కేరళ మాజీ ముఖ్యమంత్రి వి.ఎస్.అచ్యుతానందన్‌ను గుర్తుంచుకోవాలి. కేరళ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో లినక్స్, ఇంకా ఇతర ఓపెన్ సోర్స్ టూల్స్ వాడటం ఆయన విజన్ వల్లే సాధ్యమైంది.

– అద్వైద్, క్రానికలర్

వండివార్చే కథనాలు



బ్రెగ్జిట్‌ను ఒక వైఫల్యంగా చూపేందుకు పరిశోధనల్లో అక్రమం చేసిందని వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ మీద ఆరోపణ. తమ గ్లోబల్ ర్యాంకింగ్స్‌ను మాయ చేశారంటూ ఆఖరికి పాశ్చాత్య దేశాలు కూడా ఇప్పుడు ఆరోపిస్తున్నాయి. ఒకసారంటూ పారదర్శకత లేని వ్యవస్థను సృష్టించినప్పుడు, తమ ప్రయోజనాలను కాపాడుకోవడానికి అదే యంత్రాంగాన్ని కులీనులు వాడుకోకుండా ఎలా ఉంటారు?

– సంజీవ్ సన్యాల్, ఆర్థికవేత్త

మారే సంబంధాలు



జగదీప్ ధన్‌ఖడ్‌ను ఎగతాళి చేయడానికి అన్ని అవకాశాలను వాడుకుని, ఆఖరికి ఆయనకు వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానాన్ని కూడా ప్రవేశపెట్టిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఆయనకు అతిపెద్ద సానుభూతిపరురాలిగా ప్రవర్తిస్తోంది. కాలం ఎంత వేగంగా మారిపోతుంది!

– మోనికా వర్మ, పరిశోధకురాలు

సూపర్ భ్రమలు



ఈ గ్రహం మీద అత్యంత తెలివైన మనుమలే అర్థం పర్థంలేని విషయాలను నమ్మే ప్రమాదం ఉన్నప్పుడు, సూపర్ ఇంటెలిజెంట్ ఏఐ అంతకు మించిన భ్రమలను పెంచుకోగలదా? మనకు మించిన భ్రమలనే అది కలిగివుంటుంది. అందుకే మనకు గతంలో కన్నా గట్టి నైతిక విలువలు అవసరం.

– యువల్ నోవా హరారీ, పాపులర్ హిస్టారియన్

ఎన్ని చెట్లు?



2004–14 మధ్య, దేశవ్యాప్తంగా 1.73 లక్షల హెక్టార్ల అటవీ భూములను అటవీయేతర వినియోగం కోసం ఆమోదించారు. అంటే మైనింగ్, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక ప్రాజెక్టుల కోసం. ఈ పరిమాణం ఢిల్లీ, ముంబయి, బెంగళూరు నగరాలు మూడింటిని కలిపిన మొత్తానికి దాదాపుగా సమానం.

– ఫాయే డిసౌజా, జర్నలిస్ట్

మనిషికి మచ్చిక




కుక్కలను కనీసం 14,000 సంవత్సరాలుగా మనుమలు మచ్చిక చేసుకుంటున్నారు. దానర్థం నమోదైన చరిత్రంతా కుక్కలను మచ్చిక చేసుకుంటూనే ఉన్నారు.

– ఇంతియాజ్ మహమూద్, వ్యాఖ్యాత

నిఖార్సయిన తెలంగాణ వాది

కులమతాలకు అతీతంగా మొత్తం తెలంగాణ సమాజాన్ని ఒక్కటి చేసింది తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమం. ఆ ఉద్యమంలో ఎందరెందరినో కలిసే మహత్తరమైన అవకాశం వచ్చింది. నిలువెల్లా తెలంగాణ తనం నింపుకొన్న మహామనిషి, రాజనీతి శాస్త్రాన్ని బోధిస్తూ ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్‌గా వేలాది మంది విద్యార్థులపై చెరగని ముద్రవేసిన ప్రొఫెసర్ కుంభం మధుసూదన రెడ్డి అందులో ఒకరు. తెలంగాణకు సంబంధించిన ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, సాహిత్య రంగాలపై అలవోకగా మట్లాడ గల దిట్ట ఆయన.



ప్రొ॥ కుంభం మధుసూదన్ రెడ్డి

వీర తెలంగాణ కేంద్రమైన నల్లగొండ జిల్లా మానుగోడు నియోజకవర్గం శివన్న గూడెం ఆయన స్వగ్రామం. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం సమయంలో టాగూర్ ఆడిటోరియంలో మీటింగులు పెట్టించాడు. రాష్ట్రసాధన ఉద్యమనేత కేసీఆర్ దగ్గర్నుంచి ప్రజా సంఘాల, అధ్యాపక సంఘాల నేతలు, ఈ తరం విద్యార్థుల వరకు అందరికీ సుపరిచితుడు మధుసూదన్ రెడ్డి సారు. 'పల్లె కన్నీరు పెడ్తుందోయ్, కనిపించని కుట్రల'... అంటూ గోరటి వెంకన్న గొంతెత్తి గానం చేస్తుంటే గుక్కపట్టి ఏడ్చినవాడు.

ఈయనకు కోదండరామ్ అంటే ప్రేమెక్కువ. ప్రొ॥ లక్ష్మణ్, వినాయకరెడ్డి, కిషోర్, గింజల రమణారెడ్డిల దగ్గర్నుంచి లక్షలాది విద్యార్థుల వరకూ అందరిపై చెరగని ముద్ర వేసినవాడు. వర్ధెల్లి మురళి ఈయన విద్యార్థే. కె.శ్రీనివాస్, అల్లం నారాయణంటే మక్కువ. కె.రామచంద్రమూర్తి, టంకశాల అశోక్ దగ్గర్నుంచి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి వరకు అందరితోనూ అనుబంధం!

ఉద్యమ సమయంలో కేసీఆర్‌తో కలిసి గంటలకొద్దీ చర్చలు జరిపాడు. జిల్లాలు, మండలాలు తిరిగాడు. రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో ఆర్ట్స్ కాలేజీ ముందు హోలీ ఆడుతుండగా పోలీసులు వచ్చి గందరగోళం సృష్టించటం, మధుసూదన్ రెడ్డి ఆగ్రహించటం... ఆనాటి అసెంబ్లీలో తీవ్ర చర్చలకు, వాదోపవాదాలకు దారితీసింది.

మలిదశ ఉద్యమ సమయంలో ఆయన 70ల వయసులో ఉన్నప్పటికీ ఓపికగా అనేక సభలకు వెళ్లి ప్రసంగాలు చేశారు. తెలంగాణ ప్రభాకర్, వినాయక్, లక్ష్మణ్, ప్రొ॥ కేశవరావ్ యాదవ్, తోట ఆనందరావు, జయశంకర్, హరినాథ్ కలిసి పెట్టిన 'తెలంగాణ ఇన్ఫర్మేషన్ సెంటర్' (టిక్)లో ఆయన భాగస్వామి.

ఉస్మానియా యూనివర్సిటీలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల వాళ్లు వివిధ ఉద్యోగాలలో ఈయన హయాంలోనే ఎక్కువమంది రిక్రూట్ అయ్యారు. కింది కులాల నుంచి వచ్చిన వారికి అవకాశాలు తాను ప్రిన్సిపల్‌గా ఉన్న సమయంలో బాగా వచ్చాయని అనేకసార్లు మాటల సందర్భంగా గర్వంగా చెబుతుండేవారు.

వ్యవసాయానికి మూలమైన నేలతల్లి ఆయనకు ప్రాణపదం. దేశదేశాల్లో తిరిగి ఆంగ్ల భాషా లోతుల్ని చూసి వచ్చినా తన ఊరి యాసలోనే మాట్లాడేవారు. అహంకారం దరిచేరని వ్యక్తిత్వం. తెలంగాణ సామాజిక సంబంధాలు లోతుగా తెలిసిన ఆయన ఇక్కడి మానవీయ అనుబంధాలు అన్నింటినీ 'మరువలేని జ్ఞాపకాలు' పుస్తకంగా ఇటీవలే వెలువరించారు.

(ప్రొ॥ కుంభం మధుసూదన్ రెడ్డి జూలై 22న మరణించారు.)

– జూలూరు గౌరీశంకర్
తెలంగాణ సాహిత్య అకాడమి మాజీ చైర్మన్

'పీఎం కిసాన్' కొందరికేనా?

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలెన్ని తెచ్చినా క్షేత్ర స్థాయిలో అమలులో లోపాల వల్ల రైతులకు జరగాల్సిన న్యాయం జరగడంలేదు. ఇందుకు తాజా ఉదాహరణ 'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి' పథకం అమలు.

కేంద్ర ప్రభుత్వం దేశంలో ఉన్న రైతులందరికీ భూ కమతం, విస్తీర్ణంతో సంబంధం లేకుండా, వ్యవసాయ అవసరాల నిమిత్తం ఏడాదికి 6,000 రూపాయల్ని మూడు విడతల్లో ఈ పథకం ద్వారా ఇవ్వడం మొదలుపెట్టింది. అయితే తెలంగాణలో 2019 జనవరి 31 వరకు భూమి పట్టాదారు పాసు పుస్తకాలున్న రైతులకు మాత్రమే ఈ సాయం అందుతోంది. 2019 నుండి ఇప్పటివరకు గత ఆరేండ్లుగా వ్యవసాయ భూమి అమ్మకాలు, కొనుగోళ్లు జరిగిన వారికి, వారసత్వంగా యాజమాన్య హక్కులు బదిలీ అయ్యి కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు వచ్చిన వారెవరికీ ఈ సాయం అందట్లేదు. స్థానిక వ్యవసాయ శాఖ అధికారుల్ని రైతులు సంప్రదిస్తే పీఎం కిసాన్ సమ్మాన్ వెబ్‌సైట్‌లో కటాఫ్ డేట్ 2019 ఫిబ్రవరి కాబట్టి కొత్తవారికి అందడం లేదని సమాధానం ఇస్తున్నారు.



తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 90% ఉపాంత, చిన్న కమతాలున్న ఐదు ఎకరాల లోపు రైతులున్నారు. ఇక పది ఎకరాల లోపున్న రైతులు దాదాపు 95% శాతమని ఏటా విడుదల చేసే తెలంగాణ సామాజిక ఆర్థిక ముఖచిత్రం (సోషియో ఎకనామిక్ అవుట్‌లుక్) ద్వారా తెలుస్తోంది. రాష్ట్ర సగటు భూ కమతం 0.89 హెక్టార్లు మాత్రమే. అంటే దాదాపు రెండు ఎకరాలు. రాష్ట్రంలో పీఎం కిసాన్ సాయం అందే రైతుల సంఖ్య ఏటేటా తగ్గుతూ వస్తోంది. 2020లో దాదాపు 37 లక్షల మంది రైతులు ఈ పథకంలో లబ్ధిదారులుగా ఉంటే 2024 నాటికి దాదాపు 31 లక్షలకు తగ్గింది. ఇందుకు ఒక కారణం ఒకే కుటుంబంలో ఒకరికన్నా ఎక్కువ మందిపేర్లతో లబ్ధి పొందుతున్నవారిని గుర్తించి ఒక్కరికే లబ్ధిని పరిమితం చేయడం.

ఈ మధ్యే రైతులందరికీ కేంద్ర ప్రభుత్వం పథకాల అమలులో సౌలభ్యం కోసం 'విశిష్ట గుర్తింపు కార్డులు' ఇవ్వనున్నట్లు ప్రకటించింది. దీని కోసం రైతులు తమ వివరాల్ని స్థానిక వ్యవసాయ శాఖ అధికారుల సహకారంతో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాతైనా కటాఫ్ తేదీని పెంచి కొత్త రైతులకు అవకాశం కల్పించాలి.

కరోనా మహమ్మారి విలయ తాండవం చేసినపుడు, భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలిచింది వ్యవసాయ రంగమే. ఇప్పటికీ దేశ జనాభాలో సగభాగం ప్రత్యక్షంగా ఉపాధి పొందుతున్నారు. 'ఎద్దు ఏడ్చిన ఎవుసం రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదని' ఒక నానుడి ఉంది. కార్పొరేట్‌లు, పారిశ్రామిక వేత్తలకు ఇచ్చే రాయితీలతో పోల్చితే రైతులకు చేసే సాయం చాలా స్వల్పంగా ఉంటోంది. ప్రభుత్వాలు రైతుల పట్ల వాస్తవిక దృక్పథంతో వ్యవహరించాలి.

– డా॥ మంద అశోక్ రెడ్డి । పరిశోధకుడు

తెలివిని హరించేది!

పూర్వం గోమతీ నది తీరంలో కంధుడు అనే ముని తపస్సు చేసుకుంటూ ఉండేవాడు. కంధుడి తపస్సును భగ్నం చేయడానికి ఇంద్రుడు ప్రమ్లోచన అనే అప్సరసను పంపించాడు. ఇంద్రుడి ఆజ్ఞ ప్రకారం ప్రమ్లోచన కంధుడిని చేరి, సపర్యలు చేసి అతడి మనసును రంజింపజేసింది. వారిరువురి మధ్య అనురాగం వృద్ధిపొందింది. అలా కొంత కాలం గడిచాక, తాను వచ్చిన పని అయిందని గ్రహించిన ప్రమ్లోచన కంధుడితో 'స్వామీ, నేను ఇంద్రుడి కొలువులో ఉండేదానను. ఇక్కడకు వచ్చి చాలా కాలం అయింది. ఇక సెలవిస్తే వెళతాను!' అంది. దానికి కంధుడు 'నువ్వు ఇక్కడకు వచ్చి ఎక్కువసేపేమీ కాలేదు. అప్పుడే నన్ను విడిచి వెళితే ఎలా?' అన్నాడు. మరికొంత కాలం గడిచింది. ప్రమ్లోచన మళ్ళీ వెడతానని బయలుదేరింది. 'నీవు వచ్చి ముహూర్తం సమయమైనా గడవలేదు. అప్పుడే వెళ్ళిపోతాననంటావేమిటి?' అన్నాడు కంధుడు. మరి కొంత కాలం గడిచింది. మరోసారి ప్రమ్లోచన ఇంద్రుడి సన్నిధికి వెళ్ళిపోయే ప్రయత్నం చేసింది. 'తపస్సు చేసుకుంటూ రోజులు గడిపే నా జీవితంలో నేను కోరకుండానే ప్రవేశించి, నా మనసులో మోహ బీజాన్ని నాటి, ఆనందపరచి, ఇప్పుడు ఆ అంతటినీ వ్యర్థంచేసి వెళ్ళిపోతాననడం నీకు తగినదేనా?' అన్నాడు కంధుడు.

జ్యోతిర్మయం

మరి కొంత కాలం గడిచింది. ఒకనాడు సూర్యుడు అస్తమిస్తున్న వేళ నదీతీరానికి బయలుదేరాడు కంధుడు. 'ఎక్కడికి స్వామీ?' అడిగింది ప్రమ్లోచన. 'సాయంత్రమయింది, సంధ్యాకాల విధులు తీర్చుకుని వస్తాను!' అన్నాడు కంధుడు. దానికి ఆమె నవ్వి 'ఒకనాటి పొద్దున నేను రావడం నిజం! ఇప్పుడు సాయంత్రమవడమూ నిజం! కానీ ఈ రెండింటి మధ్య తొమ్మిది వందల ఏడు సంవత్సరాల ఆరు నెలల మూడు రోజుల కాలం గడిచింది!' అన్నది. తెలివిలోకి వచ్చిన కంధుడు, మోహంలో చిక్కుకుని ఎంత విలువైన జీవితాన్నీ, తపోధనాన్నీ తాను పోగొట్టుకున్నాడో గ్రహించి బాధపడ్డాడు.

– భట్టు వెంకటరావు



పాకాల.. పారాల

గత రెండు రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో మహబూబాబాద్ జిల్లా గార్ల సమీపంలోని పాకాల ఏరు మంగళవారం చెక్‌డ్యాం పైనుంచి పొంగి ప్రవహిస్తోంది. దీంతో గార్ల నుంచి రాంపురం, మద్దివంచ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ ఏటిపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాలని పలుమార్లు ఎంపీ, ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్‌కు విన్నవించినా ఫలితం లేదని ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - గార్ల

శ్రీశైలం ప్రాజెక్టు ఒక్కగేటు ఎత్తివేత

దోమలపెంట: ఎగువ ప్రాంతాలు జూరాల, సుంకేసుల నుంచి వస్తున్న నీటి ప్రవాహంతో శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరువైంది. దీనితో మంగళవారం ఆనకట్ట వద్ద ఒక్క గేటును పది అడుగుల మేరకు పైకెత్తి స్పిల్‌వే ద్వారా 27,478 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. మరోవైపు ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో విద్యుతుత్పత్తి చేస్తూ 31,870 మొత్తం 67,185 క్యూసెక్కుల నీరు అదనంగా సాగర్‌కు విడుదలవుతోంది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 883.7 అడుగుల నీటి మట్టం వద్ద 208 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,054 క్యూసెక్కులు, స్పిల్‌వే ద్వారా 12,158, సుంకేసుల నుంచి 39,411 మొత్తం 88,623 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలానికి వస్తోంది. గడిచిన 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 20,000 క్యూసెక్కులు, హెచ్‌ఎన్‌ఎస్ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 1,013, ఎంజీకేఎల్‌ఐకు 957 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో 17.408 మిలియన్ యూనిట్లు, కుడిగట్టు కేంద్రంలో 17.180 మి.యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు.



సీఐడీ పోలీసుల అదుపులో పవన్‌కుమార్

- కిడ్నీ రాకెట్ కేసులో కీలక నిందితుడి అరెస్టు

సాక్షి, హైదరాబాద్: సరూర్‌నగర్ అలకనంద మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ కిడ్నీ రాకెట్ కేసులో కీలక నిందితుడు పవన్‌కుమార్‌ను రాష్ట్ర సీఐడీ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్న ఆయన్ను ముంబైలో అరెస్టు చేసి ట్రాన్సిట్ వారెంట్‌పై హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. బుధవారం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు పంపనున్నారు. కిడ్నీ మార్పిడి రాకెట్ల ముఠాతో కలిసి పవన్‌కుమార్ అనేక ఆపరేషన్లు చేసినట్లు సీఐడీ గుర్తించింది. ఈ నేపథ్యంలో విశాఖపట్నంలో పలు కేసులు నమోదయ్యాయి. కిడ్నీ మార్పిడి వ్యవహారంలో ఈ ఏడాది జనవరి 22న సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో హాస్పిటల్ నిర్వాహకులు, డాక్టర్లు సహా 13 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ రాకెట్‌పై పూర్తిస్థాయి దర్యాప్తునకు కేసును ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. ఏపీ పోలీసులతో కలసి రాష్ట్ర సీఐడీ తనిఖీలు కొనసాగిస్తోంది. దర్యాప్తులో భాగంగా ఈనెల 9న విజయనగరం జిల్లాకు చెందిన మురళీకృష్ణ, బెంగళూరుకు చెందిన ప్రదీప్, విశాఖపట్నానికి చెందిన పవన్ సహా మరికొందరు మధ్యవర్తులతో కిడ్నీ మార్పిడి చేసినట్లు ఆధారాలు సేకరించారు. ఒక్కో కిడ్నీకి రూ.10 లక్షలు తీసుకుని రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలు కిడ్నీ దాతకు ఇచ్చేవారని దర్యాప్తులో వెలుగు చూసింది. ఈ కేసులో మే నెలలో తమిళనాడుకు చెందిన శంకరన్, రమ్యలను సీఐడీ అధికారులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

తాండూరులో కుండపోత



మార్కండేయ కాలనీలో నీట మునిగిన వాహనాలు

తాండూరు టౌన్: వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో కుండపోత వర్షం కురిసింది. సోమవారం రాత్రి, మంగళవారం కురిసిన వానతో కాలనీలు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మూడు గంటల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో 10.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రోడ్ల పక్కన పార్క్ చేసిన బైకులు, కార్లు నీట మునిగాయి. దిచక్రవాహనంతో పాటు వరదలో కొట్టుకుపోతున్న ఓ యువకుడిని స్థానికులు రక్షించారు.

క్లుప్తంగా...

జాతీయ తెలుగు సారస్వత పరిషత్ అధ్యక్షుడిగా విశ్వనాథరాజు



లక్డీకాపూల్ (హైదరాబాద్): జాతీయ తెలుగు సారస్వత పరిషత్ తెలంగాణ శాఖ నూతన అధ్యక్షుడిగా కలిదిండి విశ్వనాథ రాజు ఎన్నికయ్యారని పరిషత్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు రాంప్రసాద్ కేశిరాజు తెలిపారు. నూతన కార్యవర్గంలో కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కాసాని వీరేశ్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా చంద్రహాస్ ఇప్పలపల్లి, ఉపాధ్యక్షుడిగా విద్య వెంకట్, యోగేశ్ ప్రభు, సంయుక్త కార్యదర్శిగా మంకరరాజు (ప్రజ్ఞ రాజు), కోశాధికారిగా సుధీర్ కాలనాథభట్ల, కార్య నిర్వాహక కార్యదర్శులుగా కలిదిండి మధుసూదన రాజు, శైలజా మిత్ర, కార్యదర్శులు ఇందుకూరి సూర్యప్రభ, ఆమంచి నాగపరిమళ, వాసరవేణి పరశురామ్, నాంపల్లి వెంకటసాయి, ఇద్దరు ప్రచార కార్యదర్శులుగా, మరో నలుగురు సభ్యులుగా ఎంపికయ్యారు. పరిషత్ గౌరవ సలహాదారులుగా హేమసుందరరావు మంగళాపురపు, దుర్గం రవీందర్, పొత్తూరి శ్యామల రాజు, జమలాపురపు విఠల్ రావు నియమితులయ్యారు.

అగర్వాల్ సమాజ్‌లో ఐదుగురు సలహాదారుల నియామకం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అగర్వాల్ సమాజ్‌కు ఐదుగురు కొత్త సలహాదారులను నియమించారు. ఈ మేరకు మంగళవారం అగర్వాల్ సమాజ్ తెలంగాణ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా ఒక ప్రకటన విడుదల చేశారు. అగర్వాల్ సమాజ్ తెలంగాణ కొత్త బృందం ద్వారా సమాజం ప్రభావవంతమైన మార్గదర్శకత్వం కోసం ఐదుగురు సలహాదారులను నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. కొత్త సలహాదారులలో బద్రివిశాల్ బన్సాల్, చంద్రకాంత్ దకోటియా, అంజనీకుమార్ అగర్వాల్, వినోద్ అగర్వాల్, హరీశ్ గుప్తా ఉన్నారు.

వాట్సాప్‌లో హేళన చేశాడని హత్య



కృపాకర్ (ఫైల్)

సూర్యాపేట టౌన్: వాట్సాప్ గ్రూప్‌లో చప్పట్లు కొట్టే ఎమోజీ పెట్టడం వివాదాస్పదంగా మారి ఓ వ్యక్తి హత్యకు దారితీసింది. సూర్యాపేటలో ఆగస్టు 3న పద్మశాలి సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు నామినేషన్ ప్రక్రియ జరుగుతోంది. ఈ ఎన్నికల్లో శ్రీరాముల రాములుతో పాటు మరో వ్యక్తి పోటీపడుతున్నాడు. అయితే, రాములుకు, గత అధ్యక్షుడు అప్పం శ్రీనివాస్‌కు విభేదాలున్నాయి. కాగా, సోమవారం పద్మశాలి సంఘం వాట్సాప్ గ్రూప్‌లో రాములు పెట్టిన ఒక మెసేజ్‌కు సమాధానంగా అప్పం శ్రీనివాస్ ఒక మెసేజ్ పోస్ట్ చేశాడు. దీనికి మద్దతుగా సంఘం సభ్యుడు మానుపూరి కృపాకర్ (54) చప్పట్లు కొడుతున్న ఎమోజీని పెట్టాడు. ఈ నేపథ్యంలో రాములు.. కృపాకర్‌కు ఫోన్ చేసి దుర్భాషలాడాడు. ఈ విషయమై కులపెద్దలు, ఎలక్షన్ ఆఫీసర్లకు ఫిర్యాదు చేయడానికి కృపాకర్ మంగళవారం సూర్యాపేటలోని పద్మశాలి సంఘ భవనానికి వెళ్లాడు. అక్కడే ఉన్న రాములు, అతని కుమారుడు ధనుంజయ్ వారి అనుచరులు కలిసి కృపాకర్‌పై దాడిచేశారు. తీవ్రంగా గాయపడిన కృపాకర్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

స్థానిక పోరు.. కారు హుషారు!

- స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రచార ఎజెండా, అభ్యర్థుల ఎంపికపై కేసీఆర్ దిశానిర్దేశం
- సమన్వయ కమిటీల ఏర్పాటుపై కసరత్తు.. కీలక నేతలకు ప్రచార బాధ్యతలు
- పార్టీ విజయావకాశాలపై సర్వేలు.. 18కిపైగా జెడ్పీల్లో గెలుస్తామని అంచనాలు



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ యంత్రాంగాన్ని సిద్ధం చేయడంపై బీఆర్‌ఎస్ దృష్టి సారించింది. ఈ వారాంతంలో నియోజకవర్గ స్థాయిలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు ప్రకటించారు. ఆలోగా జిల్లాలు, నియోజకవర్గాలవారీగా సమావేశ తేదీలను నిర్ణయించే బాధ్యతను మాజీ మంత్రులు, పార్టీ ముఖ్య నేతలకు అప్పగించారు. ఈ సమావేశాలకు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిలతోపాటు జిల్లా ముఖ్య నేతలు కూడా హాజరుకానున్నారు. స్థానిక ఎన్నికల్లో ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అంశాలు, అభ్యర్థుల ఎంపికలో అనుసరించే విధివిధానాలను కేసీఆర్ దిశానిర్దేశానికి అనుగుణంగా పార్టీ కేడర్‌కు వివరించనున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో గ్రామ పంచాయతీలు, జిల్లా, మండల పరిషత్‌లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతోపాటు సంక్షేమ కార్యక్రమాలను కూడా వివరించనున్నారు. 20 నెలలుగా కాంగ్రెస్ పాలనా వైఫల్యాలు, గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య లోపం, బీసీ రిజర్వేషన్లలో కాంగ్రెస్ అనుసరిస్తున్న విధానాలపై కేడర్‌కు అవగాహన కల్పించనున్నారు.

సమన్వయ కమిటీల ఏర్పాటుపై కేటీఆర్ దృష్టి

స్థానిక సంస్థల ఎన్నికల్లో అంతర్గతంగా సమన్వయం కోసం పార్టీ కమిటీలను ఏర్పాటు చేయాలని పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో సమన్వయ కమిటీల ఏర్పాటుపై కేటీఆర్ దృష్టి సారించారు. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలకు ఈ కమిటీల్లో చోటు కల్పించనున్నారు. స్థానిక ఎమ్మెల్యే లేదా నియోజకవర్గ ఇన్‌చార్జి సమన్వయకర్తగా వ్యవహరించే కమిటీల్లో గ్రామాలవారీగా రాజకీయ పరిస్థితులను మదింపు చేయనున్నారు. స్థానిక సంస్థల రిజర్వేషన్ల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక, ఇతర పార్టీల నుంచి చేరికలు, అసెంబ్లీ ఎన్నికల తర్వాత పార్టీకి దూరమైన నాయకులు, కార్యకర్తలను తిరిగి చేర్చుకోవడం వంటి అంశాలపై సమన్వయ కమిటీలు దృష్టి సారించనున్నాయి. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు సంబంధించిన చర్చ నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికలో వారికి ప్రాధాన్యం ఇవ్వాలని బీఆర్‌ఎస్ భావిస్తోంది. మరోవైపు అవసరమైన చోట ముఖ్య నేతలను కూడా ప్రచార బరిలోకి దించాలని బీఆర్‌ఎస్ భావిస్తోంది. కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు మాజీ మంత్రులు ప్రచార కమిటీల్లో ఉంటారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. స్థానిక ఎన్నికలు జరగని హైదరాబాద్, మేడ్చల్ జిల్లా పరిధిలోని పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులకు కూడా ఇతర జిల్లాల్లో సమన్వయం, ప్రచార బాధ్యతలు అప్పగించాలని పార్టీ భావిస్తోంది.

స్థానిక ఎన్నికలపై సర్వేలు

స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయావకాశాలు, నియోజకవర్గ ఇన్‌చార్జీల పనితీరు, కాంగ్రెస్ ప్రభుత్వ పాలన, కాంగ్రెస్, బీజేపీలపై ఓటర్ల మనోగతం తదితరాలపై ఇటీవల బీఆర్‌ఎస్ తరఫున కొన్ని సర్వేలు జరిగాయి. ఈ సర్వే ఫలితాలను విశ్లేషించిన బీఆర్‌ఎస్.. 31 జిల్లా పరిషత్‌లకుగాను 18 నుంచి 20 జిల్లా పరిషత్‌లను గెలుచుకుంటామని అంచనా వేస్తోంది. రిజర్వేషన్ల ఖరారు తర్వాత జెడ్పీటీసీ అభ్యర్థుల ఎంపికలోనూ సర్వే ఫలితాలను పరిగణనలోకి తీసుకుంటూ అభ్యర్థులను ఎంపిక చేయాలని భావిస్తోంది. ఈ నెల 24న కేటీఆర్ జన్మదిన వేడుకల అనంతరం పార్టీ యంత్రాంగాన్ని స్థానిక ఎన్నికలకు సిద్ధం చేసేలా కార్యాచరణ వేగవంతం చేస్తామని బీఆర్‌ఎస్ వర్గాలు వెల్లడించాయి.



హనుమకొండ జిల్లా కమలాపూర్ పీఏసీఎస్ వద్ద యూరియా కోసం క్యూలైన్‌లో రైతులు పెట్టిన చెప్పులు

పోలీస్ పహారాలో యూరియా పంపిణీ

- భారీగా క్యూలైన్ కట్టిన రైతులు

కమలాపూర్: యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. యూరియా వచ్చిందని తెలియగానే వ్యవసాయ పనులన్నీ వదులుకుని రైతులు ఆడ, మగ తేడా లేకుండా గంటల తరబడి క్యూ కడుతున్నారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ పీఏసీఎస్‌కు మంగళవారం 888 బస్తాల యూరియా రాగా, ఉదయం 6 గంటల నుంచే సుమారు 1,500 మంది రైతులు పీఏసీఎస్ వద్దకు చేరుకుని క్యూలైన్‌లో చెప్పులు పెట్టారు. ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ సిబ్బందితో కలిసి హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. పోలీసు పహారాలో రైతులకు యూరియా పంపిణీ చేయించారు. సరిపడా యూరియా బస్తాలు దొరకని పలువురు రైతులు నిరాశతో వెనుదిరిగి పోయారు. సీఎం రేవంత్‌రెడ్డి యూరియా కొరత లేదని చెప్తున్నాడని, ఇక్కడ పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత ఏడాదికన్నా 18 % అధికంగా యూరియా సరఫరా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మంగళవారం నాటికి గత ఏడాదితో పోలిస్తే 18 శాతం యూరియా అధికంగా సరఫరా అయిందని వ్యవసాయ శాఖ వెల్లడించింది. వ్యవసాయేతర ప్రయోజనాల కోసం ఇతర కార్యక్రమాలకు యూరియాను మళ్లించే అవకాశం ఉన్నందున వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని మార్కెటింగ్, వ్యవసాయ శాఖ డైరెక్టర్లు కె.సురేంద్రమోహన్, బి.గోపిలు ఆదేశించారు. రాష్ట్రంలో యూరియా సరఫరాపై మంగళవారం వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్)తో పాటు రిటైల్ ఔట్‌లెట్లలో యూరియా స్టాక్ బోర్డులను బహిరంగంగా ప్రదర్శించాలని, ఉదయం 8 గంటల కల్లా పీఏసీఎస్‌లను తెరిచి రైతులకు అందుబాటులో ఉండాలని వారు సూచించారు. యూరియా సరఫరాపై రాష్ట్ర స్థాయిలో 24 గంటలపాటు పనిచేసే కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామని, రైతులకు ఎలాంటి సమస్యలు వచ్చినా 8977741771 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

బంగారం చోరీ దర్యాప్తు వేగవంతం

- షాప్ సమీపంలో రూమ్ అద్దెకు తీసుకున్న నిందితులు
- సీసీ కెమెరాల ఆధారంగా ఐదుగురు అద్దెకు ఉన్నట్టు గుర్తించిన పోలీసులు

సూర్యాపేట టౌన్: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీసాయి సంతోషి జ్యువెలరీ షాపులో చోరీ జరిగిన కేసులో నిందితులను గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఐదుగురు రెండు నెలల క్రితం సూర్యాపేటలోని బాలాజీ గ్రాండ్ హోటల్ సమీపంలోని ఓ పాత ఇంట్లో అద్దెకు ఉండేందుకు అడ్వాన్స్ ఇచ్చారు. ఇంటి యజమానికి బస్టాండ్ సమీపంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ పెడుతున్నామని చెప్పి రూం అద్దెకు తీసుకున్నారు. నాలుగైదు రోజుల క్రితమే వారు రూంలోకి దిగారు. చోరీ జరిగిన బంగారం షాపు సమీపంలోనే వారు అద్దెకు తీసుకున్న గది ఉంది. అప్పటి నుంచి బంగారం షాపులో దొంగతనం చేసేందుకు రెక్కీ నిర్వహించినట్టు సీసీ కెమెరాల్లో రికార్డయినట్టు తెలిసింది. సోమవారం ఉదయం నుంచి ఆ రూమ్‌కు తాళం వేసి ఉంది. తెల్లవారుజామున సుమారు 3.30 గంటల సమయంలో ఆ రూమ్‌లో నుంచి బ్యాగ్‌లు వేసుకొని ఐదుగురు వెళుతున్నట్టు సీసీ కెమెరాలో రికార్డయ్యింది. నిందితులు అద్దెకు ఉన్న రూమ్‌లో మంగళవారం క్లూస్‌టీంతో పోలీస్ సిబ్బంది ఫింగర్ ప్రింట్స్ సేకరించారు. దొంగతనం జరిగిన స్థలంలో ఫింగర్ ప్రింట్, వారు అద్దెకు ఉన్న రూంలో ఫింగర్ ప్రింట్ మ్యాచ్ అయినట్టు పోలీసులు గుర్తించారు.



సూర్యాపేటలో దొంగలు అద్దెకు ఉన్న ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

డిగ్రీలో ఫెయిలైనందుకు ఆత్మహత్య



వైద్య సాక్షి (ఫైల్)

సాత్నాల: డిగ్రీలో ఫెయిలైన విషయం తల్లిదండ్రులకు చెప్పుకోలేక మనస్తాపంతో ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదిలాబాద్ జిల్లా భోరజ్ మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని లేఖర్‌వాడ గ్రామానికి చెందిన వైద్య గణేశ్–అనిత దంపతులకు కూతురు, కుమారుడు సంతానం. కుమార్తె సాక్షి (20) ఆదిలాబాద్‌లోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో చదివి ఈ ఏడాది ఫైనలియర్ పరీక్షలు రాసింది. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఆమె రెండు సబ్జెక్టుల్లో ఫెయిలైంది. తల్లిదండ్రులకు మాత్రం పాసైనట్లు చెప్పింది. దీంతో తల్లిదండ్రులు ఆమెను బ్యాంకు కోచింగ్ కోసం 15 రోజుల కిందట నంద్యాలకు పంపించారు. అయితే వారం కిందట హోంసిక్ అని చెప్పి ఇంటికి వచ్చింది. సోమవారం కుటుంబ సభ్యులంతా చేను పనులకు వెళ్లారు. సాక్షి మాత్రం ఇంట్లోనే ఉండిపోయింది. మధ్యాహ్నం 3.30 గంటలకు తమ్ముడు చరణ్‌కు ఫోన్ చేసి తాను పురుగుల మందు తాగానని చెప్పింది. వెంటనే వారు ఇంటికి వచ్చి చూడగా అప్పటికే ఆమె వాంతులు చేసుకుంటోంది. ఎందుకిలా చేశావని తండ్రి అడగ్గా.. 'నేను డిగ్రీలో రెండు సబ్జెక్టులు ఫెయిలయ్యా. మీరు ఏమనుకుంటారోనన్న భయంతోనే పురుగుల మందు తాగేశా'అని చెప్పడంతో వెంటనే ఆమెను రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది.

డిగ్రీ ఫిజిక్స్.. ఏఐ ట్రెండ్స్

▶ మొదటి పేజీ తరువాయి

ఆమోదం తెలిపారు. ఇక నుంచి అన్ని యూనివర్సిటీల్లోనూ ఫిజిక్స్ సిలబస్ ఒకే విధంగా ఉంటుంది. పాత చాప్టర్లన్నీ నవీకరించి అందించబోతున్నారు. ప్రతి చాప్టర్‌లోనూ కాలానుగుణంగా వస్తున్న మార్పులను తీసుకొచ్చారు. డిజిటల్ విధానాలను ఇందులో జోడించారు. తరగతి బోధనే కాకుండా, అనుభవ పూర్వకమైన విద్యా విధానం ఈ ఏడాది నుంచి అందుబాటులోకి రాబోతోంది. సంప్రదాయ డిగ్రీ కోర్సులు కూడా ఉపాధికి బాటలు వేయాలన్న లక్ష్యంతో మార్కెట్ అవసరాలకు అనుగుణంగా సిలబస్‌లో మార్పులు చేశారు.

మెకానిక్స్‌లో మజా

డిగ్రీ ఫిజిక్స్‌లో మెకానిక్స్ అండ్ ఆసిలేషన్స్ కీలకమైంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో వైద్య పరికరాలు పనిచేస్తున్న ఈ కాలంలో దీని ప్రాధాన్యత ఎక్కువే. ఎనర్జీ, రొటేషనల్ మోషన్, తరంగ ధైర్ఘ్యం వంటి చాప్టర్స్ ప్రధానమైనవి. న్యూటన్ లా ఆధారంగా ఉండే ఈ చాప్టర్‌ను మరింత సరళీకరించారు. ఏఐతో పనిచేసే యంత్ర పరికరాలకు అనుగుణంగా సిలబస్‌లో ప్రాక్టికల్ వర్క్ జోడించారు. దీంతో విద్యార్థి కార్పొరేట్ వైద్య రంగంలో యంత్ర పరికరాల నిర్వహణలో మంచి ఉపాధి అవకాశాలు పొందే వీలుంది. తరంగాలు, ఎలక్ట్రానిక్స్ కదలికలు వంటి మార్పులను రికార్డు చేసే రేడియేషన్ ఫిజిక్స్‌ను ఈసారి అత్యాధునిక టెక్నాలజీకి అనుసంధానం చేస్తూ అందించబోతున్నారు.

మోడ్రన్ ఫిజిక్స్‌లో మెరుపులు

విద్యుత్ రంగంతోపాటు అత్యాధునిక లేబొరేటరీల్లో పనిచేసే యంత్ర పరికరాలకు ఆయువు పట్టు మోడ్రన్ ఫిజిక్స్. ఏఐ వచ్చిన తర్వాత అటామిక్, సబ్ అటామిక్ లెవల్స్‌ను బేరీజు వేసే విధానం పూర్తిగా మారిపోయింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని మోడ్రన్ ఫిజిక్స్‌లో ప్రాక్టికల్ వర్క్‌ను పెంచబోతున్నారు. అత్యాధునిక యంత్రాల్లో క్వాంటం మెకానిక్స్‌ను పరిశీలించేలా ప్రాజెక్టు వర్క్ పెంచుతున్నారు. అణు ఇంధన రంగంలో వచ్చిన మార్పులను గమనించేలా న్యూక్లియర్ ఫిజిక్స్ చాప్టర్స్, సోలార్ ఎనర్జీ ట్రాకింగ్ విధానాల చాప్టర్స్‌ను డిగ్రీలో కొత్తగా నేర్చుకునే అవకాశం ఇక నుంచి ఉండబోతోంది.

వేవ్స్, ఆప్టిక్స్‌లో వెరైటీ

ఫిజిక్స్‌లో మరో కీలకమైన చాప్టర్ వేవ్స్ అండ్ ఆప్టిక్స్ పూర్తిగా ఉపాధికి బాటలు వేసేలా ఉండాలని నిపుణులు నిర్ణయించారు. తరంగాలు వాటి గతి, ధ్వని తరంగాలు, కాంతి వేగం, కాంతిలో మార్పులు తెలిపే ఈ చాప్టర్‌ను పూర్తిగా ఇప్పుడున్న టెక్నాలజీకి అనుసంధానం చేస్తారు. తరగతిలో కేవలం బోధన సాగితే, ప్రాక్టికల్ నాలెడ్జ్ మొత్తం ప్రధాన కంపెనీల ద్వారా నేర్చుకునే వీలుంటుంది. ఇలాంటి అనేక మార్పులతో కూడిన ఫిజిక్స్ సిలబస్ ఈ ఏడాదినుంచి అందుబాటులోకి రాబోతోంది.



ఉపాధి పెంచడానికే మార్పులు

సంప్రదాయ డిగ్రీ కోర్సులను ఆధునీకరిస్తున్నాం. నేటి తరం ఆలోచనలు, టెక్నాలజీలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సిలబస్ రూపొందిస్తున్నాం. ఫిజిక్స్‌లో ఆధునిక వైద్య రంగానికి ఉపయోగపడే చాప్టర్లు జోడిస్తున్నాం. విద్యార్థి ప్రాక్టికల్‌గా విషయ పరిజ్ఞానం సంపాదించేలా ప్రాజెక్టు పనులు ఇవ్వబోతున్నాం.

–ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, ఉన్నత విద్యా మండలి చైర్మన్.

బడి సంచి భారం కాదిక్కడ!


▶ మొదటి పేజీ తరువాయి

హెచ్ఎంగా, ఎంఈవోగా బాధ్యతలు తీసుకున్నారు. ఆ సమయంలో పలువురు విద్యార్థులు అధిక బరువుతో ఉన్న బ్యాగులతో బడికి రావడాన్ని ఆయన గమనించారు. వారిలో పలువురు పిల్లల భుజాలు, నడుములు ఒంగిపోవడం, నడకలో మార్పు రావడం, కాళ్ల ఆకారంలో మార్పులు ఉండటాన్ని గుర్తించారు. ఈ సమస్యను అధిగమించేందుకు పుస్తకాల బరువును తగ్గించాలని నిర్ణయించారు. ఇందుకోసం స్కూలు ఆవరణలోనే త్రాసు ఏర్పాటు చేశారు. అక్కడ విద్యాశాఖ నిర్దేశించిన ప్రకారం.. ఏ విద్యార్థి ఎంత బరువు మోయాలనే సూచనల ఆధారంగా అంతే బరువు ఉండేలా అదనపు పుస్తకాలను తప్పించారు.

రెండు జతల పుస్తకాలు..

విద్యార్థులు టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్‌ను స్కూల్‌కు తప్పనిసరిగా తీసుకెళ్లాల్సి ఉండటంతో బ్యాగుల బరువు పెరుగుతోంది. అందుకే బ్యాగుల బరువు తగ్గించేలా గత విద్యాసంవత్సరం ముగింపు సందర్భంగా హైస్కూలు పిల్లల పాఠ్యపుస్తకాలను సేకరించి వాటిని ఈ ఏడాది ప్రతి విద్యార్థికీ అదనపు సెట్ కింద అందించారు. దీనివల్ల విద్యార్థులు ఇంటి వద్ద పాత పుస్తకాలను, బడిలో కొత్త పాఠ్యపుస్తకాలను ఉంచుతున్నారు. ఫలితంగా వారికి పాఠ్యపుస్తకాలను మోసుకెళ్లే బాధ తప్పింది. అలాగే హోంవర్క్, ఫెయిర్ నోట్స్‌ను మాత్రమే పిల్లలు తీసుకెళ్లేలా ఏర్పాటు చేశారు.

హాయిగా ఉంది



పుస్తకాల బరువు తగ్గించాక చాలా హాయిగా ఉంది. అంతకుముందు దాదాపు 9 కిలోల బ్యాగ్ మోయాల్సి వచ్చేది. ఇప్పుడు తక్కువ పుస్తకాలతో స్కూల్‌కు వెళ్తున్నా. నెత్తి, భుజం నొప్పులు తగ్గిపోయాయి.

– ఎం.శ్రావ్య, 8వ తరగతి, జెడ్పీ హెచ్ ఎస్, ఓద్యారం

నడుం నొప్పి పోయింది



గతంలో బ్యాగు బరువు వల్ల అమ్మానాన్న దిగబెట్టాల్సి వచ్చేది. ఇప్పుడు అవసరమైన పుస్తకాలనే తీసుకెళ్తుండటం వల్ల బ్యాగు బరువు తగ్గింది. అందుకే మేమే తీసుకెళ్లగలుగుతున్నాం. ఇప్పుడు నడుం నొప్పి, భుజాల నొప్పి లేవు.

–రామంచ హర్షిత 10వ తరగతి, జెడ్పీహెచ్ఎస్, గట్టుబూత్కూరు, గంగాధర మండలం

ధన్‌ఖడ్ రాజీనామాపై గెజిట్ నోటిఫికేషన్

న్యూఢిల్లీ: జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా విరమించుకునేలా ప్రభుత్వం చివరి ప్రయత్నం చేయొచ్చనే వాదనలకు ఫుల్‌స్టాప్ పెడుతూ కేంద్ర హోం శాఖ మంగళవారం ఆయన రాజీనామాను ఆమోదిస్తూ గెజిట్ నోటిఫికేషన్‌ను వెలువర్చింది. రాష్ట్రపతి ముర్ముకు ధన్‌ఖడ్ రాసిన రాజీనామా లేఖను అధికారికంగా బహిర్గతంచేస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కార్యదర్శి గోవింద్ మోహ న్ సంతకం చేసి గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదలచేశారు. ఈ గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదలచేయబోతున్నట్లు ముందుగా రాజ్యసభకు హోం శాఖ సమాచారమిచ్చింది. దీంతో ధన్‌ఖడ్ రాజీనామాను అధికారికంగా ప్రభుత్వం ప్రకటించిందని మంగళవారం రాజ్యసభలో అధ్యక్షస్థానంలో కూర్చున్న ఘన్‌శ్యామ్ తివారీ అక్కడి సభ్యులందరికీ వెల్లడించారు. 12 గంటలకు ప్రశ్నోత్తరాల సమయం వేళ తివారీ ఈ ప్రకటన చేశారు. రాజ్యాంగంలోని 67(ఏ) అధికరణం ప్రకారం ధన్‌ఖడ్ రాజీనామా తక్షణం అమల్లోకి వచ్చిందని ఆయన ప్రకటించారు.

బిహార్ ఓటరు జాబితా నుంచి 52 లక్షల పేర్లు తొలగింపు: ఈసీ

న్యూఢిల్లీ: బిహార్‌లో చేపట్టిన ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)లో ఇప్ప టి వరకు దాదాపు 52 లక్షల మంది పేర్లను తొలగించినట్లు మంగళవారం ఎన్నికల కమిషన్(ఈసీ) తెలిపింది. ఇందులో 18 లక్షల మంది ఓటర్లు చనిపోగా, 26 లక్షలు మంది వేరే నియోజకవర్గాల్లో ఉంటున్నవారు, 7 లక్షల మంది ఒకటికి మించి ప్రాంతాల్లో నమోదైన వారని వివరించింది. 'ఎస్ఐఆర్‌లో భాగంగా అర్హులైన ఓటర్లందరి పేర్లను ఆగస్ట్ ఒకటో తేదీన విడుదల చేసే ముసాయిదా జాబితాలో చేర్చేందుకు ప్రయ త్నాలు ముమ్మరం చేశామని ఈసీ ఒక ప్రకటనలో తెలిపింది.


ఎయిరిండియా విమానంలో మంటలు

న్యూఢిల్లీ: ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ల్యాండయిన ఎయిరిండియా విమానం విద్యుత్ విభాగంలో మంటలు వచ్చాయి. మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకున్న ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. హాంకాంగ్–న్యూఢిల్లీ ఏఐ 315 విమానం ఆగ్జిలరీ పవర్ యూనిట్(ఏపీయూ)లో ల్యాండయిన కొద్దిసేపటికే మంటలు వచ్చాయని అధికారులు తెలిపారు. గేట్ వద్ద పార్కు చేశాక ప్రయాణికులు కిందికి దిగేందుకు సిద్ధమవుతున్న సమయంలో ఈ ఘటన జరిగిందన్నారు. అయితే, వెంటనే డిజైన్ ప్రకారం పవర్ యూనిట్ ఆటోమేటిక్‌గా మూతబడిందన్నారు. విమానానికి కొంత నష్టం వాటిల్లిందని, ప్రయాణికులు, సిబ్బంది ఎప్పటిమాదిరిగానే సురక్షితంగా కిందికి దిగారని వివరించారు.

రాజీపడలేకే..!

వివాదాస్పద జడ్జి జస్టిస్ వర్మ అభిశంసన అంశమే అసలు కారణమా?

- అభిశంసనపై విపక్షాల నోటీసును సమ్మతించిన జగదీప్ ధన్‌ఖడ్
- తమ తీర్మానాన్ని కాదని ఆ నోటీసుకు ఓకే చెప్పడాన్ని జీర్ణించుకోలేని సర్కార్
- ఆ కారణంగానే బిజినెస్ అడ్వైజరీ కమిటీ భేటీకి నడ్డా, రిజిజు డుమ్మా



న్యూఢిల్లీ: గుండె సంబంధ యాంజియోప్లాస్టీ, అనారోగ్యం కారణంగా ఉపరాష్ట్రపతి పదవి నుంచి తప్పుకుంటున్నట్లు సోమవారం జగదీప్ ధన్‌ఖడ్ ప్రకటించిన కొద్దిసేపటికే ఆయన నిజంగానే అంత అనారోగ్యంగా ఉన్నారా? లేదంటే మోదీ సర్కార్‌పై మరింత అసహనంతో రగిలిపోయారా?. ఆయనకు కోపం తెప్పించిన విషయమేంటి?. అందుకు స్పందనగా మోదీ సర్కార్ ఏం చేసింది? ఇలాంటి వరుస ప్రశ్నల పరంపర సోమవారం మొదలై గంటలు గడుస్తున్నకొద్దీ సందేహాలు, విశ్లేషణలు మరింత ఎక్కువయ్యాయి. కాలిన కరెన్సీ కట్టల ఉదంతంలో అభిశంసనను ఎదుర్కోబోతున్న అలహాబాద్ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ పరోక్షంగా ధన్‌ఖడ్ పదవికి ఎసరుపెట్టారని మెజారిటీ విపక్ష పార్టీలు వాదిస్తున్నాయి. సాధారణంగానే న్యాయవ్యవస్థపై పదునైన విమర్శనాస్త్రాలు సంధించే ధన్‌ఖడ్ అరుదుగా వచ్చే జడ్జీల అభిశంసన అవకాశాన్ని తన హయాంలో విజయవంతంగా పూర్తిచేయాలన్న అత్యుత్సాహం చివరకు కేంద్రప్రభుత్వానికి కోపం తెప్పించిందని తెలుస్తోంది. మీ ఏకపక్ష నిర్ణయంపై తాము తీవ్ర అసంతృప్తితో ఉన్నామని తెలియజేప్పేందుకే పార్లమెంట్ వ్యవహారాల సలహా కమిటీ(బీఏసీ) భేటీకి రాజ్యసభ పక్షనేత జేపీ నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజులు రాలేదని తెలుస్తోంది. దీనిపై ధన్‌ఖడ్ తీవ్ర అసంతృప్తితో రగిలిపోయారని విశ్లేషణలు వెలువడ్డాయి. అన్ని విషయాల్లో ప్రభుత్వానికి మద్దతు పలికే తనను ఇలా కేంద్రప్రభుత్వం ఒకే ఒక్క అంశాన్ని సాకుగా చూపి అవమానించిందనే తీవ్ర అసహనంతో వెంటనే ఆయన రాజీనామాకు సిద్ధపడ్డారని తెలుస్తోంది.

మధ్యాహ్నం 1 గంట నుంచి 4.30 మధ్యలోనే..

సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 4.30 గంటల మధ్యలోనే ప్రభుత్వానికి, ఉపరాష్ట్రపతికి మధ్య సఖ్యత ఒక్కసారిగా, పూర్తిగా చెడిందని కాంగ్రెస్ నేత, రాజ్యసభ సభ్యుడు జైరాం రమేశ్ 'ఎక్స్'లో ఒక పోస్ట్‌చేశారు. ''కీలక అంశాలపై చర్చించేందుకు సోమవారం మధ్యాహ్నం 12.30 నిమిషాలకు ధన్‌ఖడ్ సారథ్యంలో బీఏసీ భేటీ జరిగింది. ఈ భేటీకి నడ్డా, రిజిజు హాజరయ్యారు. మళ్లీ 4.30 గంటలకు సమావేశమవుదామని ధన్‌ఖడ్ చెప్పారు. ఆ సమయంలో భేటీకి నడ్డా, రిజిజు రాలేదు. కనీసం రావట్లేదని ధన్‌ఖడ్ సమాచారం ఇవ్వలేదు. దీంతో ఆయనకు పరువు పోయినంత పనైంది. దాంతో చేసేదిలేక భేటీని మంగళవారం మధ్యాహ్నానికి వాయిదావేసి ఆయన నిరుత్సాహంగా వెళ్లిపోయారు''అని జైరాం వెల్లడించారు.

ఖర్గేకు అవకాశం ఇవ్వడమూ మరో కారణమా?

సోమవారం ఉదయం సభలో ప్రశ్నోత్తరాల గంట ముగిశాక రాజ్యసభలో విపక్షనేత మల్లికార్జున ఖర్గే మాట్లాడేందుకు ధన్‌ఖడ్ అనుమతించారు. దీంతో ఆపరేషన్ సిందూర్ తదనంతర పరిణామాలపై కేంద్రప్రభుత్వాన్ని తీవ్రస్థాయిలో విమర్శిస్తూ ఖర్గే ప్రసంగించారు. ఆపరేషన్‌సిందూర్‌పై వారం తర్వాత చర్చకు ప్రభుత్వం సిద్ధమవుతున్న వేళ ఖర్గేకు ముందే ఆ అంశంపై అవకాశమిచ్చి తమపై విమర్శలు గుప్పించే అవకాశం అనవసరంగా ఇచ్చారని ధన్‌ఖడ్‌పై మోదీ సర్కార్ గుర్రుగా ఉందని కొందరు బీజేపీ పార్లమెంట్ సభ్యులే చెప్పడం గమనార్హం. పుండుమీద కారం చల్లినట్లుగా ఖర్గే ప్రసంగించిన వెంటనే జడ్జి వర్మపై అభిశంసనకు సంబంధించి రాజ్యసభలో కేవలం విపక్ష సభ్యుల నోటీసును ధన్‌ఖడ్ ఆమోదిస్తున్నట్లు ప్రకటించారు. ఈ నోటీస్‌పై అధికారకూటమి ఎంపీల సంతకాలు లేవు. అయినాసరే దానికి ధన్‌ఖడ్ ఆమోదముద్రవేయడం ప్రభుత్వానికి ఆగ్రహం తెప్పించింది. ఇదే అంశంపై లోక్‌సభలో జడ్జిపై అభిశంసన తీర్మానాన్ని ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సమయంలోనే ఆ నోటీస్‌కు రాజ్యసభ చైర్మన్ హోదాలో ధన్‌ఖడ్ ఆమోదం తెలపడాన్ని మోదీ సర్కార్ తీవ్ర అవమానంగా భావించినట్లు తెలుస్తోంది. విపక్షాల నోటీస్ ఆమోదంతో ఇకపై జరిగే అభిశంసన ప్రక్రియ మొత్తం విజయమంతా విపక్షాల ఖాతాలో పడిపోతుందన్న అక్కసు అధికారపక్షంలో పెరిగింది. దీని తర్వాతనే ఖర్గే, రిజిజులు బీఏసీ భేటీకి డుమ్మా కొట్టడం, ధన్‌ఖడ్ అసహనం వ్యక్తంచేయడం చకచకా జరిగిపోయాయని తెలుస్తోంది.

అవమానించిన నడ్డా!

రాజ్యసభలో మల్లికార్జున ఖర్గే ప్రసంగిస్తుండగా నడ్డా ఉద్దేశపూర్వకంగా కల్పించుకున్నారు. అధ్యక్షస్థానంలో కూర్చున్న ధన్‌ఖడ్‌కు వేలు చూపిస్తూ.. ''ఇక్కడ ఖర్గే మాట్లాడింది ఏదీ రికార్డింగ్‌లోకి వెళ్లదు. నేను ఏం మాట్లాడితే అది మాత్రమే రికార్డుల్లోకి వెళ్తుంది''అని అన్నారు. ''ఖర్గే ప్రసంగంవేళ నిష్పాక్షికంగా ధన్‌ఖడ్ సభ నడుపుతుంటే నడ్డా కల్పించుకున్నారు. అలా అవమానించడం ఆయన తట్టుకోలేకపోయారు.

ఇది ఆకస్మిక నిర్ణయమే

రాజీనామా లేఖలో పేర్కొన్న 'అనారోగ్యం'కారణం కానేకాదని ఉప రాష్ట్రపతి సచివాలయం సైతం పరోక్షంగా ధ్రువీకరిస్తోంది. ఉపరాష్ట్రపతి జూలై 23వ తేదీన జైపూర్‌లో ఒకరోజు పర్యటన తాజాగా ఖరారైంది''అని సోమవారం మధ్యాహ్నం 3.53 గంటలకు ఉపరాష్ట్రపతి సెక్రటేరియట్ ఒక ప్రకటనలో పేర్కొంది. మరికొన్ని గంటల్లో సొంత రా ష్ట్రపర్యటనకు సంసిద్ధమైన వ్యక్తి మదిలో రాజీనామా ఆలోచన ఉండదని, సోమ వా రం జరిగిన అనూహ్య పరిణామాలే ఆ యనను రాజీనామాకు ఉసిగొల్పాయని తెలుస్తోంది.

ఆయన ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నా: మోదీ

న్యూఢిల్లీ: ఉపరాష్ట్రపతి పదవికి సోమవారం రాజీనామా చేసిన జగదీప్ ధన్‌ఖడ్‌కు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. 'శ్రీ జగదీప్ ధన్‌ఖడ్‌జీకి భారత ఉపరాష్ట్రపతి సహా వివిధ హోదాల్లో మన దేశానికి సేవ చేయడానికి అనేక అవకాశాలు లభించాయి. ఆయన ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నా'' అని మోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు.

రెండో రోజూ అదే రగడ

- పార్లమెంట్‌లో కొనసాగిన విపక్షాల ఆందోళన
- ఓటర్ల జాబితా సవరణ, ఆపరేషన్ సిందూర్‌పై వెంటనే చర్చించాలని పట్టు
- చర్చకు తాము సిద్ధమని, సభకు సహకరించాలని ప్రభుత్వం విజ్ఞప్తి
- పలుమార్లు వాయిదా పడిన ఉభయ సభలు



ఆందోళన తెలుపుతున్న ప్రతిపక్ష సభ్యులు

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ ఉభయ సభలు వరుసగా రెండో రోజు మంగళవారం సైతం అట్టుడికాయి. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఆపరేషన్ సిందూర్ సహా పలు కీలక అంశాలపై విపక్షాలు చర్చకు పట్టుబట్టాయి. తాము ఇచ్చిన వాయిదా తీర్మానాలపై వెంటనే చర్చ ప్రారంభించాలని డిమాండ్ చేశాయి. ఆపరేషన్ సిందూర్ సహా అన్ని అంశాలపై చర్చకు సిద్ధంగా ఉన్నామని కేంద్రం పదేపదే ప్రకటించినా విపక్షాలు వెనక్కి తగ్గలేదు. ఆయా అంశాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని తేల్చిచెప్పాయి. మంగళవారం పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కావడానికి ముందు విపక్ష 'ఇండియా' కూటమి నేతలు రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కార్యాలయంలో సమావేశమయ్యారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీతో పాటు సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీ, డీఎంకే, నేషనల్ కాన్ఫరెన్స్ తదితర పార్టీల ఎంపీలు హాజరయ్యారు. బిహార్‌లో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణతోపాటు పహల్గాం ఉగ్రవాద దాడి, ఆపరేషన్ సిందూర్, పాకిస్తాన్‌తో కాల్పుల విరమణ ప్రక్రియలో అమెరికా జోక్యం, నియోజకవర్గాల పునర్విభజన, దేశంలో దళితులు, ఆదివాసీలు, ఓబీసీలు, మహిళలపై పెరుగుతున్న దౌర్జన్యాలు, అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటన, మణిపూర్ హింసాకాండ తదితర అంశాలపై చర్చించారు. ప్రధాని మోదీ సభకు హాజరై, వీటిపై సమాధానం ఇచ్చేలా ఒత్తిడి పెంచాలని నిర్ణయించారు. విపక్షాల భేటీలో తీసుకున్న నిర్ణయాల మేరకు ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీలు గౌరవ్ గొగోయ్, మాణిక్కం ఠాగూర్, రాజ్యసభలో ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ వాయిదా తీర్మానాలు ఇచ్చారు.

విపక్ష ఎంపీల తీరుపై లోక్‌సభ స్పీకర్ ఆగ్రహం

లోక్‌సభ ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కాగానే విపక్షాలు ఆందోళనకు దిగాయి. బిహార్ ఓటర్ల జాబితా సవరణతోపాటు ప్రధాన అంశాలను ప్రస్తావిస్తూ ప్లకార్డులు ప్రదర్శించాయి. నినాదాలు చేస్తూ నిరసన కొనసాగించాయి. సభలో స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలు చేపట్టారు. వ్యవసాయానికి సంబంధించిన కీలకమైన అంశాలు ఉన్నందు వీటిపై చర్చకు సహకరించాలని వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రతిపక్షాలను కోరారు. అయినప్పటికీ విపక్ష ఎంపీలు వెనక్కి తగ్గకుండా ఆందోళన కొనసాగించడంతో సభ మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా పడింది. సభ పునఃప్రారంభమైన తర్వాత విపక్షాల ఆందోళన కొనసాగింది. స్పీకర్ స్థానంలో ఉన్న బీజేపీ ఎంపీ జగదాంబికా పాల్ స్పందిస్తూ... విపక్షాలు లేవనెత్తే అన్ని అంశాలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ సైతం మాట్లాడారు. సభకు సహకరించాలని విపక్ష సభ్యులను కోరారు. అయినప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు రాకపోవడంతో సభ తిరిగి 2 గంటల వరకు వాయిదా పడింది. సభ మళ్లీ ప్రారంభమైన తర్వాత కూడా విపక్ష సభ్యులు ఆందోళన విరమించలేదు. వారి వైఖరిని స్పీకర్ తప్పుపట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ వెల్‌లోకి దూసుకురావడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. చర్చ జరగకుండా సభా సమయాన్ని వృథా చేస్తున్నారని మండిడ్డారు. విపక్షాలు నిరసన కొనసాగించడంతో సభ బుధవారానికి వాయిదా పడింది. రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. వాయిదా తీర్మానం నోటీసులను డిప్యూటీ చైర్మన్ హరివంశ్ తిరస్కరించడం పట్ల విపక్షాలు నిరసన వ్యక్తంచేశాయి. సభ తొలుత 12 గంటలకు వరకు, తర్వాత మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేయడంతో డిప్యూటీ చైర్మన్ హరివంశ్ ఎగువ సభ అధ్యక్షుడిగా వ్యవహరించారు.

ఓటర్ల హక్కులు కాలరాస్తున్నారు

పార్లమెంట్ ఉభయ సభలు వాయిదా పడిన తర్వాత విపక్ష ఎంపీలు పార్లమెంట్ మకరద్వారం మెట్లపై నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, అఖిలేశ్ యాదవ్ పాల్గొన్నారు. బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు.

అపాచీ ఆగయా

హిండన్ ఎయిర్‌బేస్‌కు చేరుకున్న మూడు ఏహెచ్-64ఈ అటాక్ హెలికాప్టర్లు

- భారత సైన్యంలోకి మోస్ట్ అడ్వాన్స్‌డ్ చాపర్లు
- ఈ ఏడాది ఆఖరు నాటికి మరో మూడు హెలికాప్టర్ల రాక

న్యూఢిల్లీ: భారత సైన్యంలో మైలురాయి లాంటి ఘట్టం చోటుచేసుకుంది. 15 నెలల నిరీక్షణకు తెరపడింది. అత్యాధునిక ఏహెచ్-64ఈ అపాచీ హెలికాప్టర్లు అమెరికా నుంచి భారత్‌కు చేరుకున్నాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఘజియాబాద్‌లోని హిండన్ ఎయిర్‌బేస్‌లో అడుగుపెట్టాయి. మొదటి బ్యాచ్‌లో భాగంగా మూడు హెలికాప్టర్లను అమెరికా మిలటరీ సరుకు రవాణా విమానంలో మంగళవారం ఇండియాకు చేర్చారు. ఒప్పందం ప్రకారం 2024 మార్చి నెలలోనే రావాల్సి ఉండగా, సాంకేతిక కారణాలతో పలుమార్లు జాప్యం చోటుచేసుకుంది. ఏహెచ్-64ఈ అపాచీ హెలికాప్టర్లను అమెరికాకు చెందిన బోయింగ్ సంస్థ రూపొందించింది. ఎడారిని భ్రమింపజేసే రంగులో ఉన్న ఈ చాపర్లను రాజస్తాన్‌లోని జైపూర్‌లో మోహరించబోతున్నారు. ఇవి ప్రపంచంలోనే మోస్ట్ అడ్వాన్స్‌డ్ మల్టీరోల్ కాంబాట్ హెలికాప్టర్లు. ఎన్నెన్నో ప్రత్యేకతలున్నాయి. ఒప్పందం ప్రకారం బోయింగ్ సంస్థ మొత్తం ఆరింటిని సరఫరా చేయాల్సి ఉండగా, మిగతా మూడు హెలికాప్టర్లను ఈ ఏడాది ఆఖరుకల్లా అందించనుంది. ఇప్పటికే 22 ఈ–మోడల్ అపాచీలను బోయింగ్ కంపెనీ భారత వైమానిక దళానికి(ఐఏఎఫ్) అందజేసింది. ఏహెచ్-64ఈ అపాచీలను సరఫరా చేయడం ఇదే మొదటిసారి. మొత్తం ఆరు హెలికాప్టర్ల కోసం భారత ప్రభుత్వం అమెరికా సర్కార్‌తోపాటు బోయింగ్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ విలువ రూ.4,168 కోట్లు.



హిండన్ బేస్‌లో అపాచీ హెలికాప్టర్

శత్రువులపై నిప్పుల వాన

అపాచీ హెలికాప్టర్ల రాక పట్ల భారత సైన్యం హర్షం వ్యక్తంచేసింది. వీటితో సైనిక దళాల పోరాట సామర్థ్యం మరింత పెరుగుతుందని సోషల్ మీడియాలో పోస్టు చేసింది. ప్రధానంగా భారత్-పాకిస్తాన్ సరిహద్దుల్లో కీలక సైనిక ఆపరేషన్ల కోసం ఏహెచ్-64ఈ అపాచీలను ఉపయోగించబోతున్నారు. ఉగ్రవాదుల కార్యకలాపాలను కట్టడి చేయడంతో కీలక పాత్ర పోషించబోతున్నాయి. ముష్కరుల గుండెల్లో వణుకు పుట్టించడం తథ్యమని నిపుణులు అంటున్నారు. భూఉపరితలంతోపాటు ఆకాశంలో శత్రువుల ఉనికిని గుర్తించి, దాడి చేయడంలో అడ్వాన్స్‌డ్ టార్గెటింగ్ సిస్టమ్స్‌తో కూడిన ఈ హెలికాప్టర్లకు తిరుగులేదని చెబుతున్నారు. అమెరికా సైన్యంలో వీటి శక్తిసామర్థ్యాలు నిరూపితం కావడంతో కొనుగోలు చేసేందుకు ఎన్నో దేశాలు ఆసక్తి చూపుతున్నాయని బోయింగ్ సంస్థ తెలియజేసింది.

- ఏహెచ్-64ఈ అపాచీ అటాక్ హెలికాప్టర్లలో తుపాకులు, రాకెట్లు, క్షిపణుల వంటి బహుళ ఆయుధాలు అమర్చారు. 30 ఎంఎం ఎం230 చైన్ గన్, 70 ఎంఎం హైడ్రా రాకెట్లు ఇందులో అంతర్భాగమే. తక్కువ దూరం, ఎక్కువ దూరంలో ఉన్న లక్ష్యాలపై సులువుగా దాడి చేయొచ్చు.
- గంటకు 365 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. 480 కిలోమీటర్ల పరిధిలో పనిచేయగలవు. ఆటోమేటిక్ చైన్ గన్ నిమిషానికి 625 రౌండ్లు పేల్చగలదు.
- ఇక ఏజీఎం–114 హెల్‌ఫైర్ క్షిపణులతో భూమిపై ఆరు కిలోమీటర్ల దూరంలోని సాయుధ వాహనాలు, యుద్ధ ట్యాంక్‌లను సైతం ధ్వంసం చేయొచ్చు.
- గగనతలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే స్ట్రింగర్ మిస్సైళ్లు మరో ప్రత్యేకత. గాలిలో ప్రయాణిస్తుండగానే శత్రుదేశాల హెలికాప్టర్లు, మానవ రహిత వాహనాలను కూల్చేయవచ్చు. ఒక్కమాటలో చెప్పాలంటే అపాచీలు శత్రువులపై నిప్పుల వర్షం కురిపించి, తుత్తునియలు చేయగలవు.
- అన్ని రకాల వాతావరణ పరిస్థితుల్లో పని చేయడం మరో ప్రత్యేకత. పగలు, రాత్రి, వర్షంలో, దుమ్ములో, ధూళిలో, పొగలో... భౌగోళిక పరిస్థితులు ఎలా ఉన్నా ముందుకు దూసుకెళ్లి దాడి చేసేలా ఇందులో సెన్సార్లు, టార్గెటింగ్ వ్యవస్థలు ఉన్నాయి.
- సంక్లిష్టమైన యుద్ధ వాతావరణాల్లోనూ సమర్థంగా పనిచేస్తాయి. దృఢమైన నిర్మాణం కావడంతో శత్రువుల దాడిని తట్టుకుంటాయి. చిన్నపాటి ఆయుధాలు ప్రయోగించినా ఏమాత్రం చెక్కుచెదిరే ప్రసక్తే ఉండదు. అపాచీలో ఇద్దరు ప్రయాణించవచ్చు. ఒకరు పైలట్‌గా వ్యవహరిస్తారు. మరొకరు ఆయుధ వ్యవస్థను నియంత్రిస్తారు.
- అపాచీ హెలికాప్టర్లు అమెరికా సైన్యంలో గత 40 ఏళ్లుగా సేవలందిస్తున్నాయి. 1980వ దశకం తర్వాత కీలకమైన ఆపరేషన్లలో పాల్గొన్నాయి. విశ్వసనీయత, ప్రభావశీలతను నిరూపించుకున్నాయి.

బ్రిటిష్ ఫైటర్ జెట్ ఎగిరింది!

- సాంకేతిక లోపంతో నెలకుపైగా కేరళలో నిలిపివేత
- ఎట్టకేలకు బ్రిటన్‌కు...

త్రివేంద్రం: సాంకేతికలోపంతో కేరళలోని తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో నెల రోజుల పాటు నిలిచిపోయిన బ్రిటన్‌కు చెందిన అత్యంత అధునాతన ఎఫ్–35బీ యుద్ధవిమానం ఎట్టకేలకు స్వదేశానికి పయనమైంది. సరిపడా ఇంధనం లేకపోవడం, అసాధారణ వాతావరణ పరిస్థితుల కారణంగా ఈ విమానం జూన్ 14వ తేదీన కేరళలోని తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండవడం తెలిసిందే. ఆ తర్వాత ఎన్నిసార్లు రిపేర్లుచేసినా మళ్లీ టేకాఫ్ తీసుకోలేక అక్కడే రన్‌వే పైనే చతికిలపడిన విషయం విదితమే. కీలక హైడ్రాలిక్ వ్యవస్థ వైఫల్యంతో యుద్ధవిమానం ఎగరలేకపోయింది. దాన్ని సరిచేయడానికి బ్రిటన్ రాయల్ నేవీ టెక్నీషియన్ల బృందం చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. విమానం సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) రక్షణలో నాలుగో నంబర్ రన్‌వేపై ఉండిపోయింది. హైడ్రాలిక్ వ్యవస్థ వైఫల్యం కారణంగా చివరకు ఈ యుద్ధవిమానం రెక్కలను జాగ్రత్తగా విడదీసి అత్యంత భారీ సరకు రవాణా సైనిక విమానంలో బ్రిటన్‌కు తరలించనున్నట్లు మొదట్లో వార్తలొచ్చాయి. అయితే చివరి ప్రయత్నంగా బ్రిటన్ నుంచి ప్రత్యేకంగా 40 మంది బ్రిటిష్ ఇంజనీర్లు, నిపుణుల బృందం తిరువనంతపురం విచ్చేసింది. రిపేర్ల కోసం ఎట్టకేలకు యుద్ధ విమానాన్ని రన్‌వే మీద నుంచి హ్యాంగర్‌కు తరలించారు. జూలై ఆరో తేదీన ఎయిర్‌బస్ ఎ400ఎమ్ అట్లాస్ విమానంలో కొత్త విడిభాగాలు, అధునాతన పరికరాలతో రాయల్ ఎయిర్ ఫోర్స్ బృందం రాకతో పరిస్థితులు మారిపోయాయి. ఫైటర్ జెట్‌కు చకచకా మరమ్మతు చేశారు. లాక్‌హీడ్ మార్టిన్ రక్షణరంగ తయారీసంస్థ అభివృద్ధిచేసిన ఈ ఎఫ్–35బీ.. ప్రపంచంలోనే అత్యంత అధునాతనమైన, ఖరీదైన యుద్ధ విమానాల్లో ఒకటి. దీని ధర దాదాపు రూ.950 కోట్లు. అత్యవసర పరిస్థితుల్లో నిట్టనిలువుగా ల్యాండింగ్ కావడం ఈ విమానం ప్రత్యేకత. ఇది నాటో వైమానిక శక్తికి మూలస్తంభం లాంటిదని చెప్పొచ్చు.


ఎఫ్-35బీ ఫైటర్ జెట్

రాష్ట్రపతికి గడువుపై మీరేమంటారు?

కేంద్రం, రాష్ట్రాలకు సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ: అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులకు ఆమోదం తెలిపే విషయంలో రాష్ట్రపతికి కాల పరిమితి విధించడంపై సుప్రీంకోర్టు మంగళవారం కేంద్రంతోపాటు రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. ఈ నెల 29వ తేదీలోగా సమాధానాలను అందజేయాలంటూ ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ సారథ్యంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఆదేశించింది. ఈ అంశంపై ఆగస్టులో విచారణ చేపడతామని వెల్లడించింది. రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులకు ఆమోదం తెలిపే విషయంలో రాష్ట్రపతి న్యాయస్థానాలు కాల పరిమితి విధించవచ్చా అంటూ మేలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సుప్రీంకోర్టుకు 14 ప్రశ్నలతో లేఖ రాయడం తెల్సిందే. పరిశీలన కోసం గవర్నర్లు పంపిన బిల్లులపై రాష్ట్రపతి అవి అందిన నాటి నుంచి మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఏప్రిల్‌లో జారీ చేసిన ఉత్తర్వులు సంచలనం రేపడం తెల్సిందే.

పుతిన్‌తో ముఖాముఖి చర్చలకు సిద్ధం

ముందుకు వచ్చిన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

కీవ్: రష్యాతో జరుగుతున్న యుద్ధానికి ముగింపు పలికేందుకు అధ్యక్షుడు పుతిన్‌తో నేరుగా చర్చలకు తాను సిద్ధమని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మరోసారి ముందుకువచ్చారు. తుర్కియే మధ్యవర్తిత్వంతో ఇరు దేశాల మధ్య బుధవారం మరో దఫా చర్చలు జరగనున్నాయన్నారు. ఈసారి మరింత మంది యుద్ధ ఖైదీల విడుదలతోపాటు రష్యా నిర్బంధంలో ఉన్న తమ చిన్నారులను తిరిగి అప్పగించాలని కోరుతామన్నారు. అయితే, ఇలాంటి చర్చలతో పెద్దగా ఫలితం కనిపించదని ఆయన పేర్కొన్నారు. యుద్ధాన్ని ఆపేందుకు పుతిన్ ముఖాముఖి చర్చలే మార్గమని చెప్పారు. 'ఉక్రెయిన్ యుద్ధాన్ని ఎన్నడూ కోరుకోలేదు. అనవసరమైన ఈ యుద్ధాన్ని మొదలుపెట్టింది రష్యాయే. కాబట్టి, ఆ దేశమే ఈ యుద్ధానికి స్వస్తి చెప్పాలి'అని జెలెన్‌స్కీ స్పష్టం చేశారు. రెండో ప్రపంచయుద్ధం తర్వాత అతి పెద్ద సంక్షోభానికి ముగింపు పలికేందుకు జెలెన్‌స్కీ గతంలోనూ పలుమార్లు ముఖాముఖి చర్చలకు ముందుకు వచ్చినా పుతిన్ ముఖం చాటేశారు. కాల్పుల విరమణ ఒప్పందానికి రావాలంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇచ్చిన పిలుపును సైతం పుతిన్ పట్టించుకోలేదు.

ఉక్రెయిన్‌పై రష్యా గ్లైడ్ బాంబులు

మరోవైపు, రష్యా సైన్యం ఉక్రెయిన్ తూర్పు, ఈశాన్య ప్రాంతాల్లోని వెయ్యి కిలోమీటర్ల పొడవైన యుద్ధక్షేత్రంలో ముందుకు చొచ్చుకువెళ్లేందుకు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తోంది. సుమీ, ఒడెసా, క్రమటోర్‌స్క్ ప్రాంతాల్లోని నాలుగు నగరాలపై ప్రమాదకర గైడ్ బాంబులను ప్రయోగించింది. ఈ దాడుల్లో ఒక చిన్నారి సహా 24 మంది గాయపడ్డారు. క్రమటోర్‌స్క్‌లోని ఓ నివాస భవన సముదాయంలో మంటలు చెలరేగాయి. డ్రోన్ దాడితో సుమీలోని పుటివేల్‌లో గ్యాస్ స్టేషన్‌కు మంటలు అంటుకున్నాయి. ఇలా ఉండగా, మాస్కోతోపాటు పలు ప్రాంతాలపై ఉక్రెయిన్ ప్రయోగించిన 35 లాంగ్ రేంజ్ డ్రోన్లను ధ్వంసం చేసినట్లు రష్యా రక్షణ శాఖ ప్రకటించింది.

యునెస్కో నుంచి బయటకు వస్తాం

- రెండేళ్ల తర్వాత అమెరికా మళ్లీ హెచ్చరిక
- ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా పనిచేస్తోందని ఆరోపణ

ప్యారిస్: ఐక్యరాజ్యసమితిలోని కీలకమైన యునెస్కోతో తెగదెంపులు చేసుకుంటామని అమెరికా మరోసారి హెచ్చరించింది. యునెస్కోలో సభ్యత్వం తమ దేశ ప్రయోజనాలకు విరుద్ధమని భావిస్తున్నామని, పైపెచ్చు ఈ విభాగం ఇజ్రాయెల్ వ్యతిరేక ప్రసంగాలను ప్రోత్సహిస్తోందని ఆరోపించింది. సామాజిక, సాంస్కృతిక విభేదాలను యునెస్కో ప్రోత్సహిస్తున్నందునే ట్రంప్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని విదేశాంగ శాఖ ప్రతినిధి టామీ బ్రూస్ చెప్పారు. పాలస్తీనాను సభ్యదేశంగా చేర్చుకోవడం యునెస్కో తీసుకున్న అత్యంత సమస్యాత్మక నిర్ణయమన్నారు. కాగా, ఈ నిర్ణయం 2026 డిసెంబర్‌లో అమల్లోకి రానుంది. యునెస్కో డైరెక్టర్ జనరల్ ఆండ్రీ అజౌలే అమెరికా ప్రభుత్వ నిర్ణయంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అమెరికా చర్య తమకు ఆశ్చర్యం కలిగించలేదు, ఇది ముందుగా ఊహించిందేనన్నారు. యునెస్కోది ఇజ్రాయెల్ వ్యతిరేక ధోరణి అంటూ చేసిన ఆరోపణలను తోసిపుచ్చారు. కాగా, అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ మొదటిసారి బాధ్యతలు చేపట్టిన సమయంలో 2018లోనూ యునెస్కోను వీడిన అమెరికా తిరిగి బైడెన్ ప్రభుత్వ హయాంలో 2023లో చేరింది. పాలస్తీనాను యునెస్కోలో సభ్యదేశంగా చేర్చుకోవాలన్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అప్పట్లో అమెరికా, ఇజ్రాయెల్ నిధులను నిలిపివేశాయి. గతంలో సోవియెట్ యూనియన్‌కు అనుకూలంగా పనిచేస్తోందంటూ రీగన్ ప్రభుత్వం 1984లో యునెస్కో నుంచి బయటకు వచ్చింది. 2003లో జార్జి డబ్ల్యూ బుష్ హయాంలో తిరిగి యునెస్కోలో చేరింది. కాగా, యునెస్కోకు అత్యధికంగా నిధులు సమకూర్చే దేశంగా అమెరికా ఉండేది. అయితే, యునెస్కో నిధుల సమీకరణకు కొత్త మార్గాలను అన్వేషించుకుంది. దీంతో, ఇప్పుడు మొత్తం నిధుల్లో అమెరికా వాటా కేవలం 8 శాతానికి పడిపోయింది. అమెరికా నిర్ణయంతో తమ కార్యక్రమాలు యథాప్రకారం కొనసాగుతాయని, సిబ్బంది తొలగింపు వంటివేవీ ఉండవని అజౌలే స్పష్టం చేశారు.

ఇండియా-యూకే ఎఫ్‌టీఏకు కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ: భారత్, యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి(ఎఫ్‌టీఏ) కేంద్ర మంత్రివర్గం మంగళవారం ఆమోద ముద్ర వేసింది. దీనిపై ఈ నెల 24వ తేదీన లండన్‌లో భారత ప్రధాని నరేంద్ర మోదీ, యూకే ప్రధాని కీర్ స్టార్మర్ సమక్షంలో సంతకాలు జరుగుతాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. అధికారికంగా 'సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం'గా పిలుస్తున్న ఎఫ్‌టీఏపై ఇరుదేశాల వాణిజ్య శాఖ మంత్రులు సంతకాలు చేస్తారు. అనంతరం ఒప్పందాన్ని బ్రిటిష్ పార్లమెంట్ ఆమోదించాల్సి ఉంటుంది. ఈ తర్వాత అమల్లోకి వస్తుంది. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ప్రకారం.. భారత్ నుంచి ఎగుమతి చేసే తోలు ఉత్పత్తులు, పాదరక్షలు, వస్త్రాలపై యూకేలో పన్నులు తొలగిస్తారు. అలాగే యూకే నుంచి ఇండియాకు దిగుమతి అయ్యే విస్కీ, కార్ల ధరలు తగ్గుతాయి. ఇదిలా ఉండగా, భారత్, యూకే మధ్య ద్వైపాక్షిక పెట్టుబడుల ఒప్పందం (బీఐటీ)పై చర్చలు కొనసాగుతున్నాయి.

సాక్షి హైదరాబాద్

బుధవారం ॥ 23 ॥ జూలై ॥ 2025



నవీద్ చిక్కింది నగరంలోనే!
ముంబై సబర్బన్ రైళ్ల పేలుళ్ల కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. నిర్దోషిగా తేలిన వారిలో ఒకడైన నవీద్ హుస్సేన్ పట్టుబడింది నగరంలోనే.
-10లో



స్కాన్.. పొదుపు గాన్..
స్కాన్ అండ్ పే.. చిల్లర గొడవలేదు.. పెద్దనోట్ల బెడదలేదు. కానీ.. స్కాన్ అండ్ పేతో ఆర్థిక నియంత్రణ కోల్పోతున్నామని పలువురు చెబుతున్నారు.
- సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
33.0/23.0

వాతావరణం
నగరంలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 33, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువకుడి బలి


వెంకటేష్ (ఫైల్)

బంజారాహిల్స్: ఆన్‌లైన్ బెట్టింగ్‌లో రూ.లక్షలు పోగొట్టుకున్న ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. మహబూబ్‌నగర్ జిల్లా నర్వా మండలం జక్లెన్ గ్రామానికి చెందిన గడ్డమీది వెంకటేష్ (23) ఖైరతాబాద్ సమీపంలోని చింతల్ బస్తీలో అద్దెకు ఉంటూ బంజారాహిల్స్ రోడ్డునెంబర్–14లోని ఓ కేఫ్‌లో గార్డెనర్‌గా పని చేస్తున్నాడు. కొంతకాలంగా ఆన్‌లైన్ బెట్టింగ్ అలవాటు పడ్డాడు. బెట్టింగ్ యాప్‌లో రెండు నెలల వ్యవధిలోనే రూ.6 లక్షలు కోల్పోయాడు. బెట్టింగ్ కోసం తెలిసినవారి నుంచి అప్పులు తీసుకున్నాడు. ఆర్థికంగా దివాలా తీశాడు. అప్పు ఇచ్చిన వారు ఒత్తిడి తీసుకురావడం, బెట్టింగ్‌కు బానిసవడం, ఆర్థిక ఇబ్బందులకు తోడు సమస్యలు చుట్టుముట్టడంతో తాను పని చేస్తున్న కేఫ్‌లోనే గుర్తు తెలియని క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేగవంతంగా రేషన్ కార్డుల వెరిఫికేషన్ ప్రక్రియ

- వ్యాధులు ప్రబలకుండా పకడ్బందీ చర్యలు
- హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్



సాక్షి, సిటీబ్యూరో: కొత్త రేషన్ కార్డు దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కొత్త రేషన్‌కార్డు దరఖాస్తుల ప్రక్రియ వెరిఫికేషన్, సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియ కొనసాగుతుందని, పాత రేషన్ కార్డులో కొత్త సభ్యుల పేర్లను కూడా యాడ్ చేస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఈ నెల 25 నుంచి ఆగస్టు 10 వరకు నియోజకవర్గాల వారీగా నూతన రేషన్ కార్డుల అందజేత ప్రక్రియ ఉంటుందని మంత్రి వివరించారు. హైదరాబాద్ జిల్లాలో 43,115 కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు మంజూరైనట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మొత్తం 2,19,717 దరఖాస్తులు రాగా.. వీటిలో 92,842 దరఖాస్తులను పరిశీలించినట్లు.. 1,26,875 దరఖాస్తులను వెరిఫికేషన్ చేయాల్సిఉందన్నారు. వర్షాల నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రత్యేక స్క్రీనింగ్ క్యాంపులు చేపట్టి టీబీ నిర్ధారణ తర్వాత రెగ్యులర్ కోర్స్ మెడిసిన్ అందించాలని ఆదేశించారు. మురికివాడల్లో వైద్య శిబిరాలు నిర్వహించి ప్రాంతాల వారీగా ఫాగింగ్ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటి, జిల్లా టీబీ నివారణ అధికారి డాక్టర్ చల్లా దేవి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు పాల్గొన్నారు.



అలలపై.. తెరచాపలై..

అంబర వీధుల్లో మేఘమాలికలు. హుస్సేన్ సాగర్ తీరంలో అమరవీరుల స్తూపం.. బిర్లా టెంపుల్.. ధవళవర్ణ కాంతుల్లో సచివాలయ భవనం, అతిపెద్ద అంబేద్కర్ విగ్రహం.. మరోవైపు సాగర్ మధ్యలో తథాగతుడి ప్రతిమ మంగళవారం కొత్తందాలను సంతరించుకోగా.. ఇంకోవైపు నీటి అలలపై పడవల తెరచాపలు రెపరెలాడాయి. సెయిలింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఇచ్చిన శిక్షణలో భాగంగా నావలు ఇలా నవనవలాడుతూ కనిపించాయి. పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచాయి.
- సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్

గ్యారంటీ లేకపాయే..

కొత్త రేషన్ కార్డులకు ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ వర్తించేనా?

- దరఖాస్తుల కోసం కార్డుదారుల ఉరుకులు.. పరుగులు
- కలెక్టరేట్, మున్సిపల్ కార్యాలయాల వద్ద కిటకిట
- ప్రజాపాలనలో దరఖాస్తులు చేసి ఉంటేనే నమోదుకు అవకాశం



సాక్షి, సిటీబ్యూరో

కొత్తగా రేషన్ కార్డులు మంజూరైన పేద కుటుంబాలు ఆరు గ్యారంటీల్లో భాగంగా అమలవుతున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500కు వంట గ్యాస్ సిలిండర్ వర్తింపు కోసం దరఖాస్తులు చేసుకునేందుకు ఉరుకులు పరుగులు తీస్తున్నారు. వారం రోజులుగా కలెక్టరేట్, మున్సిపల్ కార్యాలయాల్లోని ప్రజాపాలన సేవా కేంద్రాలకు దరఖాస్తుదారుల తాకిడి పెరిగింది. ఏడాదిన్నర క్రితం ప్రజాపాలన కార్యక్రమంలో విద్యుత్, గ్యాస్ కోసం అర్జీలు పెట్టుకున్నట్లు ఆన్‌లైన్‌లో చూపిస్తేనే కొత్త దరఖాస్తులు నమోదవుతున్నాయి. అప్పట్లో దరఖాస్తు చేసుకోనివారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీంతో గంటలకొద్దీ క్యూలో నిలబడి వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అర్హత సాధించిన 58,565 కుటుంబాలు

గ్రేటర్ పరిధిలో కొత్త రేషన్ కార్డుల మంజూరుతో సుమారు 58,565 కుటుంబాలు ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హత సాధించినట్లయింది. హైదరాబాద్ జిల్లా పరిధిలో 43,115, రంగారెడ్డి జిల్లాలో 8,680, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 6,770 కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు మంజూరయ్యాయి. దీంతో ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. అయితే.. సగానికి పైగా కుటుంబాలు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోకపోవడంతో ఆన్‌లైన్‌లో నమోదుకు సాధ్యం కాని పరిస్థితి నెలకొంది. ప్రజాపాలన దరఖాస్తు నంబర్‌తో ముడిపడి ఉండటంతో నమోదుకు ఆటంకం కలుగుతోంది. వాస్తవంగా ఇప్పటికే తెల్ల రేషన్‌కార్డు ప్రామాణికంగా అర్హత సాధించిన కుటుంబాలు సైతం కేవలం ఉచిత విద్యుత్‌కు పరిమితమయ్యాయి. సిలిండర్‌పై సబ్సిడీ అందిస్తున్నా.. మెజార్టీ బీపీఎల్ కుటుంబాలకు వర్తించడం లేదు. బీపీఎల్ ఒకే కుటుంబం గృహాలక్ష్మి పథకానికి అర్హత సాధించినా.. మహాలక్ష్మి పథకానికి మాత్రం అర్హత సాధించకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. దీంతో పూర్తిస్థాయి బహిరంగ మార్కెట్ ధర చెల్లించి వంట గ్యాస్ సిలిండర్ కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలొంది.

అందని ద్రాక్షగానే..

మహా నగర పరిధిలో వంట గ్యాస్ కనెక్షన్లు సుమారు 31.18 లక్షలు ఉండగా అందులో కొందరికి మాత్రమే రూ.500కు సబ్సిడీ వంట గ్యాస్ వర్తిస్తోంది. వాస్తవంగా సుమారు 24.74 లక్షల కుటుంబాలు మహాలక్ష్మి పథకం కింద దరఖాస్తు చేసుకున్నట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అందులో సుమారు 19.01 లక్షల కుటుంబాలు మాత్రమే తెల్లరేషన్ కార్డులు కలిగి ఉన్నాయి. అయితే.. సబ్సిడీ గ్యాస్ మాత్రం మూడు లక్షల లోపు కనెక్షన్‌దారులు మాత్రమే ఎంపికైనట్లు పౌరసరఫరాల శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే.. మిగతా సుమారు 16 లక్షల కనెక్షన్‌దారులు అర్హులుగా ఉన్నా.. సబ్సిడీ వర్తింపు మాత్రం అందని ద్రాక్షగా తయారైంది. కాగా.. సుమారు 52,65,129 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉండగా, అందులో ప్రజాపాలనలో గృహజ్యోతి కింద ఉచిత విద్యుత్ కోసం 24 లక్షల కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నాయి. ఇందులో 11 లక్షల కుటుంబాలు జీరో బిల్లుకు అర్హత సాధించాయి. మిగతా కుటుంబాలు వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యాయి.

‘వెంట్’నే వరద వెళ్లేలా!


బహదూర్‌పురా ఫ్లై ఓవర్‌పై..

ఎప్పుడూ, ఎక్కడా లేని విధంగా ఇటీవల కురిసిన వర్షాలకు నగరంలో కొత్తగా కట్టిన కొత్తగూడ ఫ్లై ఓవర్, నాయిని నరసింహారెడ్డి స్టీల్ బ్రిడ్జి సహా పలు ప్రాంతాల్లోని ఫ్లై ఓవర్లపై వరదనీరు చేరడంతో ప్రజల నుంచి వెల్లువెత్తిన విమర్శలతో ఎట్టకేలకు అధికార యంత్రాంగం కదిలింది. అటు హైడ్రా, ఇటు జీహెచ్‌ఎంసీ ఫ్లై ఓవర్లపై వరదనీరు వెళ్లాల్సిన వెంట్స్ (రంధ్రాల) నుంచి పైపుల ద్వారా కిందకు వెళ్లేలా చర్యలు చేపట్టాయి. పేరుకుపోయిన చెత్తా చెదారాలను తొలగించి, వెంట్స్ శుభ్రం చేసే పనులు చేపట్టాయి. జేఎన్‌టీయూ, బహదూర్‌పురా, నారాయణగూడ, నల్లగొండ క్రాస్‌రోడ్స్, మూసాపేట, బయో డైవర్సిటీ, కొండాపూర్, బేగంపేట, లాలాపేట, దబీర్‌పురా తదితర ప్రాంతాల్లోని ఫ్లై ఓవర్ల వెంట్స్‌ను మంగళవారం క్లీన్ చేశాయి. ఫ్లై ఓవర్ల నిర్వహణను పూర్తిగా గాలికొదిలేయడం, కొత్తగా కట్టిన కొత్తగూడ ఫ్లై ఓవర్‌ను సైతం పట్టించుకోకపోవడం తెలిసిందే.
- సాక్షి, సిటీబ్యూరో


జేఎన్టీయూ వద్ద..

ఒత్తిడి తెస్తారా.. వదిలేస్తారా?

మన ఎంపీలు.. ఏం చేస్తారో మరి..

- మెట్రో రెండో దశపై 9 నెలలుగా ఎదురుచూపులే
- ప్రస్తుత పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు
- కేంద్రంపై ఒత్తిడి తెస్తేనే ప్రాజెక్టులో కదలిక
- కాలయాపనతో నిర్మాణ వ్యయం భారీగా పెరిగే అవకాశం
- కేంద్రం సందేహాలపై హెచ్‌ఎంఆర్‌ఎల్ వివరాల అందజేత



సాక్షి, సిటీబ్యూరో: మెట్రో రెండోదశ మరోసారి చర్చనీయాంశమైంది. ప్రస్తుత వర్షాకాల సమావేశాల నేపథ్యంలో కేంద్రం ఆమోదంపై ఆశలు చిగురిస్తున్నాయి. మన ఎంపీలు ముక్తకంఠంతో ఒత్తిడి చేస్తే ప్రాజెక్టు పట్టాలెక్కే అవకాశాలు ఉన్నాయి. ఇదే అంశంపై ఇటీవల జరిగిన ఎంపీల సమావేశం ఒక సానుకూలమైన వాతావరణాన్ని కల్పించింది. ప్రస్తుతం వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో పార్టీలకు అతీతంగా పార్లమెంట్‌లో ప్రస్తావిస్తే కేంద్రం నుంచి స్పష్టమైన ప్రకటన వెలువడే అవకాశం ఉంది. హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్‌ఎంఆర్‌ఎల్) తొమ్మిది నెలల క్రితమే సమగ్ర ప్రాజెక్టు నివేదికను కేంద్రానికి అందజేసింది. ఆ తర్వాత రెండో దశ ‘బి’ విభాగం కింద ప్రతిపాదించిన మరో మూడు లైన్ల డీపీఆర్‌లను కూడా కేంద్రానికి అందజేశారు. కానీ ఈ ప్రాజెక్టుపైన ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేదు. మరోవైపు వివిధ మార్గాల్లో కేంద్రంలోని పలు విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు వెలిబుచ్చిన సందేహాలపై హెచ్‌ఏఎంఆర్‌ఎల్ వివరాలను సైతం అందజేసింది. ఈ క్రమంలో ఎంపీలంతా కలిసి కేంద్రంపై గట్టిగా ఒత్తిడి తెస్తే సానుకూలమైన ఫలితం వెలువడే అవకాశం ఉంది.

భారీగా పెరగనున్న నిర్మాణ వ్యయం..

మెట్రో రెండో దశ ‘ఎ’ విభాగం కింద 5 మార్గాల్లో, ‘బి’ విభాగం కింద మూడు మార్గాల్లో మెట్రో లైన్‌లను నిర్మించేందుకు ప్రణాళికలను రూపొందించిన సంగతి తెలిసిందే. రెండు విభాగాలుగా మొత్తం 8 మార్గాల్లో మెట్రో నిర్మాణానికి సుమారు రూ.43,848 కోట్లు ఖర్చు కానున్నట్లు అంచనా. మొదటి 5 కారిడార్‌లకు రూ.24, 269 కోట్లు, ‘బి’ విభాగం ప్రతిపాదించిన 3 కారిడార్లకు రూ.19,579 కోట్ల చొప్పున అంచనాలను రూపొందించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో రెండో దశ చేపట్టనున్నారు. ఈ నిర్మాణ వ్యయాలు 9 నెలల క్రితం నాటి అంచనాలు మాత్రమే. ఇప్పుడు ఈ అంచనాలు భారీగా పెరిగే అవకాశం ఉన్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. రూ.55 వేల కోట్లు దాటే అవకాశం ఉన్నట్లు అంచనా. కాలయాపన వల్ల ఆర్థికంగా ఈ ప్రాజెక్టు భారంగా మారే అవకాశం ఉంది. ఇప్పటికే ఢిల్లీ, చెన్నై, బెంగళూరు, తదితర నగరాల్లో రెండో, మూడో దశ మెట్రోరైళ్ల నిర్మాణం కొనసాగుతుండగా హైదరాబాద్‌లో మాత్రం 69 కి.మీ. మొదటి దశకే పరిమితమైంది. రెండో దశ పూర్తయితే సుమారు 124 కి.మీ. వరకు మెట్రో సేవలు విస్తరించనున్నాయి. హైదరాబాద్ మహానగర విస్తరణలో భాగంగా ట్రిపుల్ ఆర్ వరకు నాలుగు దశలుగా మెట్రో విస్తరణకు ప్రభుత్వం మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేస్తోంది. 4 దశల్లో మొత్తం 640 కి.మీ చేపట్టాలని అంచనా.

రెండో దశ ఇలా..

- రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి భారత్ ఫ్యూచర్‌సిటీ వరకు 39.6 కి.మీ కారిడార్ నిర్మాణానికి రూ.7,168 కోట్లతో అంచనాలు.
- జేబీఎస్ నుంచి మేడ్చల్ వరకు 24.5 కి.మీ.లకు రూ.6,946 కోట్లు, జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ వరకు 22 కి.మీ.లకు రూ.5,464 కోట్ల చొప్పున నిర్మాణ వ్యయం.
- మెట్రో రెండో దశ ‘ఎ’ విభాగం కింద ప్రతిపాదించిన 76.4 కి.మీలకు సుమారు రూ.24,269 కోట్లతో అంచనాలు.
- ‘ఎ’ విభాగం కింద ఐదు కారిడార్‌లలో నాగోల్ నుంచి ఎయిర్‌పోర్టు వరకు 36.8 కి.మీ. రాయదుర్గం నుంచి కోకాపేట్ నియోపోలిస్ వరకు 11.6 కి.మీ. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5.కి.మీ. మియాపూర్–పటాన్‌చెరు 13.4 కి.మీ. ఎల్‌బీనగర్– హయత్‌నగర్ 7.1.కి.మీ చొప్పున నిర్మించనున్నారు.

ఎనీ ఎమర్జెన్సీ.. డయల్-112

ఈ నెలలో ఆరు ఉదంతాల్లో తక్షణ స్పందన

- వివరాలు వెల్లడించిన డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలో ఎవరికి ఏ అత్యవసరం వచ్చినా.. ‘డయల్–112’ సేవలు వినియోగించుకుంటున్నారు. ప్రతి ఫోన్ కాల్‌ను క్షుణ్ణంగా అధ్యయనం చేస్తున్న తెలంగాణ ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టం (టీజీఈఆర్‌ఎస్‌ఎస్) సిబ్బంది క్షేత్రస్థాయిలో ఉన్న పోలీసులకు అప్రమత్తం చేస్తున్నారు. ఇలా ఈ నెలలో ఇప్పటి వరకు ఆరు ఉదంతాల్లో తక్షణం స్పందించిన యంత్రాంగాలు పెను ప్రమాదాలను తప్పించాయి. ఆ వివరాలను తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (టీజీఐసీసీసీ) డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి మంగళవారం విడుదల చేశారు.



గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తూ..

ఎస్సార్ నగర్‌లో అగ్ని ప్రమాదం:

ఎస్సానగర్‌లోని కేఫ్ కాఫీ డేలో ఈ నెల 3న మధ్యాహ్నం అగ్నిప్రమాదం జరిగింది. దీనిపై ‘112’కు మధ్యాహ్నం 3.37కు కాల్ వచ్చింది. టీజీఈఆర్‌ఎస్‌ఎస్ సిబ్బంది వెంటనే ఇటు ఎస్సార్‌నగర్ పోలీసులతో పాటు అటు అగ్నిమాపక శాఖ అధికారులను అప్రమత్తం చేశారు. ఘటనాస్థలికి చేరుకున్న బలగాలు ఆరుగురిని రెస్క్యూ చేసి.. గాయపడిన ఓ వ్యక్తిని ఆస్పత్రికి తరలించాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో అంటుకున్న మంటలు రెండో అంతస్తు వరకు విస్తరించినా తక్షణ స్పందనతో 20 నిమిషాల్లోనే నియంత్రించగలిగారు.

దేవగిరి ఎక్స్‌ప్రెస్‌లో వేధింపులు:

ఈ నెల 5న దేవగిరి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న ఓ యువకుడు మహిళా ప్రయాణికుల్ని వారి అనుమతి లేకుండా ఫొటోలు, వీడియోలు తీస్తున్నాడు. దీనిపై బాధితులు టీ–సేఫ్ యాప్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఇది కూడా టీజీఈఆర్‌ఎస్‌ఎస్‌కు చేరడంతో అక్కడి సిబ్బంది రైల్వే అధికారులు, శంకర్‌మ్మెట్, కామారెడ్డి పోలీసులకు సమాచారం ఇచ్చి అప్రమత్తం చేశారు. రైలు కామారెడ్డి రైల్వేస్టేషన్ చేరుకునే లోపు అక్కడకు వెళ్లిన పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు.

బహదూర్‌పురలో ఆత్మహత్యాయత్నం:

ఈ నెల 7న నగరంలోని బహదూర్‌పురా ఫ్లైఓవర్ వద్ద ఓ యువతి ఆత్మహత్యకు యత్నిస్తుండటాన్ని స్థానికులు గమనించారు. వీళ్లు ‘112’కు కాల్ చేసి విషయం చెప్పారు. టీజీఈఆర్‌ఎస్‌ఎస్ సిబ్బంది ఈ సమాచారాన్ని బహదూర్‌పుర పోలీసులకు చేరవేసి అప్రమత్తం చేశారు. ఘటనాస్థలికి చేరుకున్న అధికారులు ఆమె ప్రాణాలు కాపాడారు.

రైల్లో ప్రయాణిస్తున్న చిన్నారి రెస్క్యూ:


తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రుల చెంతకు..

కేరళ ఎక్స్‌ప్రెస్‌లో తొమ్మిదేళ్ల బాలుడు ఒంటరిగా ప్రయాణిస్తుండటాన్ని తోటి ప్రయాణికులు వరంగల్ దగ్గర గుర్తించారు. ఈ విషయాన్ని వాళ్లు ‘112’కు తెలిపారు. వీరి ద్వారా సమాచారం అందుకుని అప్రమత్తమైన వరంగల్ జీఆర్పీ పోలీసులు ఆ రైలు వద్దకు చేరుకుని బాలుడి తల్లిదండ్రుల వివరాలు ఆరా తీశారు. అతడు చెప్పిన అంశాలను బట్టి ఇన్‌స్టాగామ్‌లో సెర్చ్ చేసి బాలుడి తండ్రిని గుర్తించారు. ఆయన్ను సంప్రదించడం ద్వారా సదరు బాలుడు ఛత్తీస్‌గఢ్ నుంచి తప్పిపోయి వచ్చినట్లు తేలింది. బాలుడిని స్టేట్ హోమ్‌కు తీసుకువెళ్లిన పోలీసులు తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించారు.

కొండాపూర్, దేశాయిపేటల్లోనూ:

ఈ నెల 11, 15 తేదీల్లో కొండాపూర్, వరంగల్ దేశాయిపేటల్లో ఆత్మహత్యకు యత్నించిన ఇద్దరి వివరాలు స్థానికుల ద్వారా ‘112’కు అందాయి. ఇక్కడి సిబ్బంది తక్షణం అప్రమత్తమై స్థానిక పోలీసులకు ఘటనాస్థలికి పంపారు. వీళ్లు రెస్క్యూ చేయడంతో ఆ రెండు ప్రాణాలు నిలిచాయి.

‘సీఅండ్‌డీ’.. పకడ్బందీ

నిర్మాణ వ్యర్థాలు రీసైక్లింగ్‌కు పంపిస్తేనే ఓసీ

- అందుకనుగుణంగా టౌన్‌ప్లానింగ్ నిబంధనలు
- వ్యర్థాల సమస్య పరిష్కారం కోసం అమలు
- చర్యలకు సిద్ధమవుతోన్న జీహెచ్‌ఎంసీ

సాక్షి, సిటీబ్యూరో: ఇటీవల స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో పది లక్షల జనాభా మించిన నగరాల్లో ఆరో స్థానంతోపాటు వ్యర్థాలు లేని నగరాల విభాగంలో సెవెన్‌స్టార్ ర్యాంక్ పొందిన జీహెచ్‌ఎంసీ.. స్వచ్ఛ కార్యక్రమాలు పకడ్బందీగా అమలు చేయాలని భావిస్తోంది. ఏటా ర్యాంకులు, అవార్డులైతే వస్తున్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయనే విమర్శలు వెల్లువెత్తుతుండటంతో వాస్తవ పరిస్థితుల్లోనూ మార్పు తేవాలనే దిశగా చర్యలకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే ఫోన్ చేస్తే చెత్త తరలించే కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా ప్రారంభించిన జీహెచ్‌ఎంసీ, నిర్మాణ.. కూల్చివేతల (సీఅండ్‌డీ) వ్యర్థాల సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టనుంది. పెద్ద భవనాలను నిర్మించే రియల్టర్లు నిర్మాణ వ్యర్థాలను రీసైక్లింగ్ సదుపాయాలున్న జీహెచ్‌ఎంసీచే గుర్తింపు పొందిన అధీకృత ఏజెన్సీలకే పంపించేలా తగు చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతోంది. మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ(జీహెచ్‌ఎంసీ) కార్యదర్శి ఇలంబర్తి సూచనలకనుగుణంగా ఈ మేరకు చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా టౌన్‌ప్లానింగ్ విభాగం భవన నిర్మాణ అనుమతుల నిబంధనల్లోనే సదరు అంశాన్ని చేర్చి పాలకమండలి, ప్రభుత్వ ఆమోదంతో దాన్ని అమలు చేయాలని భావిస్తున్నారు. తద్వారా వ్యర్థాలను అధీకృత ఏజెన్సీలకు పంపిస్తేనే నిర్మాణాలు పూర్తయ్యాక ఆక్యుపెన్సీసర్టిఫికెట్ (ఓసీ) ఇచ్చేలా చర్యలు తీసుకోనున్నారు.

5–10 శాతం రీసైక్లింగ్ పునరుత్పత్తులే..

పాత భవనాలు కూల్చివేసి వాటి స్థానే కొత్తగా భవనాలు నిర్మించే వారికి భవన నిర్మాణ అనుమతి ఫీజులతో పాటే నిర్మాణ వ్యర్థాల ఫీజులను ఇప్పటికే వసూలు చేస్తున్నారు. రియల్టర్లు తమ ప్రాజెక్టుల్లో 5–10 శాతం రీసైక్లింగ్ పునరుత్పత్తుల్నే వాడాలని కూడా సూచించనున్నారు. రీసైక్లింగ్ ఉత్పత్తులైన మిక్స్‌డ్ కంకర, ఇసుక, ఇటుకలు, కెర్బ్ స్టోన్స్‌ను రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల్లో వివిధ ప్రాంతాల్లో వాడవచ్చని అధికారులు పేర్కొన్నారు. ఈ చర్యల ద్వారా నగరంలో ఎక్కడ పడితే అక్కడ సీఅండ్‌డీ వ్యర్థాలు లేకుండా చేయడంతో పాటు రీసైక్లింగ్ ప్లాంట్లున్న అధీకృత ఏజెన్సీల పునరుత్పత్తులు పూర్తిస్థాయిలో వినియోగమవుతాయని భావిస్తున్నారు. ప్రస్తుతం రీసైక్లింగ్ ఉత్పత్తులకు అంతగా డిమాండ్ లేకపోవడంతో పాటు చాలామంది బిల్డర్లు నిర్మాణ వ్యర్థాలను నాలాలతో సహా బహిరంగ ప్రదేశాల్లో వేస్తుండటంతో ప్లాంట్లను ఏర్పాటు చేసిన ఏజెన్సీలు తమకు అంతగా ఆదాయం రావడం లేదని ఆరోపిస్తున్నారు. దీన్ని కూడా దృష్టిలో ఉంచుకొని ఇందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

జరిమానాలూ భారీగా..

బహిరంగ ప్రదేశాల్లో సీఅండ్‌డీ వ్యర్థాలు వేసే వారికి ఇప్పటికే భారీ జరిమానాలున్నప్పటికీ, వాటిని మరింత పెంచే ఆలోచనలో అధికారులున్నట్లు తెలిసింది. సీఅండ్‌డీ వ్యర్థాల్ని నాలాలు, చెరువుల్లో వేస్తుండటంతో ముంపు సమస్యలు పెరుగుతున్నాయి. బహిరంగ ప్రదేశాల్లో వేస్తుండటంతో సదరు స్థలాలు వినియోగంలో లేకుండాపోతున్నాయి. పర్యావరణపరంగానూ కాలుష్య సమస్య ఉత్పన్నమవుతోంది. రోడ్ల పక్కన వేస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలతో పాటు నగర ఇమేజ్ దెబ్బతింటోంది. దీంతో ఇప్పటికే ఎక్కడ పడితే అక్కడ ఈ వ్యర్థాలు వేస్తే మొదటిసారి రూ.25 వేలు, రెండోసారి రూ.50వేలు, మూడోసారి లక్ష రూపాయల జరిమానా విధించేలా నిబంధనలున్నా ఉల్లంఘనలు జరుగుతుండటంతో జరిమానాలు ఇంకా పెంచే యోచనలో ఉన్నట్లు సమాచారం.



మిత్రులకు బెయిల్ ఇప్పించేందుకు..

- మహారాష్ట్ర నుంచి వచ్చి నగరంలో దొంగతనాలు.. పాతనేరస్తుడి అరెస్టు


నేరస్తుడి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జావెద్ తదితరులు

సికింద్రాబాద్: తన మిత్రులైన సహ నేరగాళ్లకు బెయిల్ ఇప్పించడం కోసం మహారాష్ట్ర నుంచి నగరానికి వచ్చి..లాడ్జిల్లో బస చేస్తూ..రైళ్లలో ప్రయాణాలు చేస్తూ టార్గెట్ చేసిన ప్రయాణికుల బంగారు ఆభరణాలు దొంగిలిస్తున్న ఓ ఘరానా నేరగాన్ని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. లోగడ పలుమార్లు ఈ తరహా నేరాలకు పాల్పడి బెయిల్‌పై బయటకు వచ్చాడు. జీఆర్పీ డీఎస్పీ ఎస్ఎన్ జావెద్, జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సాయీశ్వర్‌గౌడ్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సారస్వత్ తెలిపిన వివరాల ప్రకారం..కర్నాటకకు చెందిన మోతీలాల్ రెడ్డప్ప పవార్ (24) ఉపాధి కోసం మహారాష్ట్రకు వెళ్లాడు. వ్యసనాలకు బానిసైన ఇతడు రైలు ప్రయాణాల్లో 30 నేరాలకు పాల్పడ్డాడు. కొద్ది రోజుల క్రితం బెయిల్‌పై బయటికి వచ్చిన మోతీలాల్ రెడ్డప్ప పవార్‌కు తనతోపాటు మహారాష్ట్రలో జైలుకు వెళ్లిన సహనేరస్తులకు బెయిల్ ఇప్పించడం కోసం డబ్బు అవసరం అయింది. ఇందు కోసం హైదరాబాద్ చేరుకున్న అతడు పలు లాడ్జీల్లో బసచేసి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో దొంగతనాలు చేయడం కోసం పథకం సిద్ధం చేసుకున్నాడు. ఈనెల 17న ఎంఎంటీఎస్ రైలు ఎక్కిన నిందితుడు రెండు చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడ్డాడు. కేసులు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీల ద్వారా నిందితుడిని గుర్తించారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పరిసరాల్లో తచ్చాడుతుండగా మోతీలాల్ రెడ్డప్ప పవార్‌ను ఈ నెల 21న పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి రెండు బంగారు గొలుసులను స్వాధీనం చేసుకున్నారు.

గో'దారులు' కాకుండా !

నిరంతరం పర్యవేక్షిస్తున్న హైడ్రా



సాక్షి, సిటీబ్యూరో: వర్షం పడితే రహదారులపై వరద ముంచెత్తకుండా హైడ్రా నిరంతరం చర్యలు తీసుకుంటోంది. ఆర్‌యూబీలు, వంతెనలను పరిశీలించి ఎక్కడా నీరు నిలవకుండా జాగ్రత్త పడుతోంది. వంతెనలపైన కురిసిన వర్షం నీరు కిందకు వెళ్లేలా వాటికి ఉన్న రంధ్రాలను గుర్తించి, అడ్డంకులు తొలగిస్తోంది. కొండాపూర్‌లోని కొత్తగూడ వంతెన, హఫీజ్‌పేట్ వంతెనలపైన ఉన్న రంధ్రాలన్నీ తెరిచారు. అలాగే నగరంలోని అన్ని వంతెనలపైన నీరు నిలవకుండా చర్యలు తీసుకుంది. మదీనగూడ దగ్గర నాలా క్లీనింగ్ పనులు పూర్తి చేశారు. ఆర్‌యూబీల వద్ద సంపులు నిర్మించి ఆటోమేటిక్‌గా నీటిని తోడే వ్యవస్థను ఏర్పాటు చేశారు. అవి కొన్ని చోట్ల పని చేయకపోవడం, సామర్థ్యానికి మించి వరద నీరు రావడంతో తలెత్తిన ఇబ్బందుల పరిష్కారంపై హైడ్రా దృష్టి పెట్టింది. మంగళవారం మెహిదీపట్నం, మాదాపూర్ ప్రాంతాల్లో వర్షం పడుతున్నప్పుడు హైడ్రా ఎమర్జెన్సీ, డీఆర్ఎఫ్ బృందాలు క్షేత్రస్థాయిలో ఉండి..వరద నిలవకుండా చర్యలు తీసుకున్నాయి. అలాగే చింతల్, ఎల్‌బీనగర్ ఆర్‌యూబీలను కూడా హైడ్రా అధికారులు పరిశీలించారు. కాటేదాన్ అండర్ పాస్ (ఆర్‌యూబీ) వద్ద నీరు నిలవకుండా తీసుకోవాల్సిన చర్యలను అధ్యయనం చేశారు. హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్య, ఆర్ఎఫ్ఓ జయప్రకాష్, డీఎఫ్ఓ యజ్ఞనారాయణ తదితరులు క్షేత్రస్థాయిలో ఈ పనులను పరిశీలించారు.

అసలే అక్రమం.. ఆపై మోసం!

బెట్టింగ్ యాప్స్‌లో పెట్టుబడులంటూ ఎర
- నగర వాసి నుంచి రూ.13.42 లక్షలు స్వాహా
- ఈ-చలాన్ పేరుతో మరో యువకుడికీ టోకరా
- ఏపీకే ఫైల్ పంపి రూ.1.72 లక్షలు కాజేసిన వైనం

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలో ఆన్‌లైన్ బెట్టింగ్గే అక్రమం... అలాంటి బెట్టింగ్ యాప్‌లో పెట్టుబడి పేరుతో సైబర్ నేరగాళ్లు భారీ మోసం చేశారు. ముషీరాబాద్‌కు చెందిన యువకుడి నుంచి రూ.13.42 లక్షలు స్వాహా కాజేశారు. మరో ఉదంతంలో సికింద్రాబాద్‌కు చెందిన వ్యక్తికి పెండింగ్ ఈ-చలాన్ అంటూ ఏపీకే ఫైల్ పంపిన దుండగులు రూ.1.72 లక్షలు కాజేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ముషీరాబాద్‌కు చెందిన యువకుడికి (24) ఈ నెల 8న వాట్సాప్ కాల్ వచ్చింది. తన పేరు ఆర్య అని, తాను సఫైర్ బెట్టింగ్ క్యాసినో సంస్థ తరఫున మాట్లాడుతున్నానని ఓ యువతి పరిచయం చేసుకుంది. తమ బెట్టింగ్ యాప్‌లో పెట్టుబడులు పెడితే తక్కువ సమయంలోనే భారీ లాభాలు వస్తాయంటూ ఎర వేసింది. పలుమార్లు సంప్రదింపులు జరిపిన ఆ యువతి ఓ దశలో తమ ఇన్‌స్టాగామ్ ఖాతా లింక్‌ను షేర్ చేసింది. అందులో ఉన్న వీడియోలు చూసిన బాధితుడికి వీడియో కాల్ చేసి మాట్లాడింది. పెట్టుబడులు పెట్టడం ద్వారా భారీ లాభాలు పొందవచ్చని అతడిని నమ్మించింది. దీంతో ఆ యువతి చెప్పిన వర్చువల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకున్న బాధితుడు తొలుత రూ.10 వేలు పెట్టుబడిగా పెట్టాడు. ఆ వర్చువల్ యాప్‌లో లాభాలు వచ్చినట్లు అప్‌డేట్ అయింది. ఇది నిజమని నమ్మిన అతడు దఫదఫాలుగా రూ.13,42,778 పెట్టుబడిగా పెట్టారు. చివరకు ఆ యువతి ఫోన్‌తో పాటు తన వర్చువల్ యాప్ కూడా పని చేయకపోవడంతో తాను మోసపోయినట్లు తెలుసుకుని ఫిర్యాదు చేశారు. మరో ఉదంతంలో సికింద్రాబాద్‌కు చెందిన వ్యక్తికి (34) ఏళ్ల ఈ నెల 16న ఆర్టీఏ చలాన్ పేరుతో లింక్ ఉన్న వాట్సాప్ సందేశం వచ్చింది. అందులో దుండగులు ఏపీకే ఫైల్ జోప్పించారు. ఇది తమ వాహనం చేసిన ఉల్లంఘనలకు సంబంధించిన ఈ-చలాన్ అని భావించిన బాధితుడు ఆ లింక్ క్లిక్ చేశాడు. అందులో కనిపించిన యాప్ డౌన్‌లోడ్ చేసుకుని తన వ్యక్తిగత వివరాలు పొందుపరిచాడు. ఈ వివరాలు వినియోగించిన దుండగులు ఈ నెల 18 రాత్రి అతడి ఖాతా నుంచి రూ.1,72,625 స్వాహా చేశారు. పలు లావాదేవీల్లో ఈ మొత్తం పోతుండగా... బాధితుడు ఆపడానికి ప్రయత్నించాడు. అది సాధ్యం కాకపోవడతో నష్టపోవాల్సి వచ్చింది. ఏపీకే ఫైల్ ద్వారా ఈ ఫోన్‌ను రిమోట్ యాక్సస్ చేసిన దుండగులు అతడి ఫోన్‌కాల్స్, ఎస్సెమ్మెస్‌లు తమకు ఫార్వర్డ్ చేసుకుని, బ్యాంక్ ఓటీపీలు సంగ్రహించి ఈ మొత్తం కొట్టేశారు. ఎట్టకేలకు కాల్ ఫార్వాడింగ్‌ను అడ్డుకున్నప్పటికీ అప్పటికే నష్టపోవాల్సి వచ్చింది. దీనిపై బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు.

వర్షం నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలి

- వాటర్ లాగింగ్ పాయింట్లపై ఫోకస్ పెట్టండి
- ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా సత్వర చర్యలు చేపట్టాలి
- అధికారులకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశం



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో వర్షాల వల్ల నీరు నిలిచే వాటర్ లాగింగ్ పాయింట్లపై స్పెషల్ ఫోకస్ పెట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్‌తో కలిసి లక్డీకాపూల్ వద్ద మెహదీ ఫంక్షన్ హాల్, పీటీఐ బవన్, చీచా రెస్టారెంట్ వద్ద వాటర్ లాగింగ్ పాయింట్లను పరిశీలించారు. అప్పటికే అక్కడ నిలిచిన వర్షపు నీరును ఇంజనీరింగ్ సిబ్బంది తొలగించారు. అదే చోట ఇరుకుగా ఉండడం, రోడ్డు లెవెల్ డిఫరెన్స్ ఉండడంతో మెహదీపట్నం నుంచి వచ్చే వాహనాలు స్లోగా వెళ్లడం వల్ల ట్రాఫిక్ తరచుగా నిలిచిపోయి ఇబ్బందులు తలెత్తుతున్నాయనీ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్.. కర్ణన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై తమతో ఉన్న చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్‌తో కమిషనర్ చర్చించారు. సాధ్యమైనంత త్వరగా లెవెల్ డిఫరెన్స్ తొలగించడంతో పాటు సీసీ వేయాలని చీఫ్ ఇంజనీర్‌ను ఆదేశించారు. అక్కడే అదనంగా మరో లేన్ వచ్చేలా చూడాలన్నారు. తద్వారా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు.

నాంపల్లి కోర్టుకు ఎన్ఎస్‌యూఐ నేత

సిటీ కోర్టులు: గత ప్రభుత్వ పాలనలో విద్యార్థి సమస్యలపై పోరాటం చేసిన ఎన్ఎస్‌యూఐ నాయకులపై బీఆర్ఎస్ ప్రభుత్వం నమోదు చేసిన కేసు విచారణ మంగళవారం నాంపల్లిలోని మూడవ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో జరిగింది. ఈ విచారణకు ఏ-1గా ఉన్న ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వై.వెంకటస్వామి హాజరు కాగా..ఆయన తరుపున న్యాయవాది కురుమ నరేందర్ వకాలత్ దాఖలు చేశారు. ఏ-2గా ఉన్న ఎం.శివకుమార్ కోర్టుకు గైర్హాజరు కావడంతో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు తదుపరి విచారణను ఆగస్టు 28కి వాయిదా వేసింది.

మద్యం మత్తులో వాహనాలు ధ్వంసం



జీడిమెట్ల: ఓ వ్యక్తి మద్యం మత్తులో ఏడు వాహనాలను ధ్వంసం చేసిన ఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ వివరాల ప్రకారం..గాజులరామారం రోడామేస్త్రీనగర్‌కు చెందిన అంజన్‌గౌడ్ కొద్దిరోజులుగా మానసికంగా సరిగా ఉండటం లేదు. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పూటుగా మద్యం సేవించి స్థానిక మార్కండేయ నగర్‌లో తిరుగుతూ 4 బైకులు, రెండు కార్లు, ఒక ఆటో ధ్వంసం చేశాడు. అందులో కొన్ని వాహనాలకు నిప్పుపెట్టి తగులబెట్టాడు. ఇది గమనించిన బాధితులు జీడిమెట్ల పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు అంజన్‌గౌడ్‌పై కేసు నమోదు చేశారు. కాగా సదరు వ్యక్తితో ప్రవర్తనతో భయంగా ఉందని స్థానికులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇంట్లో పార్కు చేసిన ద్విచక్రవాహనాలు దగ్ధం



ఉప్పల్: బోనాల పండుగకు వెళ్లి వచ్చే సరికి ఇంట్లో పార్కు చేసిన ద్విచక్ర వానాలను గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేసిన సంఘటన రామంతాపూర్ ఇందిరానగర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన శ్రీనివాస్ ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి పాత బస్తీలో బోనాల పండుగకు బంధువుల ఇంటికి వెళ్లాడు. సోమవారం రాత్రి ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి ఆవరణలోకి చొరబడి దిచక్రవాహనాలకు నిప్పుపెట్టి దగ్ధం చేశారు. విషయం తెలుసుకున్న శ్రీనివాస్ ఇంటికి వచ్చి చూసి..ఉప్పల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీసీ ఫుటేజీలను పరిశీలించగా.. ఇద్దరు వ్యక్తులు కన్పించారని, వారిని పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

పదేళ్ల బాలికపై లైంగికదాడి

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలో మంగళవారం తెల్లవారు జామున దారుణం చోటు చేసుకుంది. ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఓ పదేళ్ల బాలికపై యువకుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. యాచకులైన ఇద్దరు దంపతులు తమ పదేళ్ల కుమార్తెతో కలిసి పట్టణంలోని ఫ్లైఓవర్ కింద తలదాచుకుంటున్నారు. గుజరాత్ రాష్ట్రం నుంచి ఇటీవల ఉపాధి కోసం వచ్చిన ఇర్ఫాన్ హుస్సేన్ మద్యం మత్తులో మంగళవారం తెల్లవారు జామున ఫ్లైఓవర్ వద్దకు వచ్చి..అక్కడ నిద్రిస్తున్న బాలికను పక్కకు తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. విషయం గమనించిన కొందరు స్థానికులు, తల్లిదండ్రులకు చెప్పగా..వారు పోలీసులకు సమాచారం అందించడంతో వెంటనే అతడిని అదుపులోకి తీసుకున్నారు. బాలికను వైద్యపరీక్షల నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాలరాజు తెలిపారు.

లారీ ఢీకొనడంతో పల్టీకొట్టిన కారు


లారీ ఢీకొట్టడంతో తలకిందులుగా పడిన కారు

మియాపూర్: జాతీయ రహదారిపై వేగంగా వచ్చిన లారీ వెనుక నుండి కారును ఢీకొట్టడంతో డివైడర్‌కు తాకి తలకిందులుగా పల్టీ కొట్టింది. ఈ ఘటనలో కారులో ఉన్న యువకుడికి గాయాలయ్యాయి. మియాపూర్ ఎస్ఐ చంద్రయ్య తెలిపిన వివరాల ప్రకారం.. చందానగర్‌లోని అపర్ణ హిల్ పార్క్‌లో నివాసం ఉంటున్న తన్మయ్ మియాపూర్ నుండి చందానగర్‌లోని తన ఇంటికి కారులో జాతీయ రహదారిపై వెళ్తున్నాడు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో మదీనాగూడ అంకుర్ ఆసుపత్రి వద్దకు రాగానే వెనుక నుండి చందానగర్ వైపు వస్తున్న లారీ వేగంగా వచ్చి కారును ఢీకొట్టింది. దీంతో కారు జాతీయ రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొని తలకిందులుగా పడిపోయింది. స్థానికులు వెంటనే స్పందించి కారులో ఉన్న తన్మయ్‌ను బయటకు తీసి సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు కారును రోడ్డుపై నుండి తొలగించారు. లారీ డ్రైవర్ రమేష్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని పోలీసులకు తన్మయ్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

బైకు ఢీకొని పారిశుధ్య కార్మికుడికి గాయాలు


చికిత్స పొందుతున్న ప్రసాద్

చందానగర్: విధి నిర్వహణలో ఉన్న ఓ పారిశుధ్య కార్మికుడిని ద్విచక్రవాహనం ఢీకొట్టింది. చందానగర్ సర్కిల్ 21 పరిధిలోని మదీనాగూడ జాతీయ రహదారిపైన ఉన్న సెంట్రల్ డివైడర్ వద్ద మంగళవారం ఉదయం పారిశుధ్య పనులు చేస్తున్న ప్రసాద్‌ను వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో గాయపడిన ప్రసాద్‌ను చికిత్స కోసం సమీపంలోని ఓ హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం సనత్‌నగర్‌లోని ఈఎస్ఐ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ నేతలు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు.

మోసపూరిత క్లెయిమ్‌లపై క్రిమినల్ చర్యలు


ఆనంద్ రాజేశ్వర్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

హిమాయత్‌నగర్ : పన్ను చెల్లింపుదారులు ఆదాయపు రిటర్న్ క్లెయిమ్‌లను మోసపూరితంగా పొందేందుకు ప్రయత్నిస్తే క్రిమినల్ చర్యలు తప్పవని రాష్ట్ర ఆదాయపు పన్ను(దర్యాప్తు) విభాగం డైరెక్టర్ జనరల్ ఆనంద్ రాజేశ్వర్ బయ్యార్ అన్నారు. మంగళవారం ఆనంద్ రాజేశ్వర్, ప్రిన్సిపల్ డైరెక్టర్ రాజగోపాల్ శర్మలతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ ప్రతినిధి బృందం సమావేశమైంది. ఈ సందర్భంగా ఆనంద్ రాజేశ్వర్ మాట్లాడుతూ తప్పుడు తగ్గింపులు, మినహాయింపులను క్లెయిమ్ చేయడం, రీఫండ్‌ల కోసం తప్పుడు పత్రాలు దాఖలు చేయడం శిక్షార్హమైన నేరమని పన్ను చెల్లింపుదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఆదాయపు పన్ను సెక్షన్లు 10(13ఏ), 80జిజిసి, 80ఈ, 80డీ, 80ఈఈ, 80ఈఈబి, 80జి, 80జిజిఎ, 80డీడీబీ కింద తగ్గింపుల దుర్వినియోగం ఎక్కువగా జరుగుతుందన్నారు. ఐటీఆర్ తప్పుడు క్లెయిమ్‌లు శిక్షార్హమైన నేరమని ఐటీ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో సీఏలు చంద్రశేఖర్ వేముల, పీవీ నారాయణ రావు, ఆశిష్ జోషి, అజయ్, సోమేశ్వర్, రామ్‌దేవ్ భుతాదా, హితేష్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ పేలి ద్విచక్రవాహనం దగ్ధం



కేపీహెచ్‌బీ: కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని మూడో రోడ్డులో రెండు ట్రాన్స్‌ఫార్మర్‌ల నడుమ చెలరేగిన మంటలతో ఓ ద్విచక్ర వాహనం దగ్ధమైంది. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో చోటుచేసుకున్న ఈ సంఘటనతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పార్క్ చేసిన ద్విచక్ర వాహనాల్లో ఒకటి మంటలకు ఆహుతి అయ్యింది. స్థానికులు వెంటనే కూకట్‌పల్లి ఫైర్ స్టేషన్,పోలీసులకు సమాచారం అందించారు. స్థానికులే మంటలను ఆర్పివేశారు. కేపీహెచ్‌బీ కాలనీ మూడో రోడ్డుతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో హాస్టళ్లు ఎక్కువగా ఉండటంతో ట్రాన్స్‌ఫార్మర్‌లు ఓవర్ లోడ్ కారణంగా మంటలు చెలరేగి ఉంటాయని స్థానికులు భావిస్తున్నారు..

మాంసాహారం విషతుల్యమై ఒకరి మృతి!

మరో 9 మందికి అస్వస్థత


అనంత శ్రీనివాస్ యాదవ్ (ఫైల్)

వనస్థలిపురం: బోనాల పండుగ వేళ ఓ ఇంటిలో విషాదం నెలకొంది. పండుగ సందర్భంగా వండుకున్న మాంసాహారం విషతుల్యమై ఒకరు మృతిచెందగా మరో 9 మంది ఆసుపత్రి పాలయ్యారు. ఈ సంఘటన వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీలో చోటుచేసుకుంది. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం ఫతేపురానికి చెందిన అనంత శ్రీనివాస్ యాదవ్ ఫలక్‌నుమా ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తూ భార్యా పిల్లలు, తల్లిదండ్రులతో కలిసి ఆర్టీసీ కాలనీలో నివాసం ఉంటున్నాడు. బోనాల సందర్భంగా బంధువులను పిలిచి..ఆదివారం రాత్రి బోటి, చికెన్ తీసుకువచ్చి ఇంట్లో వండుకుని కుటుంబ సభ్యులందరూ తిన్నారు. అదేరోజు రాత్రి వీరిలో కొందరికి విరోచనాలు కావడంతో తార్నాకలోని ఆస్పత్రికి వెళ్లి టాబ్లెట్లు తెచ్చుకుని వేసుకున్నారు. కాగా మంగళవారం శ్రీనివాస్ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో చింతలకుంటలోని ఓ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కాగా ఆదివారం రాత్రి శ్రీనివాస్ తండ్రి మాంసాహారం తినకపోవడంతో అతన్ని మినహాయించి మిగతా అందరూ అస్వస్థతకు గురై ప్రస్తుతం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో శ్రీనివాస్ తల్లి గౌరమ్మ, చిన్న కూతురు జస్మిత ఐసీయూలో ఉన్నారు. సోమవారమే ఇక్కడి నుంచి వెళ్లిపోయిన శ్రీనివాస్ అక్క చంద్రిక అస్వస్థతకు గురికాగా మహబూబ్‌నగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు బంధువులు తెలిపారు. వండుకున్న మాంసాహారంను ఫ్రిజ్‌లో పెట్టలేదని, ఏం జరిగిందో తెలియడం లేదని శ్రీనివాస్ బావ సంతోష్‌కుమార్ తెలిపారు.

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే అనుచరుడిపై కేసు

డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇప్పిస్తానని మోసం చేసినట్లు ఫిర్యాదు

జీడిమెట్ల: కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అనుచరుడు బొడిమిశెట్టి హరిబాబుపై జీడిమెట్ల పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ గిరినగర్‌కు చెందిన తైలం రమేష్ అనే వ్యక్తి 2023వ సంవత్సరంలో తనకు డబుల్‌బెడ్‌రూం ఇప్పించాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లాడు. ఈ క్రమంలో అక్కడే పనిచేస్తున్న హరిబాబు..రమేష్‌ను పరిచయం చేసుకుని తనకు రూ.లక్ష ఇస్తే డబుల్‌బెడ్‌రూం ఇల్లు ఇప్పిస్తానంటూ ఆశచూపగా..నమ్మిన రమేష్ రూ.లక్ష చెల్లించాడు. నెలలు గడచినా డబుల్‌బెడ్‌రూం ఇల్లు రాకపోవడంతో రమేష్ తన డబ్బులు తిరిగి ఇవ్వాలని హరిబాబును అడగగా ముఖం చాటేశాడు. ఈ విషయమై ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లగా ఇదే విధంగా హరిబాబు 80 మంది వద్ద డబ్బులు తీసుకుని మోసం చేసినట్లు తెలిసింది. దీంతో మోసపోయానని గ్రహించిన రమేష్ ఈ నెల 14న జీడిమెట్ల పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు హరిబాబుపై 318(4),351(2),(3) బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

విధుల్లో నిర్లక్ష్యం సహించేది లేదు

- వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలి
- ఇందిరమ్మ ఇళ్లు వేగంగా పూర్తి చేయాలి
- వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలి
- సమీక్ష సమావేశంలో కలెక్టర్ నారాయణరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: విధుల్లో నిర్లక్ష్య వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ సి. నారాయణరెడ్డి హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం వసతి గృహాల్లో మౌలిక సదుపాయలు, గురుకుల పాఠశాలల సమస్యలు, ఇందిరమ్మ ఇళ్ల పురోగతి, వనమహోత్సవంపై సంబంధిత అదికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మండల స్థాయిలో ప్రత్యేకాధికారులు క్షేత్ర స్థాయిలో తప్పనిసరి పర్యటించాలని అన్నారు. స్థానిక వసతి గృహాలు, గురుకుల విద్యాలయాల్లో మౌలిక వసతులు అందుతున్నాయో లేదో తెలుసుకొని ఆయా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలిగినా అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు. నిర్మాణ పురోగతిని బట్టి చెల్లించాల్సిన మొత్తాన్ని లబ్ధిదారులకు వెంటనే అందజేయాలన్నారు. వన మహోత్సవంలో భాగంగా శాఖల వారీగా ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో వంద శాతం మొక్కలు నాటాలని పేర్కొన్నారు. పెద్ద మొత్తంలో ఈత మొక్కలు పెంచేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్ఓ సంగీత, పీడీ హౌసింగ్ హనుమంతు నాయక్, డీపీఓ సురేష్ మోహన్, ఉద్యాన శాఖ అధికారి సురేష్, వ్యవసాయ శాఖ అధికారి ఉష, డీఈఓ సుశీందర్‌రావు, బీసీ సంక్షేమ శాఖ కేశూరాం, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రామారావు, గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామేశ్వరి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

వారాంతపు సంతను తొలగించాలి



శ్రీనగర్‌కాలనీ: రాజీవ్‌నగర్‌కాలనీ వారాంతపు సంత వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నామని, సంతను తొలగించాలని రాజీవ్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ వివేకానంద, ఈసీ మెంబర్ పట్నాయక్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సర్కిల్–19 డీఎంసీ రజనీకాంత్‌రెడ్డిని కలిసి మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. కూరగాయల వ్యర్థాలను అక్కడే పడేయడంతో దుర్వాసనతో పాటు ఆ వ్యర్థాల వల్ల రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. సంతను వీలుగా ఉన్న చోటుకు మళ్లించాలని కోరారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



కేటీఆర్‌తో మాగంటి వజ్రనాథ్

వెంగళరావునగర్/శ్రీనగర్‌కాలనీ: రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. బీఆర్ఎస్ జూబ్లీహిల్స్ నియోజకవర్గ నాయకులు మాగంటి వజ్రనాథ్ మంగళవారం కేటీఆర్‌ను కలిసి తన అభ్యర్థిత్వాన్ని వివరించారు. తనకు జూబ్లీహిల్స్ టికెట్ కేటాయిస్తే విజయం సాధిస్తామని అన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..ముందుగా నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను ఏకతాటిపై తీసుకురావాలని తెలియజేశారు. త్వరలో జరగనున్న ఉప ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అందరినీ కలుపుకుని పని చేయాలని సూచించారు.

సన్మానం

పంజగుట్ట: తెలంగాణ రాష్ట్ర ట్రాన్స్‌పోర్టు అథారిటీ సభ్యుడిగా నియామకమైన పెట్టం నవీన్‌ను సోమాజిగూడ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు నారికెళ్ల నరేశ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

ఖైరతాబాద్ @150



జోనల్ పరిధిలో డెంగీ హాట్‌స్పాట్‌ల గుర్తింపు

- అనుమానిత ప్రాంతాల్లో పిచికారీ చేస్తున్న సిబ్బంది
- తూతూమంత్రం చర్యలే అంటున్న బస్తీవాసులు
- మరోవైపు మురుగు, చెత్తతో విజృంభిస్తున్న దోమలు
- డెంగీ బారిన పలువురు బస్తీవాసులు

బంజారాహిల్స్: ఏటా లాగే ఈ వర్షాకాలంలోనూ దోమలు విజృంభించి డెంగీ కేసులు నమోదవుతున్నా జీహెచ్ఎంసీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగానే వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు మండిపడుతున్నారు. బస్తీల్లో పారిశుధ్య లోపంతో ఇప్పటికే పలువురు మలేరియా, టైఫాయిడ్‌తో మంచం బారిన పడ్డగా తాజాగా డెంగీ కేసులతో మరింత ఆందోళన చెందుతున్నారు. అయినా దోమల నివారణకు చర్యలు తీసుకోవాల్సిన జీహెచ్ఎంసీ ఎంటమాలజీ సిబ్బంది తూతూమంత్రంగా పిచికారీ చేస్తూ చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఈ ఏడాది మొత్తం డెంగీ హాట్‌స్పాట్‌లు 800 గుర్తించగా, ఇందులో జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ పరిధిలో 150 ప్రాంతాల్లో డెంగీ అనుమానిత కేసులు ఉన్నట్లు జీహెచ్ఎంసీ రికార్డులు వెల్లడిస్తున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో చార్మినార్ జోన్ తర్వాత ఖైరతాబాద్ జోన్ రెండో స్థానంలో ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

- జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ పరిధి కిందికి వచ్చే ఖైరతాబాద్ సర్కిల్–17 పరిధిలో సోమాజీగూడ, ఖైరతాబాద్, సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్లు ఉన్నాయి.
- జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధిలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్లు ఉన్నాయి.
- ఇదే జోనల్ పరిధి కిందికి కార్వాన్, మెహిదీపట్నం, గోషామహల్ సర్కిళ్లు కూడా వస్తాయి.



ఫిలింనగర్ వినాయకనగర్‌లో పిచికారీ చేస్తున్న ఎంటమాలజీ సిబ్బంది

- ప్రతిరోజూ ఆయా సర్కిళ్ల ఎంటమాలజీ సిబ్బంది బస్తీలకు వెళ్లి యాంటీ లార్వా పిచికారీ చేస్తున్నారు. అయితే అది కూడా తూతూమంత్రంగా చేపట్టి జారుకుంటున్నారని, దీంతో దోమల నివారణ సాధ్యపడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.
- ప్రతిరోజూ జీహెచ్ఎంసీ సర్కిల్ అధికారులు తమ పరిధిలో క్షేత్రస్థాయిలో పర్యటించి చెత్తాచెదారం నిల్వ లేకుండా చూడడంతో పాటు వ్యర్థాలు పేరుకుపోకుండా చర్యలు తీసుకుని దోమల నివారణకు పిచికారీ చేస్తున్నారో లేదో పరిశీలించాల్సి ఉంటుంది. అయితే ఇదెక్కడా అమలవుతున్నా సూచనలు కనిపించడం లేదు.
- పర్యవేక్షణ లోపంతోనే దోమలను కట్టడి చేయలేకపోతున్నారని, దీంతో బెడద మరింత తీవ్రమవుతుందని బస్తీవాసులు అంటున్నారు.
- 3 రోజుల క్రితం జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని కార్పొరేటర్ నివాసం ఉండే వినాయకనగర్ బస్తీలో రెండు డెంగీ కేసులు నమోదయ్యాయి.
- ఫిలింనగర్‌లోని బసవతారకనగర్ బస్తీలో పెద్ద ఎత్తున మురుగు పారుతూ దోమలు స్వైరవిహారం చేస్తుండగా దుర్వాసనతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజలు కూడా జాగ్రత్తలు తీసుకోవాలి

- తమ నివాస ప్రాంగణాల్లో దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవాలి.
- పాతబడ్డ డ్రమ్ములు, పాడుబడ్డ కుండలు, ఇతర పాత సామగ్రిని బయటపడేయాలి.
- కొబ్బరి చిప్పలు ఇంట్లో పెట్టుకోకుండా ఎప్పటికప్పుడు చెత్తలో పడేయాలి.
- అలాగే ఇంట్లో నీరు నిల్వ ఉండాకుండా చూసుకోవాలి.
- దోమలు ఎక్కువగా తిరిగే ప్రాంతాల్లో కొబ్బరి నూనెను చల్లడం ద్వారా చాలావరకు అరికట్టవచ్చు.
- డ్రైనేజీలు, మురుగు కాలువల నుంచి నీరు ముందుకువెళ్లేలా చర్యలు తీసుకోవాలి.
- సాయంత్రం 6 గంటలకే కిటికీలు, తలుపులు మూసేయడం ద్వారా దోమలు ఇంట్లోకి రాకుండా చూసుకోవచ్చు.
- సెప్టిక్ ట్యాంక్‌లపై బట్టలు అడ్డుగా పెట్టడం ద్వారా దోమలు బయటకు రాకుండా అరికట్టవచ్చు.
- ఇళ్లలోని చెత్తను ఎప్పటికప్పుడు చెత్త కుప్పల్లో పడేయాలి.
- జీహెచ్ఎంసీ ఎంటమాలజీ సిబ్బంది ఆ ప్రాంతానికి వచ్చినప్పుడు తమ నివాసాల ముందు, ప్రాంగణాల్లో దోమల నివారణ మందును పిచికారీ చేయించుకోవాలి.
- జీహెచ్ఎంసీ ఎంటమాలజీ సిబ్బంది కూడా నాలాలు, చెరువులు ఉన్నచోట గంబూషియా చేపలు వదలాలి.
- డోర్–టు–డోర్ సర్వే కోసం వచ్చే ఎంటమాలజీ సిబ్బందికి సహకరించి తమ ఇంటి పరిసరాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయించుకోవడంతో పాటు స్ప్రే కూడా చేయించుకోవాలి.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: కిలో టమాట రూ.43, నల్లవంకాయ.18, పొడుగు వంకాయ.18, బెండకాయ.45, పచ్చిమిర్చి.65, బజ్జీమిర్చి.70, క్యాప్సికం.65, పచ్చికాకరకాయ.23, పందిరిబీర.23, క్యాబేజీ.18, క్యారెట్.45, దొండకాయ.18, గుండు బీన్నీస్.55, గింజచిక్కుడు.55, కీర.18, దోసకాయ.16, బీట్‌రూట్.26, ఉల్లిగడ్డ.22, ఆలుగడ్డ.23, చామగడ్డ.28, మొరంగడ్డ.28, క్యాలీఫ్లవర్.23, ముల్లంగి.4–5, ఉల్లిపొరక.28. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

ఆకట్టుకుంటున్న దుస్తుల ప్రదర్శన



బంజారాహిల్స్: తాజ్‌కృష్ణా హోటల్ ఎదురుగా ఉన్న లేబుల్స్ ది పాప్ అప్ స్పేస్‌లో ఏర్పాటుచేసిన దుస్తుల ప్రదర్శన ఆకట్టుకుంటున్నది. 'దివాస్ స్టోరీ ఆఫ్ కాటన్' పేరుతో ఏర్పాటుచేసిన ఈ ప్రదర్శన ఈనెల 23 వరకు కొనసాగుతుందని మేనేజర్ ఖుస్బూ గిరీష్ గిద్వానీ తెలిపారు. దేశవ్యాప్తంగా చేనేత కళాకారుల చేతుల్లో రూపుదిద్దుకున్న హ్యాండ్ బ్లాక్ ముద్రణలు, సహజమైన లెనెన్, కాటన్ పదార్థాలతో రూపొందించిన రంగుల మేళవింపుతో కూడిన డిజైన్లు ఆకట్టుకుంటున్నాయి. చేతి పనులు, మిర్రర్ వర్క్, స్టోన్ వర్క్‌లు ప్రత్యేకతను సంతరించుకుంటున్నాయి.

సమస్యలపై పోరాటాలు చేసి విజయం సాధించాలి



మాట్లాడుతున్న వెంకటేష్

వెంగళరావునగర్: నూతన కమిటీ సభ్యులు సమస్యలపై పోరాటాలు చేసి విజయాలు సాధించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్ తెలియజేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని శిశువిహార్ ఆయాలతో మంగళవారం ప్రత్యేక సమావేశం జరిగింది. తొలుత శిశువిహార్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. ఐదునెలలుగా శిశువిహార్ ఆయాలకు జీతాలు ఇవ్వకుండా పనులు చేయిస్తున్న మేనేజ్‌మెంట్ మొండి వైఖరికి వ్యతిరేకంగా పోరాటాలు చేయాలన్నారు. అనంతరం శిశువిహార్ నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా వెంకటేష్, కార్యదర్శిగా సుశీల, కోశాధికారిగా శ్యామలీల, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాపర్తి అశోక్, ఉపాధ్యక్షులుగా మంగ, ఆదిలక్ష్మి, సహాయ కార్యదర్శిగా కవిత, రాజేశ్వరి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జయశ్రీ, పద్మ, నరసమ్మ, సునీత, సక్కుబాయి, హేమలత, లక్ష్మి ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కుమార్, కె.ఈశ్వర్‌రావు పాల్గొన్నారు.

సూత్ర ఫ్యాషన్ ఎగ్జిబిషన్ షురూ



లక్డీకాపూల్: ఇండియన్ ఫ్యాషన్ ఎగ్జిబిషన్ సూత్ర.. ప్రత్యేక సంప్రదాయ వస్త్ర ప్రదర్శన తాజ్ కృష్ణా హోటల్‌లో మంగళవారం ప్రారంభమైంది. ఈనెల 24 వరకు కొనసాగే ప్రదర్శనలో శ్రావణ మాసంలో వచ్చే శుక్రవారాలు, వరలక్ష్మీ వ్రతం, రాఖీ వేడుకల కోసం దేశంలోని ప్రముఖ ఫ్యాషన్, సంప్రదాయత కలబోసిన ప్రత్యేక వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు. అంతేగాకుండా ఫ్యాషన్ ఉపకరణాలు, ఆభరణాలు, అలంకరణ సామగ్రి, గిఫ్ట్ ఆర్టికల్స్, గృహాలంకరణ బ్రాండ్‌ల శ్రేణిని ప్రదర్శిస్తుందన్నారు. మైసూర్ శారీ ఉద్యోగ్–సమకాలీన శైలితో కలకాలం నిలిచే లెగసీ–రిచ్ చీరలు, మోడీ జ్యువెలర్స్–పండుగ సందర్భాలకు అనువైన ఆభరణాలు, ఉష్వి–పండుగలకు ప్రత్యేకం, హియా క్రియేషన్–ఇండో–వెస్ట్రన్ శైలి దుస్తులు, వీపీజీ జ్యువెలరీ ప్యూర్ గోల్డ్– స్వచ్ఛత నిండిన బంగారు ఆభరణాలు, అనురాగ్ గోల్డ్ జ్యువెలరీ–సంప్రదాయం ఆధునికత జోడించిన డిజైన్లు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి.

బోనాల ఫ్లెక్సీల తొలగింపు



కేబీఆర్ పార్కు చౌరస్తాలో ఫ్లెక్సీ తొలగిస్తున్న సిబ్బంది

బంజారాహిల్స్: బోనాలను పురస్కరించుకుని పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద జూబ్లీహిల్స్, పంజగుట్ట, సోమాజీగూడ, కృష్ణానగర్, శ్రీనగర్‌కాలనీ, అమీర్‌పేట, ఖైరతాబాద్, చింతల్‌బస్తీ, లక్డీకాపూల్, మాసబ్‌ట్యాంక్, ఫిలింనగర్ ప్రాంతాల్లో పోటాపోటీగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలతో పాదచారులు, సందర్శకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే వీటిని తొలగించాలని పలువురు ఎక్స్ వేదికగా జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేశారు. నిబంధనల ప్రకారం ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన మరుసటి రోజు లేదా ఆ తెల్లవారి వాటిని తొలగించాల్సి ఉంటుంది. ఖైరతాబాద్‌లో మాత్రం వారం పది రోజులు గడిచినా వాటిని తొలగించడానికి జీహెచ్ఎంసీ సాహసించలేదు. తాజాగా సోమవారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు చౌరస్తా వద్ద ఓ ఫ్లెక్సీని తొలగించేందుకు సంబంధిత ఏజెన్సీ సిబ్బంది వచ్చారు. ఫ్రీలెఫ్ట్‌లో అడ్డంగా బారికేడ్ పెట్టి వాహనాలు ఆపి బ్యానర్, కర్రలు, జెండాలను తొలగించారు. దీంతో ఫ్రీలెఫ్ట్ మొత్తం ట్రాఫిక్‌తో స్తంభించిపోయింది. కేబీఆర్ పార్కు చౌరస్తాలో ఫ్లెక్సీలు ఏర్పాటుచేయకుండా నియంత్రించాలంటూ వాకర్స్‌తో పాటు సందర్శకులు కొన్నేళ్లుగా ఫ్లెక్సీ రహిత కేబీఆర్‌ను ఏర్పాటు చేయాలని సోషల్ మీడియాలో ఫిర్యాదు చేస్తున్నారు. అయినా సిబ్బంది ఇదేమీ పట్టించుకోవడం లేదు. దీని ప్రభావం పాదచారులు, వాహనదారులపై పడుతోంది.

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు



రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12లోని వెంకటేశ్వర కో–ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఎమ్మెల్యే కాలనీలో ప్లాట్‌నంబర్ 224/ఏ యజమాని రోడ్డును ఆక్రమించి ప్రహరీ నిర్మిస్తున్నారని సొసైటీ అధ్యక్షుడు టి.నారాయణరెడ్డి జీహెచ్ఎంసీ సర్కిల్–18 డీసీ సమ్మయ్యకు ఫిర్యాదు చేశారు. సదరు యజమాని కొంతకాలంగా లేఅవుట్ నిబంధనలు ఉల్లంఘించి అనుమతుల్లేకుండానే నిర్మాణాలు చేపడుతున్నారని, దీంతో రోడ్డు కుచించుకుపోతుందని వెంటనే తొలగించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పార్క్ చేసిన ద్విచక్ర వాహనం అపహరణ

వెంగళరావునగర్: పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం మాయమైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..రహమత్‌నగర్‌కు చెందిన కె.నీలాచలం ప్రింటర్‌గా పని చేస్తుంటాడు. ఈనెల 20న రాత్రి తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పార్క్ చేశాడు. ఉదయం వచ్చి చూడగా కనిపించలేదు. చుట్టుపక్కల విచారించినప్పటికీ ఫలితం లేదు. దీంతో మంగళవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

హిమాయత్‌నగర్: నారాయణగూడలోని బాబూ జగ్జీవన్ రామ్ (బీజేఆర్) ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఖాళీగా ఉన్న 34 అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.ఎం.విజయ్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీబీఏ, బీబీఏ రిటైల్, బయో టెక్నాలజీ, బోటనీ, కంప్యూటర్ సైన్స్, మైక్రో బయోలజీ, ఫిజిక్స్, పొలిటికల్ సైన్స్, కామర్స్, న్యూట్రిషన్, అరబిక్ ఇంగ్లిష్, గణితం, సంస్కృతం, స్టాటిస్టిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ తదితర విభాగాల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. పీజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలని నెట్, సెట్, నీట్, పీహెచ్‌డీ వంటి అదనపు విద్యార్హతలు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 24న సాయంత్రం 5 గంటల్లోపు బయోడేటాను కాలేజీ కార్యాలయంలో అందించాలని కోరారు. అలాగే 25న ఉదయం 10 గంటలకు ఖైరతాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జరిగే ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

కస్టడీ నుంచి తప్పించుకునేందుకు యత్నించిన యువకుడిపై మరో కేసు

వెంగళరావునగర్: కస్టడీ నుంచి తప్పించుకోవడానికి యత్నించిన యువకుడిపై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం..షాహీన్‌నగర్‌కు చెందిన షేక్ ఇబ్రహీం బిన్ హసన్ అనే యువకుడిని ఇటీవల కేసు విషయంలో మధురానగర్ పీఎస్‌కు తీసుకువచ్చారు. విచారణలో భాగంగా అతనిని స్టేషన్‌లో ఉంచి ఏఎస్ఐ టోనీ మార్టిన్ ఇంటికి వెళుతున్నాడు. అతనికి కాపలాగా కానిస్టేబుల్స్ ఉన్నారు. ఈ క్రమంలో హసన్ స్టేషన్‌లో గందరగోళం సృష్టించి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. దీంతో పోలీసులు అతనిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

హోటల్ యజమానిని చంపేస్తానని బెదిరింపు..కేసు నమోదు

వెంగళరావునగర్: హోటల్ యజమానిని చంపేస్తానని బెదిరించిన వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం..కూకట్‌పల్లికి చెందిన లలిత్‌కుమార్ వెంగళరావునగర్ ప్రధాన రహదారిలో హోటల్ నిర్వహిస్తున్నాడు. ఈనెల 20న గుర్తుతెలియని వ్యక్తి మద్యం సేవించి వచ్చి హోటల్‌లో అల్లకల్లోలం సృష్టించాడు. సిబ్బందిని, కస్టమర్స్‌ను బెదిరించాడు. దీంతో యజమాని లలిత్‌కుమార్ మధురానగర్ పోలీసులకు తెలియజేశాడు. విషయం తెలుసుకున్న సదరు వ్యక్తి హోటల్ యజమానికి ఫోన్ చేసి తనకు రాజకీయ పలుకుబడి ఉందని, హత్య చేస్తానని బెదిరిస్తున్నాడు. మంగళవారం బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోడ్రైవర్ ఆత్మహత్య



విమల్ కుమార్

ఖైరతాబాద్: ఆటోడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలబస్తీలో నివాసముండే పులి విమల్ కుమార్ (55) ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడగా విమల్ కుమార్‌ను బంధువులు వెంటనే మహావీర్ హాస్పిటల్‌కు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం అనంతరం పోలీసులు మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బోనమెత్తిన బస్తీలు



ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని పలు బస్తీల్లో మంగళవారం బోనాల సందడి నెలకొన్నది. మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలతో తరలివచ్చి అమ్మవార్లకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్, బీఆర్ఎస్ ఖైరతాబాద్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఫిలింనగర్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



వినాయకనగర్‌లో వేడుకల్లో ఎమ్మెల్యే దానం నాగేందర్



ఫిలింనగర్‌లో జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెంకటేశ్

ఖైరతాబాద్ యాదవ సంఘం ఆధ్వర్యంలో..

ఖైరతాబాద్: ఖైరతాబాద్ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఐమాక్స్ ఎదుట గల లేక్‌వ్యూ పార్క్‌లో గల గాలి నల్ల పోచమ్మ, కట్టమైసమ్మ ఆలయాల్లో బోనాల ఉత్సవాలు నిర్వహించారు. ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, బీఆర్ఎస్ నేత, సోమాజిగూడ కార్పొరేటర్ జి.కృష్ణ యాదవ్ హాజరయ్యారు. ఖైరతాబాద్ యాదవ సంఘం కార్యాలయం నుంచి పోతరాజుల విన్యాసాలు, బోనాలతో కళాకారుల నృత్యాలు, కోలాటాలతో ఖైరతాబాద్ లైబ్రరీ చౌరస్తాలోని మహాగణపతి ప్రాంగణం మీదుగా అమ్మవారి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఖైరతాబాద్ యాదవ సంఘం అధ్యక్షుడు కుమార్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పాండు యాదవ్, యాదయ్య యాదవ్, మారయ్య యాదవ్, లక్ష్మణ్ యాదవ్, మహేందర్ బాబు, మహేశ్‌యాదవ్, మధుకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



పోతరాజుల విన్యాసాలు



వినాయకనగర్‌లో..



దుర్గా భవానీనగర్ బస్తీలో..



లేక్ వ్యూ పార్క్‌లో యాదవ సంఘం సభ్యులు

ఎన్‌హెచ్‌ఆర్‌సీఐ తెలంగాణ సెక్రటరీగా శ్రీకాంత్ గుప్తా..



శ్రీకాంత్ గుప్తాకు నియామకపత్రం అందజేస్తున్న బండారు దత్తాత్రేయ

సనత్‌నగర్: నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఆర్‌సీఐ) తెలంగాణ రాష్ట్ర సెక్రటరీగా సనత్‌నగర్‌కు చెందిన వాడకట్టు శ్రీకాంత్ గుప్తా నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు కటకం శ్రీనివాస్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు శ్రీకాంత్‌గుప్తాకు శుభాకాంక్షలు తెలిపారు. మానవ హక్కుల పరిరక్షణకు అలుపెరగని పోరాటం చేస్తానన్నారు. హక్కులకు భంగం వాటిల్లేలా ఎవరైనా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలకు సిఫారసు చేసి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. తనపై నమ్మకం ఉంచి ఎన్‌హెచ్‌ఆర్‌సీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి బాధ్యతలు అప్పగించినందుకు కటకం శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పర్యావరణంపై విద్యార్థులకు క్విజ్ పోటీలు



సాక్షి, సిటీబ్యూరో: మొక్కలు నాటడం, నీటి సంరక్షణ పద్ధతులు, వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలపై నేషనల్ స్టూడెంట్ పర్యావరణ్ క్విజ్ కాంపిటేషన్ నిర్వహిస్తున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి సీనియర్ సైంటిస్టు ప్రసన్నకుమార్ తెలిపారు. విద్యార్థులు, యువతలో వాతావరణ మార్పులు, పర్యవసానాల నుంచి రక్షణ, పర్యావరణ నైపుణ్యాలు, జీవన శైలిని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్‌లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు. ఒకటో తరగతి నుంచి పరిశోధన విద్యార్థుల వరకు ఐదు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎకోమిత్ర యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఇందుకు ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేదన్నారు. మొక్కలు నాటుతున్న, నీటిని పొదుపు చేస్తున్న, వ్యర్థాలను వేరు చేస్తున్న సెల్ఫీ ఫొటోలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. పాల్గొన్న ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. వివరాలకు https://ecomitram.app/nspc వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

ఘనంగా దాశరథి శత జయంతి వేడుకలు



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో దాశరథి కృష్ణమాచార్య శతజయంతి ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం తెలుగుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రొ.కమలాకర శర్మ అధ్యక్షత వహించగా ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై దశరథి రచనలపై మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ.కాశీం, డా.విజయల లక్ష్మీ, డా.రఘు, మహేందర్, చంద్రయ్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ కృష్ణా హోటల్‌లో సూత్ర ఇండియన్ ఫ్యాషన్ ఎగ్జిబిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రావణ మాస వరలక్ష్మి వ్రతం, రాఖీ పండుగ సందర్భంగా ప్రత్యేక వస్త్ర ప్రదర్శన ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో హైలైఫ్ ఎగ్జిబిషన్ ఉదయం 11 గంటల రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో అధ్యాపకులు గీసిన చిత్రాలతో కూడిన మేనేజ్ చేద్దాం చిత్ర ప్రదర్శన ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమగమంలో ఉదయం 10గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్ జరుగుతుంది
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

నవీద్ చిక్కింది నగరంలోనే!

- ముంబై రైలు పేలుళ్లకు హైదరాబాద్‌తో లింకు
- నేరేడ్‌మెట్‌లో 2006 సెప్టెంబర్ 29న అరెస్టు
- 2015లో దోషిగా నిర్ధారించిన మోకా కోర్టు
- తాజాగా నిర్దోషిగా పేర్కొన్న బాంబే హైకోర్టు



నవీద్ (ఫైల్)



ముంబైలో ధ్వంసమైన రైలు (ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో: ముంబై సబర్బన్ రైళ్లలో 2006లో చోటు చేసుకున్న వరుస పేలుళ్ల (7/11 ఎటాక్స్) కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో 12 మందిని దోషులుగా తేల్చిన అక్కడి మోకా కోర్టు 2015 సెప్టెంబర్‌లో వారికి ఉరి, యావజ్జీవ శిక్షలు విధించింది. తాజాగా బాంబే హైకోర్టు వీరిని నిర్దోషులుగా ప్రకటిస్తూ సోమవారం తీర్పు ఇచ్చింది. దేశ వ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించిన ఈ కేసుతో సిటీకి లింకు ఉంది. నాడు ఉరిశిక్ష పడిన, నేడు నిర్దోషిగా తేలిన వారిలో ఒకడైన నవీద్ హుస్సేన్ పట్టుబడింది నగరంలోని నేరేడ్‌మెట్ ప్రాంతంలోనే. 2006 సెప్టెంబర్ 29న ముంబై నుంచి వచ్చిన యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) ప్రత్యేక బృందం హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసుల సాయంతో ఇతడిని అరెస్టు చేసింది.

పుట్టింది దుబాయ్...పెరిగింది మిరా రోడ్..

నవీద్ హుస్సేన్ ఖాన్ రషీద్ తండ్రి హుస్సేన్ ముంబైకి చెందిన వ్యక్తి. వృత్తిరీత్యా కువైట్‌కు వెళ్లిన అతను అక్కడే పాకిస్థాన్‌కు చెందిన మహిళను వివాహం చేసుకున్నట్లు ఏటీఎస్ చెబుతోంది. నవీద్ కువైట్‌లోనే పుట్టినప్పటికీ తల్లి మరణానంతరం ముంబైలోని మీరా రోడ్ ప్రాంతానికి వచ్చి స్థిరపడ్డారు. హుస్సేన్ ఇప్పటికీ కువైట్‌లోనే పని చేస్తున్నాడు. మీరా రోడ్‌లోని తన ఫ్లాట్‌కు సమీపంలో ఉండే ఫైజల్ షేక్ ద్వారా నవీద్ పేలుళ్ల కుట్రలో భాగస్వామిగా మారాడు. ముంబై లోకల్ రైళ్లల్లో పేలుళ్లకు అవసరమైన ఆర్థిక సహకారం ఫైజల్ అందించాడు. వృత్తిరీత్యా కాల్ సెంటర్ ఉద్యోగి అయిన నవీద్ హైదరాబాద్‌కు వచ్చి కొన్నాళ్లు నివసించాడు.

నేరేడ్‌మెట్‌లో నివాసం అమీర్‌పేట్‌లో ఉద్యోగం...

ఇతగాడు 2004లో నగరానికి వచ్చి నేరేడ్‌మెట్‌లో నివాసం ఏర్పాటు చేసుకున్నాడు. అమీర్‌పేట్‌లోని ఓ సంస్థలో ఉద్యోగం చేశాడు. ఇక్కడ ఉంటూనే ముష్కరులతో సంబంధాలు కొనసాగించడంతో పాటు ముంబై రైళ్లల్లో పేలుళ్లకు కుట్ర పన్నుతూ అక్కడ ఏర్పాటు చేసిన తొలి సమావేశంలోనూ పాల్గొన్నాడని ఏటీఎస్ ఆరోపించింది. రైళ్లల్లో పేలుళ్లకు వినియోగించిన ప్రెషర్ కుక్కర్ బాంబులను ఇదే కేసులో నిందితుడిగా ఉన్న ముంబై వాసి మహ్మద్ అలీ ఇంట్లోనే తయారు చేశారన్నది ఏటీఎస్ ఆరోపణ. వీటి తయారీలోనూ నవీద్ కీలక పాత్ర పోషించాడని అధికారులు అభియోగాలు మోపారు. కుట్రకు నాంది పడిన నాటి నుంచి పేలుళ్లు జరిగే వరకు పలుమార్లు హైదరాబాద్ నుంచి ముంబైకి వెళ్లి వచ్చాడని ఏటీఎస్ పేర్కొంది. 2006 జూలై 11న వరుస పేలుళ్లలో భాగంగా బాంద్రా రైల్వేస్టేషన్‌లోని రైల్లో పేలిన బాంబును నవీదే పెట్టినట్లు అభియోగాలు మోపారు. నిషిద్ధ ఉగ్రవాద సంస్థలైన లష్కరే తొయిబా (ఎల్ఈటీ), స్టూడెంట్స్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా (సిమి)తోనూ నవీద్‌కు సంబంధాలున్నాయని ఏటీఎస్ ఆరోపించింది.

లేక్ షోర్ టవర్స్‌లో అరెస్టు...

2006 జూలై 11న జరిగిన ఈ పేలుళ్లకు సంబంధించి ముంబై ఏటీఎస్ అధికారులు ఆ ఏడాది సెప్టెంబర్ 28న తొలిసారిగా నలుగురు నిందితులను అరెస్టు చేశారు. వీరి విచారణలో నవీద్ పాత్ర, అప్పటి నివాసం తదితరాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో అక్కడ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం టాస్క్‌ఫోర్స్ అధికారుల సాయంతో అదే నెల 29న నేరేడ్‌మెట్‌లో నవీద్ నివసిస్తున్న లేక్ షోర్ టవర్స్ అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌లోని గదిపై దాడి చేశారు. నవీద్‌తో పాటు అతడి సహోద్యోగి తమిళనాడుకు చెందిన స్వస్తిక్ చంద్రశేఖర్, మరో యువతిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం మిగిలిన ఇద్దరినీ వదిలేసిన ఏటీఎస్ అధికారులు నవీద్‌ను ముంబై తరలించారు. తన ఉనికి బయటపడకుండా ఉండేందుకు నవీద్ పేలుళ్ల తర్వాత తన సెల్‌ఫోన్‌ను పూర్తిగా స్విచ్చాఫ్‌లో ఉంచినట్లు ఏటీఎస్ పేర్కొంది. తొమ్మిదేళ్ల సుదీర్ఘ విచారణ అనంతరం ముంబైలోని మోకా కోర్టు నవీద్ సహా 12 మందికి 2015లో శిక్ష విధించింది. ఇతడితో సహా ఐదుగురిని ఉరిశిక్ష పడగా... మిగిలిన ఏడుగురికీ యావజ్జీవ శిక్షపడింది. ఇప్పుడు ఈ 12 మందినీ ముంబై హైకోర్టు నిర్దోషులుగా పేర్కొంది.

విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాటం



మాట్లాడుతున్న అధ్యక్షులు ఆరేపల్లి మోహన్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామని తెలంగాణ విద్యుత్ ఎస్సీ , ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ప్రభుత్వ విప్ ఆరేపల్లి మోహన్ అన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆరేపల్లి మోహన్ మాట్లాడుతూ... రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ అందించిన బోధించు, సమీకరించు, పోరాడు అనే సిద్ధాంతంతో తమ సంఘం పని చేస్తుందన్నారు. అంబేడ్కర్ వాదులు ఆపదలో ఉన్నవారికి అండగా ఉండాలన్నారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్ మాట్లాడుతూ... ఎస్సీ , ఎస్టీ ఉద్యోగులకు కమిషన్ అండగా ఉంటుందన్నారు. ఉద్యోగ నియమాకాల్లో బదిలీలు ,ప్రమోషన్లలో ఎస్సీ, ఎస్టీ లకు అన్యాయం జరిగితే సహించబోమన్నారు. డీపీఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ మాట్లాడుతూ...రిజర్వేషన్ల ద్వారా ఉద్యోగం పొందిన వారు సమాజంలో మార్పునకు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షులు రౌతు రమేష్, ఆరేపల్లి శ్రీనివాస్ , బక్క దానయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటిని ఎనుకున్నారు.

నూతన కమిటీ ఎన్నిక.....

తెలంగాణ విద్యుత్ ఎస్సీ , ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా ఆరేపల్లి మోహన్, గౌరవ అధ్యక్షుడిగా మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా బక్క దానయ్య ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్‌పిడిసిఎల్ కంపెనీ అధ్యక్షుడిగా పి. రామస్వామి, కార్యదర్శిగా ఆరేపల్లి శ్రీనివాస్ ఎంపికయ్యారు. గతంలో ప్రధాన కార్యదర్శిగా ఉన్న మాతంగి శ్రీనివాస్‌ను తొలగిస్తున్నట్లు ప్రకటించారు.

కాంట్రాక్టు పోస్టులకు 870 దరఖాస్తులు



గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ, ఆస్పత్రుల్లో వివిధ హోదాల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు 870 మంది దరఖాస్తు చేసుకున్నారు. గాంధీలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ట్యూటర్, సీనియర్ రెసిడెంట్లు, సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. బయోకెమిస్ట్రీ, మైక్రోబయోలజీ విభాగాల్లో రెండు ప్రొఫెసర్ పోస్టులు, 72 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 6 ట్యూటర్, 70 సీనియర్ రెసిడెంట్లు, 10 సివిల్ అసిస్టెంట్ సర్జన్ మొత్తం 160 పోస్టుల నియామకానికి ఈనెల 14న నోటిఫికేషన్ జారీ చేయగా, ఈనెల 15 నుంచి 22 వరకు దరఖాస్తులు స్వీకరించారు. ఆఖరి రోజైన మంగళవారం పెద్దసంఖ్యలో అభ్యర్థులు దరఖాస్తులు అందజేశారు. ఆయా పోస్టులకు మొత్తం 870 మంది దరఖాస్తు చేసుకున్నట్లు గాంధీ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర, వైస్ ప్రిన్సిపాల్ రవిశేఖరరావు, ఆఫీస్ సూపరింటెండెంట్ సుబ్బారావు తెలిపారు. ఈనెల 23 నుంచి 26 వరకు దరఖాస్తుల పరిశీలన, 28న మెరిట్ లిస్ట్ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతారు. 29, 30 తేదీల్లో అభ్యంతరాలను స్వీకరిస్తారు. ఆగస్టు 1న ఫైనల్ మెరిట్ లిస్ట్ ప్రకటిస్తారు. ఆగస్టు 2, 3 తేదీల్లో ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఫైనల్ మెరిట్ లిస్ట్ అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించి ఆగస్టు 4న నియామకపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు.

'దివ్యాంగులు, చేయూత పింఛన్లు పెంచాలి'



మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

పంజగుట్ట: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగుల, ఇతర చేయూత పింఛన్లు పెంచాలని లేని పక్షంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలని ఎమ్మార్పీఎస్, వికలాంగుల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ అన్నారు. రేవంత్ రెడ్డికి పింఛన్ల సమస్య రాజకీయ ఉరితాడులా మారకముందే నిర్ణయం తీసుకోవాలన్నారు. లక్షలాది మంది దివ్యాంగులు, అన్ని రకాల చేయూత పింఛన్‌దారులతో ఆగస్టు 13న ఎల్‌బీ స్టేడియంలో వికలాంగ, చేయూత పింఛనర్ల గర్జన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. వికలాంగులకు, వృద్ధాప్య, ఒంటరి మహిళలకు, కిడ్నీ బాధితులకు అధికారంలోకి రాగానే పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చి 20 నెలలు గడుస్తున్నా ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. జూన్ నెల పింఛన్లు ఇంకా ఇవ్వలేదని, ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు 1వ తేదీనే జీతాలు తీసుకుంటున్నారన్నారు. గత ఐదేళ్లుగా సుమారు 5 లక్షల మంది పింఛన్ కోసం దరఖాస్తులు చేసుకున్నారని వారికి వెంటనే పింఛన్లు మంజూరు చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అందె రాంబాబు, నాగభూషణం, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

'దాశరథికి సరైన గౌరవం దక్కలేదు'

నాంపల్లి: దాశరథి గొప్ప కవి అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. మంగళవారం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో తెలుగు విశ్వవిద్యాలయ సమావేశ మందిరంలో దాశరథి శత జయంతి వేడుకలు జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కవిత మాట్లాడుతూ దాశరథి శత జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించకపోవడం దారుణమన్నారు. దాశరథికి కాంగ్రెస్ ప్రభుత్వం సరైన గౌరవం ఇవ్వకపోయినా కవిగా గౌరవించుకోవడం మన కర్తవ్యంగా భావించి ఈ సభను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దాశరథి కుమారుడు లక్ష్మణ్ కార్యక్రమానికి హాజరుకావడం సంతోషంగా ఉందన్నారు. సీనియర్ జర్నలిస్టు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ... దాశరథి ఉపన్యాసాలు వినే అవకాశం తనకు దొరికిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఆస్థాన పదవులు రద్దు చేస్తే దాశరథి పదవి పోయిందని, తెలుగు వారి ఆత్మ గౌరవం పేరుతో పార్టీ పెట్టిన ఎన్టీఆర్ దాశరథి ఆత్మ గౌరవాన్ని దెబ్బతీశారన్నారు. 1949లో తెలంగాణ తల్లి అనే పదం వాడింది దాశరథేనని చెప్పారు. దాశరథి శత జయంతి ఉత్సవాలకు కవిత చొరవ తీసుకోవడం అభినందనీయమన్నారు.

చట్టబద్ధమైన రిజర్వేషన్లు కావాలి...

బీసీలకు పార్టీపరమైన రిజర్వేషన్లు అక్కర్లేదని, ఈ రిజర్వేషన్లను ప్రజలు కోరుకోవడం లేదని, చట్టబద్ధంగా, రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లు కావాలని ఎమ్మెల్సీ కవిత అన్నారు. దాశరథి శత జయంతి వేడుకల అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. బీసీ బిల్లును రాష్ట్రపతి దగ్గర పెండింగ్‌లో పెట్టారని విమర్శించారు. కేంద్రం బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వకుండా మతపరమైన రంగును పులిమే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. గుజరాత్‌లో ఎలాంటి రిజర్వేషన్లు ఇచ్చారో అదే తరహాలో తెలంగాణలోనూ ఇవ్వాలని కోరారు. కోర్టులో పెండింగ్‌లో ఉందని బీసీలను రిజర్వేషన్లకు దూరం చేయవద్దని విజ్ఞప్తి చేశారు.

జోరు వానలో..చిమ్మ చీకట్లో..

హాస్టల్ కోసం నిజాం కళాశాల విద్యార్థినుల ధర్నా

గన్‌ఫౌండ్రీ: విద్యా సంవత్సరం ప్రారంభమై 20 రోజులు గడిచినా హాస్టల్ వసతి కల్పించకపోవడంపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు హాస్టల్ వసతి కల్పించాలని కోరుతూ..... మంగళవారం బషీర్‌బాగ్‌లోని నిజాం కళాశాల విద్యార్థినిలు ఆందోళనకు దిగారు. వర్షంలో, చీకట్లోనే తమ ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు మాట్లాడుతూ.... కళాశాల ప్రిన్సిపాల్ మెస్‌చార్జీలు వసూలు చేసినా హాస్టల్ ఓపెన్ చేయడం లేదని ఆరోపించారు. డిగ్రీ 3, 2వ సంవత్సరాలకు చెందిన విద్యార్థినులకు హాస్టల్ వసతి కల్పించాలని కోరారు. రెండురోజుల క్రితం హాస్టల్ ఓపెన్ చేస్తామని చెప్పడంతో తాము లగేజ్ తీసుకొని వచ్చామని కానీ హాస్టల్ తెరవక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. తమకు హాస్టల్ వసతి కల్పించాలని ప్రిన్సిపాల్‌ను కోరినా ఆయన స్పందించకపోవడం దారుణమన్నారు. హాస్టల్ తెరిచేంతవరకు తమ పోరాటం ఆగదని భీష్మించుకున్నారు. వర్షం పడుతున్నా చీకట్లోనే సెల్‌ఫోన్ టార్చ్‌లైట్లు ఆన్ చేసుకుని నిరసన కొనసాగిస్తున్నారు.



ప్రొఫెసర్ కుంభం మధుసూదన్‌రెడ్డి కన్నుమూత

- ఆల్‌ఇండియా పొలిటికల్‌సైన్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సేవలు
- బుధవారం ఉదయం మహాప్రస్థానంలో అంత్యక్రియలు



ప్రొ.మధుసూదన్ రెడ్డి(ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో/ ఉస్మానియా యూనివర్సిటీ : ఉస్మానియా విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్ర అధ్యాపకులు, ఆర్ట్స్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రొఫెసర్ కుంభం మధుసూదన్ రెడ్డి(90) మంగళవారం ఉదయం నారాయణగూడ వైఎంసీఏలోని తన స్వగృహంలో కన్నుమూశారు. ఆయన నల్లగొండ జిల్లా, మర్రిగూడ మండలం, శివన్న గూడెం గ్రామానికి చెందిన చిన్న శివారెడ్డి, రంగనాయకమ్మ దంపతులకు 1935 ఆగస్టు 15న జన్మించారు. ఆయన ప్రాథమిక విద్యాభ్యాసం శివన్నగూడెంలో, ఇంటర్మీడియట్ హైదరాబాద్ వి.వి.కళాశాలలో, డిగ్రీ నిజాం కళాశాలలో, ఎం.ఏ పొలిటికల్ సైన్స్ ఆర్ట్స్ కళాశాలలో పూర్తి చేశారు.ఆయనకు భార్య విమల, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆయన అల్లుడు జస్టిస్ అభిషేక్ రెడ్డి పాట్నా హైకోర్టు న్యాయమూర్తి పనిచేస్తున్నారు. ప్రొఫెసర్ మధుసూదన్ రెడ్డి భౌతికకాయానికి బుధవారం ఉదయం మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఓయూ ఆర్ట్స్ కాలేజీ దిగ్గజంగా గుర్తింపు

ప్రొ.మధుసూదన్ రెడ్డి ఓయూ ఆర్ట్స్ కాలేజీలో రాజనీతి శాస్త్రంలో ఎంఏ చేసి అక్కడే అధ్యాపకుడిగా ఉద్యోగంలో చేరారు. ఓయూ ప్రొఫెసర్‌గా వివిధ పదవులను చేపట్టారు. ఆర్ట్స్ కాలేజీకి రెండు సార్లు ప్రిన్సిపాల్‌గా, సోషల్‌సైన్స్ డీన్‌గా, రాజనీతి శాస్త్రం హెడ్‌గా, బీవోఎస్‌గా, ఐసీఎస్ఎస్ఆర్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొ.కోదండరామ్‌తో పాటు పలువురు ప్రముఖులకు ఆయన గురువు. ఆయన ఆల్ ఇండియా పొలిటికల్ సైన్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చాలాకాలం సేవలందించారు. ఓయూ ప్రొఫెసర్‌గా 30 ఏళ్లు సేవలందించిన ఆయన 1996లో ఉద్యోగ విరమణ చేశారు. ఆయన 'మరుపురాని జ్ఞాపకాలు' అనే పేరుతో తన జీవిత చరిత్రను రాశారు.

పలువురి సంతాపం..

ప్రొఫెసర్ మధుసూధన్‌రెడ్డి మరణం పట్ల వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు సంతాపం తెలిపారు. ఆయన మరణం తెలంగాణ సమాజానికి తీరని లోటని రిటైర్డ్ జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. లోకాయుక్త చైర్మన్ జస్టిస్ రాజశేఖర రెడ్డి, ప్రొ.సులేమాన్ సిద్దికి, ప్రొ.కంచె ఐలయ్య, జూలూరు గౌరీశంకర్, నారా కిషోర్ రెడ్డి, అల్లం నారాయణ, మాజీ వీసీ ప్రొ.వీరారెడ్డి, ప్రకాశ్ రెడ్డి, రామచందర్‌రావు, ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి, తెలంగాణ ప్రభాకర్, ప్రొ. వినాయక్ రెడ్డి, ప్రొ.హరనాథ్, ప్రొ.ఘంటా చక్రపాణి, ప్రొ.పురుషోత్తమ్, ప్రొ.ముత్యం రెడ్డి, కృష్ణారావు, సి.హెచ్. వేణుగోపాల్ రెడ్డి, తిప్పర్తి యాదయ్య, సంగిశెట్టి శ్రీనివాస్‌తో పాటు పలువురు ప్రొఫెసర్లు, పలు విశ్వవిద్యాలయాల మాజీ రిజిస్ట్రార్లు, న్యాయవాదులు, నారాయణగూడలోని మధుసూదన్ రెడ్డి నివాసంలో ఆయన భౌతిక కాయానికి శ్రద్ధాంజలి ఘటించారు.

కల్తీ పేరిట కల్లు నిషేధానికి కుట్రలు



మాట్లాడుతున్న హనుమాండ్లు గౌడ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కల్తీ పేరిట ఔషధ గుణాలు కలిగిన కల్లును నిషేధించేందుకు కుట్రలు జరుగుతున్నాయని రాష్ట్ర కల్లుగీత పరిశ్రమల ఉద్యోగుల యూనియన్ అధ్యక్షులు కామారెడ్డి హనుమాండ్లు గౌడ్ అన్నారు. లిక్కర్ మాఫియాకు తలొగ్గి గీతన్నల వృత్తి గౌరవాన్ని దెబ్బతీయ వద్దన్నారు. మంగళవారం చిక్కడపల్లిలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షులు లింగాల గోవర్ధన్ గౌడ్ , ప్రధాన కార్యదర్శి పులి లక్ష్మీపతి గౌడ్, కార్యాలయ కార్యదర్శి టి. భిక్షపతి గౌడ్‌తో కలిసి మాట్లాడారు... ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కల్తీ కల్లు నిరోధానికి చర్యలు తీసుకోవాలన్నారు. కల్తీ కల్లు ఘటన పేరుతో కల్లుగీత వృత్తిపై జరుగుతున్న దుష్ప్రచారం గీత కార్మికులకు ఉపాధి కోల్పోయే పరిస్థితిని తెచ్చిందన్నారు. కల్లుగీత పరిశ్రమ అనాధిగా ఉందని వేలాది మంది ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. నగరంలో ఇటీవల కల్తీ కల్లు దుర్ఘటన దురదృష్టకరమన్నారు. కల్తీకి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటే తమకు అభ్యంతరం లేదన్నారు. కొందరు చేసిన తప్పునకు నగరంలోని కల్లుదుకాణాలన్ని మూసివేసి ఔటరింగ్ రోడ్డుకు తరలిస్తామనడం తగదన్నారు. నగరంలో కల్లు దుకాణాలను యధావిధిగా కొనసాగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రమాద వశాత్తు ఈత, తాటి చెట్లపై నుంచి పడి మరణించిన కార్మిక కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడంలో జాప్యం జరుగుతుందన్నారు. ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేసిన నీరా కేఫ్ ప్రాంగణంలోకి తెలంగాణ టాడి ట్యాపర్ కార్యాలయాన్ని తరలించాలని డిమాండ్ చేశారు. కల్లుగీత కార్పొరేషన్‌కు వెంటనే పాలక మండలిని నియమించాలన్నారు.

దేశ రక్షణ అందరి బాధ్యత

కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ విభాస్ గుప్తా



మాట్లాడుతున్న సీఓ కల్నల్ విభాస్‌గుప్తా

పోచారం: దేశ రక్షణ ప్రతి భారత పౌరుడు బాధ్యతగా గుర్తించాలని కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ విభాస్ గుప్తా అన్నారు. మంగళవారం యంనంపేట్‌లోని శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాలలో ఆపరేషన్ సిందూర్‌పై ప్రదర్శన జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విభాస్ గుప్తా మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్‌ను ఒక వ్యూహాత్మక ప్రతీకార సైనిక దాడిగా పేర్కొనవచ్చన్నారు. దేశ రక్షణ, దేశాభివృద్ధిలో ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. రక్షణ వ్యవస్థ పటిష్కారనికి ప్రభుత్వాలు కీలక నిర్ణయాలు తీసుకోవడం అభినందనీయమన్నారు. అసోసియేట్ ఆఫీసర్ మేజర్ అంకిత్ మాట్లాడుతూ.. దేశంలోని మూడు రక్షణ వ్యవస్థలైన భారత సైన్యం, వాయుసేన, నావికాదళం ఎలా పనిచేస్తాయో క్యాడెట్స్‌కు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టీ.సీ హెచ్.శివారెడ్డి, అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ ప్రవీణ్ అత్తోట, ఇతర విద్యా సంస్థల ఏఎన్ఓలు, పీ.ఐ.స్టాఫ్, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

గాంధర్వం–3 పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి

నాంపల్లి: యువ సాహితీవేత్తలు, సంగీత, నృత్య కళాకారులను ప్రోత్సహించేందుకు వారి రచనా పటిమను పెంపొందించుకునేందుకు నవ్య నాటక సమితి నిర్వహించే గాంధర్వం జాతీయ సదస్సు దోహదపడుతుందని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. మంగళవారం మాసబ్‌ట్యాంక్‌లోని నఫీజ్ రెసిడెన్సీ గాయత్రీ సదనంలో నవ్య నాటక సమితి సంస్థ జూలై 26, 27వ తేదీల్లో నిర్వహిస్తున్న జాతీయ సెమినార్ గాంధర్వం -3 పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ సాహిత్యం, సంగీతం, నృత్యం సమాజంలో మార్పునకు దోహదపడుతాయన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల కళాకారులు దాదాపు 50 అంశాలపై పరిశోధనా పత్రాలు సమర్పించడం ఈ సదస్సు ప్రత్యేకత అని సమన్వయకర్తలు నిష్టల సుధామాల, డాక్టర్ ఇందిర హేమ తెలిపారు. విద్యానగర్‌లోని దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభలో(ఎఎంఎస్)లో శనివారం ఉదయం కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు ప్రముఖ సంగీత నృత్య గురువులు డాక్టర్ వై.రమాప్రభ, డాక్టర్ వై.చలపతి శాస్త్రి, వివిధ రంగాల ప్రముఖులు డాక్టర్ జి.ఎల్.కె.దుర్గ, డాక్టర్ నండూరి విద్యారణ్య స్వామి ప్రసంగించారు. కార్యక్రమంలో నవ్యనాటక సమితి అధ్యక్షులు వేమరాజు విజయకుమార్, ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్.సుధారాణి, సీహెచ్.హరనాథ బాబు పాల్గొన్నారు.

ఆరు నెలలు.. వంద కిడ్నీ మార్పిడులు

నిమ్స్‌లో విజయవంతంగా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీలు

లక్డీకాపూల్ : నిజామ్స్ వైద్య విజ్ఞాన సంస్థ(నిమ్స్) ఆరు నెలల్లో వంద కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించి సరికొత్త రికార్డును సృష్టించింది. మంగళవారం నిర్వహించిన కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌తో యూరాలజీ నిపుణులు గతంలో తాము నెలకొల్పిన రికార్డును బ్రేక్ చేశారు. ఇప్పటికే ఆ విభాగం వైద్యులు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్‌లను విజయవంతంగా నిర్వహించారు. అత్యాధునిక శస్త్రచికిత్స నైపుణ్యానికి రోబోటిక్ వ్యవస్థ తోడు కావడంతో నిమ్స్ అవయవ మార్పిడి చికిత్సలలో మరింత పురోగతిని సాధించింది. 1989 నుంచి పేద రోగులకు సైతం మెరుగైన వైద్యసేవలను అందిస్తున్న యూరాలజీ విభాగానికి 2015 నుంచి డాక్టర్ సి. రామ్ రెడ్డి నేతృత్వం వహిస్తున్నారు. ఈ క్రమంలో దశాబ్దంలో ట్రాన్స్‌ప్లాంట్ శస్త్రచికిత్సల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఏటా వందకి పైగా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను చేస్తున్నామని డాక్టర్ రామ్ రెడ్డి తెలిపారు. ఈ ఏడాది కేవలం ఆరు నెలల్లో 100వ మార్కును దాటామన్నారు. రోబోటిక్ వ్యవస్థ అందుబాటులోకి రావడంతో సాంకేతిక పురోగతిలో ముందంజలో ఉండటానికి సులభతరమైందన్నారు. ఈ క్రమంలో యూరాలజిస్టులు నెలకు వెయ్యి కంటే ఎక్కువ శస్త్రచికిత్సలను నిర్వహించినట్లు తెలిపారు. రెండేళ్లలో 350కి పైగా రోబోటిక్ శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించామని యూరాలజిస్టు డాక్టర్ రాహుల్ దేవరాజ్ పేర్కొన్నారు. నిమ్స్‌లో ఇప్పటి వరకు నిర్వహించిన కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలన్నీ ఉచితంగానే చేసినట్లు డాక్టర్ రామ్‌రెడ్డి పేర్కొన్నారు.

సాక్షి
11
హైదరాబాద్‌। బుధవారం।
23। జూలై। 2025

సిటీ ప్లస్



స్కాన్ అండ్ పే.. వినడానికి ఎంత సింపుల్‌గా ఉంది.. చిల్లర గొడవలేదు.. పెద్దనోట్ల బెడదలేదు.. అనిపిస్తోంది..కదా! అయితే స్కాన్ అండ్ పేతో ఆర్థిక నియంత్రణ కోల్పోతున్నామని, అకౌంట్‌లో డబ్బులు ఇట్టే ఖాళీ అయ్యేది కూడా తెలియడంలేదని పలువురు చెబుతోన్న మాట. డిజిటల్ పేమెంట్స్‌లో ఎంత సౌలభ్యం ఉందో.. అంతే ఇబ్బందులూ ఉన్నాయనేది వాస్తవం.. ఒకప్పుడు ఏదైనా ఖర్చు చేయాలంటే ముందుగా జేబు చూసుకునే అలావాటు ఉండేది. ఆన్‌లైన్ పేమెంట్స్ పుణ్యమాని అదికాస్త అదుపుతప్పింది.. 'జస్ట్ స్వైప్ అండ్ బై' ఆప్షన్‌తో నెమ్మదిగా నోట్ల కాలాన్ని మర్చిపోతున్న తరుణంలో ఒక సరికొత్త జీవన శైలికి అలవాటుపడ్డారు. ఈ సౌలభ్యంతో పాటు పెరిగిన ఖర్చులు, తగ్గిన పొదుపులు, అదుపులో లేని ఆర్థిక వ్యయాలకు సంబంధించిన అధ్యయనాలు ఆర్థిక క్రమశిక్షణ అవసరమని హెచ్చరిస్తున్నాయి.

– సాక్షి, సిటీబ్యూరో



స్కాన్.. పొదుపు గాన్..



ఆర్థిక నియంత్రణ కోల్పోతున్న వ్యయాలు

- 'స్కాన్ అండ్ పే'తో తప్పుతోన్న లెక్కలు
- యూపీఐ పేమెంట్స్ కారణమంటున్న అధ్యయనాలు
- గతంతో పోలిస్తే పెరిగిన లైఫ్‌స్టైల్ ఖర్చులు
- నోట్ల వినియోగంలో ఉన్న సమతుల్యత యూపీఐలో లేదు
- వినియోగదారులను హెచ్చరిస్తున్న ఆర్థిక నిపుణులు
- అప్పుల ఊబిలోకి నెడుతోన్న ఆన్‌లైన్ వా'లెట్స్'

ఆన్‌లైన్ పేమెంట్స్ సిటీ లైఫ్‌స్టైల్‌కు కొత్త ఊపు నిచ్చాయి. వేగం, సౌలభ్యం, భద్రతను పెంచాయి. అయితే ఇదే క్రమంలో వ్యయం విషయంలో నియంత్రణను కోల్పోయేలా చేస్తున్నాయని, ఈ సౌలభ్యతతో పాటు ఖర్చులు పెరిగాయని, పుదపు పూర్తిగా తగ్గిపోయిందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. జీవన ప్రమాణాల పేరుతో అదుపులేని ఖర్చులతో అప్పుల భారం పెరుగుతోందని, ఇది భవిష్య ఆర్థిక భద్రతను ప్రశ్నార్థకంగా మారుస్తుందని సూచిస్తున్నారు.

సింగిల్ టచ్‌తో..

డిజిటల్ పేమెంట్స్ వల్ల మనం ఎంత ఖర్చు చేస్తున్నామో మర్చిపోతున్నాం. సింగిల్ టచ్‌తో చెల్లింపులు జరిగిపోవడం వల్ల, ఆ ఖర్చు విలువ ఆ క్షణంలో తెలియడం లేదు. ఖరీదైన కాఫీ, ఫుడ్ డెలివరీ, కాస్మొటిక్స్, ఓటీటీ సబ్‌స్క్రిప్షన్లు, ఫిట్‌నెస్ యాప్స్, విలాసవంతమైన గ్యాడ్జెట్లు.. ఇలా ప్రతి రోజూ చిన్న చిన్న ఖర్చులన్నీ కలిసిపోయి పెద్ద మొత్తాన్ని తినేస్తున్నాయి. ముఖ్యంగా యువతలో ఈ విషయంలో నియంత్రణ కొరవడుతోంది. డబ్బు నోట్లను చేత్తో పట్టుకున్నప్పుడు కలిగిన భావన, డిజిటల్ నెంబర్ల రూపంలో ఉండడంలేదని చెబుతున్నారు. పాత రోజుల్లో జీతం వచ్చిన వెంటనే ఒక భాగాన్ని పొదుపుకు ఉంచే అలవాటు ఉండేది. కానీ ఇప్పుడు డబ్బు బ్యాంకులో క్రెడిట్ అయినప్పటికీ, డిజిటల్ పేమెంట్స్ వల్ల ఒక్క రోజు గడిచేలోపు వేగంగా ఖర్చవుతోంది. నెల చివరికి మిగిలే డబ్బు మిగలకపోగా క్రెడిట్‌కార్డులకు చేరువ చేస్తోంది. ఈ కారణంగా, పొదుపు ఖాతాల్లో నిల్వలు కరిగిపోతున్నాయి. ఫైనాన్షియల్ ప్లానింగ్ చేసే అలవాటు కూడా మందగిస్తోంది.



ఆర్థిక భద్రత తప్పనిసరి..

హైదరాబాద్ వంటి పట్టణాల్లో యువతరం అత్యంత ఎక్కువగా డిజిటల్ లావాదేవీలు జరుపుతుంటారు. నేటితరం జీవనశైలిలో డిజిటల్ లావాదేవీలు.. షార్ట్స్ మెనూ డెలివరీలు, ఓటీటీ ట్రెండ్‌లు, ఇన్‌స్టంట్ బుకింగ్స్, ఈఎంఐలపై ఫోన్‌లు, గ్యాడ్జెట్లు, నిత్యం మారే డిజిటల్ ఖర్చులతో ఆర్థిక భద్రత కనుమరుగవుతోంది. పైగా ఇన్‌స్టెంట్ లోన్ యాప్స్‌పై ఆధారపడుతున్నారు. చిన్న వయసులోనే అప్పులు, క్రెడిట్ కార్డ్ బకాయిల సమస్య తలెత్తుతోంది. వ్యక్తిగత ఆర్థిక భద్రతపై అవగాహన కొరవడుతోంది.





డిజిటల్ డిపెండెన్సీకి వ్యతిరేకంగా..

'పేమెంట్ సౌలభ్యం ఉండటం మంచిదే.. కానీ, అది మనం పొదుపు చేయడం మర్చిపోయే స్థాయికి వెళితే ప్రమాదమే'.. అన్నది ఆర్థిక నిపుణులు చెబుతున్న మాట. డిజిటల్ ట్రాన్సాక్షన్ గణాంకాలు పెరగడమే కాకుండా, ఆర్థిక సమతుల్యత కూడా విపరీతంగా పెరుగుతోంది. సగం మందికిపైగా వినియోగదారులు తాము నెల మొత్తంలో చేసిన ఖర్చు ఎంతో గుర్తించలేని స్థితిలో యూపీఐ పేమెంట్స్ చేస్తున్నారని ఓ అధ్యయనం చెబుతోంది.

ఖర్చులను ట్రాక్ చేసే టెక్నాలజీ..

డిజిటల్ మానిటరింగ్ టూల్స్ వినియోగం ఈ సమస్యకు పరిష్కారంగా ఉంటాయని కొందరు సాంకేతిక నిపుణులు సూచిస్తున్నారు. ఇటీవలి కాలంలో కాయిన్, వాల్‌నట్, ఈటీ మనీ వంటి కొన్ని యాప్స్ నెలవారీ బడ్జెట్ అప్లికేషన్లు, ఖర్చులను ట్రాక్ చేయడానికి ఉపకరిస్తున్నాయి. అలాగే, 'స్పెండ్ బిఫోర్ యూ ఎర్న్' తరహా మానసిక ధోరణికి బదులుగా 'సేవ్ బిఫోర్ యూ స్పెండ్' అలవాటుగా చేసుకోవాలి.

32 ఏళ్లుగా..

- పోతురాజు వేషంలో అలరిస్తున్న సర్వేష్
- స్వచ్ఛమైన రంగులతో వేషధారణ





వృత్తిరీత్యా ఆయనో డ్రైవర్. అయినా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై మక్కువ ఆయనను కళల వైపు పురిగొల్పింది.. తెలంగాణ సంప్రదాయ ఉత్సవాలైన బోనాలకు ఎంతో ప్రసిద్ధి చెందిన వేషధారణ అయిన పోతురాజు వేషం ఆయనను ఆకర్షించింది. దీంతో గత 32 ఏళ్లుగా పోతురాజు వేషంలో స్థానిక ప్రజలను అలరిస్తున్నారు సర్వేష్. నగరానికి చెందిన సర్వేష్ మచ్చబొల్లారంలోని ఏడుగుళ్ల వద్ద, గోల్కొండ ఉత్సవాల్లోనూ పోతురాజు విన్యాసంతో సందర్శకులను ఆకట్టుకుంటారు. తన 18వ యేట నుంచి బోనాలకు ఈ వేషం కడుతున్నట్లు సర్వేష్ చెబుతున్నాడు. మిగతా వారిలా కాకుండా స్వచ్ఛమైన రంగులతో ఒంటిపై చిత్రాలు వేసుకుని నృత్యం చేస్తుంటానని, సుమారు మూడు గంటలు శ్రమిస్తేగానీ వేషధారణ పూర్తికాదని చెబుతున్నాడు సర్వేష్.

– అల్వాల్



పెర్ఫ్యూమ్ మేకింగ్ వర్క్‌షాప్..

27వ తేదీన నగరంలోని పపాయ వేదికగా నిర్వహణ

సాక్షి, సిటీబ్యూరో: అధునాతన ఫ్యాషన్ హంగుల్లో పెర్ఫ్యూమ్ ది కీలక పాత్ర. నగరంలో ఒకప్పుడు ఇంపోర్టెడ్ పెర్ఫ్యూమ్‌లకు మంచి గిరాకీ ఉండేది. కానీ గత కొంతకాలంగా పెర్ఫ్యూమ్ మేకింగ్‌పై నగరవాసుల దృష్టి పెరిగింది. ఇందులో భాగంగానే నగరంలో పెర్ఫ్యూమ్ మేకింగ్ వర్క్‌షాప్స్ విస్తృతంగా పెరిగాయి. కొన్ని రోజుల క్రితం ప్రపంచ ప్రసిద్ధి గాంచిన పెర్ఫ్యూమ్ మేకర్స్ కూడా నగరంలో సందడి చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల దృష్ట్యా నగరంలోని పపాయ వేదికగా ఈనెల 27వ తేదీన పెర్ఫ్యూమ్ మేకింగ్ పై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. హిందీ, ఇంగ్లిష్ భాషలో కొనసాగే ఈ వర్క్‌షాప్ మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమై నిరంతరాయంగా మూడు గంటల పాటు కొనసాగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. పర్ఫ్యూమ్ మేకింగ్‌లో నైపుణ్యం సాధించాలనుకునే ఔత్సాహికులు ఇందులో పాల్గొనడానికి బుక్ మై షో వేదికగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.



అభినయ

నేషనల్ థియేటర్ ఫెస్టివల్..

ఆగస్టు 11 నుంచి 13వ తేదీ వరకు జాతీయ బహుభాషా నాటకోత్సవం

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా, సాంస్కృతిక శాఖ, అభినయ థియేటర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'అభినయ నేషనల్ థియేటర్ ఫెస్టివల్ -2025' పేరుతో జాతీయ బహుభాషా నాటకోత్సవం నిర్వహించనుంది. దీనికి సంబంధించిన గోడ పత్రికను ఆ సంస్థ ప్రధాన సలహాదారు, తెలంగాణ రాష్ట్ర మాజీ ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి మంగళవారం ఆవిష్కరించారు. ఆగస్టు 11, 12, 13 తేదీల్లో ఈ థియేటర్ ఫెస్ట్ నిర్వహించనున్నామని, గత 19 యేళ్లుగా నగరంలో దీనిని నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఈ ఉత్సవం.. అభినయ ఆధ్వర్యంలో నిర్వహించే 74వ నాటకోత్సవమని, అంతేకాకుండా దీనికి అనేక ప్రత్యేకతలు ఉన్నాయని వివరించారు. ఇందులో భాగంగా ప్రతిరోజూ కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఉంటాయని, కోకా విజయలక్ష్మి, సంధ్యారాణి, అనూహ్య నెహ్రూ, రాజేష్ శిష్యబృందాల నృత్య ప్రదర్శనలు ఇవ్వనున్నాయని తెలిపారు. తొలి రోజు జరిగే రెండు నాటకాల్లో ప్రఖ్యాత రచయిత్రి మహాశ్వేతాదేవి హిందీ నాటకం 'రుడాలి' ఉంటుందని, దీనిని ఢిల్లీ నాటక సమాజం ప్రదర్శిస్తుందని పేర్కొన్నారు. తరువాత ఒడియా నాటకం 'గాంధీ భూమి కరే' ఒడిశాలోని పూరీ నాటకబృందం ప్రదర్శిస్తుందని, రెండోరోజు అభినయలో తొలిసారిగా ఒకే నటుడు నటించిన బహుభాషా నాటకం 'ఖుద్ ఔర్ ఖుదా' కేరళలోని తిరువనంతపురం వారు ప్రదర్శిస్తారని తెలిపారు. దీనికి పద్మ భూషణ్ కావలం నారాయణ పణిక్కర్ రచించి దర్శకత్వం వహించారు. వీటితో పాటు గురజాడ అప్పారావు రచించిన ప్రఖ్యాత నాటకం 'కన్యాశుల్కం' మహిళలతో అభినయ థియేటర్ ట్రస్ట్ ప్రత్యేకంగా ప్రదర్శించనుంది. మూడోరోజు పశ్చిమ బెంగాల్ సమాజం 'మేఘమాల' బెంగాలీ నాటకాన్ని ప్రదర్శిస్తున్నారు. చివరి ప్రదర్శనగా బెంగళూరు నుంచి వస్తున్న కన్నడ నాటకం 'టాకీ'.. ఇందులో నటించేవారందరూ ట్రాన్స్ జెండర్స్ కావడం విశేషమని వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు అభినయ శ్రీనివాస్, ట్రస్టీ నర్రా జగదీష్ చంద్ర పాల్గొన్నారు.

చల్లని వాతావరణంలో నగరవాసుల సందడి

మేఘాల మధ్య మెరుస్తున్న సచివాలయం





మేఘమా మరువకే..







మేఘమా మరువకే.. మోహమా విడువకే.. మాఘమాస వేళలో మల్లెపూల మాలగా.. మరునికూడి మెల్లగా మరలి రావే చల్లగా..మదిలో మెదిలే మధువై.. అని రచయిత భువన చంద్ర రచించిన పాట చాలామందికి సుపరిచితమే.. ఇలాంటి ఆహ్లాదకరమైన లిరిక్స్ గుర్తుచేసేలా తెలంగాణ సచివాలయం వద్ద కమ్ముకున్న మేఘాలు సందర్శకులను అలరించాయి. ఓవైపు చల్లని వాతావరణంలో లేలేత మొక్కజొన్న పొత్తులను వేడివేడిగా ఆరగిస్తున్న సందర్శకులు.. మరోవైపు పొట్టకూటికోసం గొడుగులు అమ్ముతున్నవారు.. ఆహ్లాదకరమైన వాతావరణంలో నగర సందర్శకులతో ట్యాంక్‌బండ్ సందడిగా మారింది. చూడగానే ఆకట్టుకునే ఈ చిత్రాలు మంగళవారం 'సాక్షి' ఫొటోగ్రాఫర్ కెమెరాకు చిక్కాయి.

క్లుప్తంగా...

ఉద్యమంలో అందెశ్రీ పాటలు కీలక ప్రాత పోషించాయి

అందెశ్రీ 'నిప్పులవాగు'పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ కవి అందెశ్రీ రచించిన జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం గీతం తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిందని, అందుకే రాష్ట్ర గీతంగా ప్రభుత్వం ప్రకటించిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అందెశ్రీ రచించిన 'నిప్పులవాగు'పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ అందెశ్రీ తన గొంతుతో తెలంగాణ దర్పాన్ని, ప్రజాస్వామ్య భావాన్ని, ప్రకృతి ప్రేమను స్ఫురింపజేసిన వ్యక్తి అని కొనియాడారు. ఉద్యమకాలంలో జనసమూహాన్ని ఏకీకరించిన పాటలతో గుర్తింపు పొందిన ప్రజాకవి అని పొంగులేటి పేర్కొన్నారు.

మహిళా భద్రతకు సమన్వయంతో కదలాలి

డీజీపీ జితేందర్ సూచన



సాక్షి, హైదరాబాద్: మహిళా భద్రతకు సమన్వయంతో పనిచేయాలని హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్‌లను డీజీపీ జితేందర్ సూచించారు. సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్‌ల పరిధిలోని ఉన్నతాధికారులు, భద్రతా మండలి సభ్యులతో ఉన్నత స్థాయి సహకార సమావేశం మంగళవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ సురక్షిత తెలంగాణ నిర్మాణానికి మహిళా భద్రతా కార్యక్రమాల నిర్వహణ అవసరమని చెప్పారు. 'ప్రాజెక్టు సేఫ్ స్టే'పేరుతో సైబరాబాద్ పరిధిలో విజయవంతమైన 1,000 హాస్టళ్ల ఆడిట్‌ను ఇతర కమిషనరేట్ల పరిధిలోని నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మహిళా భద్రతా విభాగం అడిషనల్ డీజీపీ చారు సిన్హా, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనర్లు సుధీర్ బాబు, రెమా రాజేశ్వరి, మూడు కమిషనరేట్ల భద్రతా మండలి సభ్యులు, మహిళా భద్రతా విభాగం ఇతర అధికారులు పాల్గొన్నారు. మహిళల కోసం భద్రతా కార్యక్రమాలను పెంచడంలో ఈ సెషన్ ఒక కీలక మైలురాయిగా నిలిచిపోతుందని చారు సిన్హా పేర్కొన్నారు.

మంత్రులు, బీఆర్‌ఎస్ నేతల ఫోన్ల ట్యాప్

సీఎం రేవంత్‌పై ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపణలు



సాక్షి, హైదరాబాద్: మంత్రులు, బీఆర్‌ఎస్ కీలక నేతల ఫోన్లను రేవంత్ రెడ్డి ట్యాప్ చేస్తున్నారని బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు వ్యవహారంలో ఉల్టా చోర్ కొత్వాల్ కో ఢాంటే అన్నట్టుగా రేవంత్‌రెడ్డి వ్యవహారం ఉందని ధ్వజమెత్తారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో రాంచంద్ర నాయక్, విజయ్ ఆర్యాలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. పెగాసస్ సాఫ్ట్‌వేర్‌ను రేవంత్ వాడుకున్నట్టు అనుమానాలున్నాయని, మంత్రుల ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి ఆంగ్ల పత్రిక నిజాలు బయట పెట్టిందన్నారు. ఇద్దరు మంత్రులు సరదాగా చేసుకున్న సంభాషణను సీఎం రేవంత్ రెడ్డి ట్యాపింగ్ ద్వారా తెలుసుకుని ఆ మంత్రికి క్లాస్ తీసుకున్నారని ప్రవీణ్ తెలిపారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఫోన్‌ను కూడా ట్యాప్ చేస్తున్నారేమోనని అనుమానం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ కూడా ఇక్కడ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతల ఫోన్లు ట్యాప్ చేస్తోందని, బీజేపీ సాయంతో రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఫోన్ ట్యాప్ చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ ఎవరి ఫోన్‌లు ట్యాప్ చేస్తున్నారో హైకోర్టుకు సీల్డ్ జాబితా సమర్పించాలని, ట్యాపింగ్ కేసుపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

నువ్వు ఎందుకు పోటీ చేయకూడదు?

ఆలోచింపజేస్తున్న ఫ్లెక్సీ



టవర్ సర్కిల్‌లో సామాజిక కార్యకర్త ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

విద్యానగర్ (కరీంనగర్): 'నీతి నిజాయితీగా చదువుకున్న యువ నాయకత్వం కోసం నీ గ్రామం, నీ డివిజన్ ఎదురుచూస్తోంది మిత్రమా.. రేపటి ఎన్నికల్లో పైసలు, మద్యం రాజకీయాలను బొందపెట్టి కొత్త వ్యవస్థకు నాంది పలుకుదాం. మీ భారతీయుడు కోట శ్యాంకుమార్'అంటూ కరీంనగర్‌లోని విద్యానగర్‌కు చెందిన సామాజిక కార్యకర్త కరీంనగర్ టవర్ సర్కిల్, కమాన్, తెలంగాణచౌక్, ప్రతిమ మల్టీప్లెక్స్, మంచిర్యాల చౌరస్తా, కోర్టు రోడ్డు, నాకా చౌరస్తాలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాడు. పోరాడితే పోయేదేం లేదు బానిస సంకెళ్లు తప్ప అనే నినాదంతో నేటి రాజకీయ రంగును మార్చడానికి యువత, విద్యావంతులు రాజకీయాల్లోకి రావాలనే భావాన్ని ఫ్లెక్సీలో పొందుపరిచాడు. వృత్తిరీత్యా ఇంటీరియర్ డిజైనర్ అయిన శ్యాంకుమార్ ఆరుసార్లు ఎమ్మెల్యే, రెండుసార్లు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశాడు.

ఆడబిడ్డ నిధిని ఇవ్వాలంటే.. ఆంధ్రాను అమ్మాలి

విజయనగరం సభలో మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టీకరణ
మహిళలకు కూటమి సర్కార్ మరో ధోకా...

మంత్రి వ్యాఖ్యలు.. కూటమి ప్రభుత్వ తీరుపై భగ్గుమంటున్న మహిళలు

'ఇచ్చిన ప్రతి హామీకి కాలిక్యులేషన్ చేసి ఎంత ఖర్చు అవుతుందో తెలుసుకున్నాం. ఎలా అమలులో చేయాలో తెలుసుకున్నాకే హామీ ఇచ్చాం. సూపర్ సిక్స్ వెరీ క్లియర్. ఇది మా ఎష్యూరెన్స్. పూర్తి చేస్తామని చెబుతున్నా. కెమేరాలు ఉన్నాయి. రికార్డు చేసుకోండి. ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తాం. చేయక పోతే ప్రజలకు కాలర్ పట్టుకుని నిలదీసే హక్కు కూడా ఉంటుంది.
–2023 డిసెంబరులో ఓ టీవీ చానల్ ఇంటర్వ్యూలో లోకేష్

'వైఎస్సార్‌సీపీ నేతలు అడుగుతున్నారు హామీలు ఎలా నిలబెట్టుకుంటారని...? అలాంటి వారందరికీ మీ లోకేష్ ఒకటే సమాధానం ఇస్తున్నాడు. జగన్ అప్పుల అప్పారావు అయితే, మా చంద్రన్న సంపద సృష్టికర్త. మహిళలు ఎదుర్కొంటున్న కష్టాలు తెలిసి మా చంద్రన్న మహాశక్తి ప్రకటించారు. దాంట్లో ప్రధానంగా నాలుగు ప్రకటనలు ఉన్నాయి. మొదటిది ఆడబిడ్డ నిధి. 18 ఏళ్లు నిండిన మహిళలకు ప్రతి నెలా రూ.1,500 వాళ్ల ఖాతాలో వేస్తున్నాం. ఐదేళ్లు రూ.90 వేలను తెలుగింటి ఆడపడుచుల అకౌంట్లలో మన చంద్రన్న వేయబోతున్నాడు'
–2023లో ఓ సభలో నారా లోకేష్

"రాష్ట్ర ప్రజల నేటి అవసరాలను తీరుస్తూ... రేపటి ఆకాంక్షలను సాకారం చేసేలా రూపొందించిన మేనిఫెస్టోను పక్కాగా అమలు చేస్తాం"
–ప్రజాగళం పేరుతో 2024 ఏప్రిల్ 30న చంద్రబాబుతో కలిసి ఎన్నికల ఉమ్మడి మేనిఫెస్టో విడుదల సందర్భంగా అందులో పేర్కొన్న హామీల అమలుపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు.

"చంద్రబాబు–పవన్‌కళ్యాణ్‌లు ఉమ్మడిగా ప్రకటించిన మేనిఫెస్టోలో 'ప్రతి మహిళకు నెలకు రూ.1500' (19 నుంచి 59 సంవత్సరాల వరకు) అని పేర్కొన్నారు కానీ, ఎన్నికలకు ఏడాది, ఏడాదిన్నర ముందు నుంచే... మేనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా '19–59 సంవత్సరాల వరకు' అన్నది కూడా లేకుండా, భవిష్యత్‌కు గ్యారెంటీ–బాబు ష్యూరిటీ నినాదంతో 'ఆడబిడ్డ నిధి' నుంచి '18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500' అంటూ కరపత్రాలను రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికీ పంచుతూ ప్రచారం చేశారు".

సాక్షి, అమరావతి: అధికారమే పరమావధిగా హామీల వర్షం కురిపించి... ప్రజలను నమ్మించి... గద్దెనెక్కాక వారిని నిలువునా మోసం చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబుది చెక్కుచెదరని "గ్యారంటీ.."! చెప్పిన మాట మీద నిలవకుండా... ఇచ్చిన వాగ్దానాలను విస్మరించడంలో అయితే అయనది తిరుగులేని "ష్యూరిటీ"..! ఎవరూ అందుకోలేని రికార్డులను ఈ దఫా కూడా కొనసాగిస్తూ ఎన్నికల హామీల అమలులో చేతులెత్తేస్తున్నారు...! తమ నైజాన్ని బయటపెట్టుకుంటూ... వంచనకు పాల్పడుతోంది కూటమి ప్రభుత్వం..!

ఎన్నికలకు ఏడాదిన్నర ముందు నుంచే టీడీపీ చిన్నాపెద్ద నాయకుల నుంచి కార్యకర్తల వరకు ఇంటింటికి వెళ్లి తమ ప్రభుత్వం వస్తే ఆడబిడ్డ నిధి కింద చంద్రబాబు ప్రతి మహిళకు నెలకు రూ.1,500 చొప్పున ఇచ్చేలా పథకం అమలు చేస్తారని ఊదరగొట్టారు. 'గ్యారంటీ'కార్డులను కూడా పంపిణీ చేశారు. తీరా అధికారంలోకి వచ్చాక... 13 నెలల పాటు పథకం డబ్బులను ఎగ్గొట్టారు. ఇప్పుడేమో గడిచాక ఆ హామీని అమలు చేస్తే రాష్ట్రాన్నే అమ్మాల్సి ఉంటుందంటూ ప్రభుత్వంలోని కీలక మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించడం గమనార్హం. దీన్నిబట్టి చూస్తే హామీల అమలులో టీడీపీ ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధి స్పష్టం అవుతోందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

ఎగవేతపై 2 నెలల కిందటే బాబు సంకేతాలు

అడ బిడ్డ నిధి హామీ అమలుపై సీఎం చంద్రబాబు పూర్తిగా చేతులెత్తేసినట్టే కనిపిస్తోంది. వాస్తవానికి రెండు నెలల కిందటే కర్నూలు బహిరంగ సభలో అయన ఈ మేరకు సంకేతాలు ఇచ్చారు. ఆయన మాట్లాడిన తీరే ఇందుకు నిదర్శనమని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రభుత్వం–ప్రైవేట్ భాగస్వామ్యంతో పి–4 కార్యక్రమం ద్వారా 2029 నాటికి రాష్ట్రంలో పేదరికం లేకుండా చేస్తానని, అప్పటికీ పేదలు మిగిలితే అడ్డబిడ్డ నిధి కింద ఇచ్చే డబ్బులు పి–4కు అనుసంధానం చేసి మహిళల అదాయాన్ని పెంచే మార్గం ఆలోచిస్తానంటూ



కర్నూలులో చంద్రబాబు వ్యాఖ్యానించారు. అంటే 2029 వరకు ఈ పథకం అమలు ఉండదని చెప్పకనే చెప్పారు. ఇప్పుడు మంత్రి అచ్చెన్నాయుడి వ్యాఖ్యలతో దీనికి మరింత బలం చేకూరుతోందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. వాస్తవానికి... ఎన్నికల్లో ఎలాగైనా గెలవడం అనే ఉద్దేశం తప్ప... ఇచ్చిన హామీలపై కూటమి ప్రభుత్వ పెద్దలకు చిత్తశుద్ధి లేదని వివరిస్తున్నారు. ఇందులోభాగంగానే హామీల అమలు నుంచి తప్పించుకునేందుకు సాకులు మీద సాకులు వెదుక్కుంటున్నారని చెబుతున్నారు.

మహిళలు నష్టపోయిన మొత్తం రూ.35,100 కోట్లు

ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1,500 చొప్పున అందజేస్తామంటూ చంద్రబాబు ఇచ్చిన హామీ ఎప్పటి నుంచి అమలవుతుందా? అని రాష్ట్రవ్యాప్తంగా మహిళలు 13 నెలలుగా ఎదురుచూస్తున్నారు. ఎందుకంటే.. ఒక్కొక్క నెల అలస్యం అయ్యేకొద్దీ వారు కోల్పోతున్న మొత్తం పెరుగుతోంది. ఇలా గత 13 నెలల్లో రాష్ట్రంలోని పేద మహిళలందరూ నెలకు ఏకంగా రూ.2,700 కోట్ల చొప్పున రూ.35,100 కోట్ల లబ్ధిని కోల్పోయారు. ఎన్నికల నాటికి రాష్ట్రంలో 2,10,58,615 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. టీడీపీ కూటమి ఎన్నికలకు ముందు చెప్పిన హామీ ప్రకారం మొత్తం 2.10 కోట్ల మందికి ప్రభుత్వం ప్రతి నెల రూ.1500 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో సుమారు 1.80 కోట్ల మంది ఆడబిడ్డ నిధి పథకానికి అర్హులయ్యే అవ కాశం ఉంది. వారికి ఏడాదికి రూ.18 వేలు చొప్పున 13 నెలల కాలంలో మొత్తం రూ.35,100 కోట్లు ఇప్పటికే కూటమి ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది.

హామీ ఇచ్చారంటే.. కచ్చితంగా అమలే..

- ఎన్నికలకు ముందు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చిన వైఎస్ జగన్
- కోవిడ్ వంటి మహమ్మారులు ఎదురైనా వెనక్కుతగ్గని వైనం

మ్యానిఫెస్టో అంటే భగవద్గీత, ఖురాన్, బైబిల్ అంత పవిత్రంగా భావించిన వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ హామీ ఇచ్చారంటే.. కచ్చితంగా అమలు చేస్తామని నిరూపించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కోవిడ్ వంటి మహమ్మారులు, అనుకోని విపత్తులు వచ్చినా అప్పటి సీఎం వైఎస్ జగన్ ఏమాత్రం వెనక్కుతగ్గలేదు.

2019 ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలును అపలేదు. కాగా, వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేసిన నవరత్న పథకాలను చూపిస్తూ.. 'రాష్ట్రం మరో శ్రీలంకలా తయారవుతుందో'ంటూ నాడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ దుష్ప్రచారం చేసింది. తీరా సరిగ్గా ఎన్నికల సమయానికి ప్రజలను ప్రలోభపెట్టేందుకు హామీల వరద పారించింది. అధికారం దక్కాక మాత్రం వాటిని ఒక్కోటిగా పక్కనపెడుతోంది.

రుస్తుం మైన్స్ చుట్టూ భేతాళ కుట్రలు

- టీడీపీ నేత, ఏపీ మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్‌ను ఇరికించే కుతంత్రం
- వైఎస్సార్‌సీపీ నేత శ్రీకాంత్‌ను భయపెట్టి తప్పుడు వాంగ్మూలం తీసుకున్న పోలీసులు
- అసలు మైనింగే జరక్కపోయినా జరిగినట్లు అక్రమ కేసులు



సాక్షి ప్రతినిధి, నెల్లూరు/నెల్లూరు(లీగల్): కూటమి ప్రభుత్వ వైఫల్యాలతోపాటు 12నెలలుగా టీడీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అరాచకాలపై పోరాడుతున్న ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ నాయకులే లక్ష్యంగా సర్కారు కుట్రలకు తెగబడుతోంది. అసత్యాలతో భేతాళ కథలల్లి కక్షసాధింపులకు దిగుతోంది. దీనిలో భాగంగానే అసలు మైనింగే జరగని రుస్తుం మైన్స్‌లో ఏదో జరిగిపోయిందంటూ పోలీసులు అక్రమ కేసులు బనాయిస్తున్నారు. ప్రతిపక్ష నేతలను ఒక్కొక్కరిని అరెస్టు చేస్తున్నారు. తొలుత ముగ్గురిపై కేసు నమోదు చేయడంతో వారు కోర్టుకెళ్లి ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు. ఈ కేసులో మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఏ–4గా సర్కారు ఇరికించింది. ఆయనను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపింది. ఏ–5గా టీడీపీ నేత కృష్ణంరాజు పేరు చేర్చి మరో ముగ్గురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించింది. తాజాగా బీసీ నేత, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్‌ను కేసులో ఇరికించేందుకు యత్నిస్తోంది. దీనికోసం ఏ–12వ నిందితుడిగా బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డిని చేర్చి అక్రమంగా అరెస్టు చేసింది. అతన్ని బెదిరించి మాజీమంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ పాత్ర ఉందని చెప్పాలంటూ పోలీసులు శ్రీకాంత్‌రెడ్డిని భయపెట్టి వాంగ్మూలం వారే రాసుకుని సంతకం తీసుకున్నారు. ఈ విషయాన్ని బిరదవోలు శ్రీకాంత్ రెడ్డి న్యాయమూర్తి ఎదుట చెప్పడంతో ప్రభుత్వ కుతంత్రం బట్టబయలైంది. శ్రీకాంత్‌రెడ్డి నుంచి న్యాయమూర్తి మళ్లీ వాంగ్మూలాన్ని తీసుకుని రికార్డు చేయించారు.

కేసు పూర్వాపరాలు ఇవీ..

పొదలకూరు మండలం తాటిపర్తి గ్రామంలోని ప్రభుత్వ భూముల్లో 32.71 ఎకరాల విస్తీర్ణంలో రుస్తుం మైనింగ్‌కు 2016 ఏప్రిల్ నెల వరకే అనుమతులు ఉన్నాయి. లీజు గడువు పూర్తవ్వడంతో యజమాని సైతం వదిలేశారు. అక్కడ మైనింగే జరగలేదు. 2023 డిసెంబర్‌లో అక్రమ మైనింగ్ జరుగుతోందని ప్రస్తుత ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఫిర్యాదు చేయడంతో మైనింగ్ శాఖాధికారులు జాయింట్ తనిఖీ నిర్వహించారు. అసలు అక్కడ మైనింగ్ జరిగిన ఆనవాళ్లే లేవని ఆ మేరకు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఆ తర్వాత రెండు నెలల వ్యవధిలోనే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడం, ప్రభుత్వం మారడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 8 నెలల తర్వాత రుస్తుం మైన్‌లో అక్రమ మైనింగ్ జరిగినట్లు మైనింగ్ డీడీతో ఫిర్యాదు చేయించి వైఎస్సార్‌సీపీ నేతలను ఆ కేసుల్లో ఇరికించి జైలుకు పంపుతున్నారు.

పత్రికల్లో వచ్చిన కథనాలే సిట్ చార్జ్‌షీట్

- సిట్ పత్రికలకు లీకులిస్తోంది
- మీ ఎదుట చెప్పినందుకు సిట్ మమ్మల్ని టార్గెట్ చేయొచ్చు
- ఏసీబీ న్యాయమూర్తి ఎదుట ధనుంజయ్‌రెడ్డి ఆవేదన

విజయవాడలీగల్: మద్యం అక్రమ కేసులో అరెస్టయిన రిటైర్డ్ ఐఏఎస్ ధనుంజయరెడ్డి ఏసీబీ కోర్టులో తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. న్యాయమూర్తి ఎదుట తన ఆవేదనను వెలిబుచ్చారు. జిల్లా జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న రాజ్ కేసిరెడ్డి, దిలీప్, చాణక్య, శ్రీధర్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్ప బాలాజీ, గుంటూరు జిల్లా జైలులో ఉన్న బాలాజీకుమార్ యాదవ్, నవీన్‌కృష్ణల రిమాండ్ మంగళవారంతో ముగియడంతో వీరందరినీ ఏసీబీ న్యాయస్థానంలో పోలీసులు హాజరుపరిచారు. ఈ సందర్భంగా ధనుంజయరెడ్డి న్యాయమూర్తి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. "నేను ఐదుగురితో మాట్లాడినట్టు సెల్‌ఫోన్ ట్రాక్ ద్వారా గుర్తించినట్టు పేపర్లో ఓ వార్త చూశాను. ఆ కథనంలో పేర్కొన్న ఐదుగురిలో ఇద్దరిని మాత్రమే నేను కలిశానంతే. మిగిలిన ముగ్గురిని ఇప్పటి వరకు ఎప్పుడూ కలవలేదు. మాజీ సీఎస్, మాజీ ఫారెస్ట్ కన్జర్వేటర్ నా బినామీలు అని కథనాలు రాస్తున్నారు. నేను విలాసవంతమైన కార్లు, విలాసవంతమైన జీవితం గడుపుతున్నట్లు అందులో పేర్కొన్నారు. నేను నా లైఫ్‌లో కొన్న ఒకే ఒక్క కారు శాంట్రో కారు. నా భార్య మరో కారు వాడుతోంది. ఇవి రెండు విలాసవంతమైన కార్లా? మా వ్యక్తిత్వ హననం చేస్తున్నారు. సిట్ అధికారులే లీకులు ఇచ్చి వార్తలు రాయిస్తున్నారు. గత 20 రోజులుగా పత్రికల్లో వార్తలు చూస్తే మేం చార్జ్‌షీట్ చదవాల్సిన అవసరం లేదు. కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయడానికి ముందే పత్రికల్లో, టీవీ డిబేట్లలో ప్రతి అంశం వచ్చింది. ఇదంతా ఎవరు చేస్తున్నారు"అంటూ న్యాయమూర్తి ఎదుట ధనుంజయరెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. "ఈ విషయాలన్నీ కోర్టులో మీ ఎదుట చెబుతున్నాను. రేపటి నుంచి సిట్ మళ్లీ మమ్మల్ని టార్గెట్ చేస్తుంది. అయినా అన్నింటికీ సిద్ధంగా ఉన్నాం"అని చెప్పారాయన. కోర్టులో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి కంటతడి పెట్టుకున్నారు. "గత ప్రభుత్వం పారదర్శకంగా మద్యం విధానం అమలు చేసింది. ఈ విధానంపై రెడ్‌బుక్ కుట్రతో అక్రమ కేసు నమోదు చేసింది. నా తండ్రి, నా సోదరుడు మద్యానికి బలైపోయారు. అందువల్లే నేను మద్యం జోలికి వెళ్ల లేదు. చేయని తప్పుకు శిక్ష అనుభవిస్తున్నా"అని ఆవేదన చెందారు.

నెలాఖరులోగా 'కాళేశ్వరం' నివేదిక

- సర్కారుకు సమర్పించనున్న కమిషన్..
- 27న రాష్ట్రానికి జస్టిస్ పీసీఘోష్



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలపై సుదీర్ఘ విచారణ నిర్వహించిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఈ నెలాఖరులోగా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. ఇందుకోసం జస్టిస్ పినాకి చంద్రఘోష్ ఈ నెల 27న హైదరాబాద్‌కు రానున్నారు. ఈ నెలాఖరుతో కమిషన్ గడువు ముగియనుండగా, ఆలోపే ప్రభుత్వానికి నివేదికను సమర్పించనున్నట్టు తెలిసింది. నివేదిక ఇప్పటికే సిద్ధమైన నేపథ్యంలో కమిషన్ గడువు పొడిగింపును మళ్లీ కోరే అవకాశం లేదని అధికారవర్గాలు తెలిపాయి. నివేదికలోని వివరాలు బయటకు పొక్కకుండా జస్టిస్ ఘోష్ అత్యంత గోప్యత పాటించారని, నివేదికను ఆయనే స్వయంగా రాశారని నీటి పారుదల శాఖలో చర్చ జరుగుతోంది. ఈ విషయంలో అయన కమిషన్ కార్యాలయ అధికారుల సహాయం సైతం తీసుకోలేదని, చివరకు నివేదిక ముద్రణ, ప్రింటింగ్ పనుల్లో సైతం వారి సేవలను వాడుకోవడం లేదని తెలిసింది. ఈ నెల 30 లేదా 31న ప్రభుత్వానికి నివేదిక అందజేసే అవకాశాలున్నట్టు తెలిసింది.

నివేదికను బయటపెడతారా? లేదా?

జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికను ప్రభుత్వం బహిర్గతం చేస్తుందా? లేదా ? అన్న అంశంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వంలో జరిగిన యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణంతో పాటు ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు ఒప్పందంలో జరిగిన అవకతవకలపై విచారణ నిర్వహించిన జస్టిస్ మదన్ బి.లోకూర్ కమిషన్ గతేడాది అక్టోబర్ 29కి ముందే రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించగా, 8 నెలలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం బహిర్గతం చేయలేదు. ఈ నేపథ్యంలో కాళేశ్వరం కమిషన్ నివేదికను సైతం రాష్ట్ర ప్రభుత్వం తొక్కిపెట్టి రాజకీయ అవసరాలకు వాడుకోనుందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నివేదికను బహిర్గతం చేసి బాధ్యులను శిక్షించాలని ఇప్పటికే బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

హెచ్‌సీఏ కార్యదర్శిపై లుకౌట్ నోటీసు

సాక్షి, హైదరాబాద్: విదేశాలకు పారిపోకుండా ముందు జాగ్రత్తగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) సెక్రటరీ దేవరాజ్ రామచందర్‌పై లుక్ అవుట్ సర్క్యులర్ (ఎల్‌వోసీ) జారీ అయ్యింది. దేశం విడిచిపోకుండా అన్ని విమానాశ్రయాలు, ఓడరేవులను సీఐడీ అధికారులు అప్రమత్తం చేశారు. దేవరాజ్ కోసం రెండు ప్రత్యేక బృందాలతో సీఐడీ గాలింపు చేపట్టింది. హెచ్‌సీఏ అధ్యక్షుడి ఎన్నిక సహా నిధుల దుర్వినియోగం కేసులో అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డి ప్రధాన నిందితుడు కాగా.. దేవరాజ్ రామచందర్ రెండో నిందితుడిగా ఉన్నాడు. ఈ కేసులో జగన్‌మోహన్ రావు, ట్రెజరర్ శ్రీనివాసరావు, సీఈవో సునీల్ కాంటె సహా శ్రీచక్ర క్రికెట్ క్లబ్ అధ్యక్షురాలు కవిత, ప్రధాన కార్యదర్శి రాజేందర్ యాదవ్‌లను ఈ నెల 9న సీఐడీ అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. అరెస్టుల విషయం ముందుగానే తెలియడంతో దేవరాజ్ పారిపోయాడు.

ముగిసిన ఆరు రోజుల కస్టడీ, జైలుకు తరలింపు

జగన్‌మోహన్ రావు సహా ఐదుగురు నిందితుల ఆరు రోజుల కస్టడీ మంగళవారంతో ముగిసింది. ఫోర్జరీ డాక్యుమెంట్లతో జగన్‌మోహన్ రావు ఎన్నిక సహా బీసీసీఐ నుంచి వచ్చిన గ్రాంట్లు, హెచ్‌సీఏ నిధుల దుర్వినియోగంపై అధికారులు ప్రశ్నించారు. ఆరు రోజుల కస్టడీ ముగియడంతో మంగళవారం మల్కాజిగిరి కోర్టులో హాజరుపరిచారు. కవితను చంచల్‌గూడ మహిళా జైలుకు, జగన్‌మోహన్ రావు సహా నలుగురు నిందితులను చర్లపల్లి జైలుకు తరలించారు.

ఎన్నికలపై ఊహాగానాలు వద్దు: చారుసిన్హా, సీఐడీ ఏజీడీపీ

చీటింగ్, అధికార దుర్వినియోగం, ఫోర్జరీ, నేరపూరిత కుట్రకు సంబంధించి దర్యాప్తు జరుగుతోంది. హెచ్‌సీఏ ఎన్నికల్లో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు తమ వ్యక్తిగత హోదాలో ఓటు వేసే హక్కు లేదు. క్లబ్, సంస్థాగత అంశాలతో ముడిపడి ఉన్న అధికారాలు, ఎన్నికల్లో ఐఏఎస్, ఐపీఎస్‌ల ఓటు హక్కుల గురించి ఊహాగానాలు చేయడం అనవసరం. ఏ అధికారికీ వ్యక్తిగత హోదాలో ఓటు వేసే హక్కు లేదు.

ఎఫ్‌ఆర్‌ఎస్.. అటెండెన్స్



తరగతిగదిలో విద్యార్థుల హాజరు నమోదు చేస్తున్న ఉపాధ్యాయుడు

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన.. విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంపొందించడం.. చదువుల్లో ఉన్నతంగా రాణించడం కోసం సర్కార్ ఆధునిక హంగులు జోడిస్తోంది. ఈ క్రమంలోనే విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును ప్రత్యేక యాప్ ద్వారా రోజూ నమోదు చేయాలని నిబంధనలు విధించింది. ఒక్కో విద్యార్థి లేదా గ్రూప్ ద్వారా ఫేస్ రికగ్నైజ్ పద్ధతిలో హాజరు నమోదు చేయాలనే ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లా అప్పన్నపేట జెడ్పీ హైస్కూల్‌తోపాటు పలు సర్కారు బడుల్లో ఫేస్ రికగ్నైజ్ సిస్టం (ఎఫ్‌ఆర్‌ఎస్) అటెండెన్స్ అమలు చేస్తున్నారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపికైన స్కూళ్లలో మంగళవారం విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును ఎఫ్‌ఆర్‌ఎస్ పద్ధతిలో నమోదు చేస్తుండగా 'సాక్షి'ఆ దృశ్యాలను ఇలా తన కెమెరాలో బంధించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

ఆ భూములను ఎందుకు రిజిస్ట్రేషన్ చేయకూడదు?


- దేవర్‌యంజాల్ స్థలాలపై సర్కార్‌కు హైకోర్టు నోటీసులు
- రూ.200 కోట్ల విలువైన భూములపై వివాదం

సాక్షి, హైదరాబాద్: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట్ మండలం దేవర్‌యంజాల్ సర్వే నంబర్ 61/యూ, 63/ఏలోని దాదాపు 18 ఎకరాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ ఎందుకు చేయకూడదో చెప్పాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు రెవెన్యూ, స్టాంపులు–రిజిస్ట్రేషన్, దేవాదాయ శాఖ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ భూముల రిజిస్ట్రేషన్లను సబ్ రిజిస్ట్రార్ నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ వి.ప్రతీశ్‌రావుతోపాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. సదరు భూమి అర్బన్ ల్యాండ్ (సీలింగ్ అండ్ రెగ్యులేషన్) చట్టం పరిధిలోకి వస్తుందని, యూఎల్‌సీ డిపార్ట్‌మెంట్ నుంచి ఎన్‌వోసీ తీసుకురావాలని ఆదేశించారని పేర్కొన్నారు. సబ్ రిజిస్ట్రార్ నిర్ణయం రిజిస్ట్రేషన్ చట్టం–1908 నిబంధనలకు విరుద్ధమని, ఆ ఆదేశాలను రద్దు చేసి మే 21న దరఖాస్తు చేసుకున్న ప్రకారం ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేసి సేల్‌డీడ్ డాక్యుమెంట్లు అందించేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కాజా శరత్ విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున రాజశేఖర్‌రావు వాదనలు వినిపించారు. దాదాపు రూ.200 కోట్ల విలువైన ఈ భూములపై 2014 నుంచి వివాదం కొనసాగుతోంది.

ఆలయ భూములను రక్షించాలి..

ప్రభుత్వం తరఫున జీపీలు మురళీధర్‌రెడ్డి, మంగీలాల్ నాయక్ వాదనలు వినిపిస్తూ.. దేవాదాయ శాఖ భూములు కావడంతో సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో చేర్చామని, వాటి క్రయవిక్రయం చెల్లదన్నారు. ఈ కేసులో పిటిషనర్లకు విక్రయించిన వారు ఇదే హైకోర్టులో 2022లో పిటిషన్ దాఖలు చేశారని, అది ఇంకా పెండింగ్‌లో ఉందన్నారు. ఆ పిటిషన్‌పై విచారణ చేపట్టిన కోర్టు.. తాత్కాలిక రిజిస్ట్రేషన్‌ను మాత్రమే అనుమతించిందని, తుది ఉత్తర్వులకు లోబడి చర్యలు ఉంటాయని స్పష్టం చేసిందన్నారు. తీర్పు రాక ముందే ఆ భూములను విక్రయించడం చెల్లదని, దేవాదాయ శాఖ భూములను రక్షించాల్సిన అవసరం ఉందని వాదించారు. వాదనలు విన్న న్యాయమూర్తి తదుపరి విచారణను వచ్చే నెల 6కు వాయిదా వేస్తూ.. గతంలో హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న పిటిషన్‌కు ఈ పిటిషన్లను జత చేయాలని రిజిస్ట్రీని ఆదేశించారు.


షూటింగ్ ఉంది.. రాలేను: రానా దగ్గుబాటి



సాక్షి, హైదరాబాద్: షూటింగ్‌ల కారణంగా బుధవారం ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు సంబంధించిన విచారణకు హాజరుకాలేనని ప్రముఖ నటుడు దగ్గుబాటి రానా ఈడీ అధికారులకు తెలిపారు. ముందస్తు సినిమా షెడ్యూల్ కారణంగా హాజరుకాలేనని, తర్వాత ఎప్పుడైనా రావడానికి సిద్ధమేనని ఆయన ఈడీ జాయింట్ డైరెక్టర్ రోహిత్ ఆనంద్‌కు మంగళవారం సమాచారం ఇచ్చారు. రానా దగ్గుబాటి విజ్ఞప్తి మేరకు ఈడీ అధికారులు సమయం ఇచ్చారు. విచారణకు ఎప్పుడు రావాలో సమాచారం అందిస్తామన్నారు. బెట్టింగ్ యాప్స్ కేసులో ఈడీ ఈసీఐఆర్ నమోదు చేసిన సంగతి తెలిసిందే. బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసిన రానా దగ్గుబాటిని బుధవారం, ఈనెల 30న ప్రకాశ్‌రాజ్, ఆగస్టు 6న విజయ్ దేవరకొండ, 13న మంచు లక్ష్మీలను విచారణకు హాజరు కావాలని సోమవారం సమన్లు జారీ చేసింది.

మాటల్లో ఫేకుడు.. ఢిల్లీలో జోకుడు

- హోంగార్డులకు జీతాలు చెల్లించాలి
- సీఎం వద్ద ఉన్న శాఖలోనే దుర్భర స్థితి : హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: మాటల్లో ఫేకుడు.. ఢిల్లీలో జోకుడు అన్నట్టుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన సాగుతోందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శించారు. పథకాల్లో కోతలు విధిస్తూ, ఉద్యోగులకు జీతాలు చెల్లించకుండా వాతలు పెడుతున్నాడని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. జూలై నెలాఖరు వస్తున్నా సీఎం స్వయంగా నేతృత్వం వహిస్తున్న హోంశాఖలో హోంగార్డులకు వేతనాలు చెల్లించడం లేదన్నారు. భద్రాద్రి కొత్తగూడెం, మెదక్, మహబూబ్‌నగర్, వనపర్తి, జగిత్యాల, వరంగల్, రామగుండం, వికారాబాద్ జిల్లాల్లో పనిచేస్తున్న హోంగార్డులు వేతనాల కోసం సామాజిక మాధ్యమాల్లో మొర పెట్టుకుంటున్నారని చెప్పారు. పిల్లల ఫీజులు కట్టలేక, బ్యాంకుల్లో నెలవారీ కిస్తీలు చెల్లించలేకపోతున్నారు. కొద్దిపాటి జీతంతో పనిచేస్తున్న హోంగార్డులు చేతిలో చిల్లిగవ్వ లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇంటి అద్దెలు, పిల్లల స్కూల్ ఫీజులు, రోజువారీ ఖర్చుల కోసం అప్పులు చేయాల్సిన దుస్థితిలోఉన్నారన్నారు. హోంగార్డులకు వేతనాలు ప్రతీ నెలా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

– 2013–14 నుంచి 2023–24 వరకు తెలంగాణ రాష్ట్రం తలసరి ఆదాయంలో 84.3 శాతం వృద్ధి సాధించిందని తాజాగా లోక్‌సభలో కేంద్ర ఆర్థికమంత్రి వెల్లడించిన విషయాన్ని హరీశ్‌రావు ప్రస్తావించారు. కేసీఆర్ పాలనా దక్షత వల్లే తెలంగాణ రాష్ట్రం.. తలసరి ఆదాయంలో పెద్ద రాష్ట్రాలతో పోటీ పడి దేశంలోనే మూడో స్థానంలో నిలిచిందన్నారు. తలసరి ఆదాయంలో వృద్ధి.. ప్రజల జీవన ప్రమాణాలు, వినియోగశక్తి పెరుగుదలకు స్పష్టమైన సూచికగా నిలుస్తుందని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వ విధానాల వల్లే తెలంగాణ ఆర్థిక స్థిరత్వం సాధించిందన్నారు.

33 ఏళ్ల తర్వాత..

- నీటిపారుదల శాఖలో ఇంజనీర్లకు పదోన్నతులు
- సర్కారు ఆమోదిస్తే త్వరలో ఉత్తర్వులు జారీ

సాక్షి, హైదరాబాద్: నీటిపారుదల శాఖలో ఎట్టకేలకు 33 ఏళ్ల తర్వాత ఇంజనీర్లకు పూర్తి స్థాయి పదోన్నతులు కల్పించడానికి రంగం సిద్ధమైంది. సాధారణ పరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్ నేతృత్వంలో మంగళవారం సమావేశమైన శాఖాపరమైన పదోన్నతుల కమిటీ (డీపీసీ) శాఖలోని 127 మంది ఏఈ/ఏఈఈలకు డీఈలుగా, 12 మంది ఎస్‌ఈలకు సీఈలుగా, ఐదుగురు సీఈలకు ఈఎన్సీలుగా పదోన్నతులు కల్పించాలని నిర్ణయం తీసుకుంది. దీంతో సుదీర్ఘకాలం తర్వాత శాఖలో ఇంజనీర్లకు పూర్తి స్థాయి పదోన్నతులు లభించబోతున్నాయి. గతంలో తాత్కాలిక పదోన్నతులు, అదనపు బాధ్యతల అప్పగింత విధానంలో ఇంజనీర్లకు పదోన్నతులు కల్పించేవారు. నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చొరవతో న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు కొలిక్కి రావడంతో సుదీర్ఘ నిరీక్షణ తర్వాత పదోన్నతులు సాధ్యమయ్యాయని శాఖ ఉన్నతాధికారవర్గాలు తెలిపాయి. సీఈ నుంచి ఈఎన్సీలుగా పదోన్నతులకు సీఎం రేవంత్ అనుమతి ఇవ్వాల్సి ఉండగా, మిగిలిన కేటగిరీలకు మంత్రి ఉత్తమ్ ఆమోదంతో ఉత్తర్వులు జారీ చేయనున్నారు. వాస్తవానికి ఇటీవల జరిగిన ఓ డీపీసీలో 6 మంది సీఈలకు ఈఎన్సీలుగా పదోన్నతి కల్పించాలని నిర్ణయం తీసుకోగా, వారిలో నలుగురిపై చర్యలు తీసుకోవాలని మేడిగడ్డ బరాజ్‌పై విచారణ నిర్వహించిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సిఫారసు చేసింది. దీంతో ఈఎన్సీలుగా పదోన్నతులు నిలిచిపోయాయి.

యశోద ఆస్పత్రిలో ముద్రగడకు చికిత్స

గచ్చిబౌలి (హైదరాబాద్): మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత ముద్రగడ పద్మనాభంను మాదాపూర్‌లోని యశోద ఆస్పత్రిలో కుటుంబ సభ్యులు చేర్పించారు. నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రాజశేఖర్ చక్రవర్తి ఆయనకు చికిత్స అందిస్తున్నారు. ముద్రగడ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.



ఇంద్రజాల ఆస్కార్

ఏం మాయ చేశావ్!

తన ఇంద్రజాల ప్రతిభతో సోషల్ మీడియాలో పాపులర్ అయిన మెజీషియన్, మెంటలిస్ట్ సుహానీ షా ప్రతిష్ఠాత్మకమైన 'బెస్ట్ మ్యాజిక్ క్రియేటర్–2025' అవార్డు గెలుచుకుంది. ఇంద్రజాల రంగంలో ఈ పురస్కారాన్ని ఆస్కార్‌తో సమానంగా భావిస్తారు.



అవార్డ్ గెలుచుకున్న సందర్భంగా అభిమానులు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టింది సుహానీ షా.

'ఒక కల కంటే ఆ కలను నెరవేర్చుకోవడానికి గట్టిగా నిలబడాలి. కల నెరవేర్చుకోవడం అసాధ్యంగా అనిపించవచ్చు. నీ వల్ల కాదు అని ఎంతో మంది అనవచ్చు. అయినా సరే పట్టుదల వీడొద్దు. పట్టుదలగా ముందుకు సాగినప్పుడే అద్భుతం జరుగుతుంది. కల నెరవేరుతుంది' అని రాసింది సుహానీ.

బాల్యంలో టీవీలో వచ్చే మ్యాజిక్ షోలను కన్నార్పకుండా చూసిన సుహానీ తాను కూడా మెజీషియన్ కావడానికి ఎంతో కాలం పట్టలేదు. గత పాతిక సంవత్సరాలలో ప్రపంచవ్యాప్తంగా 5,000 ప్రదర్శనలు ఇచ్చింది.

రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌కు చెందిన సుహానీ షా మెషిజియన్, మెంటలిస్ట్ మాత్రమే కాదు మోటివేషనల్ స్పీకర్ కూడా. ఎంతోమందిని తన ఉపన్యాసాలతో దిశానిర్దేశం చేసింది.

● ఇంటిప్

● ఇల్లు తుడిచే నీళ్లలో కొన్ని డ్రాప్స్ రోజ్ వాటర్ వేసి తుడిస్తే ఇల్లంతా రోజా పరిమళంతో తాజాగా ఉంటుంది.



టీచరమ్మకు స్వాగతం



అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐఎంఎఫ్)లో డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ హోదాలో ఉన్న గీతా గోపీనాథ్ ఆ పదవి నుంచి వచ్చే నెలలో వైదొలగనున్నారు. ఆ తరువాత తనకు బాగా ఇష్టమైన బోధన వృత్తిలోకి వెళ్లనున్నారు.

'ఐఎంఎఫ్'లో తొలి మహిళా చీఫ్ ఎకనామిస్ట్‌గా చరిత్ర సృష్టించారు గీత. 'జీవితంలో ఒకేసారి వచ్చే అవకాశం' అంటూ 'ఐఎంఎఫ్'లో పనిచేయడం గురించి చెబుతారు గీత.

గీత మళ్లీ బోధనరంగం వైపు రావాలనుకోవడం చాలామందిని ఆశ్చర్యపరిచింది. హార్వర్డ్ యూనివర్శిటీలో బోధనకు విరామం ఇచ్చి 'ఐఎంఎఫ్'లో చేరిన గీత మళ్లీ పాఠాలు చెప్పనున్నారు.

'నా మూలాల్లోకి తిరిగి వస్తున్నాను. అంతర్జాతీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు, ఆర్థిక శాస్త్రంలో వచ్చే తరానికి శిక్షణ ఇవ్వడానికి నా తిరుగు ప్రయాణం ఉపయోగపడుతుంది' అంటున్నారు గీత.

'ఐఎంఎఫ్'లో చేరడానికి ముందు గీతకు బోధన రంగంలో రెండు దశాబ్దాల అనుభవం ఉంది. యూనివర్శిటీ ఆఫ్ షికాగో స్కూల్ ఆఫ్ బిజినెస్, హార్వర్డ్ యూనివర్శిటీలలో పనిచేశారు.

ఎంత జటిలమైన ఆర్థిక విషయాలనైనా సులభంగా బోధించడం గీతా గోపీనాథ్ ప్రత్యేకత. సమకాలీన సంఘటనలు, దినప్రతికలలో వచ్చే వ్యాసాలను ఉటంకిస్తూ వివిధ ఆర్థిక సిద్ధాంతాలను విద్యార్థులకు బోధించేవారు.

గీత దిల్లీ యూనివర్శిటీలో డిగ్రీ చేస్తున్న కాలంలో మన దేశం ఫైనాన్సింగ్, కరెన్సీ సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. ఆ నేపథ్యమే ఆమెను అంతర్జాతీయ ఆర్థిక విషయాలపై ఆసక్తి పెంచుకునేలా చేసింది. ఆ ఆసక్తి గీతా గోపీనాథ్‌ను అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్)లో ఉన్నతస్థానానికి తీసుకువెళ్లింది.

న్యూస్ మేకర్



ఆ ఊరికి అంబులెన్స్ రాదు. రాలేదు. కారణం రోడ్డు పూర్తిగా పాడైంది. నెలలు నిండుతున్న గర్భవతి లీలా సాహు తన ఇన్‌స్టా అకౌంట్‌ను ఆయుధంగా చేసుకుంది. ఎం.పి.ని, ఎం.ఎల్.ఏ.ని, ఆఖరుకు నితిన్ గడ్కరీని కూడా వదల్లేదు. 'మా ఊళ్లో ఆరుగురు గర్భిణులు ఉన్నారు. మేము ప్రసవానికి ఎలా వెళ్లాలి?' అని నిలదీసింది. చివరకు ఇది దేశం దృష్టినే ఆకర్షించింది. ఇప్పుడు ఆ ఊళ్లో రోడ్డు పనులు మొదలయ్యాయి. మధ్యప్రదేశ్ సిద్ధి జిల్లాలో ఒక సామాన్యురాలి విజయగాథ.

డిజిటల్ వేదికపై ఓ నారి పోరు!

కొందరికి పోరాడాలంటే భయం. సమస్యలను నలుగురి దృష్టికి తీసుకెళ్లాలంటే భయం. ఇవన్నీ జరిగేవా చచ్చేవా అనే నిస్పృహ. ఈ దేశం బాగుపడదు అని ఎప్పటి నుంచో వినపడే అరిగిపోయిన డైలాగ్ ఒకటి. మనకెందుకు అనే ఫిలాసఫీ ఎలానూ ఉంది. దీని వల్ల ప్రశ్న మాయమైంది. పాలకుల నుంచి వినపడాల్సిన జవాబు కనపడకుండా పోయింది.

కాని 22 ఏళ్ల లీలా సాహుకి తెలుసు– ప్రశ్నిస్తే జనం తోడు నిలుస్తారని. ప్రశ్నలో బలం ఉంటే అది పోరాటంగా మారుతుందని. పోరాటానికి ఫలితం ఉంటుందని.

అంతా చేసి ఆమె పెట్టిన ప్రశ్న 'మా ఊరికి రోడ్డెప్పుడేస్తారు?' అని.

అది మధ్యప్రదేశ్‌లోని సిద్ధి జిల్లా. ఆ జిల్లా నుంచి 50 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది లీలా సాహు పల్లె ఖడ్డీఖుర్ద్. ఆ ఊరు నుంచి హైవే ఎక్కాలంటే 8 కిలోమీటర్ల కచ్చారోడ్డు ఉంది. ఆ రోడ్డు ఎప్పటి నుంచో పాడైపోయింది. వాన వస్తే బురద. ఏ వాహనం తిరగలేదు. అన్నీ గుంటలే. దాని వల్ల కూడా అంబులెన్స్ రావడం కష్టమవుతోంది. ఆ రోడ్డును వేయించాలని కంకణం కట్టుకుంది లీలా సాహూ.

2023లో మొదటిసారి ఆమె మోడీని ఉద్దేశిస్తూ వీడియో చేసింది. 'మోడీ గారూ.. మధ్యప్రదేశ్ మీకు 29 మంది ఎంపీలను ఇచ్చింది. మా ఊరికి రోడ్డు వేయండి' అని విన్నవించింది. ఆ వీడియో బాగా వైరల్ అయ్యింది. ఆ తర్వాత లీలా సాహూ రోడ్డు గురించి కాకుండా ఊరి సమస్యల మీద వీడియోలు చేస్తూ వచ్చింది. అయితే ఇప్పుడు ఆమె గర్భవతి. నెలలు నిండుతున్నాయి. ఏ క్షణాన్నైనా నొప్పులు వస్తే అంబులెన్స్ వచ్చి సిద్ధి వరకూ తీసుకెళ్తే డెలివరీ అవుతుంది. అయితే గతంలో చాలాసార్లు అంబులెన్స్ ఊరి పొలిమేరల వరకే వచ్చి ఆగిపోయిన సంఘటనలున్నాయి. చాలాసార్లు గర్భిణీలు ట్రాక్టర్లలో వెళ్లాల్సిన దుస్థితి. అందుకే లీలా సాహూ తిరిగి వీడియో యుద్ధం మొదలెట్టింది. 'నితిన్ గడ్కరీ గారూ... మా ఊరి రోడ్డు చూశారా ఎలా ఉందో' అని స్థానిక ఎంపీ రాజేశ్ మిశ్రాను ఉద్దేశిస్తూ 'మా ఊళ్లో ఆరుగురు గర్భిణులు ఉన్నారు. మేమంతా ప్రసవానికి ఎలా వెళ్లాలి' అని ప్రశ్నించింది.

ఈ ప్రశ్నను మీడియా ఆ ఎంపీ దగ్గరకు తీసుకెళ్లినప్పుడు అతను 'డెలివరీ డేట్ ఉంటుందిగదా... ఆ సమయానికి ఆమెను టౌన్‌ను తీసుకొస్తాం' అని జవాబు ఇవ్వడంతో సోషల్ మీడియాలో బాగా విమర్శ ఎదురైంది. లీలా సాహూ గర్భిణి కావడం ఆమె పోరాటం సహేతుకం కావడంతో మెల్లగా జనంలో కదలిక వచ్చింది. గ్రామీణులు ఆమెకు దన్నుగా నిలబడ్డారు. దీంతో ప్రభుత్వం నుంచి ఏ సహాయమూ అందకపోయినా స్థానిక ఎం.ఎల్.ఏ తన జేబు ఖర్చులతో రోడ్డు రిపేరు పనులు మొదలెట్టించాడు.

'రోడ్డు శాంక్షన్ అయ్యింది... ఈలోపు నా వంతు కృషి చేస్తున్నాను' అని తెలియచేశాడతడు.

రోడ్డు మీద రోడ్డు రోలర్, ఎస్కలేటర్‌లు తిరుగుతుంటే లీలా సాహు ముఖంలో చిర్నవ్వు వచ్చింది.

'పోరాడండి.. పోయేదేం లేదు... మీ సమస్యలు తప్ప' అంటోందా విజేత తన విజయ దరహాసంతో. ●

అలనాటి అత్తగారు .. ఆ నేత చీర



నేత ఒక కళ. చేనేతకారుడు ఒక కళాకారుడు. శిల్పి తన తన మదిలో మెదిలిన రూపాన్ని శిల మీద చెక్కుతాడు. చేనేతకారుడు తన మనోనేత్రంతో చూసిన రూపాన్ని వస్త్రం మీద ఆవిష్కరిస్తాడు. అందుకోసం అహర్నిశలు కష్టపడతాడు. ఆ కళ అన్నం పెట్టకపోతే తర్వాతి తరం చేతుల్లో ఆ కళ పురుడు పోసుకోదు. ఆ కళ కనుమరుగవుతుంది. జామ్‌దానీ చేనేత కళ కూడా ఇలాగే అంపశయ్య మీద ఉంది. బంగ్లాదేశ్ చేనేతకారుల ప్రత్యేకత ఈ నేత. మనదేశంలో వారణాసి, శ్రీకాకుళం వంటి చోట్ల ఈ నేత నేసే వాళ్లు ఉన్నప్పటికీ ప్రధానంగా ఇది బంగ్లాదేశ్ వాళ్ల చేతిలో రూపుదిద్దుకున్న ఈ నేతకు హెరిటేజ్ ట్యాగ్ వచ్చింది. కానీ అక్కడ ఈ కళకు జనాదరణ మాత్రం దొరకడం లేదు. జనాదరణ కొరవడింది అనడం కంటే మార్కెట్ మెళకువలు తెలియక పోవడమే కారణం అంటోంది వ్యాపార వర్గం.

పాతికేళ్ల కిందట ప్రేక్షకులను అలరించిన 'క్యూం కీ సాస్ భీ కభీ బహు థీ' సీరియల్ గుర్తుందా? ఆ సీరియల్ ఇప్పుడు అదే పేరుతో చివరన 2.0 కలుపుకుని మళ్లీ మన ముందుకు రాబోతోంది. దీని ప్రోమో కూడా విడుదలైంది. తులసి విరానీ గులాబీ పువ్వు రంగు కంజీవరం షిఫాన్ చీర కట్టుకుని తులసి మొక్కకు నీళ్లు పోస్తున్న చిత్రం కనువిందు చేస్తోంది. స్మృతి ఇరానీని చూసిన నాటి అభిమానులు ఈనెల 29న మొదలయ్యే ప్రసారాల కోసం ఎదురు చూస్తున్నారు. తులసి పాత్రలో స్మృతి ఇరానీ ధరించిన చీరలు చేనేతకు జీవం పోయనున్నాయి. భారతీయ చేనేతలు కళాఖండాలు. ఒక్కో పనితనం వెనుక మనసును కదిలించే ఒక కథనం ఉంటుంది. వీటన్నింటినీ కథాంశంలో జోడించడం ద్వారా మన సంప్రదాయ చేనేతలకు ప్రాచుర్యం కల్పిస్తున్నారు కాస్ట్యూమ్ డిజైనర్‌లు. వేడుకలకు సంప్రదాయ చేనేతలతో మోడరన్ అవుట్‌ఫిట్‌లకు రూపమిస్తున్నారు భారతీయ ఫ్యాషన్ డిజైనర్‌లు. సృజనాత్మకత కలిగిన వ్యాపారులు చేనేతకారులను చైతన్యవంతం చేస్తూ చేనేతను సంప్రదాయ డిజైన్‌ల చట్రం నుంచి బయటకు తీసుకువస్తున్నారు. జామ్‌దానీలో అద్భుతాలు సృష్టించవచ్చని చెబుతున్న గౌరంగ్ షా 'మీరు చీరను నేయండి, మార్కెట్ బాధ్యత నాది' అనే భరోసాతో కొత్త తరం చేనేతకారులను తయారు చేస్తున్నారు. రివైవల్ ఆఫ్ ట్రెడిషన్ స్లోగన్‌తో సంప్రదాయ చేనేతను ఫ్యాషన్ ప్రపంచంలో మేటిగా నిలుపుతున్నారు. ఇదిలా ఉంటే... బంగ్లాదేశ్ చేనేతకారులది కూడా జామ్‌దానీ చేనేతలో అందె వేసిన చెయ్యే. కానీ ఈ మేరకు మార్పు మీద దృష్టి పెట్టకపోవడంతో అక్కడ మగ్గాలు మౌనముద్ర వహిస్తున్నాయి.

ఓ ఐడియా... వార్డ్‌రోబ్‌ను మార్చబోతోంది!

ఒక పెద్ద చీరల దుకాణదారు అమ్మకాలు పెంచుకోవడానికి సెలబ్రిటీలను ఆశ్రయిస్తుంటారు. ఆ సెలబ్రిటీలు ఆ చీరలను ధరించి మోడలింగ్ చేస్తుంటారు. ముప్పై సెకన్ల సమయం కళ్ల ముందు మెరిసి మాయమయ్యే ఆ ప్రకటన లక్షల మందిని ఆకర్షిస్తుంది. కానీ ఆ చీర ఎంతమందికి గుర్తుంటుంది? సమాధానం చెప్పడం కష్టమే. అదే చీరను ఒక సీరియల్‌లో ప్రధాన భూమిక పోషిస్తున్న నటి ధరిస్తే?! ఆ దృశ్యాలు వీక్షకుల మనోఫలకం మీద ఎంతగా ముద్రించుకుపోతాయి... ఇదే ఫార్ములాతో చేనేతలకు ప్రాచుర్యం కల్పిస్తున్నారు డిజైనర్‌లు. జామ్‌దానీ, కంజీవరం షిఫాన్, బాంధినీ, ఇకత్ చీరలతో ఈ సీరియల్ పాత్రలకు కాస్ట్యూమ్ డిజైన్ చేశాడు గౌరంగ్ షా. ఈ సీరియల్ ప్రభావంతో చేనేత చీరల ట్రెండ్ మరో దశకం పాటు రాజ్యమేలనుంది.

కొనుగోలు సూత్రమిది!

ఒక వ్యక్తి ఒక వస్తువును కొనుగోలు చేయాలంటే అతడికి ఆ వస్తువుతో అవసరం అయినా ఉండాలి లేదా అభిరుచి అయినా ఉండాలి. జామ్‌దానీ చేనేత చీర కట్టుకోవాలని ఒక మహిళ ఆశపడాలంటే ఆ నేత గొప్పదనం గురించి ఆమెకి తెలియాలి, తెలియచేయాల్సిన బాధ్యత కూడా తయారీదారుదే అంటోంది వ్యాపార వర్గం.

– వాకా మంజులారెడ్డి

డాక్టర్... ట్రీట్‌మెంట్



డాక్టర్ మేఘా సక్సేనా.. ఉత్తరాఖండ్ నివాసి. అక్కడి అల్‌మోరా జిల్లా గవర్నమెంట్ కాలేజీలో పనిచేసేవారు. ప్రజారోగ్యం నుంచి పర్యావరణం వైపు మళ్లారు. ఆమె మెడికల్ ప్రాక్టీస్‌లో ఉన్నప్పుడే అల్‌మోరాలో అటు ప్రభుత్వం, ఇటు ప్రజలు నిర్లక్ష్యం చేస్తున్న ఓ క్లిష్టమైన సమస్యను పరిశీలించారు. అదేంటంటే.. అల్‌మోరాను ఆనుకుని ఉన్న అడవిలోని దేవదారు వృక్షాల మీద పండి రాలిపడి ఎండిన ఆకులు. ఎండిన ఆకులతో సమస్యేంటి అని విస్తుపోయే ముందు ఉత్తరాఖండ్ భౌగోళిక స్వరూపం తెలుసుకోవాలి. ఉత్తరాఖండ్ రాష్ట్రంలో 71 శాతం అడవే! అందులో పదహారు శాతం దేవదారు వృక్షాలు! స్థానికంగా వాటిని చిర్ కా పేడ్ అంటారు. ఆ అడవిలో తరచు కారు చిచ్చు రగులుతూ ఉంటుంది. దీనివల్ల 2000 సంవత్సరం నుంచి ఇప్పటివరకు దాదాపు 54, 801 హెక్టార్ల అడవి తగలబడిపోయింది. కార్చిచ్చు వ్యాపించడానికి కారణం.. పండిపోయి నేలరాలి ఎండిపోయిన దేవదారు ఆకులు! ఇవి అగ్నికి ఆజ్యంలా పనిచేసి అడవిని బూడిదచేస్తూ కర్బన ఉద్గారాలకు తోడవుతున్నాయి. జీవవైవిధ్యానికి ప్రమాదకారిగా మారుతున్నాయి. దీన్ని గ్రహించిన డాక్టర్ మేఘా సిరంజి సూది మీద నుంచి సూదుల్లాంటి దేవదారు ఆకుల మీద దృష్టిపెట్టారు. అదీగాక తన మెడికల్ ప్రాక్టీస్‌లో.. రసాయన ఎరువులు ప్రజల ఆరోగ్యం మీద చూపుతున్న దుష్ప్రభావాల కేసులనూ చూశారు. ఎండిపోయిన దేవదారు ఆకులతో ఇటు సాగుకు, అటు పర్యావరణానికి ఉపయోగపడే ప్రయోగాలేమైనా చేయొచ్చా అని ఆలోచించసాగారు.

బయోచార్.. ఎకోచార్

ఆలోచన రాగానే రంగంలోకి దిగారు మేఘా. అది 2019 సంవత్సరం. అప్పటికి ఆమె గర్భవతి. మెటర్నిటీ లీవ్ తీసుకున్నారు. ఆ సెలవులను తన ప్రయోగానికి వాడుకోవాలనుకున్నారు. కొంతమంది నిపుణులతో కలిసి ప్రయత్నం మొదలుపెట్టారు. 2021లో ఫలితం వచ్చింది. అది పర్యావరణ ప్రమాదానికి పరిష్కారాన్నే కాదు, తనను ఆంట్రప్రెన్యూర్‌గానూ నిలిపింది. అదే బయోచార్ (కట్టెబొగ్గు). ఆ స్టార్టప్ పేరు 'ఎకోచార్'. ఎండిపోయిన ఆకులన్నిటినీ ఏరేయడం వల్ల కార్చిచ్చు వ్యాప్తిని సాధ్యమైనంత వరకు అరికట్టడమే కాకుండా వాటినుంచి తయారైన బయోచార్ చక్కటి సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతోంది. ఇది నేల సారాన్ని పెంచుతోంది. అంతేకాదు దీన్నుంచి పౌల్ట్రీఫామ్‌లోని కోళ్లకు, చేపల చెరువుల్లోని చేపలకూ కావల్సిన సేంద్రియ దాణానూ తయారు చేశారు. ఒక కిలో బయోచార్.. పదహారు వందల గ్రాముల కార్బన్‌డయాక్సైడ్‌ను నిరోధిస్తుంది. దీనికి ఉత్తరాఖండ్‌లోనే కాదు ఉత్తర భారతదేశంలోని చాలా రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది.

'నేను పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి హాని చేస్తున్న రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయం చూడాలని మాత్రమే అనుకున్నాను. ఆ దిశగా వర్క్ చేశాను. దాని ఫలితం ఈ రెండిటికి పరిష్కారాన్నే కాదు నన్ను ఆంట్రప్రెన్యూర్‌గానూ మార్చింది. ఈ ఉత్సాహంతో స్థానికంగా దొరికే వనమూలికలు, వ్యవసాయ వ్యర్థాలతో పశువుల మేతనూ తయారుచేయాలనుకుంటున్నాను. నా ప్రస్తుత లక్ష్యం అదే' అని చెబుతుంది డాక్టర్ మేఘా సక్సేనా.

నిమ్మ, పుదీనా బ్లీచ్...

● బ్యూటిప్



చేతులు నునుపుగా, మెరుస్తూ అందంగా ఉండాలని చాలా జాగ్రత్తలు తీసుకుంటాం. కాని మోచేతుల దగ్గరికి వచ్చేప్పటికి అక్కడి చర్మం దళసరిగా, నల్లగా ఉంటుందని బద్ధకిస్తుంటాం. మిగిలిన చర్మంలో ఉన్నట్టుగా ఇక్కడ నూనె గ్రంథులు ఉండవు కాబట్టి చర్మం త్వరగా పొడిబారిపోయి, నల్లగా మారిపోతుంటుంది. మోచేతులను కూడా అందంగా తయారు చేసుకోవడానికి మంచి చిట్కా ఉంది. నిమ్మరసం, పుదీనా ఆకులతో తయారుచేసిన బ్లీచ్‌తో ఇది సాధ్యం. నిమ్మరసం సహజ సిద్ధమైన బ్లీచ్‌గా ఉపయోగపడితే, పుదీనా ఆకు చర్మానికి మృదుత్వాన్ని చేకూర్చుతుంది.

కావలసినవి: నిమ్మ చెక్క– ఒకటి; నీరు– అర కప్పు; గుప్పెడు పుదీనా ఆకులు లేదా ఒక టేబుల్ స్పూన్ పుదీనా పొడర్.

బ్లీచ్ తయారీ: అర కప్పు నీటిలో పుదీనా పొడర్‌ను ఉడకబెట్టుకున్న తర్వాత మిశ్రమాన్ని వడపోయాలి. వడకట్టిన తర్వాత వచ్చిన పుదీనా రసంలో నిమ్మరసం వేసి బాగా కలపాలి. **ఇలా వాడాలి:** కాటన్‌ను ఉండలా చుట్టి, పుదీన, నిమ్మరసంతో తయారయిన మిశ్రమంలో ముంచి మోచేతులకు అప్లై చేయాలి. 15నిమిషాలతర్వాత గోరు వెచ్చని నీటితో కడిగేయాలి. తర్వాత మాయిశ్చరైజర్‌తోకాని, ఆలివ్ ఆయిల్‌తో గాని మసాజ్ చేసుకోవాలి. ఇలా వారంలో3–4 సార్లు చేస్తే మంచి ఫలితం ఉంటుంది. నిమ్మరసం కాని, పుదీనా కాని మీ చర్మానికి సరిపడని వారు ఈ బ్లీచ్‌ని వాడకూడదు.

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) జూలై 22న ముగింపు రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	99,710
బంగారం (22 క్యారెట్లు)	92,280
వెండి	1,17,200
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	1,02,570
బంగారం (22 క్యారెట్లు)	92,850
వెండి	1,,17,500
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	1,01,290
బంగారం (22 క్యారెట్లు)	92,850
వెండి	1,28,000
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	1,01,290
బంగారం (22 క్యారెట్లు)	92,850
వెండి	1,28,000
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	99,200
బంగారం (22 క్యారెట్లు)	91,260
వెండి	1,16,500
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,0,1290
బంగారం (22 క్యారెట్లు)	92,850
వెండి	1,28,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

లీగల్

ఈ కేసులో నిర్దిష్టమైన ఆధారాలు తప్పనిసరి

నాకు గత కొంత కాలంగా విపరీతమైన నడుము నొప్పి వస్తుండటంతో ఒక సర్జన్ వద్దకు వెళ్ళాను. అయన సర్జరీ చేస్తే తగ్గుతుంది అని చెప్పి, నమ్మించి సర్జరీ చేశారు. కానీ నొప్పి పోలేదు. ఇప్పుడేమో నడుము కింది భాగంలో ఒక డిస్క్ సర్జరీ చేయాలని అంటున్నారు. ముందే ఎందుకు చెప్పలేదు అంటే, ఇంతవరకు వస్తుంది అనుకోలేదు అంటున్నారు. గూగుల్‌లో చూస్తే మొదట చేసిన సర్జరీ అంత ఫలితాలు ఇవ్వదు, అసలు చేసింది కూడా దండగే అని ఉంది. ఆ సర్జన్ నా పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారు. డబ్బు కోసమే చేశాడు అనుకుంటున్నాను. ఎలాంటి కేసులు వేయాలి?

– విక్రమ్, తిరుపతి

ఏంటండీ విక్రమ్ గారూ.. చాలా అక్రమంగా ఉన్నారే! ఒక అర్హత కల్గిన డాక్టరు అనుభవాన్ని, నిర్ణయాన్ని గూగుల్‌లో ఏదో చదివి తప్పు అని తేల్చేస్తారా? పోనీ అదే గూగుల్, యూట్యూబ్ లో చూసి మీ సర్జరీ మీరే చేసుకోకపోయారా? ఒక క్వాలిఫైడ్ (అర్హులైన) డాక్టరు ఇచ్చే సలహాపై మీకేదైనా సందేహం ఉంటే మరొక డాక్టరు వద్ద అభిప్రాయం తీసుకోవాలి. అంతేగానీ గూగుల్ చెప్పింది అని కేసులు వేస్తాననుకోవటం సబబేనా? మీ సమస్యకి డాక్టరు నిర్లక్ష్యమే కారణమని చెప్పే నైపుణ్యం మీకుందా?

ఏది ఏమైనా, మీరు అడిగారు కనుక చట్టం మాత్రమే చెప్తాను. అలా చేయమని సలహా మాత్రం ఇవ్వను.

1) భారత వినియోగదారుల సంరక్షణ చట్టం 2019 ప్రకారం, వైద్యసేవలు కూడా 'సేవలు' కిందికి వస్తాయి. ఒక వైద్యుని నిర్లక్ష్యం వల్ల మీరు శారీరక నష్టం అనుభవించి ఉంటే, మీరు కన్స్యూమర్ డిస్ప్యూట్స్ రెడ్రెస్సల్ కమిషన్ (కన్స్యూమర్ కోర్టు) లో కేసు వేయవచ్చు. అక్కడ మీరు నష్టపరిహారం, వైద్య ఖర్చులు, భవిష్యత్తు చికిత్సల ఖర్చులు సైతం కోరవచ్చు.

2) భారత న్యాయ స్మృతి కోడ్ (భారతీయ న్యాయ సంహిత) ప్రకారం, డాక్టర్ నిర్లక్ష్యం క్రిమినల్ బాధ్యతకు దారి తీయవచ్చు. ప్రస్తుత చట్టం ప్రకారం, సెక్షన్ 106 (డాక్టరు నిర్లక్ష్యం వలన ప్రాణ నష్టం) – సెక్షన్ 125 (నిర్లక్ష్యంతో ప్రాణాపాయ స్థితి కల్పించటం) వంటి సెక్షన్ల కింద కేసు వేసే అవకాశం ఉంది. కానీ, దీనికి తగినంత పటిష్టమైన మెడికల్ ఆధారాలు ఉండాలి. కేవలం అనుమానాల ఆధారంగా క్రిమినల్ కేసులు వేయటం , అవి నిలబడటం కష్టం.


ప్రతి వైద్యలోపం లేదా ప్రతికూల ఫలితాన్ని వైద్యుడి నిర్లక్ష్యంగా పరిగణించలేము. చికిత్సలు కొన్ని రిస్క్‌లతో ఉంటాయి. కాపాడాలని ప్రయత్నించే వైద్యులు కూడా ఎప్పుడో అపరాధులుగా/నిందితులుగా మారిపోతే, మన వైద్య వ్యవస్థ స్తంభించిపోతుంది.

అమెరికా వంటి దేశాల్లో, వైద్యులు కేసుల ఉచ్చులో పడిపోతారనే భయంతో అవసరమైన చికిత్సలు ఇవ్వకుండా డిఫెన్సివ్ మెడిసిన్స్ పాటిస్తున్నారు. అంటే రోగికి కావాల్సింది కాకుండా, చట్టపరమైన సమస్యలు రాకుండా చికిత్స అందిస్తున్నారు! మన దేశం కూడా అదే దిశగా పోతే, ప్రజలే నష్టపోతారు.

మీకు నిజంగా అన్యాయం జరిగిందని మీరు భావిస్తే... మొదట వైద్య నిపుణుల సలహా తీసుకోండి (ఇంకొక నిపుణుడి లిఖిత పూర్వక మెడికల్ అభిప్రాయం).

అనంతరం ఒక న్యాయవాది ద్వారా సరిగా మీ కేసు గమనించి, ఏ మార్గం మీకు సరైందో నిర్ణయించండి.

నిర్దిష్టమైన ఆధారాలతో మాత్రమే ముందుకెళ్లండి. ఎందుకంటే ఒక వైద్యుని ప్రొఫెషనల్ జీవితాన్ని కేవలం అనుమానాలతో లేక ఉద్దేశపూర్వకంగా అభాసుపాలు చేస్తే, అందుకు తగిన చర్యలు సదరు వైద్యులు కూడా తీసుకోవచ్చని మరువకండి.



– శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.



దివ్య, హంపి సెమీఫైనల్ గేమ్‌లు 'డ్రా'

బతూమి (జార్జియా): మహిళల ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్ సెమీఫైనల్స్ తొలి గేమ్‌లో ఫలితం రాలేదు. భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి–లె టింగ్జి (చైనా) మధ్య జరిగిన సెమీఫైనల్ తొలి గేమ్ 38 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిసింది. నల్ల పావులతో ఆడిన హంపి ప్రత్యర్థికి ఏ దశలోనూ పైచేయి సాధించే అవకాశం ఇవ్వలేదు. జూనియర్ ప్రపంచ చాంపియన్ దివ్య దేశ్‌ముఖ్ (భారత్), ప్రపంచ మాజీ చాంపియన్ టాన్ జోంగి (చైనా) మధ్య జరిగిన రెండో సెమీఫైనల్ తొలి గేమ్ కూడా సమంగానే ముగిసింది. తెల్ల పావులతో ఆడిన టాన్ జోంగి దూకుడుకు ఎక్కడికక్కడ అడ్డుకట్ట వేసిన దివ్య 30 ఎత్తుల్లో గేమ్‌ను 'డ్రా'గా ముగించింది. తొలి గేమ్‌లు 'డ్రా' కావడంతో... హంపి–లె టింగ్జి; దివ్య–టాన్ జోంగి మధ్య నేడు జరిగే రెండో గేమ్ కీలకంగా మారనుంది. రెండో గేమ్‌లో గెలిచిన ప్లేయర్లు విజయాన్ని ఖరారు చేసుకోవడంతోపాటు ఫైనల్‌కు అర్హత సాధిస్తారు. ఒకవేళ రెండో గేమ్ కూడా 'డ్రా' అయితే మాత్రం గురువారం టైబ్రేక్ గేమ్‌లు నిర్వహించి విజేతలను నిర్ణయిస్తారు. ఈ టోర్నీలో టాప్–3లో నిలిచిన ప్లేయర్లు వచ్చే ఏడాది జరిగే క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధిస్తారు.





హర్మన్‌ప్రీత్ సెంచరీ అభివాదం

వన్డే సిరీస్ కూడా మనదే

- ఆఖరి పోరులో 13 పరుగులతో భారత మహిళల జయభేరి
- పోరాడిఓడిన ఇంగ్లండ్
- 2–1తో సిరీస్ భారత్ వశం
- హర్మన్ మెరుపు శతకం
- నిప్పులు చెరిగిన క్రాంతి


నాట్ సీవర్

చెస్టర్ లీ స్ట్రీట్: ఈ ఇంగ్లండ్ పర్యటనను భారత మహిళల జట్టు చిరస్మరణీయం చేసుకుంది. పరిమిత ఓవర్ల సిరీస్‌లను ఆడేందుకు వచ్చిన హర్మన్‌ప్రీత్ సేన ముందుగా టి20 సిరీస్‌ను... తాజాగా వన్డే సిరీస్‌ను కైవసం చేసుకుంది. మంగళవారం జరిగిన ఆఖరి మూడో వన్డేలో భారత్ 13 పరుగుల తేడాతో ఆతిథ్య ఇంగ్లండ్‌పై గెలిచింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (84 బంతుల్లో 102; 14 ఫోర్లు) మెరుపు శతకంతో చెలరేగగా... క్రాంతి గౌడ్ (6/52) నిప్పులు చెరిగింది. దీంతో భారత అమ్మాయిల జట్టు 2–1తో సిరీస్‌ను చేజిక్కించుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 318 పరుగుల భారీస్కోరు చేసింది. జెమీమా రోడ్రిగ్స్ (45 బంతుల్లో 50; 7 ఫోర్లు) అర్ధసెంచరీ సాధించింది. ఆరంభంలో టాపార్డర్ బ్యాటర్లు ప్రతీక రావల్ (33 బంతుల్లో 26; 2 ఫోర్లు), స్మృతి మంధాన (54 బంతుల్లో 45; 5 ఫోర్లు), హర్లీన్ డియోల్ (65 బంతుల్లో 45; 4 ఫోర్లు) నింపాదిగా ఆడగా... తర్వాత వచ్చిన కెప్టెన్ హర్మన్, జెమీమా చెలరేగారు. నాలుగో వికెట్‌కు వీరిద్దరు 110 పరుగులు జోడించడంతో భారీ స్కోరుకు బాట వేశారు. అర్ధసెంచరీ వరకు చూసుకొని ఆడిన హర్మన్ 54 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకుంది. కానీ తర్వాత ధాటిని పెంచింది. దీంతో రెండో ఫిఫ్టీని చేసేందుకు కేవలం 28 బంతులే అవసరమయ్యాయి. తద్వారా 82 బంతుల్లోనే సెంచరీ సాధించింది. వన్డేల్లో హర్మన్‌కిది ఏడో సెంచరీ కాగా... 4000 పరుగులు పూర్తిచేసుకున్న మూడో భారత బ్యాటర్‌గా ఘనతకెక్కింది. స్కోరు పెంచే క్రమంలో వీరిద్దరు నిష్క్రమించగా... ఆఖర్లో రిచా ఘోష్ (18 బంతుల్లో 38 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) దంచేసింది. దీంతో భారత్ 300 పైచిలుకు స్కోరును చేయగలిగింది. ఇంగ్లండ్ బౌలర్లలో బెల్, ఫీలెర్, చార్లీ డీన్, సోఫీ, లిన్సే తలా ఒక వికెట్ తీశారు. అనంతరం ఇంగ్లండ్ 49.5 ఓవర్లలో 305 పరుగుల వద్ద ఆలౌటైంది. కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్ (105 బంతుల్లో 98; 11 ఫోర్లు), ఎమ్మా లంబ్ (81 బంతుల్లో 68; 5 ఫోర్లు) రాణించారు. ఇద్దరు మూడో వికెట్‌కు 162 పరుగులు జోడించి ఓ దశలో భారత శిబిరాన్ని వణికించారు. అయితే క్రాంతి కీలక సమయంలో వికెట్లు పడగొట్టి ఇంగ్లండ్‌ను చావుదెబ్బ తీసింది. తెలుగమ్మాయి శ్రీచరణికి 2 వికెట్లు దక్కాయి.

'సమం' చేసే లక్ష్యంతో...

నేటి నుంచి ఇంగ్లండ్‌తో భారత్ నాలుగో టెస్టు

భారత్, ఇంగ్లండ్ మధ్య ఈ సిరీస్‌లో జరిగిన మూడు టెస్టులూ ఆసక్తికరంగా సాగాయి. మొత్తం 15 సెషన్ల పాటు కూడా ఆట నడిచింది. టీమిండియా కూడా ఆధిపత్యం ప్రదర్శిస్తూ ఎక్కడా తగ్గకపోయినా కొన్ని కీలక సందర్భాల్లో తమకు వచ్చిన అవకాశాలను వృథా చేసుకుంది. ఫలితంగా ఇప్పుడు సిరీస్‌లో వెనుకబడింది. అయితే ఆటతీరులో, పోరాటంలో ఆతిథ్య జట్టుతో సమానంగా ఉన్న గిల్ బృందం కోలుకొని సిరీస్‌ను సమం చేయాలని పట్టుదలగా ఉంది. లార్డ్స్‌లో విజయాన్ని అందుకున్న ఇంగ్లండ్ అదే జోరును కొనసాగించాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో నాలుగో పోరుకు రంగం సిద్ధమైంది.

- సిరీస్ కాపాడుకునే ప్రయత్నంలో టీమిండియా
- సొంతగడ్డపై దూకుడు మీదున్న స్టోక్స్ బృందం
- మధ్యాహ్నం గం. 3:30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

మాంచెస్టర్: ఇంగ్లండ్ గడ్డపై గత నాలుగు టెస్టు సిరీస్‌లను కూడా కోల్పోయిన భారత జట్టు ఇప్పుడు మరో సిరీస్‌ను కాపాడుకునే ప్రయత్నంలో ఉంది. ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో నేటి నుంచి జరిగే నాలుగో టెస్టులో భారత్, ఇంగ్లండ్ తలపడనున్నాయి. ఇక్కడా ఓడితే సిరీస్ భారత్ చేజారుతుంది. అయితే రెండో టెస్టు తరహాలో సత్తా చాటి పైచేయి సాధిస్తే సిరీస్ ఫలితం చివరి మ్యాచ్‌కు చేరుతుంది. ఇంగ్లండ్ పూర్తి ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతుండగా, బౌలర్ల గాయాలు గిల్ బృందానికి సమస్యగా మారాయి. ఈ గ్రౌండ్‌లో పేలవ రికార్డు (0–4) ఉన్నా... స్థాయికి తగినట్లుగా చెలరేగితే భారత్ గత రికార్డులు మార్చివేయగలదు.

అన్షుల్ అరంగేట్రం!

ఆటగాళ్లు గాయపడటంతో భారత తుది జట్టులో మార్పులు అనివార్యమయ్యాయి. గత రెండు టెస్టుల్లో అనుసరించిన వ్యూహాన్ని కూడా జట్టు మార్చుకోనుంది. లార్డ్స్‌లో ఆడిన నితీశ్ కుమార్ రెడ్డి, ఆకాశ్‌దీప్ ఈ మ్యాచ్‌కు దూరమయ్యారు. బుమ్రా, సిరాజ్‌లతో పేస్ బౌలింగ్ పటిష్టంగా ఉండగా ఆకాశ్‌దీప్ స్థానంలో అదే తరహా బౌలింగ్ శైలి ఉన్న కొత్త పేసర్ అన్షుల్ కంబోజ్ అరంగేట్రం చేసే అవకాశం ఉంది. కెప్టెన్ గిల్ చెప్పినట్లుగా మూడో పేసర్‌గా అన్షుల్‌తో పాటు ప్రసిధ్ కూడా పోటీలో ఉన్నాడు. ఇక్కడి పిచ్ స్పిన్‌కు పెద్దగా అనుకూలించే అవకాశం లేకపోవడంతో సుందర్ స్థానంలో శార్దుల్‌ను ఆడించే విషయాన్ని జట్టు పరిశీలిస్తోంది. ఇక టాప్–6 బ్యాటింగ్ విషయంలో పూర్తి స్పష్టత వచ్చేసింది. నితీశ్ స్థానంలో రెగ్యులర్ బ్యాటర్ సాయి సుదర్శన్‌కు అవకాశం దక్కనుంది. వరుసగా విఫలమవుతున్నా... టీమ్ మేనేజ్‌మెంట్ కరుణ్ నాయర్‌కు మరో అవకాశం ఇస్తోంది. అతను తన రెగ్యులర్ స్థానమైన ఆరులో బ్యాటింగ్‌కు రానున్నాడు. యశస్వి, రాహుల్ మరోసారి శుభారంభం అందించాల్సి ఉంది. సిరీస్‌లో అత్యధిక పరుగులు సాధించిన గిల్ గత మ్యాచ్ వైఫల్యాన్ని మరచి చెలరేగితే భారీ స్కోరు ఖాయం. లార్డ్స్‌లో పంత్ రనౌట్ మ్యాచ్ గమనాన్ని మార్చింది. అతను ఈ సారి అలాంటి తప్పులు చేయకుండా ఆడాలని జట్టు కోరుకుంటోంది. పంత్ గాయం నుంచి పూర్తిగా కోలుకున్నాడు కాబట్టి కీపింగ్ కూడా చేస్తాడని గిల్ ఇప్పటికే స్పష్టం చేశాడు. నాలుగు వరుస హాఫ్ సెంచరీలతో జడేజా ఫామ్‌లో ఉండటం జట్టుకు సానుకూలాంశం.


ప్రాక్టీస్‌లో రాహుల్, గిల్, పంత్, యశస్వి

డాసన్ ఎనిమిదేళ్ల తర్వాత...

ఇంగ్లండ్ ఎప్పటిలాగే రెండు రోజుల ముందే తమ తుది జట్టును ప్రకటించింది. భారత్‌తో పోలిస్తే ఇంగ్లండ్ బ్యాటింగ్ బలహీనంగానే కనిపిస్తోంది. టాప్–3 ఆశించిన ప్రభావం చూపలేకపోతున్నా క్రాలీ, డకెట్, పోప్‌లపై మేనేజ్‌మెంట్ ఇంకా నమ్మకముంచింది. 57 టెస్టుల తర్వాత కూడా 30 సగటుతో క్రాలీ ఇంకా జట్టులో కొనసాగడం ఆశ్చర్యకరం! దాంతో ప్రధాన బ్యాటర్లయిన రూట్, బ్రూక్‌పై బ్యాటింగ్ భారం పడుతోంది. కీపర్ స్మిత్ రూపంలో ఇంగ్లండ్‌తో సమర్థుడైన బ్యాటర్ లభించాడు. అసాధారణ బౌలింగ్‌తో పాటు నాయకుడిగా కూడా అద్భుతంగా నడిపిస్తున్న స్టోక్స్ బ్యాటింగ్ మాత్రం ఇంకా ఆందోళనకరంగానే ఉంది. ఆరు ఇన్నింగ్స్‌లలో అతను ఒక్క హాఫ్ సెంచరీ కూడా చేయలేదు. ఇక్కడైనా స్టోక్స్ రాణించడం అవసరం. లెఫ్టార్మ్ స్పిన్నర్ డాసన్ ఎనిమిదేళ్ల తర్వాత టెస్టు మ్యాచ్ ఆడనున్నాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 18 సెంచరీలు ఉన్న అతని బ్యాటింగ్ జట్టుకు అదనపు బలం. వోక్స్, కార్స్, ఆర్చర్‌లతో పేస్ దళం పటిష్టంగా ఉంది. ముఖ్యంగా ఆర్చర్ లార్డ్స్ భారత్‌ను ఇబ్బంది పెట్టడంలో సఫలమయ్యాడు.

తుది జట్ల వివరాలు:

భారత్ (అంచనా): గిల్ (కెప్టెన్), జైస్వాల్, రాహుల్, సుదర్శన్, పంత్, కరుణ్ నాయర్, జడేజా, సుందర్/శార్దుల్, సిరాజ్, ప్రసిధ్/కంబోజ్

ఇంగ్లండ్: స్టోక్స్ (కెప్టెన్), క్రాలీ, డకెట్, పోప్, రూట్, బ్రూక్, స్మిత్, డాసన్, వోక్స్, కార్స్, ఆర్చర్.

'90 సెకన్లు ఆలస్యంగా వచ్చారు'

లార్డ్స్ టెస్టు మ్యాచ్ చివర్లో సాగిన డ్రామా గురించి భారత కెప్టెన్ శుబ్‌మన్ గిల్ స్పష్టతనిచ్చాడు. రెండో ఇన్నింగ్స్ కోసం మైదానంలోకి వచ్చిన ఇంగ్లండ్ బ్యాటర్లు ఉద్దేశపూర్వకంగా ఆటను ఆలస్యం చేయడంతో భారత్ నిర్ణీత వ్యవధిలో రెండు ఓవర్లు కాకుండా ఒకే ఓవర్ మాత్రమే వేయగలిగింది. దాంతో గిల్ సహా ఇతర భారత ఆటగాళ్లంతా ఇంగ్లండ్ ఓపెనర్లపై ఆగ్రహం ప్రదర్శించారు. గిల్ మరింత ముందుకు వెళ్లి కాస్త అభ్యంతరకర పదాలు కూడా వాడాడు. 'అందరూ దీని గురించి నన్ను అడుగుతున్నారు కాబట్టి ఒకేసారి సమాధానం ఇవ్వాలనుకుంటున్నా. ఆ రోజు మరో 7 నిమిషాల ఆట మిగిలి ఉంది. 10 కాదు 20 కాదు ఏకంగా 90 సెకన్లు వారు ఆలస్యంగా క్రీజ్‌లోకి వచ్చారు. అన్ని జట్లూ ఇలా తెలివిని ప్రదర్శించడం సహజమే. మేము కూడా తక్కువ ఓవర్లు ఎదుర్కొంటే బాగుంటుందని కోరుకుంటాం. కానీ దానికీ హద్దు ఉంటుంది. గాయపడితే ఫిజియో రావడంలో సమస్య లేదు. ఇక్కడ వివాదం బుమ్రా బౌలింగ్‌లో బంతి తగిలి క్రాలీ చికిత్స తీసుకోవడం కాదు. కానీ ఉద్దేశపూర్వకంగా 90 సెకన్లు ఆలస్యంగా రావడం క్రీడా స్ఫూర్తికి విరుద్ధం' అని గిల్ స్పష్టం చేశాడు.

0-4 ఇంగ్లండ్‌లో ఇతర మైదానాలతో పోలిస్తే ఓల్డ్‌ట్రాఫోర్డ్‌లో భారత్ తక్కువ మ్యాచ్‌లు ఆడింది. 1936–2014 మధ్య 9 టెస్టులు ఆడగా ఒక్కటీ గెలవలేదు. 4 ఓడి మరో 5 డ్రా చేసుకుంది.

పిచ్, వాతావరణం



గత మూడు టెస్టులతో పోలిస్తే ఇది వేగవంతమైన పిచ్. చక్కటి బౌన్స్ ఉంది. గత వారం రోజులుగా వానలు కురుస్తున్నాయి. తేమ కారణంగా తొలి రోజు పేస్ బౌలింగ్‌కు అనుకూలించవచ్చు. మ్యాచ్ జరిగే రోజుల్లోనూ వర్ష సూచన ఉంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో


మహేశ్‌బాబు

చిన్న విరామం


హీరో మహేశ్‌బాబు సినిమా షూటింగ్‌కు చిన్న విరామం ఇచ్చారు. ఆయన హీరోగా రాజమౌళి దర్శకత్వంలో 'ఎస్ఎస్ఎమ్‌బీ 29'(వర్కింగ్ టైటిల్) చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకి కేఎల్ నారాయణ నిర్మాత. ఈ మూవీ చిత్రీకరణకు స్మాల్ బ్రేక్ పడింది. వెకేషన్‌లో భాగంగా ఫ్యామిలీతో కలిసి శ్రీలంకకు వెళ్లారు మహేశ్‌బాబు. మరోవైపు బహమాస్ తీరంలో సేద తీరుతున్నారు ప్రియాంకా చోప్రా. ఇంకోవైపు 'బాహుబలి: ది ఎపిక్' సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులపై రాజమౌళి బిజీగా ఉన్నారని సమాచారం. ఇలా 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' చిత్రీకరణకు తాత్కాలిక బ్రేక్ పడింది. ఈ సినిమా చిత్రీకరణ తిరిగి ఆగస్టులో ప్రారంభమవుతుందని తెలిసింది. ఈ చిత్రం గత షెడ్యూల్ చిత్రీకరణ హైదరాబాద్‌లో జరిగింది. ఆగస్టులో మొదలుకానున్న కొత్త షెడ్యూల్ విదేశాల్లో మొదలవుతుందా? లేక హైదరాబాద్ శివార్లలో వేసిన వారణాసి సెట్‌లో ప్రారంభం అవుతుందా? ఈ విషయంపై స్పష్టత రావాలి.

అద్భుత పోరాటం

హృతిక్ రోషన్, కియారా అద్వానీ జంటగా నటించిన చిత్రం 'వార్ 2'. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించిన ఈ సినిమా ద్వారా హీరో ఎన్టీఆర్ హిందీ చిత్ర పరిశ్రమకి పరిచయమవుతున్నారు. యశ్ రాజ్ ఫిల్మ్స్‌పై ఆదిత్యా చోప్రా పాన్ ఇండియా స్థాయిలో నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 14న హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విడుదలవుతోంది. యశ్ రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్ ఫ్రాంచైజీలో 'వార్ 2' ఆరవ చిత్రంగా రాబోతోంది. ఈ సినిమా ట్రైలర్‌ని ఈ నెల 25న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించి, ఎన్టీఆర్–హృతిక్ రోషన్‌ల పోస్టర్ రిలీజ్ చేశారు. ''ఇండియన్ సినీ ఇండస్ట్రీకి చెందిన ఇద్దరు గొప్ప స్టార్స్ అయిన ఎన్టీఆర్–హృతిక్ రోషన్ తమ సినీ ప్రయాణంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్నారు. ఇదొక లైఫ్ టైమ్ మూమెంట్. ఈ అరుదైన క్షణాలను మరింత గొప్పగా సెలబ్రేట్ చేసుకోవటానికి ఈ నెల 25న 'వార్ 2' ట్రైలర్ విడుదల చేస్తున్నాం. ఇద్దరు గొప్ప స్టార్స్ మధ్య జరిగే అద్భుత పోరాటమే ఈ సినిమా. జూలై 25ని మీ క్యాలెండర్‌లో ప్రత్యేకంగా మార్క్ చేసుకోండి'' అని యశ్ రాజ్ ఫిల్మ్స్ సంస్థ పేర్కొంది.



ఎన్టీఆర్, హృతిక్ రోషన్

తిరుపతిలో కింగ్‌డమ్


విజయ్ దేవరకొండ


విజయ్ దేవరకొండ హీరోగా రూపొందిన తాజా చిత్రం 'కింగ్‌డమ్'. 'జెర్సీ' మూవీ ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్, ఫోర్చ్యూన్ ఫోర్ సినిమాస్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా ఈ నెల 31న రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్ల జోరు పెంచారు మేకర్స్. అందులో భాగంగా ఈ నెల 26న 'కింగ్‌డమ్' ట్రైలర్‌ని రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. తిరుపతిలో ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించనున్నట్లు చిత్రబృందం పేర్కొని, విజయ్ దేవరకొండ పోస్టర్‌ని రిలీజ్ చేసింది. ఈ సినిమాకి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు.

యాక్షన్ ఎంటర్‌టైనర్


ఉన్ని ముకుందన్

'మార్కో' మూవీ ఫేమ్ ఉన్ని ముకుందన్ హీరోగా కొత్త సినిమా ప్రకటన వచ్చింది. దర్శకుడు జోషి ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. ఉన్ని ముకుందన్ ఫిలింస్ (యుఎమ్ఎఫ్)– ఐన్‌స్టీన్ మీడియా బ్యానర్లపై ఈ సినిమా రూపొందనుంది. దర్శకుడు జోషి పుట్టినరోజుని పురస్కరించుకుని ఈ చిత్రాన్ని ప్రకటించారు మేకర్స్. ''హై యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న చిత్రమిది. జోషి డైరెక్షన్‌లో వచ్చిన పలు చిత్రాలు భావి తరాలకు స్ఫూర్తిగా నిలిచాయి. ఆ అనుభవంతో ఈ తరం స్టోరీ టెల్లింగ్ పవర్‌తో ఒక భారీ యాక్షన్ సినిమా తీసేందుకు సిద్ధం అవుతున్నారాయన. తన కెరీర్‌లో ఎప్పుడూ చూడని లుక్‌లో, మాస్ యాక్షన్ పాత్రలో కనిపించబోతున్నారు ముకుందన్. యుఎమ్ఎఫ్– ఐన్‌స్టీన్ మీడియా సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా బిగ్ పాన్ ఇండియా ఎంటర్‌టైనర్‌గా నిలవబోతోంది'' అని చిత్రబృందం తెలిపింది.

టీఐఎఫ్ఎఫ్ ప్రదర్శనకి షోలే



'షోలే' పోస్టర్

ఈ ఏడాది సెప్టెంబరు 4 నుంచి సెప్టెంబరు 14 వరకు 50వ టొరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ (టీఐఎఫ్ఎఫ్) జరగనుంది. ఈ వేడుకలో ఇండియన్ కల్ట్ బ్లాక్‌బస్టర్ సినిమా 'షోలే', 'బందర్', 'హోమ్ బౌండ్' సినిమాలు ప్రదర్శితం కానున్నాయి. ధర్మేంద్ర, సంజీవ్‌కుమార్, అమితాబ్ బచ్చన్, హేమ మాలిని, జయబాదురి, అమ్జాద్ ఖాన్ ప్రధాన పాత్రల్లో రమేష్ సిప్పి దర్శకత్వం వహించిన 'షోలే' 1975 ఆగస్టు 15న విడుదలైంది. కాగా 50వ టీఐఎఫ్ఎఫ్ ప్రారంభమయ్యే సమయానికి 'షోలే' విడుదలై 50 ఏళ్లు పూర్తవుతాయి. ఈ సందర్భంగా ఈ సినిమా లేటెస్ట్ 4కే వెర్షన్ ఇక్కడ ప్రదర్శితం కానుంది. అలాగే బాబీ డియోల్ హీరోగా అనురాగ్ కశ్యప్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'బందర్'. 'మంకీ ఇన్ ఏ కేజ్' అనేది క్యాప్షన్. ఈ చిత్రంలో సాన్య మల్హోత్రా ఓ లీడ్ రోల్‌లో నటించారు. కొన్ని వాస్తవ ఘటనలతో రూపొందిన తమ సినిమా ఈ ఫెస్టివల్‌లో ప్రదర్శితం కానుందని అనురాగ్ కశ్యప్ పేర్కొన్నారు. ఇంకా ఈ ఏడాది ఫ్రాన్స్‌లో జరిగిన 78వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించబడిన 'హోమ్‌బౌండ్' టీఐఎఫ్ఎఫ్‌లో స్క్రీనింగ్ కానుంది. ఇషాన్ కట్టర్, విశాల్ జెత్వా, జాన్వీ కపూర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాని హైదరాబాదీ దర్శకుడు నీరజ్ ఘైవాన్ తెరకెక్కించగా, కరణ్ జోహార్ నిర్మించారు. ఈ ఫిల్మ్ ఫెస్టివల్ ప్రారంభానికి ఇంకా సమయం ఉంది కనుక.. ఈ ఫెస్టివల్‌లో స్క్రీనింగ్ లేదా ప్రీమియర్ కానున్న భారతీయ సినిమాల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయి.

చీకట్లో వినోదం


యోగిబాబు


నరేష్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా బ్రహ్మానందం, యోగి బాబు కీలక పాత్రలు పోషించిన చిత్రం 'గుర్రం పాపిరెడ్డి'. మురళీ మనోహర్ దర్శకత్వం వహించారు. డా. సంధ్య గోలీ సమర్పణలో వేణు సద్ది, అమర్ బురా, జయకాంత్ (బాబీ) నిర్మించిన ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. యోగి బాబు పుట్టినరోజు(జూలై 22) సందర్భంగా 'గుర్రం పాపిరెడ్డి' లో ఆయన నటించిన ఉగ్రాజు అనే పాత్ర ప్రత్యేక పోస్టర్ రిలీజ్ చేసింది చిత్రయూనిట్. ''డార్క్ కామెడీ కథతో ఇప్పటి వరకు తెరపై చూడని సరికొత్త కాన్సెప్ట్‌తో మురళీ మనోహర్ ఈ సినిమా రూపొందించారు. యోగిబాబు నటన మా చిత్రానికి అదనపు ఆకర్షణగా నిలుస్తుంది'' అని మేకర్స్ తెలిపారు.


రాశీ ఖన్నా

మిస్ శ్లోక

పవన్ కల్యాణ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న తాజా సినిమా 'ఉస్తాద్ భగత్‌సింగ్'. ఈ చిత్రంలో పోలీసాఫీసర్ పాత్రలో నటిస్తున్నారు పవన్ కల్యాణ్. ఈ మూవీలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. కాగా ఈ సినిమాలోని మరో హీరోయిన్ పాత్రకు రాశీఖన్నాను ఎంపిక చేసింది యూనిట్. 'ఉస్తాద్ భగత్‌సింగ్' లో శ్లోక పాత్రలో రాశీఖన్నా నటిస్తున్నట్లు వెల్లడించి, ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవి శంకర్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. అశుతోష్ రానా, నవాబ్ షా, 'కేజీఎఫ్' ఫేమ్ అవినాష్, గౌతమి, నాగ మహేశ్, టెంపర్ వంశీ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

అవతార్ 3 ట్రైలర్ రెడీ


ఊనా చాప్లిన్

హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్ వెండితెరపై ఆవిష్కరించిన అద్భుత దృశ్యకావ్యం 'అవతార్'. ఈ ఫ్రాంచైజీలో వచ్చిన తొలి చిత్రం 'అవతార్'(2009)లో పండోర అనే గ్రహాన్ని సృష్టించి కళ్లుచెదిరే విజువల్ ఎఫెక్ట్స్‌తో ప్రేక్షకులను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లారు కామెరూన్. ఈ ఫ్రాంచైజీలో వచ్చిన ద్వితీయ చిత్రం 'అవతార్: ది వే ఆఫ్ వాటర్'(2022). ఈ రెండు సినిమాలకు ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. ఈ ఫ్రాంచైజీలో రానున్న తాజా చిత్రం 'అవతార్: ఫైర్ అండ్ యాష్'. సామ్ వర్తింగ్టన్, జో సల్దానా, సిగోర్నీ వీవర్, స్టీఫెన్ లాంగ్, గియోవన్నీ రిబిసి, కేట్ విన్స్లెట్, డేవిడ్ థెవ్లిస్, ఊనా చాప్లిన్ కీలక పాత్రలు పోషించారు. జేమ్స్ కామెరూన్, జాన్ లాండో, రే సాంచిన్ నిర్మిస్తున్న ఈ సినిమా డిసెంబర్ 19న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. నటి ఊనా చాప్లిన్ పోషించిన వరంగ్ పాత్రను పరిచయం చేస్తూ ఆమె పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ నెల 25న రిలీజ్ కానున్న 'ది ఫెంటాస్టిక్ ఫోర్: ఫస్ట్ స్టెప్స్' సినిమా ప్రదర్శనకు ముందు 'అవతార్: ఫైర్ అండ్ యాష్' ట్రైలర్‌ను ప్రదర్శించనున్నట్లు మేకర్స్ పేర్కొన్నారు.

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సూచీ	మార్పు	ముగింపు
సెన్సెక్స్ ▽	14	82,187
నిఫ్టీ ▽	30	25,061

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	20,913	▽	63
డోజోన్స్	44,470	△	147
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,024	△	11
డాక్స్	24,042	▽	266
షాంఘై	3,581	△	22
నికాయ్	39,775	▽	44

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.85	86.87
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	115.00	117.89
€	యూరో	ఎస్‌బీఐ	99.56	102.31
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	57.81	59.29
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.86	57.66
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.12	68.80
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.16	23.64
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.62	23.87
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.16	12.89

పసిడి.. మళ్లీ రూ.లక్ష పైకి!

- ఒకే రోజు రూ.1,000 పెరుగుదల
- ఢిల్లీ మార్కెట్లో ధర రూ.1,00,020
- రూ.3,000 ఎగసిన వెండి ధర

న్యూఢిల్లీ: పుత్తడి మరోసారి జిగేల్‌మంది. కొనుగోళ్ల మద్దతుతో 99.9 శాతం స్వచ్ఛత బంగారం 10 గ్రాముల ధర మంగళవారం ఢిల్లీ మార్కెట్లో రూ.1,000 లాభపడి రూ.1,00,020 స్థాయికి చేరింది. స్టాకిస్టుల నుంచి బలమైన కొనుగోళ్లు జరిగినట్టు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. 99.5 శాతం స్వచ్ఛత బంగారం సైతం రూ.1,000 పెరిగి రూ.99,550 స్థాయిని చేరుకుంది. అటు వెండిలోనూ కొనుగోళ్లు జోరుగా సాగాయి. దీంతో రూ.3,000 లాభపడి కిలోకి రూ.1,14,000 స్థాయిని తాకింది. అంతర్జాతీయ మార్కెట్లో (కామెక్స్ ఫ్యూచర్స్) ఔన్స్ బంగారం 35 డాలర్లకు పైగా లాభంతో 3,440 డాలర్ల స్థాయిని చేరుకుంది. వెండి ధర ఔన్స్‌కు 39.50 డాలర్ల వద్ద ఉంది. పరపతి విధానంపై యూఎస్ ఫెడ్ చైర్మన్ పావెల్ ప్రసంగం కోసం ఇన్వెస్టర్లు ఆసక్తిగా వేచి చూస్తున్నట్టు అబాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీఈవో చింతన్ మెహతా తెలిపారు. చైనా లోన్ ప్రైమ్ రేటుపై నిర్ణయం, యూఎస్ ఆర్థిక డేటా (పీఎం, డ్యూరబుల్ గూడ్స్ ఆర్డర్లు), వడ్డీ రేట్లపై నిర్ణయాలు అంతర్జాతీయంగా బంగారంలో తదుపరి ర్యాలీని నిర్ణయిస్తాయని ఎమ్‌కే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కమోడిటీస్ రీసెర్చ్ అనలిస్ట్ రియా సింగ్ అభిప్రాయపడ్డారు.



ఉద్యోగాలకు టాప్.. టాటా గ్రూప్

- అత్యంత ఆకర్షణీయమైన ఎంప్లాయర్ బ్రాండ్
- టాప్ 3లో గూగుల్ ఇండియా, ఇన్ఫోసిస్
- ర్యాండ్‌స్టాడ్ అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ: దేశీయంగా ఉద్యోగాలకు అత్యంత ఆకర్షణీయమైన బ్రాండ్లుగా టాటా గ్రూప్, గూగుల్ ఇండియా, ఇన్ఫోసిస్ నిలిచాయి. ర్యాండ్‌స్టాడ్ ఎంప్లాయర్ బ్రాండ్ రీసెర్చ్ (ఆర్‌ఈబీఆర్) 2025 నివేదికలో టాప్ 3 స్థానాలను దక్కించుకున్నాయి. దీని ప్రకారం భారత్‌లో ఉద్యోగులు వర్క్–లైఫ్ సమతుల్యత, సమానత్వం, ఆకర్షణీయమైన జీతభత్యాలను కోరుకుంటున్నారు. అలాంటి కంపెనీలకే ఎక్కువగా ప్రాధాన్యమిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆర్థిక ఆరోగ్యం, కెరియర్ పురోగతి అవకాశాలు, ప్రతిష్ట అంశాల్లో టాటా గ్రూప్ అత్యధిక స్కోరుతో అగ్రస్థానం దక్కించుకుంది. గూగుల్ ఇండియా రెండో స్థానంలో, ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ మూడో స్థానంలో నిల్చాయి. ఇక అత్యంత ఆకర్షణీయమైన టాప్ 10 ఎంప్లాయర్ బ్రాండ్స్ 2025 జాబితాలో శాంసంగ్ ఇండియా (4), జేపీ మోర్గాన్ చేజ్ (5), ఐబీఎం (6), విప్రో (7), రిలయన్స్ ఇండస్ట్రీస్ (8), డెల్ టెక్నాలజీస్ (9), స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (10) సంస్థలు ఉన్నాయి. జాబితాలో ఎస్‌బీఐ ఏకైక భారతీయ బహుళజాతి ప్రభుత్వ రంగ బ్యాంకు కావడం గమనార్హం. 'సంప్రదాయ ఉద్యోగాలతో నేటి ఉద్యోగులు సంతృప్తిపడటం లేదని 2025 నివేదికతో తేటతెల్లమైంది. వారు నిర్దిష్ట లక్ష్యం, సమానత్వం, అర్థవంతమైన వృద్ధి, వర్క్–లైఫ్ మధ్య సమతుల్యతను కోరుకుంటున్నారు' అని ర్యాండ్‌స్టాడ్ ఇండియా ఎండీ విశ్వనాథ్ పీఎస్ తెలిపారు. ఉద్యోగాలు మారిపోవాలనే ధోరణి కూడా యువ ఉద్యోగుల్లో ఎక్కువగా కనిపిస్తుండటమనేది కంపెనీలకు మేల్కొలుపులాంటిదని ఆయన చెప్పారు.



నివేదికలో మరిన్ని విశేషాలు..

- 34 మార్కెట్లలో 1,70,000 మంది ఈ అధ్యయనంలో పాల్గొన్నారు. వీరిలో 3,500 మంది భారత్‌కి చెందిన వారు ఉన్నారు.
- జీతానికి మించిన ప్రయోజనాలను ఉద్యోగులు కోరుకుంటున్నారు. ఇటు వ్యక్తిగతంగా, అటు వృత్తిగతంగా ఎదిగేందుకు ఉపయోగపడేలా కంపెనీల్లో వాతావరణం ఉండాలని ఆశిస్తున్నారు.
- 2025 ప్రథమార్ధంలో 47% మంది భారతీయ ఉద్యోగులు, ఉద్యోగం మారాలని ప్రణాళికలు వేసుకున్నారు. జెన్ జెడ్ (51%), మిలీనియల్స్‌లో (50%) ఈ ఆలోచన బలంగా ఉంది.
- ఏఐ వినియోగం భారీగా పెరుగుతోంది. ప్రస్తుతం భారతీయ ఉద్యోగుల్లో 61 శాతం మంది దీన్ని తరచుగా ఉపయోగిస్తున్నారు. మిలీనియల్స్ అత్యంత యాక్టివ్ యూజర్లుగా ఉంటున్నారు. గతేడాదితో పోలిస్తే వీరి సంఖ్య 13 శాతం పెరిగింది. ఏఐ ప్రభావాలపై అంచనాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. కృత్రిమ మేథ తమ పనిపై గణనీయంగా ప్రభావం చూపుతోందని 38 శాతం మంది ఉద్యోగుల్లో అభిప్రాయం నెలకొంది.

భద్రత తక్కువ.. ప్రచారం ఎక్కువ



- దేశీయంగా ఎయిర్‌లైన్స్ తీరుపై ప్రయాణికుల అభిప్రాయం
- లోకల్‌సర్కిల్స్ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ: దేశీయంగా చాలా మటుకు విమానయాన సంస్థలు భద్రత కన్నా ప్రచారంపైనే ఎక్కువగా వెచ్చిస్తున్నాయని అత్యధిక శాతం విమాన ప్రయాణికులు భావిస్తున్నారు. ఈ విషయంపై లోకల్‌సర్కిల్స్ నిర్వహించిన ఆన్‌లైన్ సర్వేలో 76 శాతం మంది ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గత మూడేళ్లలో కనీసం ఒక్కసారైనా టేకాఫ్ సమయంలోనో, ల్యాండింగ్ లోనో లేదా విమానంలోనో ఏదో ఒక సమస్య ఎదుర్కొన్నట్లు 64 శాతం మంది తెలిపారు. దేశవ్యాప్తంగా 322 జిల్లాల నుంచి 44,000 మంది ఈ సర్వేలో పాల్గొన్నారు. 'భారత్ కేంద్రంగా కార్యకలాపాలు సాగించే ఎయిర్‌లైన్స్, భద్రత కన్నా పబ్లిసిటీకే ఎక్కువగా ప్రాధాన్యమిస్తున్నాయని భావిస్తున్నారా' అనే ప్రశ్నకు స్పందించిన 26,696 మంది ప్రయాణికుల్లో 43% మంది 'అవును. అన్ని సంస్థలు అలాగే ఉన్నాయి' అని, 33% మంది 'అవును. కొన్ని సంస్థలే అలా ఉన్నాయి' అని, 11% మంది 'ఏ కంపెనీ కూడా అలా లేదు' అని చెప్పారు. 13 శాతం మంది మాత్రం స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. స్థూలంగా చెప్పాలంటే చాలా మటుకు ఎయిర్‌లైన్స్ భద్రత కన్నా ప్రచారంపైనే ఎక్కువగా ఖర్చు చేస్తున్నాయని చాలా మంది ప్రయాణికులు భావిస్తున్నట్లు వెల్లడైందని లోకల్‌సర్కిల్స్ ఒక ప్రకటనలో తెలిపింది. సర్వేలో పాల్గొన్న వారిలో 63% మంది పురుషులు కాగా, 37% మంది మహిళలు. వీరిలో 46% మంది ప్రథమ శ్రేణి నగరాలకు చెందినవారు. 25% మంది ద్వితీయ శ్రేణి నగరాలకు, మిగతా 29% మంది తృతీయ, చతుర్థ శ్రేణి.. గ్రామీణ ప్రాంతాలకు చెందినవారు.

హడలెత్తిస్తున్న ప్రమాదాలు..

ఇటీవలి కాలంలో విమాన ప్రమాదాల ఉదంతాలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ సర్వే ప్రాధాన్యం సంతరించుకుంది. అహ్మదాబాద్ నుంచి లండన్‌కి వెళ్లాల్సిన ఎయిరిండియా విమానం గత నెల టేకాఫ్ అయిన వెంటనే కూలిపోవడంతో, 241 మంది ప్రయాణికులు, ఇతరత్రా 19 మంది మరణించిన సంగతి తెలిసిందే. ఈ క్రాష్‌పై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) విచారణ జరిపి, ఇప్పటికే ప్రాథమిక రిపోర్టు ఇచ్చింది. మరోవైపు, సోమవారం నాడు కొచ్చి–ముంబై ఎయిరిండియా ఫ్లయిట్, ల్యాండింగ్ సమయంలో రన్‌వే మీద నుంచి పక్కకు జారిపోయిన ఘటనలో ప్రయాణికులు తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. అదే రోజున సాంకేతిక లోపం కారణంగా ఢిల్లీ–కోల్‌కతా విమానాన్ని ఎయిరిండియా ఆఖరు నిమిషంలో రద్దు చేసింది. ల్యాండింగ్ గేర్ సమస్య కారణంగా గోవా నుంచి బయలుదేరిన ఇండిగో విమానం అత్యవసరంగా ల్యాండ్ అయ్యింది.

పేటీఎమ్‌కు తొలిసారి లాభాలు

క్యూ1లో రూ. 123 కోట్లు



న్యూఢిల్లీ: ఫిన్‌టెక్ దిగ్గజం వన్97 కమ్యూనికేషన్స్ (పేటీఎమ్) ఈ ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో కంపెనీ చరిత్రలోనే తొలిసారి నష్టాలను వీడి లాభాల్లోకి ప్రవేశించింది. వ్యయాల నియంత్రణ, పేమెంట్ ఆదాయం పుంజుకోవడం ఇందుకు సహకరించింది. వెరసి పేటీఎమ్ బ్రాండ్ కంపెనీ ఏప్రిల్–జూన్(క్యూ1)లో దాదాపు రూ. 123 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 840 కోట్ల నికర నష్టం ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ఫలితాలివి. మొత్తం ఆదాయం సైతం 28 శాతం ఎగసి రూ. 1,918 కోట్లకు చేరింది. గత క్యూ1లో రూ. 1,502 కోట్ల టర్నోవర్ నమోదైంది. ఈ కాలంలో రూ. 72 కోట్ల నిర్వహణ లాభం(ఇబిటా) సైతం సాధించినట్లు కంపెనీ పేర్కొంది. ఇతర ఆదాయం పెరగడం సైతం ఇందుకు దోహదపడినట్లు తెలియజేసింది.

ఫలితాల నేపథ్యంలో పేటీఎమ్ షేరు 3.4 శాతం బలపడి రూ. 1,053 వద్ద ముగిసింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..	
రూ.కోటిలోపు ఫ్లాట్ల అమ్మకాలు డీలా	ఐఎంఎఫ్‌కు గీతా గోపీనాథ్ గుడ్‌బై

రిలయన్స్, ఐటీ షేర్లు పడేశాయ్..

- ఆరంభ లాభాలు ఆవిరి
- సూచీలకు స్వల్ప నష్టాలు



ముంబై: ఆరంభ లాభాలు కోల్పోయిన స్టాక్ సూచీలు మంగళవారం స్వల్ప నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 14 పాయింట్లు నష్టపోయి 82,187 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 30 పాయింట్లు కోల్పోయి 25,061 వద్ద నిలిచింది. ఉదయం సానుకూలంగా మొదలైన సూచీలు ట్రేడింగ్ ఆరంభంలోనే ఓ మోస్తారు లాభాలు గడించాయి. ఒక దశలో సెన్సెక్స్ 338 పాయింట్లు పెరిగి 82,538 వద్ద, నిఫ్టీ 91 పాయింట్లు బలపడి 25,182 వద్ద ఇంట్రాడే గరిష్టాలు అందుకున్నాయి. అయితే భారత్ – యూఎస్‌వాణిజ్య ఒప్పందానికి తుది గడువు ఆగస్టు 1 సమీపిస్తున్నా.. డీల్‌పై ఎలాంటి స్పష్టత రాకపోవడం, విదేశీ ఇన్వెస్టర్ల లాభాల స్వీకరణ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ముఖ్యంగా రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు ఐటీ షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో సూచీల ఆరంభ లాభాలన్నీ ఆవిరయ్యాయి. ఇండెక్సుల వారీగా బీఎస్‌ఈలో రియల్టీ 1%, టెలికమ్యూనికేషన్, ఆటో, ఐటీ, టెక్ షేర్లు అరశాతం నష్టపోయాయి.

- అంచనాలకు మించి క్యూ1 ఆర్థిక ఫలితాలు ప్రకటనతో డెలివరీ దిగ్గజం ఎటర్నల్ షేరు రెండో రోజూ రాణించింది. బీఎస్‌ఈలో 11% పెరిగి రూ.300 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 15% ఎగసి రూ.312 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. గత రెండు ట్రేడింగ్ సెషన్‌లో కంపెనీ మార్కెట్ విలువ రూ.41,013 కోట్లు పెరిగి రూ.2.89 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ నిఫ్టీల్లో అత్యధికంగా లాభపడిన షేరు ఇదే.

శాంతి గోల్డ్ @ రూ. 189-199

న్యూఢిల్లీ: బంగారు ఆభరణాల తయారీ సంస్థ శాంతి గోల్డ్ ఇంటర్నేషనల్ పబ్లిక్ ఇష్యూకి రూ. 189–199 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 25న ప్రారంభమై 29న ముగియనుంది. దీనిలో భాగంగా 1.81 కోట్ల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. తద్వారా రూ. 360 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. కంపెనీ ప్రధానంగా విభిన్న బంగారు ఆభరణాల డిజైన్, తయారీలో కార్యకలాపాలు విస్తరించింది. ప్రస్తుతం వార్షికంగా 2,700 కేజీల బంగారు ఆభరణాల తయారీ సామర్థ్యాన్ని కలిగి ఉంది.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం– తెలుగు
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–జనరల్ స్టడీస్–బయాలజీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం–రీజనింగ్



ఎన్‌ఐఆర్‌డీపీఆర్, హైదరాబాద్‌లో 13 ప్రాజెక్ట్ ఆఫీసర్ పోస్టులు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్(ఎన్‌ఐఆర్‌డీపీఆర్).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ప్రాజెక్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 13.
» **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ ఆఫీసర్–09, జూనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్–04.
» **విభాగాలు:** లీగల్, ఐఈసీ, ప్లానింగ్ అండ్ మానిటరింగ్, సెక్యూర్, ఎంఐఎస్ అండ్ డీబీటీ, ఫైనాన్స్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్/బీఈ, ఎల్‌ఎల్‌బీ, పీజీ, పీజీ డిప్లొమాలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 60 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు ప్రాజెక్ట్ ఆఫీసర్‌కు రూ.1,40,000, జూనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్‌కు రూ.1,00,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.07.2025
» **వెబ్‌సైట్:** http://career.nirdpr.in

నిట్ వరంగల్‌లో వివిధ ఉద్యోగాలు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్), వరంగల్.. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 05.
» **పోస్టుల వివరాలు:** ప్రిన్సిపల్ సైంటిఫిక్/టెక్నికల్ ఆఫీసర్–03, ప్రిన్సిపల్ ఎస్ఏఎస్ ఆఫీసర్ –01, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(సివిల్)–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్/బీఈ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు 35 ఏళ్లు, ప్రిన్సిపల్ ఎస్ఏఎస్ ఆఫీసర్, సైంటిఫిక్/టెక్నికల్ ఆఫీసర్‌కు 56 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు ప్రిన్సిపల్ ఎస్ఏఎస్ ఆఫీసర్, సైంటిఫిక్/టెక్నికల్ ఆఫీసర్‌కు రూ.1,44,200, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు రూ.56,100
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.08.2025
» **వెబ్‌సైట్:** https://nitw.ac.in

రైట్ లిమిటెడ్‌లో 14 పోస్టులు

గుడ్‌గావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్(రైట్స్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో మేనేజర్, ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 14.
» **పోస్టుల వివరాలు:** మేనేజర్(సివిల్)–02, అసిస్టెంట్ మేనేజర్(సివిల్)–04, ఇంజనీర్ (సివిల్)–08.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(సివిల్ ఇంజనీరింగ్)లో ఉత్తీర్ణతతో పాటు రెండు నుంచి ఏడేళ్ల పని అనుభవం ఉండాలి.
» **వయసు:**18.08.2025 నాటికి 40 ఏళ్లు ఉండాలి
» **వేతనం:** నెలకు మేనేజర్‌కు రూ.50,000 నుంచి రూ.1,60,000, అసిస్టెంట్ మేనేజర్‌కు రూ.40,000 నుంచి రూ.1,40,000, ఇంజనీర్‌కు రూ.23,340.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తులకు చివరితేది:** 18.08.2025.
» **హాల్‌టికెట్ డౌన్‌లోడ్ తేది:** 22.08.2025.
» **రాతపరీక్ష తేది:** 30.08.2025.
» **వెబ్‌సైట్:** https://www.rites.com

ఆర్‌ఆర్‌సీ-సౌత్ వెస్ట్రన్ రైల్వేలో 904 అప్రెంటిస్‌లు

రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్‌ఆర్‌సీ) సౌత్ వెస్టర్న్ రైల్వే(ఎస్‌డబ్ల్యూఆర్) హుబ్బళ్లి, మైసూరు, బెంగళూరు డివిజన్లలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 904.
» **విభాగాలు:** ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్, కార్పెంటర్, పెయింటర్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్ నుంచి ఇంటర్, పదో తరగతి, ఐటీఐలో ఉత్తీర్ణులైఉండాలి.
» **వయసు:** 13.08.2025 నాటికి 15 నుంచి 24 ఏళ్ల లోపు ఉండాలి.
» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 13.08.2025.
» **వెబ్‌సైట్:** https://www.rrchubli.in

హాల్ నాసిక్‌లో 310 ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్‌లు

హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హాల్) నాసిక్ డివిజన్‌లో ట్రెనింగ్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా ఒక సంవత్సరం పాటు ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 310.

ఖాళీల వివరాలు

» **రెండేళ్ల ఐటీఐ ట్రేడ్స్:** ఫిట్టర్–128, టూల్–డై మేకర్(జిగ్–ఫిక్చర్)–04, టూల్–డై మేకర్(డై–మోల్డ్)–04, టర్నర్–20, మెషినిస్ట్–17, మెషినిస్ట్(గ్రైండర్)–07, ఎలక్ట్రీషియన్–27, ఎలక్ట్రానిక్స్ మెకానిక్–06, డ్రాఫ్ట్స్‌మ్యాన్(మెకానికల్)–04, మెకానిక్(మోటార్ వెహికల్)–05, రిఫ్రిజిరేషన్–ఎయిర్ కండిషనింగ్ మెకానిక్–04, పెయింటర్(జనరల్)–07, ఆపరేటర్ అడ్వాన్స్‌డ్ మెషిన్ టూల్స్–03.
» **ఏడాది ఐటీఐ ట్రేడ్స్:** కార్పెంటర్–04, షీట్ మెటల్ వర్కర్–06, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్(సీవోపీఏ)–50, వెల్డర్(గ్యాస్–ఎలక్ట్రిక్)–10, స్టెనోగ్రాఫర్(ఇంగ్లిష్)–03, ఫుడ్ ప్రొడక్షన్(జనరల్)–01.
» **అర్హత:** ఎన్‌సీవీటీ లేదా ఎస్‌సీవీటీ గుర్తింపు పొందిన సంస్థల నుంచి సంబంధిత ట్రేడుల్లో ఐటీఐ పూర్తిచేసి ఉండాలి. ఇప్పటికే అప్రెంటిస్‌షిప్ పూర్తిచేసిన లేదా ప్రస్తుతం చేస్తున్న వారు అర్హులు కాదు.
» **స్టైపెండ్:** నెలకు రెండేళ్ల ట్రేడ్స్‌కు రూ.8,050, ఒక సంవత్సరం ట్రేడ్స్‌కు రూ.7,700.
» **ఎంపిక విధానం:** విద్యార్హతల మెరిట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** రిజిస్ట్రేషన్ అయి గూగుల్ లింక్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 02.09.2025.
» **డాక్యుమెంట్ల పరిశీలన:** సెప్టెంబర్ రెండో వారంలో
» **జాయినింగ్ తేది:** అక్టోబర్ 1వ లేదా 2వ వారంలో
» **వెబ్‌సైట్:** https://hal-india.co.in

ఐబీలో ఆఫీసర్ కొలువు

» 3,717 ఏసీఐఓ-2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్
» ఏదైనా డిగ్రీతో పోటీ పడొచ్చు
» టైర్-1, టైర్-2 పరీక్షలు, ఇంటర్వ్యూతో ఎంపిక
» ప్రారంభంలోనే నెలకు రూ.లక్ష వరకూ వేతనం

భారత ప్రభుత్వ హోంమంత్రిత్వ శాఖకు చెందిన ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ) భారీగా ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 3,717 అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ గ్రేడ్(ఏసీఐఓ) -2 పోస్టులకు ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నట్లు ప్రకటించింది. దీనిద్వారా జనరల్ సెంట్రల్ సర్వీస్, గ్రూప్ సీ(నాన్ గెజిటెడ్, నాన్ మినిస్టీరియల్) పోస్టులను భర్తీ చేయనుంది. ఈ నేపథ్యంలో.. అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ గ్రేడ్-2/ ఎగ్జిక్యూటివ్ ఎగ్జామినేషన్-2025 వివరాలు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర సమాచారం..

- **నోటిఫికేషన్:** అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ గ్రేడ్–2/ఎగ్జిక్యూటివ్ ఎగ్జామినేషన్–2025.
- **మొత్తం పోస్టుల సంఖ్య:** 3,717(అన్ రిజర్వ్‌డ్ –1,537 పోస్టులు,ఈడబ్ల్యూఎస్–442 పోస్టులు, ఓబీసీ–946 పోస్టులు, ఎస్సీ–566 పోస్టులు, ఎస్టీ– 226 పోస్టులు).

అర్హతలు

గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం ఉంటే అదనపు అర్హతగా పరిగణిస్తారు.

వయసు

10.08.2025 నాటికి 18–27 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

వేతనం

లెవెల్ 7 ప్రకారం–వేతన శ్రేణి రూ.44,900 –రూ.1,42,400తోపాటు కేంద్ర ప్రభుత్వ అలవెన్సులు లభిస్తాయి. అన్నీ కలుపుకొని ప్రారంభంలోనే నెలకు రూ.లక్ష వరకూ వేతనం పొందే అవకాశం ఉంది.

ఎంపిక ప్రక్రియ

ఆన్‌లైన్ రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. రాత పరీక్షలో భాగంగా టైర్ 1(ఆబ్జెక్టివ్ తరహా), టైర్ 2(డిస్క్రిప్టివ్ టెస్ట్) ఉంటాయి.

వంద మార్కులకు టైర్ 1

టైర్ 1 రాత పరీక్షలో 100 మార్కులకు ఆబ్జెక్టివ్ తరహా మల్టిపుల్ ఛాయిస్(ఎంసీక్యూ) ప్రశ్నలు ఉంటాయి. ఇందులో కరెంట్ అఫైర్స్ 20 ప్రశ్నలు–20 మార్కులకు, జనరల్ స్టడీస్ 20 ప్రశ్నలు–20 మార్కులకు, న్యూమరికల్ అప్టిట్యూడ్ 20 ప్రశ్నలు –20 మార్కులకు, రీజనింగ్/లాజికల్ అప్టిట్యూడ్ 20 ప్రశ్నలు–20 మార్కులకు, ఇంగ్లిష్ 20 ప్రశ్నలు –20 మార్కులకు అడుగుతారు. టైర్ 1 రాత పరీక్షలో నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి పొరపాటు సమాధానానికి 1/4 వంతు మార్కును తగ్గిస్తారు. పరీక్ష సమయం ఒక గంట. టైర్ 1 పరీక్షలో ప్రతిభ, రిజర్వేషన్ కేటగిరీ ఆధారంగా ఒక్కో పోస్టుకు పది మందిని చొప్పున టైర్ 2 పరీక్షకు ఎంపిక చేస్తారు. అయితే టైర్ 1 పరీక్షలో అభ్యర్థులు కనీస అర్హత మార్కులు సాధించాల్సి ఉంటుంది. వంద మార్కులకు అన్ రిజర్వ్‌డ్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు కనీసం 35 మార్కులు, ఓబీసీలు కనీసం 34 మార్కులు, ఎస్సీ/ఎస్టీలు కనీసం 33 మార్కులు సాధించాలి.

టైర్ 2 డిస్క్రిప్టివ్ పరీక్ష


టైర్ 2 పరీక్షను వ్యాసరూప విధానంలో 50 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో ఎస్సేకు 20 మార్కులు, ఇంగ్లిష్ కాంప్రహెన్షన్‌కు 10 మార్కులు, ఒక్కోటి పది మార్కులకు చొప్పున 2 దీర్ఘ సమాధాన ప్రశ్నలు(20 మార్కులకు) అడుగుతారు. కరెంట్ అఫైర్స్, ఎకనామిక్స్, సామాజిక–రాజకీయ అంశాలపై దీర్ఘ సమాధాన ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం ఒక గంట.

టైర్-3/ఇంటర్వ్యూ

ఎంపిక ప్రక్రియ మూడో దశ టైర్–3లో భాగంగా ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. టైర్1, టైర్2 రెండింటిలో అభ్యర్థుల ప్రతిభతోపాటు రిజర్వేషన్ కేటగిరీల వారీగా ఒక్కో పోస్టుకు ఐదుగురిని చొప్పున ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. టైర్2లో 50 మార్కులకు కనీసం 17 మార్కులు సాధించాల్సి ఉంటుంది.

తుది ఎంపిక ఇలా

టైర్1, టైర్2, టైర్3ల్లో అభ్యర్థులు చూపిన ఉమ్మడి ప్రతిభతోపాటు రిజర్వేషన్ కేటగిరీల వారీగా మెరిట్ జాబితాను రూపొందిస్తారు. ఈ జాబితాలో నిలిచిన అభ్యర్థులకు వైద్య పరీక్షలు, సరిఫికెట్ల పరిశీలన, వ్యక్తిత్వం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని తుది విజేతలను ప్రకటిస్తారు.



విజయం సాధించేలా

- కీలకమైన టైర్1 పరీక్షలో విజయం సాధించేందుకు కరెంట్ అఫైర్స్, జనరల్ స్టడీస్, న్యూమరికల్ అప్టిట్యూడ్, రీజనింగ్, ఇంగ్లిష్ అంశాలపై పట్టు సాధించాల్సి ఉంటుంది.
- ఇందుకోసం మొదట సిలబస్‌ను సమగ్రంగా విశ్లేషించాలి. ఆ తర్వాత గత ప్రశ్న పత్రాల ఆధారంగా ముఖ్యమైన టాపిక్స్‌ను గుర్తించాలి. ప్రశ్నలు ఏవిధంగా, ఏ స్థాయిలో అడుగుతున్నారో గమనించాలి. దానికి అనుగుణంగా ప్రిపరేషన్ సాగించాలి.
- కరెంట్ అఫైర్స్ కోసం ప్రతి రోజూ ఏదైనా ప్రామాణిక దినపత్రికను అనుసరించాలి. కనీసం ఆరు నెలల కాలానికి సంబంధించిన ముఖ్యమైన జాతీయ, అంతర్జాతీయ పరిణామాలను నోట్స్‌లో రాసుకోవాలి.
- ఎక్కువ స్కోరింగ్‌కు అవకాశం ఉండే ఇంగ్లిష్ కోసం గ్రామర్‌తోపాటు వొక్యాబులరీపై పట్టు సాధించాలి.
- అప్టిట్యూడ్ కోసం 9,10వ తరగతి గణితంతో ప్రిపరేషన్ ప్రారంభించాలి. అరిథమెటిక్‌ను బాగా ప్రాక్టీస్ చేయాలి. దీంతోపాటు నంబర్ సిరీస్, బాడ్‌మాస్, సింప్లిఫికేషన్స్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్‌పై పట్టు బిగించాలి.
- రీజనింగ్ విభాగంలో రాణించేందుకు పజిల్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, సిలాజిజమ్స్, కోడింగ్–డీకోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, కాజ్ అండ్ ఎఫెక్ట్, డేటా సఫిషియన్సీ అంశాలపై పట్టు సాధించాలి.
- అన్ని విభాగాలకు సంబంధించి సాధ్యమైనన్ని ఎక్కువ మోడల్ ప్రశ్నలు, పాత పేపర్లు ప్రాక్టీస్ చేయాలి.
- టైర్ 2లో రాణించేందుకు ఇంగ్లిష్‌పై పట్టుతో పాటు రాత నైపుణ్యం పెంచుకోవాలి. ఇందుకోసం ప్రామాణిక ఇంగ్లిష్ దిన పత్రికల ఎడిటోరియల్ వ్యాసాలు ఉపయోగపడతాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం:** 19.07.2025
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 10.08.2025
- **వెబ్‌సైట్:** https://www.mha.gov.in/en, https://www.ncs.gov.in

వీనస్ దాకా వెళ్లే గీత లేదు మరి..

అరచేతి గీతల్లోనే అంతా ఉందంటారు..
గీత సరిగా లేకుంటే..
తలరాతే మారిపోతుందంటారు..
మనుషుల వరకూ ఓకే..
మరి ఇదే 'గీత' సిద్ధాంతం
అంతరిక్ష నౌకలకు కూడా వర్తిస్తే..
గీత సరిగా లేక.. వాటి 'బతుకు' రాతే మారిపోతే..
సరిగ్గా 63 ఏళ్ల క్రితం జరిగింది ఇదే!!



అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా.. భూమికి ఆవల ఉన్న గ్రహాలపై తన తొలి ప్రయోగాలు కొనసాగిస్తున్న సమయం అది.. వీనస్(శుక్రుడు)పై అధ్యయనానికి మెరైనర్–1ను సిద్ధం చేసింది. శుక్ర గ్రహం మీద ఉన్న వాతావరణం, అక్కడి అయస్కాంత క్షేత్రాలు, రేడియేషన్ తదితరాలపై సమాచారాన్ని తెలుసుకోవడానికి దీన్ని తయారుచేశారు. 1962, జూలై 22న దీన్ని ప్రయోగించారు. మొదట్లో అంతా సరిగానే నడిచింది. తర్వాత రాకెట్ ప్రయాణించాల్సిన దిశ మారింది. అదలాగే కొనసాగితే.. ఉత్తర అట్లాంటిక్ సముద్రంలో నౌకలు అధికంగా తిరిగే ప్రదేశంలో పడే ప్రమాదం ఉంది. దీంతో రేంజ్ సేఫ్టీ ఆఫీసర్ దాన్ని ధ్వంసం చేయడానికి కమాండ్ ఇచ్చారు. ప్రయోగించిన 294 సెకన్ల తర్వాత మెరైనర్–1ను గాల్లోనే పేల్చేశారు.

శుక్ర మహా'దిశ' సరిగాలేక...

ఈ వైఫల్యానికి కారణంపై ఉన్నతస్థాయి సమీక్ష జరిగింది. చివరికి ఓ చిన్న గీత.. మొత్తం అంతరిక్ష నౌక అదృష్ట గీతనే మార్చేసిందని తేల్చారు. రాకెట్ దిశను నిర్దేశించే సాఫ్ట్‌వేర్‌లో ఓవర్‌బార్(పైన రాసే గీత) మిస్ చేయడం వల్ల ఇది జరిగిందని గుర్తించారు. ఒక ఈక్వేషన్‌లో రేడియస్‌కు $\bar{R}$ కు బదులు R వచ్చింది. అంతే.. రాకెట్ దిశ మారిపోయింది. దీని వల్ల నాసా ఎంతో విలువైన పాఠాన్ని నేర్చుకుంది. ఈ ప్రయోగం కోసం ఖర్చు పెట్టిన రూ.160 కోట్లు పోవడం సంగతి పక్కనపెడితే.. కోడింగ్ కావచ్చు.. మరేదైనా కావచ్చు.. ఉపగ్రహ ప్రయోగాల్లో చేసే చిన్నపాటి తప్పులు మొత్తం మిషన్ వైఫల్యానికి ఎలా దారి తీస్తాయన్నది తెలుసుకుంది. అయితే, మెరైనర్–1 వైఫల్యం భవిష్యత్ ప్రయోగాలకు బాగా పనికివచ్చింది. తదుపరి మిషన్లన్నిటిలోనూ ప్రతి అంశాన్ని ఒకటికి రెండుసార్లు చెక్ చేయడం అన్నది పరిపాటిగా మారింది.

గీత మారిందిలా..



మెరైనర్–1 నమూనా

– సాక్షి సెంట్రల్ డెస్క్

జీపీఓలో ఏపీటీ 2.0 సేవలు!

ప్రారంభించిన తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ పీవీఎస్ రెడ్డి



ఏపీటీ 2.0 ప్రాజెక్టును ప్రారంభిస్తున్న తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ డాక్టర్ పీవీఎస్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: పోస్టల్ శాఖ ఐటీ సంస్కరణలో భాగంగా అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ (ఏపీటీ) 2.0 ప్రాజెక్టు అమలును నగరంలోని జనరల్ పోస్టాఫీసులో మంగళవారం తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ పీవీఎస్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సర్కిల్‌లోని 5,727 పోస్టాఫీసులు, 32 హెడ్ పోస్టాఫీసులు, 689 సబ్ పోస్టాఫీసులు, 5,006 బ్రాంచ్ పోస్టాఫీసుల్లో ఏపీటీ 2.0 ప్రాజెక్టు సేవలను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం కౌంటర్ సేవలు, కస్టమర్ డోర్‌స్టెప్, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్, ఫ్రాంచైజ్ ఔట్‌లెట్‌ల సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆబ్కారీశాఖలో ఘనంగా బోనాల ఉత్సవాలు

సాక్షి, హైదరాబాద్: ఆబ్కారీ భవన్‌లో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ వేడుకల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఎక్సైజ్ శాఖ ఉద్యోగులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో టీజీబీసీఎల్ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, అడిషనల్ కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషి, జాయింట్ కమిషనర్ రాథోడ్ సురేశ్, రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ పి.దశరథ్, కార్యక్రమ నిర్వాహకులు విజయలక్ష్మి తదితరులున్నారు.

మెడికల్ యూజీ, పీజీ పరీక్షల్లో జంబ్లింగ్

ఇప్పటివరకు సొంత కాలేజీల్లోనే పరీక్షలు
దీనివల్ల అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు
వచ్చే ఏడాది నుంచి జంబ్లింగ్ అమలుకు నిర్ణయం!
కాళోజీ వర్సిటీ వినతికి ప్రభుత్వం కూడా సమ్మతి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వైద్య విద్యపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించింది. ప్రైవేటు మెడికల్ కళాశాలల్లో కనీస మౌలిక వసతులు లేవని ఇప్పటికే నిర్ధారణకు వచ్చిన ప్రభుత్వం.. ఎంబీబీఎస్, మెడికల్ పీజీ పరీక్షలు, ప్రాక్టికల్స్ అన్నీ సొంత కళాశాలలనే పరీక్ష కేంద్రాలుగా మార్చి నిర్వహిస్తున్న విధానాన్ని మార్చాలని భావిస్తోంది. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు జరుగుతున్న పరీక్షల తరహాలో జంబ్లింగ్ విధానంలో పరీక్ష కేంద్రాలను ఇతర మెడికల్ కళాశాలల్లోకి మార్చాలని ప్రాథమికంగా నిర్ణయించారు. కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం కూడా ప్రభుత్వానికి ఈ మేరకు నివేదిక పంపినట్లు తెలిసింది. వచ్చే ఏడాది ఎంబీబీఎస్, పీజీ పరీక్షల నుంచే ఈ జంబ్లింగ్ విధానాన్ని అమలు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. రాష్ట్రంలో 34 ప్రభుత్వ, 26 ప్రైవేటు, డీమ్డ్ యూనివర్సిటీ పరిధిలో రెండు మెడికల్ కళాశాలలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి మరో రెండు ఉన్నాయి. ఎంబీబీఎస్, బీడీఎస్‌తో పాటు పీజీ మొదటి సంవత్సరం నుంచి చివరి సంవత్సరం వరకు పరీక్షలన్నీ ఆయా సొంత కళాశాలల్లోనే నిర్వహిస్తున్నారు. దీంతో పరీక్షల్లో అవకతవకలు సర్వసాధారణంగా మారాయని ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లాయి. మాస్ కాపీయింగ్‌తోపాటు ప్రాక్టికల్స్ ఫాల్స్‌గా మారాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో జంబ్లింగ్ విధానంలో పక్క జిల్లాల్లోని ప్రైవేటు, ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పరీక్ష కేంద్రాలుగా మార్చాలని నిర్ణయించినట్లు తెలిసింది. చిన్న జిల్లాల్లో కూడా ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఉండడం, అన్ని చోట్ల ప్రాక్టికల్స్ కోసం ప్రభుత్వ ఆస్పత్రులు అందుబాటులో ఉండడంతో జంబ్లింగ్ విధానం కష్టం కాదని విశ్వవిద్యాలయం నివేదిక సిద్ధం చేసినట్లు సమాచారం.

ప్రైవేటు కాలేజీల నుంచి వ్యతిరేకత!

జంబ్లింగ్ విధానంలో వార్షిక పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వ కళాశాలల నుంచి పెద్దగా అభ్యంతరాలు వచ్చే అవకాశం లేదు. కానీ ప్రైవేటు కళాశాలల నుంచే వ్యతిరేకత వస్తుందని కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం, ప్రభుత్వం భావిస్తున్నాయి. ఇటీవల ప్రైవేటు వైద్య కళాశాలల్లో ఎన్ఎంసీ నిబంధనల మేరకు మౌలిక వసతులు, మెడికల్ ప్రాక్టీస్ సదుపాయాలు ఉన్నాయో లేదో తెలుసుకునేందుకు యూనివర్సిటీ వీసీ, ఇతర వైద్యాధికారులు ఆకస్మిక తనిఖీలు చేయడాన్నే జీర్ణించుకోక ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేశారు. అయినా ఇప్పటివరకు 12 మెడికల్ కళాశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇదే పద్ధతిలో ప్రైవేటు కళాశాలలు వ్యతిరేకించినా, జంబ్లింగ్ విధానంలో పరీక్షలు నిర్వహించాలని, వచ్చే సంవత్సరం నుంచే ఈ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారని సమాచారం. అలాగే అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయించినట్లు తెలిసింది. ఈ విషయాన్ని కాళోజీ నారాయణరావు విశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ నందకుమార్ రెడ్డి ధ్రువీకరించారు.

ముందు 4 కోర్సులతో మొదలు



అందుబాటులోకి ఎర్త్ సైన్సెస్ వర్సిటీ
కొత్తగూడెంలో నేడు సమావేశమవనున్న ఉన్నతాధికారులు

సాక్షి హైదరాబాద్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని మైనింగ్ కాలేజీని రాష్ట్ర ప్రభుత్వం రూ. 500 కోట్ల బడ్జెట్‌తో ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా ఉన్నతీకరించడంతో ఈ విద్యా సంవత్సరం నుంచి నాలుగు ప్రధాన కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. 312 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ వర్సిటీకి ప్రభుత్వం దివంగత ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరు పెట్టడం తెలిసిందే. ఈ వర్సిటీలో స్థానిక పరిస్థితులు, అంతర్జాతీయ ప్రమాణాలు, ఉద్యోగ అవకాశాలే లక్ష్యంగా కోర్సులు అందించనున్నారు. తొలి దశలో జియో ఫిజిక్స్, జియో కెమిస్ట్రీ, జియాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ కోర్సుల్లో ప్రవేశాలు చేపట్టనున్నారు. డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ (దోస్త్) పరిధిలోనే కోర్సుల ప్రవేశాలు జరగనున్నాయి. ఇందుకోసం 'దోస్త్' ప్రత్యేక విడత నిర్వహించాలని నిర్ణయించారు. ఈ అంశంపై వర్సిటీ తాత్కాలిక వీసీ, విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ తదితరులు బుధవారం కొత్తగూడెంలో సమీక్షించనున్నారు. ఈ నెల 25న ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఒక్కో కోర్సులో 60 సీట్లు ఉంటాయని అధికారులు తెలిపారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ నేపథ్యంతో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఈ కోర్సుల్లో ప్రవేశానికి అర్హులు. తదుపరి దశల్లో ప్లానెటరీ జియాలజీ, జియోమార్ఫాలజీ, స్ట్రక్చరల్ జియాలజీ, మినరాలజీ, ఎన్విరాన్‌మెంటల్ జియాలజీ వంటి కోర్సులను ప్రవేశపెట్టాలని అధికారులు భావిస్తున్నారు.

ఉపాధి అవకాశాలే లక్ష్యం

భద్రాద్రి కొత్తగూడెం ప్రాంతంలో సింగరేణి గనులున్నాయి. తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఉంది. నవభారత్, బయ్యారం మైన్స్, మైలారం కాపర్ మైన్స్ వంటివి కూడా అక్కడే ఉన్నాయి. దీంతో ఎర్త్ సైన్సెస్ కోర్సులు పరిశోధన స్థాయికి చేరువగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఆన్‌లైన్ విధానం ద్వారా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్లాసులను సైతం అందించే వీలుందని అధికారులు అంటున్నారు. దీంతో యువతకు ఈ కోర్సుల ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని చెబుతున్నారు.

టెట్‌లో 59,692 మంది పాస్



పేపర్–1లో 61.50 శాతం..
పేపర్–2లో 33.98 శాతం అర్హత
గతం కన్నా 2 శాతం పెరిగిన ఉత్తీర్ణత

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీజీ టెట్–2025)లో 59,692 మంది అర్హత సాధించారు. గత ఏడాది (2024)తో పోలిస్తే ఈసారి 2% ఎక్కువ మంది అర్హత సాధించారు. జూన్ 18 నుంచి 30వ తేదీ వరకు 16 సెషన్స్‌లో నిర్వహించిన టెట్ పరీక్ష ఫలితాలను మంగళవారం విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్య డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

పెరిగిన పాస్ శాతం: డీఎడ్ అర్హత గల పేపర్–1ను 47,224 మంది రాయగా 29,043 (61.50%) అర్హత సాధించారు. బీఎడ్ అర్హత గల పేపర్–2లో మేథ్స్, సైన్స్ పేపర్‌ను 48,998 రాయగా, 17,574 (35.87%) అర్హత పొందారు. సోషల్ స్టడీస్ పేపర్‌ను 41,207 మంది రాయగా, వీరిలో 13,075 (31.73 శాతం) అర్హత సాధించారు. 2024లో రెండు సార్లు టెట్ నిర్వహించారు. రెండో విడత టెట్ పేపర్–1లో 59.48 శాతం అర్హత పొందితే, ఈసారి 61.50 శాతం అర్హత సాధించారు. పేపర్–2లో 2024లో 31.21 శాతం అర్హత సాధిస్తే, ఈసారి 33.98 శాతం అర్హత సాధించారు.

డీఎస్సీపై ఆశలు: టెట్ ఫలితాలు ప్రకటించటంతో ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టులపై నిరుద్యోగుల్లో ఆశలు పెరుగుతున్నాయి. గత ఏడాది డీఎస్సీలో 10 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశారు. జాబ్ కేలండర్ ప్రకారం ఈ ఏడాది డీఎస్సీకి నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంది. ఈ సంవత్సరం 6 వేల పోస్టులను భర్తీ చేస్తామని గత డీఎస్సీ ఫలితాల సందర్భంగా ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ పాఠశాలల్లో పదవీ విరమణ పొందిన వారు, ఖాళీగా ఉన్న పోస్టులు కలుపుకుని మొత్తంగా 10 వేల ఖాళీలుంటాయని అధికారులు లెక్కగట్టారు.

2014 నుంచి టెట్ అర్హత ఇలా...

సంవత్సరం	పేపర్-1	పేపర్-2
2014	61.86	28.56
2016	54.45	25.04
2017	57.37	19.51
2022	32.68	49.64
2023	36.89	15.30
2024	67.13	34.18
2024	59.48	31.21
2025	61.50	33.98

నోట్: 2024లో టెట్ రెండు సార్లు నిర్వహించారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



మంచిర్యాల పట్టణ శివారులో నీరులేక వెలవెలబోతున్న గోదావరి నది

గోదారమ్మా.. ఆ పరవళ్లు ఏవమ్మా..!

గోదావరి నది బేసిన్‌లో ఆశించిన మేర వర్షాలు కురవడం లేదు. దీంతో నదిలో నీటి ప్రవాహం లేక వెలవెలబోతోంది. ఎగువన మహారాష్ట్ర నుంచి కూడా వరద రావడం లేదు. ఎండాకాలంలో మాదిరిగానే గోదావరిలో చిన్న పాయ పారుతోంది. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల మధ్యనున్న శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 20 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 8 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. వర్షాలు కురిసినప్పుడు నదిలోకి లక్షల క్యూసెక్కుల నీరు చేరేది. ప్రస్తుతం వెయ్యిలోపే ఉంటోంది. ప్రాణహితలో వరద కారణంగా కాళేశ్వరం దిగువన నదిలో కొంతమేర ప్రవాహం ఉన్నా ఎగువన మాత్రం ఆ నీటి పరవళ్లు కనిపించడం లేదు.

-సాక్షి ప్రతినిధి, మంచిర్యాల



క్రమపద్ధతిలో నాట్లు వేస్తున్న బెంగాల్ కూలీలు

నీట్‌గా వరినాట్లు !

వర్షాలు జోరందుకోవడంతో ఇప్పటికే వరి నారు సిద్ధం చేసుకున్న రైతులు నాట్లు వేయించడంలో నిమగ్నమయ్యారు. ఖమ్మం జిల్లాలో సాగర్ ఆయకట్టు ఉన్న నేపథ్యాన కొన్నేళ్లుగా పశ్చిమ బెంగాల్ నుంచి కూలీలు వచ్చి నాట్లు వేస్తున్నారు. ఈసారి కూడా వచ్చిన కూలీలు నేలకొండపల్లి మండలంలో తాడు కట్టి క్రమపద్ధతిలో నాట్లు వేస్తుండటం ఆకట్టుకుంటోంది. ఇలా నాట్లు వేయడం వల్ల మందుల పిచికారీ, కలుపు తీయడం సులువుగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఏటా బెంగాల్ కూలీలకు డిమాండ్ పెరుగుతోంది. ఒకేరోజు 14–15 మంది కలిసి ఐదెకరాల్లో నాట్లు పూర్తిచేస్తున్న నేపథ్యంలో వీరితో రైతులు ముందుగానే ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు.

- రాధారపు రాజు, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం




కలరేసుకుంటేనే కడుపు నిండుతుంది కన్నా..

ఓ తల్లి తన కొడుకుకు రంగు పూసి భిక్షాటన చేసేందుకు సిద్ధం చేస్తున్న ఈ ఫొటో సూర్యాపేట జిల్లా కేంద్రంలో మంగళవారం కనిపించింది. ఇలా వారు రోజంతా పట్టణంలో తిరిగి భిక్షాటన చేసి కడుపు నింపుకుంటారు.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట

ఊహాగానాలతో నిర్ణయాలు కుదరదు

- ట్రాన్స్‌పోర్ట్ వాహనాన్ని నాన్-ట్రాన్స్‌పోర్టుగా.. మార్చకుండా నిబంధనలు ఉన్నాయా?
- రవాణా శాఖ తీరుపై హైకోర్టు అసహనం



సాక్షి, హైదరాబాద్‌: అక్రమ వినియోగానికి, రోడ్డు ప్రమాదాలకు అవకాశం ఉంటుందన్న ఊహాగానాలతో వాహన మార్పిడిని అడ్డుకోలేరని రవాణా శాఖ అధికారులకు హైకోర్టు స్పష్టం చేసింది. ఇన్నోవా (ట్రాన్స్‌పోర్టు) వాహనాన్ని.. మ్యాక్సీ క్యాబ్ నుంచి ఓమిని బస్ (నాన్ ట్రాన్స్‌పోర్టు)గా మార్చడానికి నిరాకరించే నిబంధనలు చట్టంలో లేనప్పుడు అందుకు ఎలా తిరస్కరిస్తారని ప్రశ్నించింది. కోర్టు ఉత్తర్వులు కాపీ అందిన నాటి నుంచి ఆరు వారాల్లో చట్టప్రకారం ఓమిని బస్‌గా మార్పు చేయాలని రవాణా శాఖకు ఆదేశాలు జారీ చేసింది. తన ఇన్నోవా వాహనాన్ని మాక్సీ క్యాబ్ నుంచి ఓమిని బస్‌గా మార్చడానికి తిరస్కరిస్తూ 2022, 2025లో రవాణా శాఖ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన రత్నాజీరావు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె శరత్ మంగళవారం విచారణ చేపట్టారు. వాహనాన్ని ఓమిని బస్‌గా మార్చేందుకు స్లాట్ బుక్ చేసుకుని పన్నులు, చార్జీల కింద రూ.2 లక్షల డీడీని కూడా పిటిషనర్ తీసుకున్నట్లు అతడి తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. వాహనం మార్పునకు అధికారులు నిరాకరించడంతో 2022లో పిటిషనర్ ఇదే హైకోర్టును ఆశ్రయించారని, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని న్యాయస్థానం ఆదేశించినా పిటిషనర్ దరఖాస్తును అధికారులు మరోసారి 2025, మార్చిలో తిరస్కరించారని చెప్పారు. వాహన మార్పు కారణంగా సర్కార్ ఆదాయానికి నష్టం వాటిల్లే అవకాశం ఉందని ప్రభుత్వ న్యాయవాది వాదించారు. అక్రమంగా వాహనాన్ని మానవ రవాణా కోసం వినియోగించే అవకాశం కూడా ఉందని అనుమానం వ్యక్తం చేశారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. మార్పిడిపై నిషేధానికి సంబంధించి రవాణా శాఖ అధికారులు ఎలాంటి నిబంధనలు సమర్పించలేదని, ఊహలతో తిరస్కరణ సరికాదని చెప్పారు. 6 వారాల్లో వాహనం మార్పిడికి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని ఆదేశించారు.

25న ఢిల్లీలో ఓబీసీ భాగీదారీ న్యాయ సమ్మేళనం

- టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి



సాక్షి, హైదరాబాద్‌: ఏఐసీసీ ఓబీసీ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 25న ఢిల్లీలో 'ఓబీసీ భాగీదారీ న్యాయ సమ్మేళనం 'నిర్వహించనున్నట్లు టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి తెలిపారు. దేశవ్యాప్తంగా ఓబీసీలకు ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ రంగాల్లో తగిన ప్రాతినిధ్యం లభించడం లేదని, దీనికి ఓ ఉద్యమాన్ని నిర్వహించాలన్న ఆలోచనతో కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం జాతీయ చైర్మన్ అనిల్ జైహింద్ ఆధ్వర్యంలో ఈ మహా సమ్మేళనాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు మంగళవారం నర్సారెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ పార్టీ ప్రముఖులు సమ్మేళనానికి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డెలిగేట్ ప్రతినిధిగా జిల్లా లేదా రాష్ట్ర యూనిట్ ద్వారా పాల్గొనాలనుకునే వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రం నుంచి ఓబీసీ ప్రతినిధులు భారీగా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

3 వారాల్లో నిర్ణయం తీసుకోండి

- వినియోగదారుల కమిషన్ ఉత్తర్వులపై 'అలయన్స్'కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్ : హైదరాబాద్ జిల్లా వినియోగదారుల కమిషన్ ఆదేశాలపై మూడు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని అలయన్స్ ఎయిర్ ఏవియేషన్ లిమిటెడ్‌ను హైకోర్టు ఆదేశించింది. అలయన్స్ ఎయిర్ సర్వీస్ లోపంపై 2022లో శ్యామ్‌సుందర్ లహోటి, మరో 31 మంది.. వినియోగదారుల కమిషన్‌లో కేసు దాఖలు చేశారు. విమానం అకస్మాత్తుగా రద్దు చేయడంతో తాము తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చిందని వారు విన్నవించుకున్నారు. వాదనలు విన్న కమిషన్.. రూ.12,80,000/- చెల్లించాలని అలయన్స్ ఎయిర్‌కు ఆదేశాలు జారీ చేసింది. కమిషన్ ఆదేశాలను అలయన్స్ ఎయిర్ అమలు చేయకపోవడంతో శ్యామ్‌సుందర్ లహోటి, ఇతరులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎన్వీ.శ్రవణ్‌కుమార్ మంగళవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. కమిషన్ ఆదేశాల అమలుపై పిటిషనర్లు సమర్పించిన వినతి పత్రాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని అలయన్స్ ఎయిర్‌ను ఆదేశించారు.



మంగళవారం జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన అసెంబ్లీ మీడియా అడ్వైజరీ కమిటీ ప్రతినిధులు

పీడితుల పక్షాన నిలిచిన కలం దాశరథి: కేసీఆర్



సాక్షి, హైదరాబాద్‌: పీడితుల పక్షాన నిలిచి తన కలం ద్వారా జనాన్ని జాగృతం చేసిన మహనీయుడు దాశరథి కృష్ణమాచార్య అని బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు కొనియాడారు. దాశరథి శత జయంతి సందర్భంగా ఆయన కృషిని ఒక ప్రకటనలో గుర్తు చేసుకున్నారు. 'జైలులో కూడా జై తెలంగాణ నినాదాన్ని వీడని యోధుడు దాశరథి. నా తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ తెలంగాణ గరిమను తన సాహిత్యం ద్వారా ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి. జైలు గోడల నడుమ నిర్బంధంలోనూ తెలంగాణ నినాదాన్ని వినిపించిన దాశరథి స్ఫూర్తిని కొనసాగించడమే దాశరథికి ఘన నివాళి'అని కేసీఆర్ పేర్కొన్నారు. 'కవిగా, రచయితగా తన రచనలతో ప్రజలలో ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన కవి దాశరథి'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు వేరొక ప్రకటనలో తెలిపారు. 'తెలంగాణ ఆత్మగౌరవాన్ని అత్యున్నత శిఖరాల మీద నిలబెట్టే దాశరథి కవిత్వం, సాహిత్యం తెలంగాణ భవిష్యత్తు తరాలకు నిత్య స్ఫూర్తిదాయకం'అని నివాళి అర్పించారు.

బీఆర్ఎస్ గుర్తింపును రద్దు చేయాలి: ఎమ్మెల్సీ అద్దంకి



సాక్షి, హైదరాబాద్‌: ప్రాంతాల మధ్య వైరుధ్యాలను సృష్టించి పబ్బం గడుపుకోవాలనేది బీఆర్ఎస్ నేతల పన్నాగమని, రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న ఆ పార్టీ గుర్తింపును రద్దు చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాజకీయాలను బీఆర్ఎస్ నేతలు గబ్బు పట్టిస్తున్నారని, లేని బనకచర్ల అంశాన్ని తెరపైకి తెచ్చి తెలంగాణ సెంటిమెంట్ రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. అసలు ఫామ్‌హౌజ్‌కే పరిమితమైన కేసీఆర్‌కు ప్రతిపక్ష నేత హోదా ఎందుకని ప్రశ్నించారు. ప్రజా వినియోగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన గాంధీభవన్‌లో అందుబాటులో ఉండి ప్రజల నుంచి పలు సమస్యలపై వినతిపత్రాలు తీసుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అందుబాటులో ప్రజాప్రతినిధుల కార్యక్రమం చాలా ఉపయోగకరమని, ప్రజలకు చేరువయ్యేలా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తీసుకున్న నిర్ణయం అభినందనీయమని అద్దంకి అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల గురించి ఎక్కువగా వినతిపత్రాలు వచ్చాయని చెప్పారు. బీఆర్ఎస్ నేతలను చూసి శకుని కూడా సిగ్గుపడే పరిస్థితి వచ్చిందని, ప్రజలు ఆ పార్టీ నేతల మాటలు నమ్మొద్దని వ్యాఖ్యానించారు.



మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ స్టేట్ పోలీస్ కంప్లైంట్స్ అథార్టీ చైర్మన్ జస్టిస్ శివశంకర్ రావు బులుసు

'మార్చి 31' లక్ష్యానికి తెలంగాణ నాయకత్వమే అడ్డుగోడ!



- ఎంసీసీ, పీపుల్స్‌వార్ విలీనంతో మావోయిస్టు పార్టీ ఏర్పాటు
- పార్టీలో తగ్గుతున్న ఎంసీసీ ప్రాబల్యం
- ఆపరేషన్ కగార్‌తో అంతమైన ఆంధ్రప్రదేశ్ నాయకత్వం
- గాజర్ల గణేశ్‌తో మొదలైన తెలంగాణ నేతల వేట

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టు పార్టీని సమూలంగా నిర్మూలించాలనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి తెలంగాణ నేతలే ప్రధాన అడ్డుగోడగా ఉన్నారు. దీంతో తెలంగాణ నేతలను లక్ష్యంగా చేసుకుని స్పెషల్ ఆపరేషన్లకు భద్రతా దళాలు శ్రీకారం చుట్టాయి. చిక్కబడ్డ అడవి, వర్షాలను లెక్క చేయకుండా బస్తర్ జంగళ్లను జల్లెడ పడుతున్నాయి.

సమ్మిళిత నాయకత్వం..

దేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో బలమైన సాయుధ విప్లవ పోరాట పంథాను అమలు చేస్తున్న పీపుల్స్‌వార్, మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ (ఎంసీసీ) 2004లో విలీనమై భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)గా ఏర్పాటైంది. అప్పటి నుంచి పదేళ్ల పాటు ఉత్తర, దక్షిణ, తూర్పు భారత దేశాలకు సంబంధించిన వారి నేతృత్వంలో మావోయిస్టులు వేగంగా విస్తరించారు. దేశంలో పది రాష్ట్రాల్లో ప్రభావం చూపించే దశకు చేరుకున్నారు. పశుపతి (నేపాల్)టు తిరుపతి వరకు గల ప్రాంతాన్ని రెడ్ కారిడార్‌గా ప్రకటించడంతో పాటు బస్తర్‌లో జనతన సర్కార్ పేరుతో సమాంతర రాజ్యాన్ని నడిపించడం ప్రారంభించారు. అయితే మావోయిస్టుల విస్తరణను అడ్డుకునేందుకు మొదట సల్వాజుడుంను ముందుకు తెచ్చి భంగపడిన కేంద్రం.. ఆ తర్వాత ఆపరేషన్ గ్రీన్‌హంట్‌తో మొదలుపెట్టి వరుసగా పలు ఆపరేషన్లు అమలు చేస్తోంది.

తగ్గిన ఎంసీసీ నేతలు

సీపీఐ మావోయిస్టు పార్టీ ఏర్పాటైనప్పుడు కేంద్ర కమిటీలో 34 మందికి పైగా సభ్యులు ఉండేవారు. ఇందులో పీపుల్స్‌వార్, ఎంసీసీ నేతలకు సముచిత స్థానం లభించింది. కానీ ప్రభుత్వాలు చేపట్టిన యాంటీ నక్సల్స్ ఆపరేషన్లలో మొదట ఎంసీసీకి చెందిన నేతలు ఎక్కువ మంది అరెస్ట్ కావడం లేదా ఎన్‌కౌంటర్లలో, కొందరు అనారోగ్య కారణాలతో చనిపోయారు. 2006 నుంచి 2025 వరకు పరిశీలిస్తే సుశీల్‌రాయ్ (2005), జాంటూ ముఖర్జీ (2006), ప్రమోద్ మిశ్రా (2008), కోబడ్ గాంధీ (2009), అమితాబ్ బాగ్చీ (2009), జగదీశ్‌యాదవ్ (2011), నారాయణ్ సన్యాల్ (2011), అరవింద్ (2018), ప్రశాంత్‌బోస్ (2021), ప్రయాగ్ మాంఝీ (2025).. మొత్తంగా పదిమంది అగ్రనేతలు సాయుధ విప్లవ ఉద్యమానికి దూరమయ్యారు. ఇదే సమయంలో పీపుల్స్‌వార్‌కు చెందిన వారిలో చెరుకూరి రాజ్‌కుమార్ అలియాస్ ఆజాద్ (2010), మల్లోజుల కోటేశ్వరరావు అలియాస్ కిషన్‌జీ 2011లో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో మృతిచెందగా.. రెండేళ్ల క్రితం రామకృష్ణ, కటకం సుదర్శన్ అనారోగ్య కారణాలతో మరణించారు. దీంతో దశాబ్ద కాలంగా సీపీఐ మావోయిస్టు పార్టీ అగ్రనాయకత్వంలో ఎంసీసీ నేతల ప్రాబల్యం తగ్గి తెలుగు రాష్ట్రాల నుంచి పుట్టుకొచ్చిన పీపుల్స్‌వార్ నాయకత్వమే కీలకంగా మారింది.

టార్గెట్ చేరాలంటే..

ఆపరేషన్ కగార్ ప్రభావంతో జనవరిలో చలపతి, మేలో నంబాల కేశవరావు, జూన్‌లో తెంటు సుధాకర్ వంటి అగ్ర నేతలు చనిపోయారు. దీంతో మావోయిస్టు పార్టీలో ఏపీకి చెందిన టాప్ లీడర్ల ప్రాతినిధ్యం లేకుండా పోయింది. అయితే 20 ఏళ్ల మావోయిస్టు పార్టీ చరిత్రలో తీవ్రమైన ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదుర్కొంటూ గెరిల్లా పంథాలో సాయుధ విప్లవ పోరాటాన్ని నడిపించడంలో తెలంగాణ నేతలు మిగిలిన వారి కంటే మిన్నగా ఉన్నారనేది ప్రభుత్వ వర్గాల అంచనా. ఈ క్రమంలో తెలంగాణకు చెందిన అగ్రనేతల 'టార్గెట్'ను ఛేదిస్తేనే '2026 మార్చి 31'నాటికి అనుకున్న లక్ష్యం చేరగలమని, లేదంటే పరిస్థితి మరో రకంగా ఉంటుందనే ఆందోళన ప్రభుత్వ వర్గాల్లో ఉంది.

గణేశ్‌తో మొదలు..

ఇటీవల వర్షాలతో పాటు చిక్కబడిన అడవులను సైతం లెక్క చేయకుండా భద్రతా దళాలు సెర్చ్ ఆపరేషన్లు కొనసాగిస్తున్నాయి. ఈ క్రమంలో ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఈనెల 8న చేపట్టిన గాలింపు చర్యల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన కేంద్ర కమిటీ సభ్యుడు గాజర్ల రవి అలియాస్ గణేశ్ నేలకొరిగారు. రాబోయే రోజుల్లో కేంద్ర కమిటీలో ఉన్న పది మంది తెలంగాణ నేతలు టార్గెట్‌గా చేపట్టే ఆపరేషన్లు ఉధృతంగా సాగనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆపరేషన్లకు వెళ్తున్న జవాన్లు మొబైల్ ఫోన్ల వాడకంపై ఆంక్షలు విధించినట్లు సమాచారం.

క్లుప్తంగా...

సహజ ప్రసవాల పెంపునకు ప్రత్యేక పథకం

మంత్రి సత్యకుమార్ యాదవ్

సాక్షి, అమరావతి: సహజ ప్రసవాల పెంపునకు ప్రత్యేక పథకాన్ని తీసుకొస్తున్నట్టు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) కింద అమలయ్యే ఈ పథకానికి ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. తొలి విడతలో ఏడాదికి 600 నుంచి 6 వేలకు పైగా ప్రసవాలు జరుగుతున్న 86 ప్రభుత్వాస్పత్రుల్లో 1,264 మంది ప్రసూతి సహాయకులను నియమించనున్నట్లు మంత్రి వెల్లడించారు. గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో ప్రసవాలు నిర్వహించే ప్రతి పీహెచ్‌సీలో ఒక మిడ్‌వైఫ్ ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు మంత్రి పేర్కొన్నారు.

విద్యాభివృద్ధిలో హెచ్‌ఎంల కృషి కీలకం: ఎస్పీడీ

సాక్షి, అమరావతి: విద్యార్థులకు, తోటి ఉపాధ్యాయులకు నాయకత్వం వహిస్తూ సమగ్ర విద్యను అందించడంలో ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ మార్గదర్శకులుగా నిలవాలని సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు సూచించారు. పాఠశాల నిర్వహణ, సమాజ అభివృద్ధిలో తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని కోరారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు విజయవాడలో నిర్వహిస్తున్న శిక్షణ ముగింపు సభలో మంగళవారం ఆయన పాల్గొని హెచ్‌ఎంలకు దిశానిర్దేశం చేశారు. పాఠశాలల్లో లైబ్రరీ, సైన్స్ ల్యాబ్స్, క్రీడా మైదానాలు, కిచెన్ గార్డెన్లను విద్యార్థులు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. పిల్లల్లో చదువుతో పాటు వృత్తి, జీవన నైపుణ్యాలు పెంపొందించాలని సూచించారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో కేజీబీవీ టీచర్ల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన స్టేట్ రిసోర్సు పర్సన్లను ఉద్దేశించి మాట్లాడారు. కేజీబీవీల్లో చదువుతున్న విద్యార్థులంతా పేద పిల్లలు, తల్లిదండ్రులు లేనివారు, మైనార్టీ బాలికలేనని, వారిని సొంత పిల్లల్లా భావించి నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు.

ఇంజినీరింగ్ కాలేజీల స్థితిగతులు ఏమిటి?

విద్యాశాఖ మంత్రికి పేరెంట్స్ అసోసియేషన్ లేఖ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అటానమస్, ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల స్థితిగతులు, వాటిల్లో బోధన, బోధనేతర, మౌలిక వసతులు, అడ్మిషన్లు, ఫీజులపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ పేరెంట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ వివరాలను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఉంచాలని కోరింది. ఈమేరకు అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మలిరెడ్డి కోటారెడ్డి, అధ్యక్షుడు నరహరి, కార్యదర్శి జి.ఈశ్వరయ్య విద్యాశాఖ మంత్రికి లేఖ రాశారు. రాష్ట్రంలో 30 ప్రభుత్వ, 350 ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలున్నాయని పేర్కొన్నారు. వీటిలో 165కు పైగా కాలేజీలకు ఏఐసీటీఈ, యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా స్వయం ప్రతిపత్తి కళాశాలలుగా అనుమతులు ఇచ్చారని ఆరోపించారు. సీట్లను అమ్ముకుంటూ, ఫీజుగా రూ.లక్షలు దోపిడీ చేస్తున్న ఈ కాలేజీలపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఫిర్యాదులు చేసినా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని విమర్శించారు. విద్యా ప్రమాణాలపై ప్రతి ఇంజినీరింగ్ కళాశాలలోను విద్యార్థి తల్లిదండ్రులు, అధ్యాపకులతో కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలు లేని కొత్త జిల్లాల్లో వాటిని ఏర్పాటు చేయాలని వారు ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు.

విద్యా వ్యవస్థ ఛిన్నాభిన్నం: వైఎస్సార్‌టీఏ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో విద్యా వ్యవస్థను కూటమి ప్రభుత్వం విచ్ఛిన్నం చేస్తోందని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ వి.రెడ్డి శేఖర్ రెడ్డి ఓ ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రస్థాయిలో ప్రభుత్వ ప్రణాళికలు, విద్యా సంబంధ చర్యలు ప్రాథమిక విద్యను బలహీనం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కింది స్థాయిలో ఎదురయ్యే ఇబ్బందులు, సమస్యలను పట్టించుకోకుండా ప్రభుత్వ పెద్దల మెప్పు కోసం అధికారుల అత్యుత్సాహంతో ఇష్టానుసారంగా ఆదేశాలు ఇవ్వడం సరికాదన్నారు. కూటమి సర్కారు ప్రవేశపెడుతున్న యాప్స్, ఆన్‌లైన్ పనులు, జూమ్ మీటింగ్స్‌కు వ్యతిరేకంగా ఉపాధ్యాయులు రోడ్డు ఎక్కే పరిస్థితి తీసుకొస్తున్నారన్నారు. పాఠశాలలు ప్రారంభం నుంచే కిట్లు, యూనిఫాం పంపిణీ, స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర, యోగ, మెగా పీటీఎం, 18 రకాల కర్మయోగి కోర్సులు, శానిటేషన్ పనులు, ఉపాధ్యాయుల శిక్షణతో పూర్తిగా బోధనేతర పనులతోనే టీచర్లకు సరిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి పాలనలో తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పోయిందని, ఉపాధ్యాయులకు రికార్డులు, రిపోర్టుల నుంచి విముక్తి కల్పించి పాఠశాల ప్రగతికి, నాణ్యమైన విద్య కోసం ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు.

రియల్ ఢమాల్!

ప్రభుత్వ వైఖరితో రాజధానిలో నిలిచిపోయిన భూముల క్రయవిక్రయాలు

రాజధాని నిర్మాణం పేరుతో 11 ఏళ్ల కిందట తీసుకున్న భూములకు సంబంధించిన రైతులకు ఇప్పటికీ ఇచ్చిన ప్లాట్లు కాగితాలపైనే ఉన్నాయి. ఎకరం పొలం తీసుకుని చేతిలో పెట్టిన 1,200 గజాలు కాగితాలకు కనీసం బ్యాంకర్లు కూడా రుణాలు ఇవ్వడం లేదు. ఈ పరిస్థితుల్లో మూలిగే నక్కపై తాడిపండు పడినట్లుగా మరో 45 వేల ఎకరాలు రాజధాని నిర్మాణం కోసం సేకరిస్తున్నామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఆయా ప్రాంతాల రైతులకు ఇది మింగుడు పడటం లేదు. ఈ ప్రభావం రియల్ ఎస్టేట్ రంగంపై తీవ్రంగా పడింది. కొత్తగా కొనేవారు లేక భూ లావాదేవీలు స్తంభించిపోయాయి.



- నాలుగు నెలల కిందట ఆకాశాన్నంటిన ప్లాట్లు, పొలాల ధరలు
- భూముల కొనుగోళ్లు, అమ్మకాలతో అంతటా సందడే సందడి
- అమరావతిలో భూములు విక్రయించి మరో ప్రాంతంలో కొనుగోలు
- రాజధానికి మరో 45 వేల ఎకరాలు కావాలని చంద్రబాబు పట్టు
- నెల రోజుల నుంచి స్తంభించిపోయిన స్థిరాస్తి కార్యకలాపాలు
- గోళ్లు గిల్లుకుంటున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఏజెంట్లు
- రెండో దశ పూలింగ్‌పై ప్రభుత్వ ప్రకటనతో అందరిలో ఆందోళన
- రాజధానిలో ప్లాట్లు, పొలాల కొనుగోలుకు ముందుకురాని ప్రజలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు, తాడికొండ, పెదకాకాని: రాజధాని ప్రాంతానికి చెందిన వెంకటేశ్వరరావు తనకున్న రెండెకరాల పొలంలో వ్యవసాయం చేస్తున్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే భూముల ధరలు రూ. కోట్లకు పడగలెత్తుతాయని ఆశ, ఆరాటంతో ఓటు వేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అందులో ఎకరం అమ్ముకొని సొమ్ము చేసుకొని వేరే ప్రాంతంలో భూమి కొనుగోలు చేద్దామని ఆశతో బేరం పెట్టారు. ఎకరం అమాంతంగా రూ.3 కోట్ల నుంచి రూ. 4 కోట్ల వరకు అడుగుతుండటంతో అమ్మో అప్పుడే అమ్మితే ఎలా అని రోజుకో రకంగా పెరుగుతున్న రియల్ ఎస్టేట్ రంగాన్ని చూస్తూ మురిసిపోతూ కాలం వెళ్లబుచ్చారు. ఇప్పుడు పరిస్థితి పూర్తి విరుద్ధంగా మారింది. ఇక మరో రైతు ప్రభుదాసు తమవారు తరాలుగా కష్టపడి సంపాదించి ఇచ్చిన అర ఎకరం పొలం విక్రయిద్దామని బేరం పెట్టారు. రూ.3 కోట్లకు 1/3వ వంతు నగదు తీసుకొని 3 నెలల తరువాత రిజిస్ట్రేషన్ చేసుకుందామని అగ్రిమెంట్ చేసుకున్నారు. ఈ డబ్బుతో మరో ప్రాంతానికి వెళ్లి ఎకరం రూ.35 లక్షల చొప్పున కొనుగోలు చేసి, అగ్రిమెంట్ చేసుకున్నారు. ఇలా ఎందరో రైతులు రాజధాని ప్రాంతంలో తమ భూములను అమ్మకాలు, కొనుగోళ్ల సందడితో మురిసిపోయారు. కూటమి ప్రభుత్వం ఉన్నట్టుండి రెండు నెలల క్రితం అదనపు భూ సమీకరణ చేపట్టనున్నట్లు ప్రకటించింది. దీంతో రైతుల గుండెల్లో బాంబు పడినట్లైంది.

ఒక్కసారిగా నిస్తేజం

రెండో విడత భూ సమీకరణ పేరుతో అమరావతి, తుళ్ళూరు మండలాల్లో గ్రామ సభలు నిర్వహించిన ప్రభుత్వం తొలుత 45 వేల ఎకరాలను సమీకరణ చేస్తున్నట్లు ప్రకటించింది. తదనంతరం సభలను విస్తరించి తాడికొండ మండలంలో కూడా చేపట్టడంతో రైతులు మండిపడ్డారు. ఉన్నట్టుండి విరుచుకుపడటంతో ప్రభుత్వం ఓ అడుగు వెనక్కేసింది. కానీ నిన్న మొన్నటి వరకు రూ. కోట్లలో పలికిన భూముల ధరలు మాత్రం ఆకాశం నుంచి కుప్పకూలిన చందంగా ఒక్కసారిగా పడిపోయాయి. అమ్ముకొని సొమ్ము చేసుకున్న రైతుల ఆనందం అంతా ఇంతా కాగా ఇప్పటికీ అగ్రిమెంట్‌ల రూపంలో ఉన్న రైతులు, అప్పుల పాలై అమ్ముకుందామని ఎదురు చూస్తున్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఎప్పుడూ సందడిగా ఉండే రియల్ ఎస్టేట్ ఆఫీసులు వెలవెలబోతున్నాయి. అదే తరహాలో పెదకాకాని రిజిస్ట్రార్ కార్యాలయంలో కూడా రిజిస్ట్రేషన్‌ల సంఖ్య తగ్గిపోయింది.

సొంత పార్టీ నేతల తిరుగుబాటు

నిన్న మొన్నటి వరకు బ్రహ్మాండమైన రాజధాని నిర్మించి ప్రపంచంలోనే గొప్పగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తారంటూ ప్రగల్భాలు పలికిన సొంత పార్టీ నేతలే నేడు తిట్ల దండకం అందుకుంటున్నారు. బాబును నమ్మితే నట్టేట ముంచారని, నమ్ముకున్న వాడిని మోసం చేయడం అంటే ఇదేనని వాపోతున్నారు. చెప్పిన మాటకు కట్టుబడి ఉన్న భూముల్లో రాజధాని నిర్మిస్తే సరేసరి.. లేదంటే మరో ఉద్యమం తప్పదన్నారు. ఇప్పటికే భూములిచ్చిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు సైతం ఇవ్వలేదు, ఇచ్చిన వారికి ప్లాట్లు భౌతికంగా ఎక్కడున్నాయో కూడా తెలియదు. ఇంకా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి కాలేదు. అభివృద్ధి చేసి 10 సంవత్సరాల్లో ప్లాట్లు తిరిగిస్తానన్న బాబు విదేశీ పర్యటనలు, అదనపు భూ సమీకరణ పేరుతో రైతులను పట్టించుకోవడం లేదు. ఇప్పటికే ఏడాదిన్నర పూర్తయింది. రాజధానిలో ఏవేవో కడతానని చెప్పడం మినహా పునాదులను సైతం అడుగు కూడా పైకి లేపిన దాఖలాలే లేవు.

కొనేవారు రావడం లేదు



భూములు కొనుగోలు చేసే వారు రావడం లేదు. ప్రభుత్వం మళ్లీ భూ సమీకరణ ప్రకటన చేసినప్పటి నుంచి వ్యాపారాలు సాగడం లేదు. పదేళ్లుగా ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ చేస్తున్నాను. గతంలో ప్లాట్లు, పొలాలు కొనుగోలు చేసేందుకు వచ్చే వారికి చుట్టుపక్కల ప్రాంతాల్లో చూపించేవారం. అందుకు ప్రతిఫలంగా వారు కమీషన్ ఇచ్చేవారు. కొనేవారు ఇప్పుడు రాకపోవడంతో వ్యాపారాలు నిలిచిపోయాయి.

– షేక్ మస్తాన్, రియల్ ఎస్టేట్ వ్యాపారి, పెదకాకాని

స్థిరాస్తి రంగం కుదేలు



కూటమి ప్రభుత్వం రాజధాని పేరుతో మళ్లీ భూములు సమీకరిస్తుండటంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలైంది. అమ్మేవారు సిద్ధంగా ఉన్నప్పటికీ కొనేవారు లేకపోవడంతో వ్యాపారం ఆగిపోయింది. నెల రోజులకు ముందు చేసుకున్న అగ్రిమెంట్లు మాత్రమే రిజిస్ట్రేషన్‌లు అవుతున్నాయి. ఈ నెలలో ఒక్క బేరం కూడా జరగలేదు. భూములు కావాలని వచ్చేవారు తగ్గిపోయారు. ప్రభుత్వం భూ సమీకరణపై స్పష్టత ఇవ్వాలి.

– పాటిబండ్ల సంగీతరావు, రియల్ ఎస్టేట్ వ్యాపారి, పెదకాకాని

అప్పు కూడా పుట్టక అవస్థలు

అదనపు భూ సమీకరణ ఊసు లేనప్పుడు రాజధాని ప్రాంతంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ప్రాంతాన్ని బట్టి గజం రూ.40 వేలు నుంచి రూ.80 వేలు పలికిన భూముల ధరలు ఇప్పుడు కొనేందుకు వ్యాపారులు, ప్రజలు ఆసక్తి చూపడం లేదు. ఆ భూమిని కనీసం బ్యాంకులో అయినా తనఖా పెట్టుకొని అప్పు తీసుకుందామా అంటే అధికారులు ఒప్పుకోవడం లేదు. దాదాపు 25 కిలోమీటర్ల దూరంలో తుళ్ళూరు రాజధాని ఉంటే పెదకాకాని మండల శివారులో ఉన్న మంగళగిరి రూరల్ మండలం కాజ, తాడికొండ మండలంలోని కంతేరు గ్రామం వరకూ భూములు సేకరిస్తారని కూటమి ప్రభుత్వం ప్రకటించడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కనీసం తమ అవసరానికి కూడా విక్రయించలేక పోతున్నామని, ఎక్కడా అప్పు కూడా పుట్టడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వ్యాపార ధోరణి విడనాడి స్పష్టమైన విధానం ప్రకటించాలని వారు కోరుతున్నారు.



పెదకాకానిలో వెలవెలబోతున్న ఓ రియల్ ఎస్టేట్ వ్యాపార దుకాణం

రేసర్ల జోరు.. జనం బేజారు



విశాఖలో రాత్రుళ్లు రేసింగ్‌లతో యువత హల్‌చల్

- అడవివరం, రుషికొండ, భీమిలి, భోగాపురం ప్రాంతాల్లో పోటీలు
- రూ.15 లక్షల నుంచి రూ.30 లక్షల ఖరీదైన బైక్‌లతో స్టంట్లు
- 'వీ సూపర్ బైకర్స్' పేరుతో అసోసియేషన్ ఏర్పాటు
- ఇటీవలే పోర్టు స్టేడియంలో తొలి వార్షికోత్సవం నిర్వహణ
- రేసర్ల స్పీడ్‌కు బ్రేకులు వేయలేకపోతున్న పోలీసులు

విశాఖ సిటీ : వారంతా సంపన్న కుటుంబాలకు చెందిన యువత. వారి ఒక్కో బైక్ రూ.15 లక్షలకు పైమాటే. ఇవి 200 నుంచి 300 కి.మీ వేగంతో పరుగులు పెడతాయి. అటువంటి స్పోర్ట్స్ బైక్‌లపై రేసింగ్‌లతో కుర్రకారు విశాఖ రోడ్లపై హల్‌చల్ చేస్తున్నారు. థ్రిల్ కోసం వేగంతో పోటీపడుతున్నారు. 'అదుపు' తప్పితే కలిగే దుష్పరిణామాలను అంచనా వేయలేకపోతున్నారు. దురదృష్టం వెంటాడితే తల్లిదండ్రులకు కడుపుకోత మిగులుస్తున్నారు. విశాఖలో రేసింగ్ సంస్కృతి పెచ్చుమీరుతోంది. స్మార్ట్ సిటీ బైక్ రేసర్లకు కేంద్రంగా మారుతోంది. విశాలమైన రహదారుల్లో యువత వేగానికి బ్రేకులు లేకుండా పోతున్నాయి. అర్ధరాత్రుళ్లు వారు చేస్తున్న స్టంట్స్ ఒళ్లు గగుర్పాటుకు గురిచేస్తున్నాయి.

ప్రత్యేకంగా అసోసియేషన్

విశాఖలో రేసింగ్ కల్చర్ పెరుగుతోంది. గతంలో అప్పుడప్పుడు జరిగే బైక్ రేసులు.. ఇప్పుడు వారాంతానికి దర్శనమిస్తున్నాయి. సంపన్న వర్గాలకు చెందిన కుర్రకారు స్పోర్ట్స్ బైక్‌లతో చేసే విన్యాసాలకు విశాఖ రహదారులు ప్రత్యక్ష సాక్షులుగా మారిపోయాయి. పేరున్న కళాశాలలో ఉన్నత చదువులు చదువుతున్న యువతే ఈ రేసింగ్‌లతో రెచ్చిపోతున్నారు. వీరి ఒక్కో బైక్ ఖరీదు రూ.15 లక్షల నుంచి రూ.30 లక్షలు. గంటకు గరిష్ఠంగా 200 నుంచి 300 కిలోమీటర్లు వేగంతో ప్రయాణించే సామర్థ్యం వీటి ప్రత్యేకత. ముందు హోదా, సరదా కోసమే వీటిని కొనుగోలు చేస్తూ.. తర్వాత మాత్రం రేసుల్లో పోటీపడుతున్నారు. ఇటువంటి ఖరీదైన సూపర్ బైక్‌లు ఉన్నవారంతా ఒక గ్రూప్‌గా ఏర్పాటవడం గమనార్హం. వీరంతా 'వీ సూపర్ బైకర్స్' పేరుతో ఒక అసోసియేషన్‌లా ఏర్పాటు చేసుకున్నారు. ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ వేదికలపై గ్రూపులుగా ఏర్పాటు చేసుకుని కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నారు. ఈ అసోసియేషన్ ఏర్పాటై ఏడాదైన సందర్భంగా రెండు రోజుల క్రితమే పోర్టు స్టేడియంలో గెట్ టు గెదర్‌ను నిర్వహించినట్లు తెలుస్తోంది.



పోర్టు స్టేడియంలో గెట్ టు గెదర్ అయిన సూపర్ బైకర్లు

శివారు ప్రాంతాల్లో రేసింగ్‌లు

స్మార్ట్ సిటీ విశాఖలో రహదారుల అభివృద్ధి శరవేగంగా జరుగుతోంది. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా శివారు ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ చేపట్టారు. ఇదే రేసర్లకు వరంగా మారింది. గతంలో బీచ్ రోడ్డు, ఆరిలోవ బీఆర్‌టీఎస్, విశాఖ వ్యాలీ రోడ్లలో రేసులు నిర్వహించే వారు. పోలీసులు ఈ రేసింగ్‌లపై ప్రత్యేక నిఘా పెట్టారు. పలువురిని అరెస్టులు చేశారు. దీంతో ఇప్పుడు ఈ రేసర్లు శివారు ప్రాంతాలకు మకాం మార్చారు. రుషికొండ ఐటీ హిల్స్ రోడ్డు, పనోరమ అపార్ట్‌మెంట్ రోడ్డు, తిమ్మాపురం నుంచి భీమిలి, మధురవాడ–బావికొండ, మారికవలస–తిమ్మాపురం బీచ్‌రోడ్డు వంటి ప్రాంతాలతో పాటు ఇటీవల కాలంలో భోగాపురం వైపు కూడా రేసింగ్‌లకు అనువైన ప్రాంతాలుగా ఎంచుకుంటున్నారు. గతంలో శని, ఆదివారాల్లో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహించేవారు. కొన్నాళ్ల నుంచి వీలు చిక్కినప్పుడల్లా రేసుగుర్రాల్లా దూసుకుపోతున్నారు. సింగిల్ టైర్ రైడ్, సైడ్ హ్యాంగింగ్ రైడ్, జిగ్ జాగ్, స్నేక్ రైడ్, 360 డిగ్రీస్, 120 యాంగిల్, ఫ్రంట్ లీ, బ్యాక్ లీ.. పేర్లతో పిలిచే డేంజరస్ స్టంట్‌లకు పాల్పడుతున్నారు.

స్పీడ్‌కు బ్రేకులు వేయలేకపోతున్న పోలీసులు

ఇంజనీరింగ్ విద్యార్థులు, ఐటీ ఉద్యోగులే ఈ రేసింగ్‌లకు పాల్పడుతున్నారన్న వాస్తవం పోలీసులను సైతం విస్మయపరుస్తోంది. రేసింగ్‌కు పాల్పడేవారంతా వాట్సాప్, ఇన్‌స్టా గ్రామ్‌లో గ్రూపులుగా ఏర్పడి రేసింగ్ ఎక్కడ నిర్వహించేదీ సమాచారం ఇచ్చిపుచ్చుకుంటున్నారు. ఒక్కొక్కరుగా అక్కడికి చేరుకుని జిగ్‌జాగ్‌లు, స్పీడ్ డ్రైవింగ్, స్టంట్‌లు వంటి వాటిపై పోటీలు పెట్టుకుంటున్నారు. ఆ సమయంలో అదే రోడ్డుపై వెళ్లే వాహనచోదకులు వారిని చూసి ఆందోళనకు గురై ప్రమాదాల బారిన పడిన సందర్భాలు కూడా ఉన్నాయని పోలీసులే చెబుతున్నారు. ఈ రేసింగ్ జాడ్యాన్ని కట్టడి చేసేందుకు పోలీసులు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ.. యువత స్పీడుకు పూర్తి స్థాయిలో బ్రేకులు వేయలేకపోతున్నారు. గత ఏడాది కాలంలో మూడుసార్లు బైక్ రేసర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బైక్‌లను సీజ్ చేయడంతో పాటు వారి తల్లిదండ్రుల సమక్షంలోనే కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినప్పటికీ అనేక మందిలో మార్పు రాలేదు. ఇప్పటికీ రేసులు చేస్తూనే ఉన్నారు. మరో వైపు పోలీసులు సైతం శివారు ప్రాంతాల్లో కూడా సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా పెట్టాలని భావిస్తున్నారు. ప్రధానంగా రాత్రివేళ గస్తీ పెంచడంతో బైక్ రేసర్ల ఆటకట్టించాలని ఆలోచన చేస్తున్నారు.

పి–4 వడపోత షురూ..!

12 ప్రశ్నలతో సర్వే ద్వారా కుటుంబాల ఆస్తుల వివరాల సేకరణ

- కుటుంబ నెలవారీ ఆదాయం ఎంత..? ఖర్చు ఎంత?
- భవిష్యత్‌లో ఆదాయం పెరగడానికి తొలి అవసరమేంటి?
- గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో సర్వే

సాక్షి, అమరావతి: పి–4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ భాగస్వామ్యం) పేరుతో పేదరికాన్ని నిర్మూలిస్తామని, ప్రభుత్వం నుంచి పైసా ఇవ్వకుండా పేదరికం నుంచి పైకి తీసుకొస్తామని ప్రకటించిన సీఎం చంద్రబాబు, ఇప్పుడు పి–4 సర్వే పేరుతో పేద కుటుంబాల వడపోత కార్యక్రమాన్ని చేపడుతున్నారు. పేద కుటుంబాలను సంపన్నులు దత్తత తీసుకుని పేదరికం నుంచి బయటకు తీసుకురావాలని, ఇందుకు ప్రభుత్వం సమన్వయకర్తగా మాత్రమే ఉంటుందని సీఎం చెప్పిన విషయం తెలిసిందే. ప్రస్తుతం 29 లక్షల పేద కుటుంబాలున్నట్లు గుర్తించారు. ఆ కుటుంబాలను ఇప్పుడు పి–4 సర్వే పేరుతో వడపోస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని కుటుంబాల ఆస్తులను, వారి అవసరాలను 12 ప్రశ్నల ద్వారా సమాచారాన్ని సేకరించనున్నారు. కుటుంబంలో ఎంత మంది ఉన్నారు. ఇతర ప్రాంతాల్లో ఆ కుటుంబంలో వారు ఎవరైనా ఉన్నారా అనే అంశంతో పాటు, కుటుంబం నెలవారీ ఆదాయం ఎంత, వ్యయం ఎంత అనే వివరాలనూ రాబడుతున్నారు. అలాగే భవిష్యత్‌లో ఆదాయం పెరగాలంటే తొలి అవసరమేంటి? రెండో అవసరమేంటి? అనే వివరాలను సేకరిస్తారు. ఎటువంటి మద్దతు కావాలనే సమాచారంతో పాటు కుటుంబానికి ఆస్తులు ఏమైనా ఉన్నాయా, ప్రభుత్వ పథకాలు ఏమైనా అందుతున్నాయా, కుటుంబానికి కారు ఉందా, ద్విచక్రవాహనం ఉందా, భూమి ఏమైనా ఉందా అనే సమాచారాన్ని సర్వే ద్వారా సేకరించనున్నారు. అయితే ఇచ్చిన హామీలు అమలుచేయకుండా, పి–4 పేరుతో సీఎం చంద్రబాబు కాలక్షేపం చేస్తున్నారనే వ్యాఖ్యలు అధికార వర్గాల నుంచే వినిపించడం గమనార్హం.

రాజకీయాల తర్వాతే సినిమాలు

'హరిహర వీరమల్లు' ప్రమోషన్‌లో పవన్ కళ్యాణ్

సాక్షి, అమరావతి: తన జీవితంలో ఇక రాజకీయాలకే మొదటి ప్రాధాన్యత ఇస్తానని, దాని తర్వాతే సినిమాలని ఉప ముఖ్యమంత్రి, సినీ నటుడు పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యానించారు. హరిహర వీరమల్లు సినిమా ప్రమోషన్‌కు సంబంధించి మంగళవారం ఆయన మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. హైదరాబాద్ మాదిరిగా ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు చిత్ర పరిశ్రమ అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. 'నాకు వచ్చింది సినిమాల్లో నటించడమే. నాకు అన్నం పెట్టింది, బతుకుదెరువు ఇచ్చింది సినిమాలే. రాజకీయాల్లో ఉంటూనే ఇకపై కూడా చిత్రాల్లో నటించే అంశం పూర్తిగా భగవదేచ్ఛ. అన్ని సినిమాలకు మాదిరిగానే ఈ సినిమాకు టికెట్ రేట్లు పెరిగాయి. నా సినిమాకు ప్రత్యేకంగా టికెట్ రేట్ల పెంపు ఇవ్వలేదు. సహచరులైన ప్రజా ప్రతినిధుల కోసం ప్రత్యేకంగా షో ఏర్పాటు చేస్తాను. హిందువుగా బతకాలంటే పన్ను కట్టాల్సిన పరిస్థితిలో ధర్మాన్ని కాపాడేందుకు చేసే పోరాటాన్ని ఈ సినిమాలో చూపించాం. సినిమా పార్ట్–2 కూడా 20 శాతం చిత్రీకరణ పూర్తయింది' అని తెలిపారు.

చేతగాని హామీలు ఎందుకు ఇచ్చారు?



18 ఏళ్లు నిండిన మహిళలందరికీ నెలకు రూ.1,500 చొప్పున ఇస్తామన్నారు. ఇప్పుడు ఆడబిడ్డ నిధి ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్మాలని మంత్రి అచ్చెన్నాయుడు అంటున్నారు. హామీల అమలు చేతగానప్పుడు ఎందుకు వాగ్దానాలు చేశారు. ఎన్నికల్లో అనేక ఉచిత హామీలు ఇచ్చి, ఓట్లు వేయించుకునేటప్పుడు తెలియదా?

– కె.సురేష్ బాబు, కడప మేయర్

చేతులెత్తేసిన కూటమి



ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చలేక కూటమి ప్రభుత్వం చేతులెత్తేసింది. ఆడబిడ్డ నిధి ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్ముకోవాలనడం సిగ్గుచేటు. ఈ ప్రభుత్వం మహిళలను నమ్మించి మోసం చేసింది.

– ఏకుల రాజేశ్వరిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి


కూటమి నయవంచన..



ఆడబిడ్డ నిధిపై మంత్రి అచ్చెన్నాయుడి మాటలు కూటమి నయవంచనకు దర్పణం. కూటమి పార్టీలను నమ్మి ఓట్లేసిన మహిళలు ఇప్పుడు పశ్చాత్తాపం చెందుతున్నారు. 2 కోట్ల మంది మహిళలను ఈ ప్రభుత్వం మోసం చేసింది.

– పుత్తా శివశంకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి

పుష్యమి కార్తె:
జూలై 20 నుంచి





సంతాన భాగ్యానికి, ఆరోగ్య భాగ్యానికి చిరునామాగా నిలుస్తోంది అరుదైన హెరిటేజ్ రైస్ 'కుల్లాకర్'. ఈ అపురూపమైన రెడ్ రైస్ పుట్టిల్లు తమిళనాడు అయినా దేశ వ్యాప్తంగా సాగు చేస్తున్నారు. దేశీ వరి వంగడాల్లో పోషకాలు, విశిష్ట ఔషధ గుణాలు కలిగిన ఒకానొక అపురూప వంగడం ఇది.

గర్భ ధారణలో సమస్యలను అధిగమించాలన్నా.. లేకుండా సహజ రీతిలో సుఖప్రసవం కావాలన్నా.. ప్రసవానంతరం తల్లీ బిడ్డా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్నా.. అన్నిటికీ ప్రకృతి వ్యవసాయంలో పండించిన కుల్లాకర్ తదితర దేశీ వరి బియ్యాన్ని ఆశ్రయించాల్సిందేనా? దేశీ ఆవు పాలు, నెయ్యిని మెనూలో జోడించాల్సిందేనా?? అంటే.. ముమ్మాటికీ అవును అంటున్నారు 'సేవ్' స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు, సుభాష్ పాలేకర్ కృషి (ఎస్‌పికె) సాధకులు, దేశీ విత్తన పరిరక్షకులు ఎం. విజయ్‌రామ్.

ఆరోగ్యవంతమైన కుటుంబ జీవనానికి కుల్లాకర్ ఆరోగ్య బాటలు వేస్తోందని చెబుతున్నారు. ప్రకృతి వ్యవసాయంలో పండించిన ముడి కుల్లాకర్ బియ్యాన్ని అనేక గ్రామాల్లో, హైదరాబాద్ నగరంలో గత కొన్నేళ్లుగా పలువురితో తినిపించారు. వారి అనుభవాల సారాన్ని ఆయన ఎలుగెత్తి చాటుతున్నారు. కేవలం కుల్లాకర్ బియ్యం తినటం మాత్రమే కాదు, ఆరోగ్యవంతమైన సమృద్ధ జీవనానికి దోహదం చేసే 'దేశీ ఆహారంతో కూడిన ఒక సమగ్ర జీవన విధానా'న్ని ఆయన సూచిస్తున్నారు. ఇంతకీ దొడ్డు/ముతక రకం కుల్లాకర్ బియ్యం చుట్టూ అల్లుకున్న విశేషాలేమిటి? వాడిన/వాడుతున్న కుటుంబాల సుసంపన్న అనుభవాలేమిటి?? ఆలస్యం ఎందుకు.. చదవండి!

పాత పంట

కలల పంట కుల్లాకర్!

మొదట సిజేరియన్.. రెండో కాన్పు నార్మల్!

అప్పుడు బెంగళూరులో ఉండేవాళ్లం. మొదట కాన్పులో బాబు పుట్టినప్పుడు సిజేరియన్ ఆపరేషన్ అయ్యింది. హైదరాబాద్ వచ్చిన రోజే రెండో ప్రెగ్నెన్సీ కన్ఫర్మ్ అయ్యింది. సాధారణ వైట్ రైస్ తినకుండా ఉండలేకపోయేదాన్ని. కేర్‌లెస్‌గా జంక్‌ఫుడ్ తినేదాన్ని. ప్రీడయాబెటిక్ స్టేజీకి వెళ్లా. రెండో కాన్పు కూడా ఆపరేషన్ తప్పదనుకున్నాం.

అయితే, గర్భం దాల్చిన నాలుగు నెలల తర్వాత, విజయరామ్ గారి వీడియోలు చూసి సుఖప్రసవానికి, ఆరోగ్యానికి కుల్లాకర్ బియ్యం ఉపయోగపడతాయని తెలుసుకున్నా. అప్పటి నంచి 4-5 నెలల పాటు కులాకర్ బియ్యాన్ని మట్టిపాత్రలో వండుకొని తినటం, దేశీ ఆవు నెయ్యి, పాలు వాడటం శ్రద్ధగా చేశా. నార్మల్ డెలివరీ అయ్యింది. బాబు చాలా ఆరోగ్యంగా ఉన్నాడు. 21వ రోజే తల నిలిపాడు. స్థిమితంగా, నెమ్మదిగా ఉంటాడు. ఆకలైతేనో, నిద్ర వస్తేనో ఏడుస్తాడు.

మా ఇద్దరి పిల్లలకు ఈ విషయంలో తేడా గమనించాను. డెలివరీ తర్వాత బహురూపి, నారాయణ కామిని, ఇంద్రాణి వంటి దేశీ బియ్యం తింటున్నాం. నల్లబియ్యం, ఎర్రబియ్యం దోసెలకు వాడుతున్నాం. మా ఇంట్లో రెండు వైపులా పెద్దవాళ్లకు సుగర్ ఉంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కూర్చొని చేసే ఉద్యోగం, పైగా పని వత్తిడి. అయినా, ఇప్పుడు ప్రకృతి వ్యవసాయంలో పండించిన దేశీ ఆహారం తింటున్నాం కాబట్టి ఆ భయం లేకుండా ఆరోగ్యంగా జీవిస్తున్నాం.

ఆహారాన్ని ఇలా మార్చుకుంటే యూరిన్ ఇన్ఫెక్షన్, పిసిఓఎస్, పీరియడ్స్ సమస్యలు పోతాయి. మళ్లీ రావు. ఆలస్యం కాకముందే కళ్లు తెరిచి మీరేమి తింటున్నారో తెలుసుకోమని యువతకు స్వానుభవంతో ఘంటాపథంగా చెబుతున్నా.

– రామవరపు సింధుకుమారి,
సాఫ్ట్‌వేర్ ఇంజనీర్,
కొండాపూర్, హైదరాబాద్

ఆ తర్వాతే గర్భం నిలిచింది..!

నా భార్య మౌనికకు రెండు సార్లు గర్భం నిలవలేదు. సుగర్, బీపీ లేవు. కుల్లాకర్ దేశీ వరి బియ్యం తినటం ప్రారంభించిన తర్వాత మూడో సారి గర్భం నిలిచి, పండంటి బాబు పుట్టాడు. ఆరోగ్యంగా ఉన్నాడు. ప్రకృతి వ్యవసాయంలో పండించిన కుల్లాకర్ బియ్యం తినటంతో పాటు ఒంగోలు ఆవు పాలు, నెయ్యి వాడటం వల్లనే ఈ మేలు జరిగిందని నా నమ్మకం. 2021 మేలో హైదరాబాద్ లోయర్ ట్యాంక్‌బండ్ రోడ్డులోని సేవ్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో వెంకటరమణ ఇచ్చిన సలహాతో కుల్లాకర్ అన్నం తినటం ప్రారంభించాం. త్వరలోనే బాబు కడుపున పడ్డాడు. 2022 సెప్టెంబర్‌లో ఆరోగ్యంగా పుట్టాడు. కుల్లాకర్ ముతక బియ్యం కావటం వల్ల మూడు పూటలా అదే తినలేం. ఒకపూట తిన్నాం. మిగతా రెండు పూటలా బహురూపి అనే దేశీ బియ్యం వాడాం.

అన్నం, దోసెలే కాదు రొట్టెలు కూడా చేసుకుతిన్నాం. వెండి గిన్నెలో తోడు వేసిన పెరుగు తిన్నాం. హార్మోన్ అసమతుల్యత వల్లే గర్భం సంబంధిత సమస్యలు, రక్తహీనత వేధిస్తూ ఉంటాయి. వీటిని అధిగమించడానికి కుల్లాకర్, బహురూపి చాలా ఉపయోగపడ్డాయని మా అనుభవంలో తెలుసుకున్నాం. గర్భవతిగా ఉండగా మౌనికకు ఏ ఇబ్బందులూ రాలేదు. బిడ్డ జుట్టు బాగా నల్లగా నిగనిగలాడుతూ వత్తుగా పెరిగింది. 12 నెలలకు తీసే తలనీలాలు 9 నెలలకే తియ్యాల్సి వచ్చింది. ఇప్పటి వరకు ఆసుపత్రికి వెళ్లాల్సిన పని రాలేదు. కొన్ని రకాల దేశీ వరి బియ్యం కలిపి పిండి పట్టించి బాబుకు తినిపిస్తున్నాం. బాబు చాలా యాక్టివ్‌గా, ఆరోగ్యంగా ఉన్నాడు. గోమాత దయతో, సేవ్ సంస్థ సలహాలతో మా ఇంటిల్లపాదీ ఆరోగ్యంగా, ఆనందంగా ఉన్నాం.

– జి. వెంకట రమణారెడ్డి,
రైల్వే ఉద్యోగి, మల్కాజ్‌గిరి,
హైదరాబాద్

దేశీ వరి 'ప్రజ్ఞ' తెలుసా?

పది వేల సంవత్సరాల వ్యవసాయ సంస్కృతి వారసత్వానికి సజీవ సాక్ష్యాలు మనకున్న దేశీ వరి వంగడాలు. వరి పంట జీవవైవిధ్యానికి మూలాధారమైన ప్రాంతంగా భారతావనికి ప్రపంచవ్యాప్త గుర్తింపుంది. అనాదిగా రైతులు అనంతమైన జీవన గమనంలో తమకు తారసపడిన అపురూప సుగుణ సంపత్తి గల వరి వంగడాలను గుర్తించి, వాటిని జాగ్రత్తగా సాగు చేస్తూ, ఆ పంటలో నుంచే మేలైన పనితీరు చూపిన ధాన్యాన్ని విత్తనాలుగా ఎంపిక చేసి ఇతర రైతులతో పంచుకుంటూ ఉన్నారు. ఈ వారసత్వ వ్యవసాయక పరంపరలో నుంచి వచ్చినవి కాబట్టే వీటిని హెయిర్‌లూమ్ వెరైటీస్ అని హెరిటేజ్ రైస్ వెరైటీస్ అని ఆత్మగౌరవం ఉప్పొంగేలా ఇప్పటికీ పిలుచుకుంటూ ఉన్నాం.



అధిక జనాభాలకు తగిన అధిక దిగుబడుల కోసమని అందుకు అనుగుణమైన అతికొద్ది రకాలను వాణిజ్యపరమైన సాగు కోసం రూపొందించుకున్నాం. అయితే, ఈ హరితవిప్లవ క్రమంలో వ్యాప్తిలోకి తెచ్చిన ఇంప్రూవ్‌డ్ వంగడాల్లో పోషక / ఔషధ విలువలు ఉన్నాయా లేదా అన్న గ్రహింపు లేకుండా అరవయ్యేళ్లు గడిచిపోయాయి. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసిఎఆర్) – భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఐసిఎంఆర్) సంయుక్తంగా రెండేళ్ల క్రితం వెల్లడించిన అధ్యయనం ప్రకారం.. గత ఏభయ్యేళ్లలో మనం విరివిగా పండిస్తున్న వరి, గోధుమ వంగడాల్లో పోషకాలు 45% తగ్గిపోయాయి. విషతుల్య పదార్థాలైన భార లోహాలు వచ్చి చేరాయి. రసాయనిక సేద్యం, పెచ్చరిల్లిన కాలుష్యం మూలాన ఈ విషతుల్య పదార్థాలు మన ధాన్యంలోకి చేరిపోతున్నాయని తేలింది.

నేలలో ఉన్న విషతుల్య పదార్థాలను తీసుకోకుండా జాగ్రత్తపడే 'ప్రజ్ఞ'ను ఈ ఆధునిక వంగడాలు కోల్పోవటం వల్లే బియ్యంలోకి భార లోహాలు చేరుతున్నాయని కూడా ఈ అధ్యయనం తేటతెల్లం చేసింది. మనం విస్మరించిన దేశీ వరి వంగడాలకు ప్రకృతే ఈ 'ప్రజ్ఞ'ను సమకూర్చింది.

సేంద్రియ/ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తే దేశీ వరి బియ్యంలో అద్భుతమైన పోషక / ఔషధ విలువలు చెక్కు చెదరలేదన్న విషయం మనకు బోధపడుతుంది. అపారమైన దేశీ వరి జీవవైవిధ్యం చాలా వరకు కాలగర్భంలో కలసిపోయింది. అయితే, కొద్ది మంది ముందుచూపున్న రైతులు ఇప్పటికీ అనేక వందల అలనాటి వరి వంగడాలను ఏటేటా సాగు చేస్తూనే ఉన్నారు. వీటిని అపురూపంగా పరిరక్షించుకుంటున్నారు. ఇంతకీ, ఏ ఆరోగ్య సమస్యలను అధిగమించడానికి ఏయే దేశీ వరి బియ్యం ఉపయోగపడతాయో తెలుసుకుంటే ఆశ్చర్యం కలగకమానదు! అందుకే ఈ ఆహారమే 'దివ్యౌషధం' అయ్యింది!!



3 నెలల్లోనే ఫలించిన కల

పెళ్లయిన ఐదేళ్లకు తొలి కాన్పులో బాబు అనారోగ్యంతో పుట్టి, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 50 రోజులకు చనిపోయాడు. ఆ తర్వాత మళ్లీ గర్భం రాలేదు. ఆ దశలో కులాకర్ బియ్యం మధ్యాహ్నం, రాత్రి వండుకొని తినటం ప్రారంభించిన మూడు నెలల్లోనే, ఎటువంటి మందులు వాడకుండానే, నా భార్య సింధూరి గర్భం దాల్చింది. తర్వాత కూడా ఏ సమస్యలూ రాలేదు.

ఆరోగ్యవంతమైన బిడ్డను ప్రసవించింది. కులాకర్ బియ్యం గర్భం దాల్చటానికి దోహదపడుతున్నట్లు యూట్యూబ్‌లో విజయరామ్ వీడియో చూసి రెండేళ్ల క్రితం సేవ్ సంస్థ కార్యాలయానికి వెళ్లి కలిశాం. అప్పటి నుంచి కుల్లాకర్, బహురూపి, గోవింద భోగ్, నవార బియ్యం, దేశీ ఆవు నెయ్యి, పాలు ఉపయోగిస్తున్నందు వల్లనే మా కల నెరవేరింది. ఇంట్లో అందరికీ ఆరోగ్యం చేకూరిందని నూరు శాతం నమ్ముతున్నాం.

ఇవన్నీ తింటుంటే ఎగతాళి చేసిన మా అక్క ఇప్పుడు రసాయనాల్లేని దేశీ బియ్యం, దేశీ ఆవు ఉత్పత్తుల ప్రభావాన్ని గుర్తించింది. మా అత్తగారి (కడప జిల్లా వేంపల్లె) ఊళ్లో 3 ఎకరాల భూమి కొన్నా. నాకు ప్రకృతి వ్యవసాయం ప్రారంభించబోతున్నాం.

– సి. క్రాంతికుమార్,
సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, హైదరాబాద్

20 మంది కలలు పండాయి!

వికారాబాద్ జిల్లా దారూర్ మండలం నాగసముందర్ గ్రామంలో సంతానం కావాలనుకునే 30 మంది మహిళలకు 18 నెలల పాటు కుల్లాకర్ బియ్యాన్ని ఇచ్చి వాడించాం. అదే విధంగా, కృష్ణా జిల్లా గూడూరు మండలం పినగూడూరు లంక గ్రామంలో 18 నెలల పాటు 20 మందికి ఈ బియ్యాన్ని తినిపించాం. వీళ్లందరూ గర్భందాల్చారు. ఆరోగ్యవంతమైన పిల్లలు పుట్టారు. పిల్లల బరువు 2.5 కేజీల నుంచి 3 కేజీల మధ్యన వుంది. పుట్టిన పిల్లలు చలాకీగా వున్నారు. వారికి రోగ నిరోధక శక్తి ఎక్కువగా వుంది. ఒక సంవత్సరం లోపు పిల్లలు ఇతరుల దగ్గర వున్నప్పుడు చికాకుతో ఏడవట్లేదు. పాలు అవసరమైనప్పుడు మాత్రమే తల్లి కోసం ఏడుస్తున్నారు. మధ్యలో తల్లి కనిపిస్తూ వుంటే ఇతరులతో స్థిమితంగా వుండ గలుగుతున్నారు. తల్లుల ఆరోగ్యం బాగుంది. పిల్లలకు సరిపడా పాలు వున్నాయి.

ఈ పద్ధతిని పాటించిన ఒక ప్రవాస భారతీయురాలు కుల్లాకర్ బియ్యాన్ని వాడి బిడ్డకు సరిపడా పాలు ఇవ్వడమే కాకుండా తల్లి పాల బ్యాంకుకు తన పాలను దానం చేయగలిగింది. చాలా మంది గర్భవతులకు సహజ సిద్ధంగా సులభ ప్రసవం జరిగింది.

9 సంవత్సరాల నుంచి పిల్లలు లేని తల్లి ఈ బియ్యాన్ని వాడి 40 రోజుల్లోనే గర్భవతి అయ్యింది. అంతకు మునుపు అబార్షనై, పిసిఓడితో బాధపడే ఒకామె ఈ బియ్యాన్ని 6 నెలలు వాడి పండంటి బిడ్డను కన్నారు. ప్రైవసీ కోసం వారందరి పేర్లు బహిరంగంగా ఇవ్వలేకపోతున్నాం. ఆసక్తి గల ఎవరైనా హైదరాబాద్ లోయర్ ట్యాంక్‌బండ్ రోడ్డులోని 'సేవ్' ఆఫీసు(సుంకర వెంకట రమణ: 630 91 11427) ను సంప్రదించి, వారితో ఫోనులో మాట్లాడొచ్చు. తర్వాత నేరుగా కలవొచ్చు కూడా!



– ఎం. విజయ్ రామ్,
దేశీ విత్తన పరిరక్షకులు,
సుభాష్ పాలేకర్ కృషి (ఎస్‌పికె) సేద్య విధాన సాధకులు,
సేవ్ సంస్థ వ్యవస్థాపకులు

దేశీ వరితో కూడిన ఆరోగ్య జీవన విధానం ఇదే!

బాలింతలు, గర్భవతులు, పిసిఓడి సమస్యలు ఉన్న వారు కుల్లాకర్ బియ్యాన్ని ఉపయోగించుకొని ఆరోగ్యం పొందవచ్చు లేదా ఆరోగ్య సమస్యలు తగ్గించుకునే పద్ధతులు.

1. గర్భవతులు, పాలిచ్చే తల్లులకు సూచనలు: గర్భవతులు 3వ నెల నుంచి ఇలా చేయాలి. వెండి గిన్నెలో దేశీ ఆవుపాలను రాత్రి పూట తోడు పెట్టి పెరుగు తయారు చేసుకోవాలి. కుల్లాకర్ బియ్యంతో అన్నం వండి ఆ పెరుగుతో కలిపి ఉదయపు అల్పాహారం (బ్రేక్‌ఫాస్ట్)గా తినాలి.

2. పాలు ఇచ్చే తల్లులకు కుల్లాకర్ బియ్యంతో పాలతాలికలు చేసి సాయంత్రం వేళల్లో వారంలో రెండు సార్లు పెట్టాలి. లేదా.. కుల్లాకర్ బియ్యంతో పరమాన్నం చేసి సాయంత్రం ఆహారంగా వారంలో రెండు రోజులు పెట్టాలి.

3. కుల్లాకర్ అన్నాన్ని రోజూ మధ్యాహ్న భోజనంలో కుటుంబంలో అందరూ తినవచ్చు. కుల్లాకర్ బియ్యాన్ని 3 గంటలు నానబెట్టి, ఇత్తడి పాత్రలో ఎసరు పెట్టి అన్నం వండుకొని ప్రతి రోజూ మధ్యాహ్నం తినాలి. కనీసం 8 వారాలు అలా చేయాలి.

4. పిసిఓడి సమస్యలు ఉన్న మహిళలు, గర్భాశయ సమస్యలు, రుతుక్రమంలో సమస్యలు వున్న వారు కుల్లాకర్ బియ్యాన్ని ఉపయోగించే విధానాన్ని జాగ్రత్తగా గమనించి పాటించాలి. కుల్లాకర్ బియ్యంతో రాత్రి పూట అన్నం వండాలి. ఒక కప్పు బియ్యానికి 6 కప్పుల నీళ్ళు ఇత్తడి పాత్రలో పోసి ఎసరు పెట్టి వండాలి. పాతకాలం ఇత్తడి గిన్నె లేదా మట్టి పాత్రలో వండాలి. గంజి వంచాలి. ఆ గంజిని పక్కన పెట్టి, మరునాడు సాయంత్రం 4 గంటలకు తాగాలి. వండిన అన్నాన్ని ఇత్తడి పాత్ర నుంచి తీసి వేసి మట్టి పాత్ర లేదా స్టీల్ పాత్రలో వుంచి అన్నం మునిగే వరకూ నీళ్ల పోసి రాత్రంతా వుంచాలి. మరునాడు పొద్దున్నే నానిన అన్నం నుంచి నీటిని వేరు చేయాలి (ఆ నీటిని సాయంత్రం గంజి నీళ్లలో కలిపి తాగలి). నానిన అన్నానికి మజ్జిగ కలిపి దాన్ని బ్రేక్‌ఫాస్ట్‌లో తినాలి. అలా 40 రోజులు చేయాలి. ఇతర ఆహారాలు, పండ్లు, ఊరగాయలు ఏవీ కూడా దీనితో కలిపి బ్రేక్‌ఫాస్ట్‌లో తినకూడదు. రోజూ చేయలేని వారు ఇలా వారంలో కనీసం 5 రోజుల చొప్పున 8 వారాలు చేయాలి.



– ఎం. సురేంద్రనాథ్,
దేశీ ఆహార చైతన్య ప్రచార కార్యక్రమం,
సేవ్ స్వచ్ఛంద సంస్థ, హైదరాబాద్

కుల్లాకర్‌లో పోషకాలేమిటి?

చెన్నై కేంద్రంగా పనిచేస్తున్న సెంటర్ ఫర్ ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్ (సిఐకెఎస్) అనే స్వచ్ఛంద సంస్థ 'ట్రెడిషినల్ రైస్ వెరైటీస్ ఆఫ్ తమిళనాడు: ఏ సోర్స్ బుక్' అనే సంకలనాన్ని 2019లో ప్రచురించింది. దీని ప్రకారం.. సేంద్రియంగా పండించిన కుల్లాకర్ బాయిల్డ్ (ఉప్పుడు) బియ్యంలో వివిధ పోషకాలు మెండుగా ఉన్నాయి. గ్లైసెమిక్ ఇండెక్స్(జిఐ) తక్కువ. ఐరన్, కాల్షియం, జింక్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి:

కుల్లాకర్ ఉప్పుడు బియ్యం (100 గ్రాములకు)

కాల్షియం(ఎంజి)	50.40
ఐరన్ (ఎంజి)	7.50
పొటాషియం (ఎంజి)	291.60
మెగ్నీషియం (ఎంజి)	121.70
జింక్ (ఎంజి)	2.50
ఫాస్ఫరస్ (ఎంజి)	347.7
మాంసకృత్తులు (గ్రా.)	8.64
పిండిపదార్థాలు (గ్రా.)	73.26
శక్తి (కిలో కేలరీలు)	349.00

బిజినెస్ రీల్

ఐకియా ఇండియా కొత్త సీఈవోగా ప్యాట్రిక్ ఆంటోనీ



న్యూఢిల్లీ: హోమ్ ఫర్నిషింగ్స్ దిగ్గజం ఐకియా ఇండియా కొత్త సీఈవోగా ప్యాట్రిక్ ఆంటోనీ నియమితులయ్యారు. ఆగస్టు నుంచి ఆయన నియామకం అమల్లోకి వస్తుంది. కంట్రీ రిటైల్ మేనేజర్, చీఫ్ సస్టైనబిలిటీ మేనేజర్గా (సీఎస్వో) కూడా ఆయన వ్యవహరిస్తారని కంపెనీ తెలిపింది. ప్రస్తుత కంట్రీ రిటైల్ మేనేజర్, సీఎస్వో సుసాన్ పల్వరర్ రాజీనామా చేయడంతో ఆంటోనీ నియమితులయ్యారు. ఐకియాలో సుసాన్ సుమారు 28 ఏళ్లు పనిచేశారు. అయిదేళ్ల పాటు డిప్యూటీ సీఈవోగా కూడా వ్యవహరించారు. 2018లో హైదరాబాద్లో తొలి స్టోర్ ప్రారంభించిన ఐకియా ప్రస్తుతం రెండో విడత విస్తరణపై దృష్టి పెడుతోంది.

ఏజీఐ గ్రీన్ప్యాక్ రూ. 1,000 కోట్ల పెట్టుబడులు



ముంబై: గ్లాస్ కంటైనర్ల తయారీ సంస్థ ఏజీఐ గ్రీన్ప్యాక్ సంస్థ కొత్తగా అల్యూమినియం క్యాన్ల విభాగంలోకి ప్రవేశిస్తోంది. ఇందుకోసం ఉత్తర్ ప్రదేశ్లో కొత్త ప్లాంటుపై రూ. 1,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. రెండు దశలుగా ఈ పెట్టుబడులు పెట్టనున్నట్లు కంపెనీ సీఎండీ సందీప్ సోమానీ తెలిపారు. ఇది తొలుత 95 కోట్ల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో 2028 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో అందుబాటులోకి రాగలదని చెప్పారు. దీన్ని 2030 ఆర్థిక సంవత్సరం నాటికి 160 కోట్లకు పెంచుకోనున్నట్లు సందీప్ తెలిపారు. మరోవైపు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో కంపెనీ నికర లాభం గత క్యూ1తో పోలిస్తే 41% పెరిగి రూ. 63 కోట్ల నుంచి రూ. 89 కోట్లకు చేరింది.

మెరిల్లో ఏడీఐఏ 200 మిలియన్ డాలర్ల పెట్టుబడులు



గుజరాత్: అబుదాబీ ఇన్వెస్ట్మెంట్ అథారిటీ(ఏడీఐఏ), భారత్కు చెందిన మెడికల్ డివైజెస్ తయారీ సంస్థ మైక్రో లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్(మెరిల్)లో 200 మిలియన్ డాలర్ల(రూ.1,670 కోట్లు) పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ పెట్టుబడితో మెరిల్లో ఏడీఐఏకు 3% వాటా లభించనుంది. తద్వారా మెరిల్ మార్కెట్ విలువ 6.6 బిలియన్ డాలర్లకు (సుమారు రూ.56,859 కోట్లు)చేరుతుందని అంచనా. పెట్టుబడి నిధులను వ్యాపార విస్తరణ, పరిశోధన-అభివృద్ధి (ఆర్అండ్డీ) కార్యకలాపాలకు వినియోగించుకుంటామని మెరిల్ వైస్ ప్రెసిడెంట్ సంజీవ్ భట్ తెలిపారు. గుజరాత్లోని వాపి కేంద్రంగా పనిచేసే మెరిల్ సంస్థ... గుండె సంబంధిత పరికరాలు, సర్జికల్ రోబోటిక్స్, ఆర్థోపెడిక్ ఇంప్లాంట్లు వంటి వైద్య పరికరాలు తయారు చేస్తుంది.

కోడిగుడ్లు (హోల్సేల్-నెక్ / 100కు రూ.లలో)

23-7-2025

విశాఖ	520-00
చిత్తూరు	543-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	505-00
విజయవాడ	505-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	480-00
వరంగల్	482-00
రిటైల్ ధర	5.40

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ETERNAL	299.75	10.32
HDFCLIFE	762.55	1.36
HINDALCO	690.55	1.15
TITAN	3,469.50	1.06
BEL	403.45	0.88

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SHRIRAMFIN	640.9	-2.25
EICHERMOT	5,441.00	-2.11
JIOFIN	311	-1.97
ADANIPORTS	1,424.80	-1.77
BAJAJ-AUTO	8,290.00	-1.76

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,596
ఎన్ఎస్ఈ	1,00,574
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,34,910
ఎఫ్ఐఐ	-3,549
డీఐఐ	+ 5,240

ముడిచమురు... (బ్యారల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	65.13	$	65.95
బ్రెంట్	68.44	$	69.21

రూ.కోటిలోపు ఫ్లాట్ల అమ్మకాలు డీలా

- జనవరి-జూన్ మధ్యకాలంలో 32 శాతం డౌన్
- ప్రీమియం ఇళ్లకు మంచి డిమాండ్
- 6 శాతం అధిక విక్రయాలు
- జేఎల్ఎల్ ఇండియా నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఏడు ప్రధాన నగరాల్లో రూ.కోటిలోపు ధర కలిగిన అపార్ట్మెంట్ల (ఫ్లాట్లు) అమ్మకాలు 32 శాతం తగ్గిపోయాయి. ఇదే కాలంలో ప్రీమియం అపార్ట్మెంట్లలో అమ్మకాలు 5 శాతం పెరిగాయి. రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ జేఎల్ఎల్ ఇండియా విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం.. 2025 జనవరి-జూన్ కాలంలో ఏడు ప్రధాన నగరాల్లో 1,34,776 అపార్ట్మెంట్ల అమ్మకాలు నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే కాలంలోని అమ్మకాలతో పోల్చి చూస్తే 13 శాతం తగ్గాయి. రూ.కోటి ధరలోపు అపార్ట్మెంట్ల విక్రయాలు మాత్రం 32 శాతం తగ్గి 51,804 యూనిట్లుగా ఉన్నాయి. రూ.కోటికి పైన ధర శ్రేణిలోని అపార్ట్మెంట్ల అమ్మకాలు 6 శాతం పెరిగి 82,972 యూనిట్లుగా నమోదయ్యాయి. హైదరాబాద్ తోపాటు ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్), ఢిల్లీ ఎన్సీఆర్, కోల్కతా, చెన్నై, బెంగళూరు, పుణె నగరాల్లో అమ్మకాలపై జేఎల్ఎల్ ఇండియా నివేదిక విడుదల చేసింది. అపార్ట్మెంట్ల గణాంకాలు మినహా విల్లాలు, రోహౌస్లు ఇతర ఇళ్ల విక్రయాలు ఇందులో లేవు. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో మొత్తం అపార్ట్మెంట్ల అమ్మకాల్లో రూ.కోటికి పైన ధరలోనివి (ప్రీమియం) 62 శాతంగా ఉండడం గమనార్హం. క్రితం ఏడాది ఇదే కాలంలో వీటి అమ్మకాలు మొత్తం విక్రయాల్లో 51 శాతంగా ఉన్నాయి. రూ.కోటిలోపు ఇళ్ల విక్రయాల వాటా 49 శాతం నుంచి 38 శాతానికి తగ్గింది.

పెరుగుతున్న కొనుగోలు సామర్థ్యం..

''లగ్జరీ ఇళ్ల అమ్మకాలు స్థిరంగా వృద్ధి చెందడం కొనుగోలు పెరుగుతున్న సామర్థ్యం, మెరుగైన జీవన ఆకాంక్షలకు నిదర్శనం. ప్రీమియం ప్రాపర్టీల పట్ల పెరుగుతున్న దృష్టి మాస్ హౌసింగ్ విభాగంలో కార్యకలాపాలకు ప్రాధాన్యం తగ్గుతోంది'' అని జేఎల్ఎల్ ఇండియా ముఖ్య ఆర్థికవేత్త సమంతక్ దాస్ తెలిపారు.

ముంబైలో అల్ట్రా లగ్జరీ ఇళ్ల జోరు



ముంబై నగరంలో లగ్జరీ ఇళ్లకు (రూ.10 కోట్లు, అంతకుమించిన బడ్జెట్లోనివి) డిమాండ్ బలంగా పెరుగుతోంది. ఇందుకు నిదర్శనంగా ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో అమ్మకాల విలువ క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 20 శాతం పెరిగి రూ.14,751 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో అమ్మకాల విలువ రూ.12,285 కోట్లుగా ఉండడం గమనార్హం. సంఖ్యా పరంగా చూస్తే అల్ట్రా లగ్జరీ ఇళ్ల విక్రయాలు 11 శాతం పెరిగి 692 యూనిట్లకు చేరాయి. ఈ వివరాలను ఇండియా సోథెబిస్ ఇంటర్నేషనల్ రియల్టీ (ఐఎస్ఐఆర్), సీఆర్ఈ మ్యాట్రిక్స్ సంయుక్త నివేదిక వెల్లడించింది. కొత్తగా నిర్మించిన ఇళ్లు, మెరుగైన వసతులతో ఉన్న వాటికి కొనుగోలుదారులు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రైమరీ మార్కెట్లో (మొదటిసారి విక్రయించే కొత్త ఇళ్లు) ఇళ్ల అమ్మకాలు 422 యూనిట్ల నుంచి 501 యూనిట్లకు పెరిగాయి. సెకండరీ మార్కెట్లో విక్రయాలు (రీసేల్) 200 యూనిట్ల నుంచి 191కు తగ్గాయి. ప్రైమరీ మార్కెట్లో అల్ట్రా లగ్జరీ ఇళ్ల అమ్మకాల విలువ రూ.8,752 కోట్ల నుంచి రూ.11,008 కోట్లకు పెరిగింది. సెకండరీ మార్కెట్లో అమ్మకాల విలువ రూ.3,533 కోట్ల నుంచి రూ.3,743 కోట్లకు చేరింది. ''ముంబై లగ్జరీ ఇళ్ల మార్కెట్ కీలక తరుణంలో ఉంది. ఈ ఏడాది మొదటి అర్ధ భాగంలో రికార్డు స్థాయి అమ్మకాలు అల్ట్రా ప్రీమియం ఇళ్లకు ఉన్న డిమాండ్ను తెలియజేస్తోంది. ముఖ్యంగా వర్లి, ప్రభాదేవి, మలబార్ హిల్, బాంద్రా వెస్ట్ వంటి సూక్ష్మ మార్కెట్లలో డిమాండ్ ఎక్కువగా ఉంది'' అని ఐఎస్ఐఆర్ ఈడీ సుదర్శన్ శర్మ తెలిపారు.

ఐఎంఎఫ్కు గీతా గోపీనాథ్ గుడ్బై

హార్వర్డ్లో చేరనున్న ఆర్థికవేత్త



న్యూఢిల్లీ: అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్)కు డిప్యూటీ ఎండీగా వ్యవహరిస్తున్న భారతీయ అమెరికన్ ఆర్థికవేత్త గీతా గోపీనాథ్ ఆ బాధ్యతల నుంచి తప్పుకోనున్నారు. తాను హార్వర్డ్ యూనివర్సిటీ ఎకనామిక్స్ ప్రొఫెసర్గా తిరిగి వెళ్లనున్నట్టు ఆమె ప్రకటించారు. సెప్టెంబర్ 1న కొత్త బాధ్యతలను ఆమె స్వీకరించనున్నారు. ''ఐఎంఎఫ్లో ఏడేళ్ల అద్భుత కాలం తర్వాత బోధనా వృత్తిలోకి తిరిగి వెళ్లాలని నిర్ణయించుకున్నాను''అని ఎక్స్ ప్లాట్ఫామ్పై చేసిన పోస్ట్లో పేర్కొన్నారు. ఐఎంఎఫ్ చరిత్రలో మొదటి మహిళా ముఖ్య ఆర్థికవేత్తగానే కాదు, మొదటి డిప్యూటీ ఎండీగా గోపీనాథ్ పనిచేసి చరిత్ర సృష్టించడం గమనార్హం. ఐఎంఎఫ్లో సేవల పట్ల గీతా గోపీనాథ్ కృతజ్ఞతలు తెలిపారు. అసాధారణ సవాళ్లతో కూడిన సమయంలో పనిచేయాల్సి రావడం జీవితంలో ఒక్కసారి దక్కే అవకాశంగా పేర్కొన్నారు. ''అధ్యాపక మూలాలాల్లోకి తిరిగి వెళుతున్నాను. అంతర్జాతీయ సవాళ్లకు పరిష్కారంగా పరిశోధనలపై దృష్టి సారించాలని అనుకుంటున్నాను. తదుపరి తరం ఆర్థికవేత్తలకు శిక్షణ ఇవ్వాలని అనుకుంటున్నాను''అని గోపీనాథ్ తన భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. గోపీనాథ్ 2019లో ఐఎంఎఫ్లో ముఖ్య ఆర్థికవేత్తగా చేరారు. 2022 జనవరిలో ఐఎంఎఫ్ డిప్యూటీ డైరెక్టర్ పదవి సృష్టించి ఆ బాధ్యతలను ఆమెకు అప్పగించారు. ఐఎంఎఫ్కు ముందు హార్వర్డ్ యూనివర్సిటీలో ఇంటర్నేషనల్ స్టడీస్, ఎకనామిక్స్ ప్రొఫెసర్గా పనిచేయడం గమనార్హం. గోపీనాథ్ అద్భుతమైన, అసాధారణ నేత అంటూ ఆమె సేవలను ఐఎంఎఫ్ ఎండీ క్రిస్టలీనా జార్జీవా కొనియాడారు.

డబ్బా ట్రేడింగ్ చట్ట విరుద్ధం

సెబీ హెచ్చరికలు



న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా డబ్బా ట్రేడింగ్ చట్ట విరుద్ధమని స్పష్టం చేసింది. ఈ అంశంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండవలసిందిగా హెచ్చరించింది. చట్ట విరుద్ధంగా జరిగే ట్రేడింగ్ సర్వీసుల ద్వారా ఎలాంటి లావాదేవీలు చేపట్టవద్దని సూచించింది. ఈ విషయంలో జాగరూకతతో వ్యవహరించవలసిందిగా పేర్కొంది. స్టాక్ మార్కెట్లకు సమాంతరంగా నియంత్రణలులేని ఆఫ్మార్కెట్లో నిర్వహించే అక్రమ లావాదేవీలకు దూరంగా ఉండమంటూ హెచ్చరించింది. గుర్తింపు పొందిన స్టాక్ ఎక్స్ఛేంజీలకు సంబంధంలేకుండా నిర్వహించే ఇలాంటి లావాదేవీలు భారీ రిస్కులతో కూడి ఉంటాయని తెలియజేసింది. అంతేకాకుండా సెక్యూరిటీస్ కాంట్రాక్టుల చట్టంలోని పలు నిబంధనల ఉల్లంఘనకు సైతం దారితీస్తాయని హెచ్చరించింది. వెరసి డబ్బా ట్రేడింగ్ చట్ట విరుద్ధమేకాకుండా.. రిస్కులను సైతం ఎదుర్కోవలసి ఉంటుందని వివరించింది. నియంత్రణ, అవగాహన, చట్టబద్ధ సంస్థల సహకారంతో సెబీ ఇన్వెస్టర్ల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తుందని ఈ సందర్భంగా తెలియజేసింది.

జీసీసీల నిర్వహణకు కోవాసెంట్ 'ఎనేబ్లర్' సేవలు

Covasant
AI-Driven. Human-Inspired.

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల నిర్వహణకు ఉపయోగపడేలా 'ఎనేబ్లర్' పేరిట కొత్త సర్వీస్ల విభాగాన్ని ప్రారంభించినట్లు కోవాసెంట్ టెక్నాలజీస్ వెల్లడించింది. కంపెనీలు జీసీసీలను ఏర్పాటు చేయడం, నిర్వహించుకోవడం, కార్యకలాపాలను మెరుగుపర్చుకోవడానికి సంబంధించి కృత్రిమ మేధను (ఏఐ) ఉపయోగించి ఎనేబ్లర్ తగు వ్యూహాలను అందిస్తుందని పేర్కొంది. సరైన ప్రాంతాన్ని ఎంపిక చేసుకోవడం, ప్రతిభావంతులను రిక్రూట్ చేసుకోవడం నుంచి ఆటోమేషన్, అనలిటిక్స్ను ఉపయోగించుకోవడం వరకు ఇది అన్ని రకాల సేవలను అందిస్తుందని వివరించింది. కేవలం కంపెనీల కార్యకలాపాల నిర్వహణపరమైన పనులకే పరిమితం కాకుండా ఆవిష్కరణలు, వ్యూహాల్లో కూడా భాగస్వాములుగా జీసీసీలు ఎదిగేందుకు ఇది సహాయకరంగా ఉంటుందని కోవాసెంట్ టెక్నాలజీస్ తెలిపింది. వచ్చే అయిదేళ్లలో హైదరాబాద్తో పాటు దేశవ్యాప్తంగా 150 జీసీసీల ఏర్పాటుపై ఎనేబ్లర్ దృష్టి పెట్టినట్లు సంస్థ వివరించింది.

ఐపీవోకు మిల్క్ మిస్ట్ డెయిరీ

- సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు
- రూ. 2,035 కోట్ల సమీకరణపై కన్ను



న్యూఢిల్లీ: డెయిరీ ప్రొడక్టుల కంపెనీ మిల్క్ మిస్ట్ డెయిరీ ఫుడ్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. అనుమతుల కోసం క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. ఇష్యూలో భాగంగా రూ. 1,785 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో రూ. 250 కోట్ల విలువైన షేర్లను కంపెనీ ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి ఐపీవో ద్వారా రూ. 2,035 కోట్లు సమీకరించాలని ఆశిస్తోంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 750 కోట్లు రుణ చెల్లింపులకు, రూ. 414 కోట్లు పెరుందురై ప్లాంట్ విస్తరణ, ఆధునీకరణకు వినియోగించనుంది. విస్తరణలో భాగంగా వే ప్రొటీన్ కాన్సన్ట్రేట్, యోగర్ట్, క్రీమ్ చీజ్ తయారీ యూనిట్లను నెలకొల్పనుంది. ఈ బాటలో మరో రూ. 129 కోట్లు విసీ కూలర్స్, ఐస్క్రీమ్ ఫ్రీజర్స్, చాకొలెట్ కూలర్స్ తదితరాల ఏర్పాటుకు వెచ్చించనుంది. తమిళనాడులోని ఈరోడ్లో ప్రారంభమైన కంపెనీ పనీర్, చీజ్, యోగర్ట్, బటర్, నెయ్యి తదితర వివిధ డెయిరీ ప్రొడక్టులను రూపొందించి విక్రయిస్తోంది. గతేడాది(2024-25) రూ. 2,349 కోట్ల ఆదాయం, రూ. 310 కోట్ల నిర్వహణ లాభం (ఇబిటా) సాధించింది.

ఆకాశ ఎయిర్ భారీ ప్రణాళికలు

2032 నాటికి 226 విమానాలు



న్యూఢిల్లీ: విమానయాన సంస్థ ఆకాశ ఎయిర్ భారీ విస్తరణ ప్రణాళికల్లో ఉంది. 2032 నాటికి 226 విమానాలను సమకూర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. వార్షికంగా సర్వీసుల సామర్థ్యాన్ని 25-30 శాతం మేర పెంచుకోవాలని నిర్దేశించుకుంది. కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ అంకుర్ గోయల్ ఈ విషయాలు తెలిపారు. 2022 ఆగస్టులో ప్రారంభమైన ఆకాశ ఎయిర్ దేశీయంగా 23, అంతర్జాతీయంగా 5 గమ్యస్థానాలకు ఫ్లైట్లు నడుపుతోంది. కంపెనీ దగ్గర ప్రస్తుతం 30 బోయింగ్ 737 మ్యాక్స్ విమానాలు ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరో అయిదు కొత్త విమానాలు జత కానున్నాయి. త్వరలోనే వ్యయాలను మరింతగా తగ్గించుకుని, లాభాల్లోకి మళ్లగలమని అంకుర్ గోయల్ ధీమా వ్యక్తం చేశారు.

ఆర్బీఐ రేట్ల కోత మ్యాజిక్ బుల్లెట్ కాదు

- పెట్టుబడులకు చోదకంగా నిలవదు
- ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్రాజన్





న్యూఢిల్లీ: ఆర్బీఐ వడ్డీ రేట్ల తగ్గింపు పెట్టుబడులను ఇతోధికం చేసే మ్యాజిక్ బుల్లెట్ కాబోదని మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అభిప్రాయపడ్డారు. ఆర్థిక వృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లడంతో ఇతర అంశాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ప్రస్తుత తరుణంలో వడ్డీ రేట్లు అధికంగా లేవన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఆర్బీఐ రేట్ల కోత ఫలితమిచ్చేందుకు సమయం పడుతుందన్నారు. ఆర్బీఐ ఈ ఏడాది ఇప్పటి వరకు ఒక శాతం మేర రెపో రేటును తగ్గించడం తెలిసిందే. ఈ రేట్ల తగ్గింపు అంతిమంగా కంపెనీల పెట్టుబడులు పెరిగేందుకు దారితీస్తుందా? అంటూ ఓ మీడియా సంస్థ ఆయన్ను ప్రశ్నించింది. ''కేవలం వడ్డీ రేట్లతోనే ఇది సాధ్యపడుతుందని నేను అనుకోవడం లేదు. ఒకటికి మించిన అంశాలు ఇందులో పనిచేస్తాయి. మరిన్ని రంగాల్లో పోటీని పెంచాలి. తమ సానుకూలతలను కాపాడుకునేందుకు వీలుగా పెట్టుబడులపై మరింతగా దృష్టి పెట్టే విధంగా పరిశ్రమలను ప్రోత్సహించాలి. మరిన్ని కార్పొరేట్ పెట్టుబడులు వస్తాయని నేను విశ్వసిస్తున్నాను''అని రాజన్ పేర్కొన్నారు. ప్రైవేటు పెట్టుబడులు 11 ఏళ్ల కనిష్టానికి పడిపోయినట్టు కేంద్ర ప్రభుత్వ గణంకాల ఆధారంగా తెలుస్తోంది.

ప్రతి ద్రవ్యోల్బణం

ద్రవ్యోల్బణం జూన్ నెలలో 2.1 శాతానికి దిగిరావడంతో ఆర్బీఐ మరిన్ని రేట్లను తగ్గించే అవకాశం ఉందా? అన్న ప్రశ్నకు రాజన్ నేరుగా బదులివ్వలేదు. ద్రవ్యోల్బణం పరంగా భారత్ సౌకర్యమైన స్థితిలో ఉన్నట్టు చెప్పారు. పారిశ్రామిక దేశాలపై అమెరికా టారిఫ్ల విధింపు.. అంతిమంగా ఆయా దేశాల్లోకి అమెరికా ఉత్పత్తుల ప్రవేశం ప్రతి ద్రవ్యోల్బణానికి (ధరల పతనానికి) దారితీస్తుందన్నారు. ఆర్బీఐ లక్ష్యంగా పెట్టుకున్న రిటైల్ ద్రవ్యోల్బణం కంటే ప్రధాన ద్రవ్యోల్బణం అధికంగా ఉన్నట్టు గుర్తు చేశారు.

క్యూ1 ఫలితాలు

డిక్సన్ టెక్ లాభం హైజంప్

క్యూ1లో రూ. 280 కోట్లు




న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి త్రైమాసికంలో డిక్సన్ టెక్నాలజీస్(ఇండియా) ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం రెండు రెట్లుపైగా ఎగసి రూ. 280 కోట్లను అధిగమించింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో కేవలం రూ. 113 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 95 శాతం జంప్చేసి రూ. 12,836 కోట్లను తాకింది. గత క్యూ1లో ఎలక్ట్రానిక్స్ తయారీ సర్వీసుల(ఈఎంఎస్) దిగ్గజం రూ. 6,580 కోట్ల టర్నోవర్ ప్రకటించింది. అయితే మొత్తం వ్యయాలు సైతం 95 శాతం పెరిగి రూ. 12,476 కోట్లకు చేరాయి. మొత్తం ఆదాయంలో 91 శాతం వాటా ఆక్రమించే మొబైల్, ఈఎంఎస్ బిజినెస్ రెండు రెట్లు ఎగసి రూ. 11,663 కోట్లను తాకింది. అయితే కన్సూమర్ ఎలక్ట్రానిక్స్, అప్లయెన్సెస్(లెడ్ టీవీ, రిఫ్రిజిరేటర్) విభాగం 21 శాతం క్షీణించి రూ. 672 కోట్లకు పరిమితమైంది. హోమ్ అప్లయెన్సెస్ ఆదాయం 3 శాతం పుంజుకుని రూ. 313 కోట్లకు చేరగా.. లైటింగ్ ప్రొడక్టుల బిజినెస్ 17 శాతం తక్కువగా రూ. 188 కోట్లకు పరిమితమైంది.

ఫలితాల నేపథ్యంలో డిక్సన్ టెక్ షేరు 1 శాతం నష్టంతో రూ. 16,112 వద్ద ముగిసింది.

జీ ఎంటర్టైన్మెంట్ లాభం జూమ్

క్యూ1లో రూ. 144 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి త్రైమాసికంలో మీడియా రంగ దిగ్గజం జీ ఎంటర్టైన్మెంట్ ఎంటర్ప్రైజెస్ ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 22 శాతం జంప్చేసి రూ. 144 కోట్లకు చేరింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 118 కోట్లు మాత్రమే ఆర్జించింది. నెట్వర్క్ వ్యూవర్షిప్ పుంజుకోవడం, డిజిటల్ విభాగంలో మెరుగైన పనితీరు, తగ్గిన వ్యయాలు ఇందుకు తోడ్పాటునిచ్చాయి. మొత్తం ఆదాయం మాత్రం రూ. 2,150 కోట్ల నుంచి రూ. 1,850 కోట్లకు క్షీణించింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 1,941 కోట్ల నుంచి రూ. 1,653 కోట్లకు తగ్గాయి. కాగా.. దేశీయంగా ప్రకటనల ఆదాయం 19 శాతం డీలాపడినట్లు కంపెనీ వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో జీల్ షేరు బీఎస్ఈలో 5.7 శాతం పతనమై రూ. 134 వద్ద ముగిసింది.

మహీంద్రా ఫైనాన్స్ లాభం ప్లస్

క్యూ1లో రూ. 529 కోట్లు



కోల్కతా: ప్రయివేట్ రంగ ఎన్బీఎఫ్సీ.. మహీంద్రా ఫైనాన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. ఏప్రిల్-జూన్(క్యూ1)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 6 శాతం వృద్ధితో రూ. 529 కోట్లను తాకింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 497 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 18 శాతం ఎగసి రూ. 4,438 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం ఇదేస్థాయిలో పుంజుకుని రూ. 2,285 కోట్లను తాకింది. నికర వడ్డీ మార్జిన్లు 6.7 శాతంగా నమోదయ్యాయి. కనీస మూలధన నిష్పత్తి 20.6 శాతానికి చేరింది. రుణాల విడుదల 1 శాతం పెరిగి రూ. 12,808 కోట్లను తాకగా.. లోన్ బుక్ 15 శాతం అధికంగా రూ. 1.22 లక్షల కోట్లకు చేరింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 1 శాతం లాభంతో రూ. 266 వద్ద ముగిసింది.

దాల్మియా భారత్ లాభం జోరు

క్యూ1లో రూ. 395 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి త్రైమాసికంలో సిమెంట్ తయారీ దిగ్గజం దాల్మియా భారత్ ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం రెండు రెట్లుపైగా ఎగసి రూ. 395 కోట్లను తాకింది. సిమెంట్ అమ్మకాలకు మెరుగైన ధరలు, తగ్గిన వ్యయాలు ఇందుకు దోహదపడ్డాయి. గతేడాది(2024-25) ఇదే కాలంలో కేవలం రూ. 145 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం యథాతథంగా రూ. 3,636 కోట్లకు చేరింది. గత క్యూ1లో రూ. 3,621 కోట్ల టర్నోవర్ ప్రకటించింది. అమ్మకాల పరిమాణం 6% పుంజుకుని 7.4 మిలియన్ టన్నులను తాకింది. నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లు 5.8 శాతం ఎగసి 24.3 శాతానికి చేరాయి. ఇబిటా సైతం 32 శాతం జంప్చేసి రూ. 883 కోట్లను తాకింది. అయితే మొత్తం వ్యయాలు 5 శాతం క్షీణించి రూ. 3,183 కోట్లకు పరిమితమయ్యాయి. జూన్కల్లా 49.5 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యంతో సిమెంట్ తయారీకి దేశీయంగా నాలుగో పెద్ద కంపెనీగా నిలుస్తోంది.

ఫలితాల నేపథ్యంలో దాల్మియా భారత్ షేరు 2.5 శాతం లాభంతో రూ. 2,319 వద్ద ముగిసింది.

ఐఆర్ఎఫ్సీ లాభం అప్

క్యూ1లో రూ. 1,746 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి త్రైమాసికంలో ప్రభుత్వ రంగ రైల్వే ఫైనాన్సింగ్ దిగ్గజం ఐఆర్ఎఫ్సీ పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 11 శాతం ఎగసి రూ. 1,746 కోట్లను తాకింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 1,577 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 6,766 కోట్ల నుంచి రూ. 6,918 కోట్లకు బలపడింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 5,189 కోట్ల నుంచి రూ. 5,173 కోట్లకు స్వల్పంగా తగ్గాయి.

ఫలితాల నేపథ్యంలో ఐఆర్ఎఫ్సీ షేరు 2.7 శాతం నష్టంతో రూ. 131 వద్ద ముగిసింది

పరాగ్ మిల్క్ లాభం ఫ్లాట్

క్యూ1లో రూ. 28 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో ప్రయివేట్ రంగ డెయిరీ పరాగ్ మిల్క్ ఫుడ్స్ ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం దాదాపు యథాతథంగా రూ. 27.6 కోట్లను తాకింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 27.3 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 763 కోట్ల నుంచి రూ. 859 కోట్లకు బలపడింది.

ఫలితాల నేపథ్యంలో పరాగ్ మిల్క్ షేరు 4 శాతం పతనమై రూ. 243 వద్ద ముగిసింది.

సాక్షి ప్లస్
బుధవారం। 23-7-2025




ఓటమి అంచుల నుంచి...

ఐదు మ్యాచ్ పాయింట్లు కాపాడుకొని నెగ్గిన భారత స్టార్ షట్లర్ ప్రణయ్

తొలి రౌండ్‌లో ప్రపంచ 18వ ర్యాంకర్ కోకి వతనాబెపై విజయం

చాంగ్జౌ: ఈ ఏడాది ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్న భారత స్టార్ షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్... ప్రతిష్టాత్మక చైనా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నీలో స్ఫూర్తిదాయక ప్రదర్శనతో శుభారంభం చేశాడు. ఓటమి అంచుల్లో ఉన్నప్పటికీ... సంయమనం కోల్పోకుండా ఆడిన ఈ కేరళ ప్లేయర్ ఏకంగా ఐదు మ్యాచ్ పాయింట్లను కాపాడుకొని గట్టెక్కడం విశేషం. ప్రపంచ 18వ ర్యాంకర్ కోకి వతనాబె (జపాన్)తో మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 35వ ర్యాంకర్ ప్రణయ్ 8-21, 21-16, 23-21తో గెలుపొంది ప్రీక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. 57 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ప్రణయ్ తొలి గేమ్‌లో తేలిపోయాడు. కేవలం ఎనిమిది పాయింట్లు మాత్రమే సాధించాడు. ఒకసారి వరుసగా ఐదు పాయింట్లు, ఇంకోసారి వరుసగా మూడు పాయింట్లు, మరోసారి వరుసగా నాలుగు పాయింట్లు కోల్పోయిన ప్రణయ్ తొలి గేమ్‌లో ప్రత్యర్థి స్కోరు సమీపానికి కూడా రాలేకపోయాడు. రెండో గేమ్ నుంచి ప్రణయ్ పుంజుకున్నాడు. ఆరంభంలో 2-5తో వెనుకబడ్డ ప్రణయ్ ఆ తర్వాత 5-5తో, 7-7తో, 9-9తో స్కోరును సమం చేశాడు. స్కోరు 9-9 వద్ద ఉన్నపుడు ప్రణయ్ ఒక్కసారిగా చెలరేగి వరుసగా నాలుగు పాయింట్లు నెగ్గాడు. 13-9తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ఆ తర్వాత తన జోరును కొనసాగిస్తూ 15-10తో ముందంజ వేసిన ప్రణయ్ ఈ ఆధిక్యాన్ని కాపాడుకుంటూ రెండో గేమ్‌ను సొంతం చేసుకొని మ్యాచ్‌లో నిలిచాడు. నిర్ణాయక మూడో గేమ్‌లో వతనాబె విజృంభించడంతో మొదట్లో ప్రణయ్‌కు ఏమి చేయాలో తోచలేదు. వరుస పాయింట్లు కోల్పోయిన భారత ప్లేయర్ చూస్తుండగానే 1-10తో వెనుకబడిపోయాడు. గతంలో థామస్ కప్ టైటిల్ భారత్‌కు తొలిసారి దక్కడంలో కీలకపాత్ర పోషించిన ప్రణయ్ ఈ దశలో పోరాడితే పోయేదేమీ లేదన్నట్లు ఆడాడు. తొమ్మిది పాయింట్ల వ్యత్యాసాన్ని 10-14తో నాలుగు పాయింట్లకు తగ్గించాడు. స్వల్ప ఆధిక్యాన్ని నిలబెట్టుకుంటూ ముందుకు సాగిన వతనాబె 20-15తో విజయం అంచుల్లోకి వచ్చాడు. ఒక్క పాయింట్ గెలిస్తే కెరీర్‌లో ప్రణయ్‌పై వరుసగా రెండోసారి గెలుపు అందుకునేందుకు చేరువైన వతనాబె ఈ దశలో తడబడ్డాడు. మ్యాచ్ కాపాడుకోవాలంటే ఐదు పాయింట్లు సాధించాల్సిన స్థితిలో ప్రణయ్ తుది ఫలితంపై దృష్టి పెట్టకుండా... ఒక్కో పాయింట్ నెగ్గేలా ఆడాడు. ప్రణయ్ వ్యూహం ఫలితాన్నిచ్చింది. భారత ప్లేయర్ వరుసగా ఆరు పాయింట్లు నెగ్గి 15-20 నుంచి 21-20తో ఆధిక్యంలో వచ్చేసి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. వరుసగా ఆరు పాయింట్లు కోల్పోయాక వతనాబె ఒక పాయింట్ గెలిచి స్కోరును 21-21తో సమం చేశాడు. ఈ దశలో 33 ఏళ్ల ప్రణయ్ చెలరేగి వరుసగా రెండు పాయింట్లు గెలిచి గేమ్‌తోపాటు చిరస్మరణీయ విజయాన్ని అందుకున్నాడు. ఈ ఏడాది 11 టోర్నీలు ఆడిన ప్రణయ్ ఒక్క దాంట్లోనూ క్వార్టర్ ఫైనల్ చేరుకోలేకపోయాడు. చైనా ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్లో చోటు కోసం ప్రపంచ ఆరో ర్యాంకర్, చైనీస్ తైపీ ప్లేయర్ చౌ టియెన్ చెన్‌తో ప్రణయ్ తలపడతాడు. ముఖాముఖి రికార్డులో ప్రణయ్ 6-7తో వెనుకంజలో ఉన్నాడు. చివరిసారి వీరిద్దరు గత ఏడాది ఇండియా ఓపెన్‌లో తలపడగా... ప్రణయ్ వరుస గేముల్లో గెలిచాడు.

రెండు మ్యాచ్ పాయింట్లు వదులుకొని...


లక్ష్య సేన్

పురుషుల సింగిల్స్ మరో మ్యాచ్‌లో భారత నంబర్‌వన్, ప్రపంచ 19వ ర్యాంకర్ లక్ష్య సేన్‌కు తొలి రౌండ్‌లోనే ఓటమి ఎదురైంది. ప్రపంచ ఐదో ర్యాంకర్ లీ షి ఫెంగ్ (చైనా)తో జరిగిన మ్యాచ్‌లో లక్ష్య సేన్ 21-14, 22-24, 11-21తో ఓడిపోయాడు. 67 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో లక్ష్య సేన్ తొలి గేమ్ గెల్చుకొని, రెండో గేమ్‌లో 21-20తో, 22-21తో రెండుసార్లు విజయానికి చేరువయ్యాడు. కానీ ఈ అవకాశాలను వదులుకున్న లక్ష్య సేన్ చివరకు 22-24తో రెండో గేమ్‌ను కోల్పోయాడు. నిర్ణాయక మూడో గేమ్‌లో లీ షి ఫెంగ్ జోరు పెంచగా... గెలుపు అవకాశాలను వృథా చేసుకున్న లక్ష్య సేన్ డీలా పడి చివరకు 11 పాయింట్లే గెలిచి మ్యాచ్‌ను సమర్పించుకున్నాడు.

పోరాడి ఓడిన రుత్విక-రోహన్ జోడీ



మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత జోడీలకు నిరాశ ఎదురైంది. తెలంగాణ అమ్మాయి గద్దె రుత్విక శివాని-రోహన్ కపూర్ (భారత్), అశిత్ సూర్య-అమృత జోడీలు తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాయి. రుత్విక-రోహన్ ద్వయం 64 నిమిషాలు పోరాడి 27-25, 16-21, 14-21తో వోంగ్ టియెన్ సి-లిమ్ చియె సియెన్ (మలేసియా) చేతిలో... అశిత్-అమృత 12-21, 17-21తో రెహాన్-గ్లోరియా (ఇండోనేసియా) చేతిలో ఓడిపోయారు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో అనుపమ (భారత్) 23-21, 11-21, 10-21తో లిన్ సియాంగ్ టి (చైనీస్ తైపీ) చేతిలో పరాజయం పాలైంది. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో సెల్వం కవిప్రియ-సిమ్రన్ (భారత్) 16-21, 14-21తో లౌరెన్ లామ్-అలీసన్ లీ (అమెరికా) చేతిలో... అమృత-సోనాలీ 12-21, 5-21తో సియె పె షాన్-హుంగ్ ఎన్ జు (చైనీస్ తైపీ) చేతిలో ఓటమి చవిచూశారు.

"

ప్రస్తుతం నా కెరీర్‌లో ప్రతీ విజయం ముఖ్యం. గాయం నుంచి కోలుకుని మళ్లీ టోర్నీలు ఆడుతున్నందుకు ఆనందంగా ఉంది. స్వల్ప విరామాలు తీసుకుంటున్నాను. బ్యాడ్మింటన్‌లో పోటీతత్వం విపరీతంగా పెరిగిపోయింది. ప్రతీ రౌండ్‌లో గెలిచి ముందుకెళ్లడం రోజురోజుకీ క్లిష్టంగా మారిపోతోంది. పురుషుల సింగిల్స్‌లో ఆటగాళ్ల సగటు వయసు 22-23గా ఉంది. తెరపైకి ఒక్కసారిగా కొత్త వాళ్లు దూసుకొస్తున్నారు. వారు ఎలా ఆడతారో ముందస్తుగా తెలియడంలేదు. సీనియర్‌గా ఉంటూ యువ ప్రతిభావంతులతో పోరాడాలంటే కాస్త కష్టమే.

– ప్రణయ్

సీఫెర్ట్ జోరు

- న్యూజిలాండ్ 'హ్యాట్రిక్' విజయం
- దక్షిణాఫ్రికాపై 7 వికెట్లతో గెలుపు

హరారే: ముక్కోణపు టి20 టోర్నమెంట్‌లో న్యూజిలాండ్ జోరు కొనసాగుతోంది. ఇప్పటికే ఫైనల్ చేరిన కివీస్ జట్టు... మంగళవారం దక్షిణాఫ్రికాతో జరిగిన లీగ్ మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ టోర్నీలో 'హ్యాట్రిక్' విజయం ఖాతాలో వేసుకుంది. దక్షిణాఫ్రికా నిర్దేశించిన 135 పరుగుల లక్ష్యాన్ని న్యూజిలాండ్ 15.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సీఫెర్ట్ (48 బంతుల్లో 66 నాటౌట్; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ అర్ధశతకంతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. గురువారం జరగనున్న లీగ్ దశ చివరి మ్యాచ్‌లో ఆతిథ్య జింబాబ్వేతో న్యూజిలాండ్ తలపడనుంది. తుదిపోరుకు ముందు రిహార్సల్స్ లాంటి ఈ పోరులో టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 134 పరుగులు చేసింది. రీజా హెండ్రిక్స్ (37 బంతుల్లో 41; 4 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా... మిగిలిన వాళ్లంతా విఫలమయ్యారు. కెప్టెన్ డసెన్ (14), రుబిన్ హెర్మన్ (10), డెవాల్డ్ బ్రెవిస్ (13), డ్రె ప్రిటోరియస్ (1), సిమ్లేన్ (11) పెవిలియన్‌కు వరుస కట్టారు. న్యూజిలాండ్ బౌలర్లలో డఫీ, మిల్నే, సాంట్నర్ తలా రెండు వికెట్లు ఖాతాలో వేసుకున్నారు. ఈ టోర్నీ ఫైనల్లోనూ శనివారం మరోసారి దక్షిణాఫ్రికాతోనే న్యూజిలాండ్ ఆడుతుంది.


సీఫెర్ట్

జాతీయ క్రీడా నియమావళి పరిధిలోకి బీసీసీఐ!

న్యూఢిల్లీ: త్వరలోనే భారత ప్రభుత్వం కొత్త క్రీడా బిల్లును ప్రవేశ పెట్టనుంది. ఇది వరకే జాతీయ క్రీడా నియమావళి (స్పోర్ట్స్ కోడ్) ఉంది. దీనికి కొన్ని సవరణలు, మార్పు-చేర్పులతో తాజాగా స్పోర్ట్స్ గవర్నెన్స్ బిల్లును ఈ వర్షాకాల సమావేశాల్లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. అయితే ఇన్నేళ్లుగా భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) స్వతంత్ర క్రీడా సమాఖ్యగా చక్రం తిప్పింది. ఇప్పుడు కొత్త బిల్లు ప్రకారం క్రికెట్ బోర్డు కూడా స్పోర్ట్స్ గవర్నెన్స్ గొడుగు కిందకే రానుంది. ఇదే విషయమై కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ స్పష్టీకరించింది. 'దేశంలో ఉన్న అన్ని జాతీయ క్రీడా సమాఖ్య (ఎన్‌ఎస్‌ఎఫ్)ల మాదిరే బీసీసీఐ కూడా కొత్త గవర్నెన్స్ బిల్లు పరిధిలోకి వస్తుంది. ప్రభుత్వం నుంచి నిధులు, గ్రాంట్లు పొందిన, పొందకపోయినా పార్లమెంటులో చట్టం అయ్యాక క్రికెట్ బోర్డు కూడా స్పోర్ట్స్ కోడ్ కిందకే వస్తుంది' అని క్రీడాశాఖకు చెందిన ఉన్నతాధికారి ఒకరు స్పష్టం చేశారు. క్రీడా సమఖ్యల లాగే క్రికెట్ బోర్డుకు ఉన్న స్వయంప్రతిపత్తికి ఎలాంటి విఘాతం కలుగదని, అయితే వివాదాలు, ఇతరాత్ర సమస్యలు ఎదురైతే మాత్రం జాతీయ క్రీడా నియమావళి ప్రకారం నడుచుకోవాల్సి ఉంటుందని ఆ అధికారి వెల్లడించారు. లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్-2028లో క్రికెట్ క్రీడాంశం ఉండటంతోనే బోర్డు ఒలింపిక్ సంఘం పరిధిలోకి వచ్చినట్లయ్యింది.

జాతీయ క్రీడాసమాఖ్యల్లో నిర్లిప్తతను దూరం చేసి జవాబుదారితనాన్ని మరింత పెంచేందుకు, సకాలంలో ఎన్నికల ప్రక్రియ ముగించేందుకు, పారదర్శక పరిపాలన, అర్హులైన క్రీడాకారుల సంక్షేమం, ప్రమాణాల్ని మెరుగుపరిచేందుకు కేంద్రం స్పోర్ట్స్ గవర్నెన్స్ బిల్లును తీసుకొస్తుంది. ముఖ్యంగా అంతర్జాతీయ ఒలింపిక్ చార్టర్ ప్రకారం నడుచుకోవాల్సిన ఆవశ్యకతను ఈ బిల్లు తెలియజేస్తుంది. దీనిపై సుదీర్ఘంగా కసరత్తు చేసిన మోదీ సర్కారు ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశ పెట్టి ఆమోదింపజేసుకునేందుకు సిద్ధమైంది. ఇది వరకటి స్పోర్ట్స్ కోడ్ ప్రకారం 70 ఏళ్ల వయసుకు చేరిన ఏ కార్యవర్గ సభ్యుడైనా పదవికి రాజీనామా చేయాల్సివుండగా... ఈ గరిష్ఠ వయోపరిమితి ఇక మీదట 75కు చేరే అవకాశముంది.

బిల్లు పాసయితే...

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని అపెక్స్ కమిటీ రూపుదిద్దుకుంటుంది. ఈ కమిటీలో కేబినెట్ కార్యదర్శి హోదా ఉన్న అధికారి లేదంటే క్రీడా శాఖ కార్యదర్శి, స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ జనరల్ చైర్‌పర్సన్ అవుతారు. క్రీడలకు సేవలిందించిన దిగ్గజ క్రీడాకారులు, కోచ్‌లు సభ్యులుగా ఉంటారు. వీరు తప్పనిసరిగా ద్రోణాచార్య, ఖేల్‌రత్న, అర్జున అవార్డీలై ఉండాలి. జాతీయ క్రీడా సమాఖ్యలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులకు ఈ కమిటీలో చోటుంటుంది. ముఖ్యంగా తరచూ వివాదాస్పదమవుతున్న అంశాలపై మరింత జవాబుదారీతనంగా ఈ కమిటీ వ్యవహరిస్తుంది. ఎంపికల ప్రక్రియ, ఆటగాళ్ల నిషేధం ఇతరాత్ర సమస్యల్ని ఈ కమిటీ పారదర్శక విధానంతో పరిష్కరిస్తుంది.

దీప్తి 10 స్థానాలు పైకి



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) మహిళల వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో భారత ఆల్‌రౌండర్ దీప్తి శర్మ పది స్థానాలు ఎగబాకింది. ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌లో సత్తా చాటుతున్న ఈ స్పిన్ ఆల్‌రౌండర్ పది ర్యాంక్‌లు మెరుగుపర్చుకొని 23వ స్థానానికి చేరింది. ఇంగ్లండ్‌తో తొలి మ్యాచ్‌లో అజేయ అర్ధశతకంతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచిన దీప్తి... రెండో వన్డేలోనూ అజేయంగా 30 పరుగులు చేసింది. ఇక భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన (727 పాయింట్లు) అగ్రస్థానంలో కొనసాగుతోంది. తొలి రెండు వన్డేల్లో ఆమె వరుసగా 28, 42 పరుగులు చేసింది. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఐదు స్థానాలు కోల్పోయి 21వ ర్యాంక్‌కు పరిమితమైంది. ఇక బౌలర్ల ర్యాంకింగ్స్‌లో ఇంగ్లండ్ ప్లేయర్ ఎకెల్‌స్టోన్ 776 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా... భారత్ నుంచి అత్యుత్తమంగా దీప్తి శర్మ 655 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉంది.

పాకిస్తాన్‌కు పరాభవం

బంగ్లాదేశ్ చేతిలో టి20 సిరీస్ ఓటమి


జాకీర్ అలీ

మిర్పూర్: సొంతగడ్డపై ఆల్‌రౌండ్ ప్రదర్శనతో సత్తా చాటిన బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు... పాకిస్తాన్‌పై టి20 సిరీస్ కైవసం చేసుకుంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా మంగళవారం జరిగిన రెండో టి20లో ఆతిథ్య బంగ్లాదేశ్ 8 పరుగుల తేడాతో విజయం సాధించింది. తద్వారా మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0తో సిరీస్ హస్తగతం చేసుకుంది. రెండు లేదా అంతకంటే ఎక్కువ మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో పాకిస్తాన్‌పై బంగ్లాదేశ్‌కు ఇదే తొలి సిరీస్ విజయం కావడం విశేషం. మొదట బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 133 పరుగులకు ఆలౌటైంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జాకీర్ అలీ (48 బంతుల్లో 55 ; 1 ఫోర్, 5 సిక్స్‌లు) అర్ధశతకంతో ఆదరగొట్టగా... మెహిది హసన్ (25 బంతుల్లో 33; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించాడు. కెప్టెన్ లిటన్ దాస్ (8), హృదయ్ (0), నయీమ్ (3), పర్వేజ్ (13), షమీమ్ (1) విఫలమయ్యారు. పాకిస్తాన్ బౌలర్లలో అరంగేట్ర ప్లేయర్ అహ్మద్, సల్మాన్ మీర్జా, అబ్బాస్ అఫ్రిది తలా రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో పాకిస్తాన్ పూర్తిగా తడబడింది. 19.2 ఓవర్లలో 125 పరుగులకు ఆలౌటైంది. టాపార్డర్ మూకుమ్మడిగా విఫలమవడంతో 47 పరుగులకే 7 వికెట్లు కోల్పోయిన పాకిస్తాన్ ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. కెప్టెన్ సల్మాన్ ఆఘా (9), ఫఖర్ జమాన్ (8), సయీమ్ అయూబ్ (1) విఫలమవగా... హారీస్ (0), హసన్ (0), మొహమ్మద్ నవాజ్ (0) డకౌటయ్యారు. ఆఖర్లో ఫహీమ్ అష్రఫ్ (32 బంతుల్లో 51; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపులు మెరిపించడంతో పాక్ జట్టు ఆ మాత్రం స్కోరు చేయగలిగింది. ఇరు జట్ల మధ్య ఆఖరి టి20 గురువారం జరగనుంది.

అమెరికా క్రికెట్ జట్టుకు ఐసీసీ అవార్డు

- 2024 టి20 ప్రపంచకప్‌లో ప్రదర్శనకు పట్టం
- జై షా చేతుల మీదుగా పురస్కారం అందుకున్న యూఎస్ క్రికెట్ చైర్మన్ వేణు, సీఈఓ అట్కిన్‌సన్


అట్కిన్‌సన్, జై షా, వేణు

సింగపూర్: గతేడాది జరిగిన అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టి20 ప్రపంచకప్‌లో సత్తా చాటిన అమెరికా జట్టుకు అవార్డు దక్కింది. అమెరికా, వెస్టిండీస్ సంయుక్తంగా నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో మెరుగైన ప్రదర్శన కనబర్చిన అమెరికా జట్టు... ప్రపంచ మాజీ చాంపియన్ పాకిస్తాన్‌ను ఇంటిబాట పట్టించడంతో పాటు కెనడాపై ఘనవిజయం సాధించి 'సూపర్-8' దశకు చేరింది. ఈ ప్రదర్శనతో అమెరికాలో క్రికెట్‌కు ఆదరణ పెరగగా... తాజాగా దీనికి 'ఐసీసీ అసోసియేట్ మెంబర్స్ పురుషుల టీమ్ పెర్ఫార్మెన్స్' అవార్డు దక్కింది. ఐసీసీ చైర్మన్ జై షా చేతుల మీదుగా యునైటెడ్ స్టేట్స్ (యూఎస్) క్రికెట్ చైర్మన్ వేణు కుమార్ రెడ్డి పిసికె, సీఈఓ జొనాథన్ అట్కిన్‌సన్ ఈ పురస్కారాన్ని స్వీకరించారు. నల్లగొండకు చెందిన వేణు పిసికె 1998లో ఐటీ నిపుణుడిగా అమెరికాకు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. ఒకవైపు ఉద్యోగం చేస్తూనే మరోవైపు అమెరికాలో క్రికెట్ ఆటకు ప్రాచుర్యం కల్పించే కార్యక్రమాలు చేపట్టారు. గత ఆరేళ్లుగా అమెరికాలో క్రికెట్‌ను మరింత విస్తృతం చేసేందుకు ఆయన ఎంతో కృషి చేస్తున్నారు.

ఇక అమెరికాతోపాటు 2024లో ఆయా అసోసియేట్ జట్లు కనబరిచిన ప్రదర్శన ఆధారంగా మొత్తం 8 దేశాలకు ఐసీసీ అవార్డులు ప్రకటించింది. అమెరికాతో పాటు... భూటాన్, నేపాల్, ఇండోనేసియా, నమీబియా, స్కాట్లాండ్, టాంజానియా, వనూతు ఉన్నాయి. మొదట 15 దేశాలను పురస్కారాల కోసం షార్ట్‌లిస్ట్ చేయగా... వాటిలో ఎనిమిది దేశాలు అవార్డులు గెలుచుకున్నాయి. నమీబియాలో క్రికెట్ వృద్ధికి గానూ ఆ దేశ బోర్డుకు 'ఐసీసీ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్ ఆఫ్ ద ఇయర్' పురస్కారం లభించింది. మహిళల విభాగంలో ఈ అవార్డును రెండు దేశాలు పంచుకున్నాయి. భూటాన్ క్రికెట్ కౌన్సిల్, వనూతు క్రికెట్ సంఘానికి ఉమ్మడిగా ఈ పురస్కారం దక్కింది. నేపాల్ క్రికెట్ సంఘానికి 'ఐసీసీ డిజిటల్ ఫ్యాన్ ఎంగేజ్‌మెంట్ ఆఫ్ ద ఇయర్' అవార్డు లభించింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, యూట్యూబ్, ఎక్స్ వంటి వివిధ సామాజిక మాధ్యమాల్లో ఆటకు మరింత ప్రచారం చేస్తున్నందుకు గానూ ఈ పురస్కారం దక్కింది. 'ఐసీసీ డెవలప్‌మెంట్ అవార్డులు ప్రకటించడం ఆనందంగా ఉంది. క్రికెట్‌ను విశ్వవ్యాప్తం చేయడంలో పురస్కార విజేతలు విశేష కృషి చేశారు' అని ఐసీసీ అధ్యక్షుడు జై షా వెల్లడించారు.

విజయంతో వీనస్ పునరాగమనం

ఏడాది విరామం తర్వాత ఆడిన తొలి మ్యాచ్‌లో గెలుపు • డీసీ ఓపెన్ టెన్నిస్ టోర్నీ

వాషింగ్టన్: ఏడాది తర్వాత రాకెట్ పట్టిన అమెరికా టెన్నిస్ దిగ్గజం వీనస్ విలియమ్స్ డీసీ ఓపెన్‌లో శుభారంభం చేసింది. కెరీర్‌లో సింగిల్స్, డబుల్స్‌లో కలిపి 21 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన 45 ఏళ్ల వీనస్ తన దేశానికే చెందిన హైలీ బాప్టిస్ట్‌తో కలిసి డీసీ ఓపెన్ డబుల్స్‌లో ఆడుతోంది. తొలి రౌండ్‌లో వీనస్-హైలీ జంట 6-3, 6-1తో 2014 వింబుల్డన్ రన్నరప్ యూజీనీ బుచార్డ్ (కెనడా)-క్లార్వీ (అమెరికా) ద్వయంపై విజయం సాధించింది. మూడేళ్ల తర్వాత డబుల్స్ మ్యాచ్ ఆడిన వీనస్... కిక్కిరిసిన మైదానంలో మొదట తడబడినా... ఆ తర్వాత తన ట్రేడ్ మార్క్ షాట్‌లతో ఆకట్టుకుంది. 'ఆటను ఆస్వాదించాలనే ఉద్దేశంతోనే బరిలోకి దిగాను. ప్రస్తుతం అదే నా ప్రాథమిక లక్ష్యం. నాపై నేను ఎక్కువ ఒత్తిడి పెంచుకోవాలని అనుకోవడం లేదు. గెలుపంటే నాకు ఇష్టం. ఎలాంటి స్థితిలో అయినా గెలిచేందుకే ప్రయత్నిస్తా. అత్యుత్తమ ప్రదర్శన చేసేందుకు ప్రయత్నించా' అని వీనస్ వెల్లడించింది. 2024 మయామి ఓపెన్ తర్వాత టెన్నిస్‌కు దూరమైన వీనస్... వైల్డ్ కార్డ్‌తో తాజా టోర్నీలో బరిలోకి దిగింది. దీంతో తమ అభిమాన ప్లేయర్ ఆటను ప్రత్యక్షంగా వీక్షించేందుకు అభిమానులు ఈ మ్యాచ్‌కు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. 2022 యూఎస్ ఓపెన్‌లో సోదరి సెరెనా విలియమ్స్‌తో కలిసి బరిలోకి దిగిన అనంతరం వీనస్ ఇక డబుల్స్ మ్యాచ్ ఆడలేదు. వింబుల్డన్‌లో ఐదు (2000, 2001, 2005, 2007, 2008) సింగిల్స్ టైటిల్స్ గెలిచిన వీనస్... 2000, 2001లో యూఎస్ ఓపెన్ టైటిల్స్ ఖాతాలో వేసుకుంది. డబుల్స్‌లో 14 గ్రాండ్‌స్లామ్‌లు నెగ్గిన వీనస్... ఒలింపిక్స్‌లో 4 పసిడి పతకాలు చేజిక్కించుకుంది. ఇక ఇదే టోర్నీ సింగిల్స్‌లో సైతం వీనస్ బరిలోకి దిగనుంది. తొలి రౌండ్‌లో ప్రపంచ 35వ ర్యాంకర్ 23 ఏళ్ల పేటన్ స్టెర్న్స్‌తో తలపడనుంది.

యూఎస్ ఓపెన్‌లో వీనస్

వచ్చే నెలలో జరగనున్న గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్‌లో వీనస్ విలియమ్స్ బరిలోకి దిగనుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో అమెరికాకే చెందిన రీలీ ఒపెల్కాతో కలిసి వీనస్ ఆడనుంది. వింబుల్డన్ రన్నరప్ అమండా అనిసిమోవా (అమెరికా) కూడా యూఎస్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్‌లో పాల్గొననుంది. హోల్గర్ రూనె (డెన్మార్క్)తో కలిసి ఆమె డబుల్స్‌లో బరిలోకి దిగనుంది. ఈ మేరకు యూఎస్ ఓపెన్ నిర్వాహకులు వివరాలు వెల్లడించారు. కొత్తగా చేర్చిన జాబితాలో మొత్తం 25 జోడీలు పోటీపడుతున్నాయి. పేర్లు నమోదు చేసుకునేందుకు మరో వారం రోజులు గడువు ఉన్న నేపథ్యంలో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. సింగిల్స్ మ్యాచ్‌లు ఆగస్టు 24 నుంచి ప్రారంభం కానుండగా... అందకు వారం రోజులు ముందుగానే మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్‌లు మొదలవుతాయి.


హైలీ
వీనస్





షాపింగ్ చేసే వినియోగదారుల వెంట వచ్చే సహాయకులు, చిన్నారులు హాయిగా కొద్దిసేపు సేదతీరేందుకు అత్యాధునిక సౌకర్యాలతో అందుబాటులోకి తెచ్చిన షాపింగ్ మాల్ ప్రాంగణ దృశ్యాలివి. బీన్ బ్యాగులు, బౌల్డరింగ్ ఆట వంటి ఎన్నెన్నో సౌకర్యాలు ఈ మాల్‌లో ఉన్నాయి. దీనిని చైనాలోని బీజింగ్‌లో ఏర్పాటుచేశారు.



దేశ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు యాంకిల్ మానిటర్‌ను ధరించానని చూపిస్తున్న బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సోనారో. గత ఎన్నికల్లో తిరుగుబాటు కుట్రకు ప్రణాళికలు రచించారని ఆయనపై గతంలో కేసు నమోదైంది. సోమవారం బ్రసీలియా సిటీలో పార్లమెంట్ వద్ద తీసిందీ ఫొటో.

సీమాంతర ఉగ్రవాదం.. ఖలిస్తానీల కార్యకలాపాలు

కీలక అంశాలపై యూకే ప్రధాని కీర్ స్టార్మర్‌తో చర్చించనున్న మోదీ

నేడే యూకే పర్యటనకు బయలుదేరి వెళ్లనున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం విదేశీ పర్యటన ప్రారంభించనున్నారు. ఆయన తొలుత యూకేలో పర్యటిస్తారు. గురువారం యూకే ప్రధానమంత్రి కీర్ స్టార్మర్‌తో సమావేశమవుతారు. భారత్, యూకే సంబంధాలు మరింత బలోపేతం చేసుకోవడమే లక్ష్యంగా ఇరువురు నేతలు ద్వైపాక్షిక చర్చలు జరుపనున్నారు. ఉమ్మడి ప్రయోజనాలు, సవాళ్లతో ముడిపడి ఉన్న అంశాలపై వారు అభిప్రాయాలు పంచుకుంటారని భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ చెప్పారు. ప్రధానంగా సీమాంతర ఉగ్రవాదం, యూకేలో ఖలిస్తానీ అనుకూల శక్తుల కార్యకలాపాలు, రుణాలు ఎగ్గొట్టి పారిపోయిన బిలియనీర్ల అప్పగింత గురించి మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించే అవకాశం ఉందని పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రవాద దాడి, ఆపరేషన్ సిందూర్‌తోపాటు ఉగ్రవాదాన్ని అరికట్టేందుకు భారత్ చేపట్టిన చర్యను కీర్ స్టార్మర్ దృష్టికి మోదీ తీసుకెళ్తారని చెప్పారు. లండన్‌లో మకాం వేసిన బిలియనీర్లు విజయ్ మాల్యా, నీరవ్ మోదీ, లలిత్ మోదీని భారత్‌కు అప్పగించాలని మోదీ కోరే వీలుందని స్పష్టంచేశారు. ఈ విషయంలో తమ వంతు ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉంటామని వ్యాఖ్యానించారు. యూకేలో ఖలిస్తానీల కార్యకలాపాలు పెరిగిపోతుండడం కేవలం భారత్‌కే కాకుండా, బ్రిటిష్ ప్రభుత్వానికి సైతం ఆందోళనకరమేనని విక్రమ్ మిస్రీ ఉద్ఘాటించారు. వారి ఆగడాలను అరికట్టేలా యూకేపై ఒత్తిడి పెంచుతామన్నారు. ఇండియా–యూకే భాగస్వామ్యాన్ని 2021లో ఇరుపక్షాలు సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి పెంచుకున్నాయి. నరేంద్ర మోదీ ప్రధానమంత్రి హోదాలో యూకే పర్యటనకు వెళ్తుండడం ఇది నాలుగోసారి. 2015, 2018, 2021లో ఆయన యూకేలో పర్యటించారు. మోదీ యూకే పర్యటన తర్వాత ఈ నెల 25, 26న మాల్దీవుల్లో పర్యటిస్తారు.

రష్యాతో వ్యాపారం చేస్తే పన్నుల మోతే!

- భారత్, చైనా, బ్రెజిల్‌కు లిండ్సే గ్రాహం హెచ్చరిక
- ఉక్రెయిన్‌పై పుతిన్ యుద్ధానికి ఈ దేశాలు నిధులు సమకూరుస్తున్నాయని ఆరోపణ

వాషింగ్టన్: రష్యాతో వాణిజ్య సంబంధాలను కొనసాగిస్తున్న భారత్, చైనా, బ్రెజిల్‌లకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సన్నిహితుడు లిండ్సే గ్రాహం హెచ్చరికలు జారీ చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న మూడు దేశాలపై అమెరికా 100శాతం సుంకాలు విధిస్తుందన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం మానేయకపోతే, వారు మరింత ఎక్కువ సుంకాలను ఎదుర్కోవలసి ఉంటుందన్నారు. వారి ఆర్థిక వ్యవస్థలు చిన్నాభిన్నమవుతాయని హెచ్చరించారు. ఫాక్స్ న్యూస్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన లిండ్సే.. ఈ మూడు దేశాలు రష్యా ముడి చమురు ఎగుమతుల్లో దాదాపు 80 శాతం వాటా కలిగి ఉన్నాయని, ఉక్రెయిన్‌పై పుతిన్ యుద్ధానికి ఆర్థిక సహాయం చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. ''రష్యా చమురును కొనుగోలు చేసే చైనా, భారత్, బ్రెజిల్‌లపై ట్రంప్ సుంకాలను విధించబోతున్నారు. చైనా, భారత్, బ్రెజిల్‌లకు నేను చెప్పేది ఒక్కటే. ఈ యుద్ధం కొనసాగడానికి మీరు చౌకైన రష్యన్ చమురును కొనుగోలు చేస్తూ ఉంటే, మేము మిమ్మల్ని చీల్చివేస్తాం. మీ ఆర్థిక వ్యవస్థను అణిచివేస్తాం''అని హెచ్చరించారు. రష్యాతో వాణిజ్యం కొనసాగిస్తున్న దేశాల వస్తువులపై 500 శాతం సుంకాలు విధించాలని పిలుపునిచ్చే బిల్లును గతంలో లిండ్సే ప్రతిపాదించడం గమనార్హం. అంతే కాదు.. పుతిన్‌కు ప్రత్యక్ష సందేశం కూడా ఇచ్చారు. 'మీరు మీ ఆటలో అధ్యక్షుడు ట్రంప్‌ను తీసుకొచ్చి పెద్ద తప్పు చేసారు. మీ ఆర్థిక వ్యవస్థ నలిగిపోతూనే ఉంటుంది. మేం ఉక్రెయిన్‌కు ఆయుధాలను సరఫరా చేస్తున్నాం, కాబట్టి పుతిన్‌తో తిరిగి పోరాడటానికి ఉక్రెయిన్ సరిపడా ఆయుధాలను కలిగి ఉంటుంది'అని లిండ్సే చెప్పారు. సార్వభౌమ దేశాలపై దండెత్తడం ద్వారా సోవియట్ యూనియన్‌ను పునరుద్ధరించడానికి పుతిన్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. 'పుతిన్ తనది కాని దేశాలను తీసుకోవాలనుకుంటున్నారు. 90ల మధ్యలో, ఉక్రెయిన్ 1,700 అణ్వాయుధాలను వదులుకుంది. వారి సార్వభౌమత్వాన్ని గౌరవిస్తామని రష్యా హామీ ఇచ్చింది. కానీ పుతిన్ ఆ వాగ్దానాన్ని ఉల్లంఘించారు'అని లిండ్సే గుర్తు చేశారు.

మాకు దేశ ప్రయోజనాలే ముఖ్యం: భారత విదేశాంగ శాఖ

అమెరికా తీరుపై భారత్ స్పష్టమైన వైఖరితో ఉంది. భారత్ ఎల్లప్పుడూ తన ప్రజల ప్రయోజనాలకు తగినట్లుగానే నిర్ణయం తీసుకుంటుందని తెలిపింది. ఇంధన అవసరాలే భారత్ ప్రాధాన్యత అని ఇటీవల నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టే హెచ్చరికల సమయంలో విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. 'ఈ విషయంపై నివేదికలను చూశాం. పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నాం. గతంలో చెప్పిందే మళ్లీ చెబుతున్నాం. భారత ప్రజల ఇంధన అవసరాలను తీర్చడం మాకు అత్యంత ప్రాధాన్యత. ఈ ప్రయత్నంలో, మార్కెట్లలో అందుబాటులో ఉన్నవాటిపై ప్రపంచ పరిస్థితులను బట్టి మేం నిర్ణయం తీసుకుంటాం. ఈ విషయంలో ఏవైనా ద్వంద్వ ప్రమాణాలుంటే వాటికి వ్యతిరేకంగా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటాం'అని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారు.

ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకంలో శుభాంశు శుక్లా వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి(ఐఎస్ఎస్) వెళ్లొచ్చిన మొట్టమొదటి భారతీయ వ్యోమగామిగా చరిత్ర సృష్టించిన శుభాంశు శుక్లా వ్యాఖ్యలకు పాఠ్యపుస్తకంలో చోటుదక్కింది. జాతీయ విద్యా, పరిశోధన, శిక్షణ మండలి(ఎన్‌సీఈఆర్‌టీ) తాజాగా విడుదల చేసిన ఐదో తరగతి పర్యావరణ శాస్త్ర పుస్తకంలో ఈ అంశాన్ని చేర్చారు. శుభాంశు శుక్లా ఐఎస్ఎస్‌కి చేరుకున్న తర్వాత ప్రధాని నరేంద్ర మోదీతో మాట్లాడారు. తన అనుభవాన్ని పంచుకున్నారు. అంతరిక్ష కేంద్రం నుంచి భూమి ఎలా దర్శనమిస్తోంది అని మోదీ ప్రశ్నించగా.. భూమి అంతా ఒక్కటిగానే ఉందని, ఎలాంటి సరిహద్దులు కనిపించడం లేదని శుభాంశు బదులిచ్చారు. ''భూమిపై సరిహద్దులు లేవు. రాష్ట్రాలు లేవు, దేశాలు లేవు. మానవాళిలో మనమంతా భాగమే. భూమి మన ఇల్లు. భూమిపై మనుషులంతా ఒక్కటే'' అని చెప్పారు. ''మన అద్భుతమైన ప్రపంచం'' అనే శీర్షికతో ఎన్‌సీఈఆర్‌టీ ఈ పుస్తకం ప్రచురించింది. 'భూమి.. మనందరి ఇల్లు' అనే అధ్యాయంలో భాగంగా శుభాంశు శుక్లా వ్యాఖ్యలను చేర్చింది. ఈ వ్యాఖ్యలు విద్యార్థులకు స్ఫూర్తినిస్తాయని, సరిహద్దులకు అతీతంగా ఆలోచించడానికి, ఐక్యమత్యాన్ని అలవర్చుకోవడానికి దోహదపడతాయని అధికారులు చెప్పారు. జూన్ 25వ తేదీన అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి బయలుదేరిన శుభాంశు శుక్లా 18 రోజుల తర్వాత విజయవంతంగా భూమిపైకి తిరిగివచ్చిన సంగతి తెలిసిందే.

ఇరాన్ అణు కార్యక్రమంపై 24న తుర్కియేలో చర్చలు

పాల్గొననున్న జర్మనీ, బ్రిటన్, ఫ్రాన్స్‌ల ప్రతినిధులు

టెహ్రాన్: తమ అణు కార్యక్రమంపై యూరప్ దేశాలతో చర్చలను తిరిగి ప్రారంభించనున్నట్లు ఇరాన్ మంగళవారం ప్రకటించింది. వచ్చే శుక్రవారం తుర్కియేలోని ఇస్తాంబుల్‌లో చర్చలు జరుగుతాయని ప్రకటించింది. ఇందులో తమ దేశ ప్రతినిధులు బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ దేశాల అధికారులతోపాటు ఈయూ విదేశాంగ విధానం చీఫ్ కాయా కల్లాస్‌తో కూడా చర్చలు జరుపుతారని వివరించింది. ఉప మంత్రిత్వ శాఖల హోదాలో జరిగే ఈ చర్చల ప్రధాన లక్ష్యం ఇరాన్ శాంతియుత అణు కార్యక్రమానికి సంబంధించిన అంశాలు, ఆంక్షల ఎత్తివేయడమేనని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఎస్మాయిల్ తెలిపారు. ఇరాన్ అణు కార్యక్రమంపై మేలో కూడా తుర్కియే వేదికగానే చర్చలు జరిగాయి. జూన్‌లో ఇజ్రాయెల్, ఇరాన్ పరస్పరం డ్రోన్, వైమానిక దాడులు చేసుకోగా అమెరికా సైతం ఇరాన్ అణు స్థావరాలపై భారీ బాంబులు వేసింది. ఆ తర్వాత చర్చలు జరగనుండటం ఇదే మొదటిసారి కానుంది. తిరిగి అణు చర్చలకు రాకుంటే 2015లో కుదిరిన ఒప్పందం ప్రకారం తిరిగి కఠిన ఆంక్షలను అమలు చేయక తప్పదని ఈయూ చేసిన హెచ్చరికలతో ఇరాన్ దిగివచ్చిందని చెబుతున్నారు.

ముంబై రైల్వే పేలుళ్ల కేసులో సుప్రీంకు

- సోమవారం బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేసిన ఏటీఎస్
- రేపు విచారణ జరపనున్న ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం

న్యూఢిల్లీ: 2006 ముంబై రైలు పేలుళ్ల కేసులో 12 మంది దోషులను నిర్దోషులుగా ప్రకటిస్తూ బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) మంగళవారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. మహారాష్ట్ర ఏటీఎస్ తరపున వాదించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా బాంబే హైకోర్టు తీర్పుతో విభేదిస్తూ అత్యవసర విచారణను కోరారు. దీంతో ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్, న్యాయమూర్తులు కె. వినోద్ చంద్రన్, ఎన్.వి.అంజరియాలతో కూడిన ధర్మాసనం దీనిపై గురువారం విచారణ జరిపేందుకు అంగీకరించింది.

2006 జూలై 11న ముంబైలోని వెస్టర్న్ రైల్వే లోకల్ లైన్‌లో జరిగిన ఏడు బాంబు పేలుళ్లు జరిగాయి. 11 నిమిషాలపాటు జరిగిన ఏడు పేలుళ్లలో 189 మంది ప్రాణాలు కోల్పోయారు. 800 మందికి పైగా గాయపడ్డారు. పేలుళ్లకు కుట్ర పన్ని అమలు చేసినందుకు ఐదుగురు నిందితులకు (ఒకరు మరణించారు) మరణశిక్ష, మరో ఏడుగురికి జీవిత ఖైదు విధిస్తూ ట్రయల్ కోర్టు 2009లో తీర్పు ఇచ్చింది. దీంతో వీరు ట్రయల్ కోర్టు తీర్పుపై బాంబే హైకోర్టును ఆశ్రయించారు. వాటిని సవాల్ చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం కూడా పిటిషన్ దాఖలు చేసింది. అనేక అభ్యర్థనల తర్వాత 2024 జులైలో ఈ కేసు విచారణకు హైకోర్టు ప్రత్యేక బెంచ్‌ను ఏర్పాటు చేసింది. అప్పటినుంచి విచారణ జరిపిన ధర్మాసనం సోమవారం సంచలన తీర్పునిచ్చింది. ఆ 12 మందిని నిర్దోషులుగా ప్రకటించింది. వారిపై ఉన్న అభియోగాలను నిర్ధారించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని చెప్పింది. ట్రయల్ కోర్టు ఉత్తర్వులను పక్కన పెడుతున్నట్లు జస్టిస్ అనిల్ కిలోర్, జస్టిస్ శ్యామ్ చందక్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం పేర్కొన్నది. దర్యాప్తు సమయంలో స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలు, ఆయుధాలు, మ్యాప్‌లు పేలుళ్లకు సంబంధం లేనివిగా కనిపిస్తున్నాయని తెలిపింది. పేలుళ్లలో ఎలాంటి బాంబులను ఉపయోగించారో కూడా ప్రాసిక్యూషన్ నిరూపించలేకపోయిందని పేర్కొంది. 'నిందితులపై కేసును నిరూపించడంలో ప్రాసిక్యూషన్ పూర్తిగా విఫలమైంది. నిందితులు నేరం చేశారని నమ్మడం కష్టం. అందువల్ల వారిని నిర్దోషులుగా ప్రకటిస్తున్నాం'అని తెలిపింది. నిందితులు మరే ఇతర కేసుల్లోనూ వాంటెడ్‌గా లేకపోతే వారిని జైలునుంచి వెంటనే విడుదల చేయాలని కోర్టు ఆదేశించింది.

నితీశ్ కోసమే ధన్‌ఖడ్‌తో రాజీనామా: ఆర్‌జేడీ

పట్నా: ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా వ్యవహారం బీజేపీ కుట్రగా ప్రతిపక్ష ఆర్జేడీ ఆరోపించింది. బిహార్ అసెంబ్లీకి త్వరలో ఎన్నికలు జరగనుండగా బీజేపీ ఈ కుట్రకు తెరతీసిందని ఆర్‌జేడీ నేత అఖ్తరుల్ ఇస్లామ్ షహీన్ పేర్కొన్నారు. దీని ద్వారా అప్రాధాన్యమైన ఉపరాష్ట్రపతి వంటి పోస్టులో సీఎం నితీశ్ కుమార్‌ను కూర్చోబెట్టాలనేదే బీజేపీ అసలు ఉద్దేశమన్నారు. 'నితీశ్ కుమార్‌ను తప్పించి, బిహార్‌లో తమ పార్టీ సీఎంను కూర్చోబెట్టాలని బీజేపీ ఎప్పటినుంచో ప్రయత్నిస్తోంది. వచ్చే ఎన్నికల్లో ఎన్‌డీఏ ఓటమి ఖరారని భావిస్తున్న బీజేపీ హఠాత్తుగా ఈ ఎత్తుగడ వేసింది'అని ఆయన తెలిపారు. గతంలో పలుమార్లు నితీశ్ ఉపరాష్ట్రపతి పదవి చేపట్టనున్నారంటూ వచ్చిన వార్తలను ఆయన గుర్తు చేశారు. ఈ వ్యాఖ్యలను సీఎం నితీశ్‌కుమార్ సారథ్యంలోని జేడీయూ ఖండించింది. బిహార్‌ను విడిచి నితీశ్ ఎక్కడికీ వెళ్లబోరని, మరోసారి రాష్ట్రంలో ఎన్‌డీఏను విజయపథంలో నడుపుతారని స్పష్టం చేసింది.

ధర్మస్థలలో సామూహిక ఖననాలపై సిట్

బెంగళూరు: దక్షిణ కన్నడ జిల్లా ధర్మస్థలలో సామూహిక ఖననాలు జరిగాయన్న వార్తలపై దర్యాప్తు చేపట్టేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను ఏర్పాటు చేసినట్లు కర్నాటక హోం మంత్రి జి.పరమేశ్వర మంగళవారం వెల్లడించారు. త్వరలోనే ఈ బృందం అక్కడికి వెళ్లి విచారణ ప్రారంభిస్తుందని చెప్పారు. డీజీపీ(ఇంటర్నల్ సెక్యూరిటీ డివిజన్) ప్రణబ్ మహంతా సారథ్యం వహించే నలుగురు సభ్యుల ఈ బృందానికి అవసరమైన అన్ని రికార్డులను అందుబాటులో ఉంచాలని స్థానిక పోలీసులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. గత రెండు దశాబ్దాల్లో సామూహిక హత్యలు, అత్యాచారాలకు గురైన వారినందర్నీ ధర్మస్థలలో ఖననం చేసినట్లు వార్తలు రావడం తెల్సిందే. గతంలో అక్కడ పనిచేసిన పారిశుద్ధ్య కార్మికుడొకరు దీనిపై మేజిస్ట్రేట్ ఎదుట వాంగ్మూలం కూడా ఇచ్చారు. 1995–2014 మధ్య కాలంలో హత్యకు గురైన చిన్నారులు, మహిళలు సహా పలువురిని ఖననం చేయాలంటూ తనను బెదిరించారని ఆరోపించారు. వీరిలో అత్యాచారానికి గురైన వారు సైతం ఉన్నారని చెప్పారు. ఈ విషయం రాష్ట్రంలో సంచలనంగా మారింది. ప్రభుత్వం మాత్రం తమకెటువంటి సమాచారం లేదని అంటోంది.

భార్యకు సంపాదన ఉన్నా.. భరణం ఇవ్వాల్సిందే

ముంబై: భార్య ఉద్యోగి అయినా సరే.. విడాకుల తర్వాత తన భర్త నుంచి భరణం పొందే హక్కు ఉంటుందని బాంబే హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్ తీర్పు ఇచ్చింది. భార్యకు ప్రతి నెలా రూ.15,000 భరణం చెల్లించాలని ఆదేశిస్తూ దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఒక వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఊర్మిళా జోషి ఫాల్కే విచారించారు. ఆ వ్యక్తి పిటిషన్‌ను న్యాయమూర్తి తోసిపుచ్చుఆరు. అనేక అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత ఆ వ్యక్తి వాదనలు చెల్లవని కోర్టు భావిస్తుందన్నారు. నాగ్‌పూర్‌కు చెందిన ఓ వ్యక్తికి.. వార్ధాకు చెందిన మహిళ విడాకులు తీసుకున్నారు. అయితే.. విడాకుల సందర్భంలో ఆ మహిళకు జీవనభృతిగా రూ.15 వేలు చెల్లించాలని వార్ధా సెషన్స్ కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును అతను హైకోర్టులో సవాలు చేశాడు. తన మాజీ భార్య ఫిజియోథెరపిస్ట్ అని, ఆమె తనకు, తన ఇద్దరు పిల్లలను చూసుకోగలిగేంత సంపాదిస్తున్నారని పిటిషన్‌లో పేర్కొన్నాడు. వారికి జీవనభృతి అవసరం లేదని కోర్టుకు చెప్పాడు. ఈ పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది.

అత్యాచారం అంటూ తప్పుడు ఫిర్యాదు.. పుణె మహిళా టెక్కీపై కేసు

పుణె: డెలివరీ ఏజెంట్ అంటూ అపార్టుమెంట్‌లోని తన ఫ్లాట్‌లోకి వచ్చిన ఓ అగంతకుడు అత్యాచారానికి పాల్పడ్డాడంటూ తప్పుడు ఫిర్యాదు చేసిన పుణెకు చెందిన టెక్కీ(22)పై పోలీసులు నాన్ కాగ్నిజబుల్ కేసు నమోదు చేశారు. ఈ నెల 2వ తేదీ సాయంత్రం డెలివరీ ఏజెంట్ తన ఫ్లాట్‌లోకి ప్రవేశించి, ఓ కెమికల్ స్ప్రే చేసి అపస్మారక స్థితిలోకి వెళ్లాక అత్యాచారానికి పాల్పడ్డాడంటూ 3న ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన ఫోన్‌తో సెల్ఫీ కూడా తీసుకున్నాడని, ఎవరికైనా చెబితే ఫొటోలు బయటపెడతానంటూ బెదిరించాడని కూడా పేర్కొంది. పోలీసుల దర్యాప్తులో తేలిన నిజాలతో కథ మరో మలుపు తిరిగింది. డెలివరీ ఏజెంట్ అని పేర్కొన్న ఆ అగంతకుడు ఆమె స్నేహితుడేనని వెల్లడైంది. ఆమె ఆహ్వానం మేరకే అతడు వెళ్లాడని తేలింది. బలవంతంగా లోపలికి వెళ్లడం, రసాయనం స్ప్రే చేయడం, రేప్ చేయడం వంటివన్నీ అబద్ధాలు, తప్పుదోవ పట్టించేవేనని పోలీసులు తేల్చారు. దీంతో, పోలీసులు ఆ మహిళా టెక్కీపై భారతీయ న్యాయ సంహితలోని 212, 217 సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేశారు. ఫోన్ చాటింగ్, ఘటనాక్రమం, ఇద్దరి ప్రవర్తన వంటివన్నీ గమనించాక ఇది రేప్ కేసు కాదు, కేవలం పోలీసులను పక్కదోవపట్టించేందుకు చేసిన ప్రయత్నంగా గుర్తించామని పుణె పోలీస్ కమిషన్ అమితేశ్ కుమార్ తెలిపారు. కాగా, నాన్ కాగ్నిజబుల్ కేసు నమోదైన వారిని వారెంట్ లేకుండా అరెస్ట్ చేయడం, ప్రశ్నించడం వంటివి చేయరు.

తల్లిని అవమానించాడని పదేళ్లకు ప్రతీకారం

లక్నో: పదేళ్ల కిందట తన తల్లిని ఓ వ్యక్తి అవమానించాడు. అతనిపై ప్రతీకారం తీర్చుకోవడానికి కొడుకు ప్రయత్నిస్తూనే ఉన్నాడు. చివరకు పదేళ్ల తరువాత.. తల్లిని అవమానించిన వ్యక్తిని హత్య చేశాడు. క్లాసిక్ బాలీవుడ్ సినిమా స్క్రిప్ట్‌ని తలపిస్తోంది కదా! కానీ ఇది ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో జరిగిన ఘటన.

పదేళ్ల కిందట ఒక వివాదంలో మనోజ్ అనే వ్యక్తి సోను తల్లిని కొట్టాడు. ఆ తరువాత అక్కడి నుంచి పారిపోయాడు. తన తల్లికి జరిగిన అవమానానికి కలత చెందిన సోను... మనోజ్‌కోసం వెతకడం ప్రారంభించాడు. కాలం గడిచిపోయింది. ప్రతీకార కాంక్ష మాత్రం అతడిని విడిచిపెట్టలేదు. మూడు నెలల క్రిందట లక్నోలోని మున్షి పులియా ప్రాంతంలో మనోజ్‌ను చూశాడు సోను. రెక్కీ చేసి.. మనోజ్ రోజువారీ షెడ్యూల్‌ను నోట్ చేసుకున్నాడు. ఒక ఖచ్చితమైన ప్రణాళికను సిద్ధం చేశాడు. కానీ హత్య చేసేంత వనరులు అతని దగ్గర లేవు. దీంతో.. హత్య తర్వాత వారికి పార్టీ ఇస్తానని చెప్పి నలుగురు స్నేహితులను హత్య కుట్రలో చేర్చుకున్నాడు. మే 22న, మనోజ్ తన దుకాణాన్ని మూసివేసి ఒంటరిగా వెళ్తుండగా.. స్నేహితులతో కలిసి అతనిపై ఇనుప రాడ్లతో దాడి చేశారు. సగం ప్రాణాలతో వదిలేశారు. చికిత్స పొందుతూ మనోజ్ మరణించాడు. దీన్ని ఎలా దర్యాప్తు చేయాలో పోలీసులకు తెలియలేదు. నిందితులు సీసీటీవీ కెమెరాలకు చిక్కినప్పటికీ స్పష్టంగా లేదు. దీంతో ఎంత వెదికినా వారు పోలీసులకు దొరకలేదు. ఇక స్నేహితులకు ఇచ్చిన ప్రకారం దాడి అనంతరం.. పార్టీ ఇచ్చాడు. మద్యం తాగి బయటకు వచ్చాక కొన్ని ఫోటోలు సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఆ ఫొటోలే నిందితులను గుర్తించడంలో పోలీసులకు సాయపడ్డాయి.

చేనేత కార్మికుల కోసం సంక్షేమ పథకాలు

సాక్షి, న్యూఢిల్లీ: చేనేత కార్మికుల సంక్షేమం కోసం జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం(ఎన్‌హెచ్‌డీపీ) కింద పలు పథకాలను అమలు చేస్తున్నట్లు ఆ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ మంగళవారం లోక్‌సభలో తెలిపారు. రూ.1లక్షలోపు ఆదాయం ఉండి, 60 ఏళ్లు పైబడిన వారికి నెలకు రూ.8 వేల వరకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు చెప్పారు. గుర్తింపు పొందిన ప్రభుత్వ సంస్థల్లో డిప్లొమా/అండర్ గ్రాడ్యుయేట్/పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు చదువుకునే చేనేత కార్మికుల పిల్లలకు ఏడాదికి రూ.2 లక్షల స్కాలర్‌షిప్ అందిస్తున్నట్లు చెప్పారు. ప్రమాదవశాత్తు మరణించిన కార్మికులకు ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన(పీఎంజేజేబీవై) వర్తింప జేస్తున్నట్లు తెలిపారు.

మహిళలకు కనీసం టాయిలెట్లూ లేవు!

అమెరికా డిటెన్షన్ సెంటర్లలో అమానుషాలు

వాషింగ్టన్: అనధికారికంగా అమెరికాలో అడుగుపెట్టి అక్కడి అధికారులకు దొరికిపోయిన వారు పడుతున్న కష్టాలు అన్నీఇన్నీ కావు. అమెరికా వ్యాప్తంగా వలసదారులకోసం ఏర్పాటైన డిటెన్షన్ సెంటర్లలో దుర్భర పరిస్థితులున్నట్లు కథనాలు వస్తున్నాయి. మియామీలోని క్రోమ్ నార్త్ సర్వీస్ ప్రాసెసింగ్ సెంటర్‌లో పరిస్థితి మరీ దారుణం. పురుష డిటెయినీలకు ఎదురుగానే మహిళలనూ టాయిలెట్‌కు వెళ్లాలంటూ అక్కడి అధికారులు బలవంతం చేస్తున్నట్లు సమాచారం. ఫ్లోరిడాలోని మూడు డిటెన్షన్ సెంటర్లలోనూ మహిళలకు ప్రత్యేకంగా ఎటువంటి ఏర్పాట్లు లేవు. కనీసం సరైన ఆహారం కూడా అందజేయడం లేదు. పురుషులకు మాత్రమే కేటాయించాల్సిన ప్రాంతాల్లోనే మహిళలనూ ఉంచుతున్నారు. మహిళలకు వ్యక్తిగత గోప్యతకు ఎటువంటి అవకాశాలు లేవు. పురుష డిటెయినీలు హేళనల మధ్యనే స్నానాలు సైతం చేయాల్సి వస్తోంది. కొన్ని రోజులపాటు ఇలాగే కొనసాగాయని మీడియా అంటోంది. చేతులను కలిపి మెడ వెనుక కట్టి ఉంచడంతో ప్లేట్లలో పెట్టిన భోజనాన్ని కుక్కల మాదిరిగా వీరు తినాల్సి వస్తోందని ఓ కథనం పేర్కొంది. పాంపానో బీచ్ డిటెన్షన్ సెంటర్‌లో ఉంచిన భారత సంతతికి చెందిన హర్విందర్ సింగ్ చౌహాన్ పేరును అక్కడి అధికారులు 'చిహువాహువా'అంటూ తూలనాడుతూ పిలిచేవారని ఓ కథనం తెలిపింది.

ఐటీ ట్రిబ్యునల్‌లో కాంగ్రెస్‌కు షాక్

న్యూఢిల్లీ: ఆదాయపన్ను అప్పిలేట్ ట్రిబ్యునల్(ఐటీఏటీ)లో కాంగ్రెస్‌కు చుక్కెదురైంది. 2017–18వ సంవత్సరంలో వచ్చిన రూ.199 కోట్ల విరాళాలపై పన్ను చెల్లించాలంటూ అందిన నోటీసును సవాల్ చేస్తూ చేసుకున్న అప్పీల్‌ను ట్రిబ్యునల్ తోసిపుచ్చింది. మొత్తం రూ.199.15 కోట్లకు గాను కాంగ్రెస్ రూ.197.43 కోట్లను ఖర్చుగా చూపింది. మిగతా రూ.1.71 కోట్లపై మాత్రమే పన్ను వేయాలని వాదించింది. అయితే, సకాలంలో రిటర్నులు దాఖలు చేయనందున అలా కుదరదని ట్రిబ్యునల్ పేర్కొంది.

సరిహద్దుల్లో బీఎస్ఎఫ్ అధునాతన 'డ్రోన్' స్క్వాడ్రాన్

న్యూఢిల్లీ: భారత్–పాకిస్తాన్ సరిహద్దు వెంట శత్రుసేనల డ్రోన్లను నేలకూల్చేలా, నిఘా కార్యకలాపాలను మరింత ఉధృతంచేసేలా సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్) కొత్తగా అధునాతన డ్రోన్ స్క్వాడ్రాన్‌ను రంగంలోకి దింపనుంది. సమస్యాత్మకంగా తయారైన బోర్డర్ పోస్టుల వద్ద ఈ డ్రోన్ స్క్వాడ్రాన్ విధుల్లో ఉంటుంది. ''నిఘా, పర్యవేక్షణ, శత్రు డ్రోన్లను నేలకూల్చడం, అవసరమైతే దాడి చేయడం ఈ స్క్వాడ్రాన్ ప్రధాన విధి. ఈ డ్రోన్లను ఆపరేట్ చేసేందుకు ప్రత్యేక శిక్షణ పొందిన సిబ్బంది సరిహద్దుల వెంట విధుల్లో ఉంటారు''అని బీఎస్ఎఫ్ వర్గాలు మంగళవారం వెల్లడించాయి. ఈ డ్రోన్ ఆపరేటింగ్ బృందాలు చండీగఢ్‌లోని వెస్టర్న్ కమాండ్ ప్రధానకార్యాలయంతో సమన్వయంతో పనిచేస్తాయి. ఆపరేషన్ సిందూర్‌కు ప్రతిగా మే 10న జమ్మూలోని ఆర్ఎస్‌పురా సెక్టార్‌లోని ఖార్కోలా బోర్డర్ పోస్ట్ వద్ద పాక్ డ్రోన్ బాంబును జారవిడిచిన ఘటనలో ఇద్దరు బీఎస్ఎఫ్ జవాన్లు, ఒక ఆర్మీ జవాను చనిపోయారు. పాక్ నుంచి డ్రోన్ల దండు దూసుకొచ్చిన నేపథ్యంలో డ్రోన్ల వ్యవస్థను మరింత పటిష్ఠంచేయాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. జమ్మూ, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్‌ల వెంట మొత్తంగా 2,000 కిలోమీటర్లకుపైగా ఉన్న భారత్, పాక్ సరిహద్దు వెంట కీలక ప్రాంతాల్లో ఈ డ్రోన్ స్క్వాడ్రాన్‌ను మోహరించనున్నారు.

ఢిల్లీలో స్వల్ప భూకంపం

న్యూఢిల్లీ: ఢిల్లీతోపాటు దేశ రాజధాని ప్రాంతంలో మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో భూమి కంపించింది. ఎన్‌సీఆర్ పరిధిలోని హరియాణా రాష్ట్రం ఫరీదాబాద్ కేంద్రంగా భూమికి 5 కిలోమీటర్ల లోతులో సంభవించిన ఈ భూకంపం తీవ్రత రిక్టర్ స్కేలుపై 3.2గా నమోదైందని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ తెలిపింది. ఎటువంటి ఆస్తి, ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం లేదని పేర్కొంది.

దేశంలో 2.15 లక్షల మందికి సికిల్ సెల్ వ్యాధి

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో సికిల్ సెల్ వ్యాధి(ఎస్‌సీడీ) బాధితుల సంఖ్య పెరుగుతోందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ తెలిపింది. దేశవ్యాప్తంగా 6 కోట్ల మందికి పరీక్షలు చేయగా 2.15 లక్షల మందికి వ్యాధి ఉన్నట్లు వెల్లడైందని పేర్కొంది. 16.7 లక్షల మందిని క్యారియర్లుగా గుర్తించామంది. రాష్ట్రాలు 2.6 కోట్ల మందికి ఆరోగ్య కార్డులను సైతం పంపిణీ చేశాయని వివరించింది. తెలంగాణ, మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, కర్ణాటక, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాలు వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో లక్ష్యాలకు మించి పనిచేశాయని తెలిపింది. వ్యాధి ఎక్కువగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్‌లలో ఉందని పేర్కొంది.

రుగ్వేదంలో ఎంత మంది దేవతల ప్రస్తావన ఉంది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ



వైదిక నాగరికత - 2

తొలి వేద కాలంలో ఆర్యులు ప్రధానంగా సప్త సింధూ ప్రాంతానికే పరిమితమయ్యారు. తూర్పున యమునా నదిని దాటి విస్తరించలేదు. అందుకే తొలివేద కాలానికి చెందిన రుగ్వేదంలో సింధూ, దాని ఐదు ఉపనదులతోపాటు సరస్వతిని అధికంగా ప్రస్తావించారు. కానీ మలివేద కాలానికి ఆర్యులు యమునను దాటి గంగామైదాన ప్రాంతానికి విస్తరించారు. ఈ భౌగోళిక విస్తరణతో పాటే మలివేద కాలం నాటికి ఆర్యుల ఆర్థిక, సామాజిక, రాజకీయ, మత వ్యవస్థల్లో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి.

వైదిక నాగరికత లక్షణాలు

సామాజిక వ్యవస్థ: ఆర్యులు భారతదేశంలో వర్ణ వ్యవస్థను ప్రవేశపెట్టారు. సమాజాన్ని నాలుగు వర్ణాలుగా విభజించారు. ఇందులో మొదటి మూడు వర్ణాలైన బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులను ద్విజులుగా పరిగణించారు. నాలుగో వర్ణమైన శూద్రులు రుగ్వేద కాలం చివరలో కనిపిస్తారు. అయితే ఈ వర్ణ వ్యవస్థ అంత కఠినంగా లేదు. ఏ వర్ణం వారైనా ఏ వృత్తినైనా చేపట్టవచ్చు. వర్ణాంతర వివాహాలు అధికంగానే జరిగేవి. అయితే అనులోమ వివాహాల సంఖ్య అధికంగా ఉంది. ఆనాటి సమాజంలో పైన పేర్కొన్న నాలుగు వర్ణాలతోపాటు దస్యులు అనే మరొక వర్గం కూడా ఉంది. వీరు ఆర్యుల చేతిలో ఓడిపోయిన స్థానిక ప్రజలు. వాస్తవంగా 'వర్ణం' అనే పదానికి రంగు అని అర్థం. నలుపు వర్ణంలో ఉన్న స్థానిక ప్రజలను సూచించేందుకు దీన్ని వాడారు. నాటి సమాజంలో స్త్రీలకు గౌరవప్రదమైన స్థానం ఉండేది. పాలనా సభల్లో కూడా మహిళలకు ప్రాతినిధ్యం ఉంది. స్త్రీలు భర్తతోపాటు యజ్ఞ యాగాది క్రతువుల్లో పాల్గొనేవారు. తమ జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకోవడంలోనూ స్వేచ్ఛ ఉండేది. వీరికి విద్యా హక్కు కూడా ఉండేది. ఉన్నత విద్యను అభ్యసించిన 20 మంది మహిళా మేధావుల ప్రస్తావన రుగ్వేదంలో కనిపిస్తోంది. బాల్య వివాహాలు, సతీ సహగమనం వంటి దురాచారాలకు తావు లేదు. వితంతు పునర్వివాహాలకు, నియోగ వివాహాలకు అవకాశముండేది. అపాల, విశ్వవర, ఘోష మొదలైన బ్రహ్మవాదినులు.. జీవితాంతం వివాహం లేకుండా విద్యార్జనకే తమ జీవితాలను అంకితం చేసినట్లు తెలుస్తోంది. రుగ్వేదంలోని చాలా శ్లోకాలను మహిళలే రచించారని చరిత్రకారుల అభిప్రాయం. బృహదారణ్యక ఉపనిషత్‌లో గార్గి అనే బ్రహ్మవాదినికి యజ్ఞవల్క్య మహర్షికి మధ్య జరిగిన తాత్విక చర్చల ప్రస్తావన ఉంది.

మలివేద కాలం నాటికి చాతుర్వర్ణ వ్యవస్థ బాగా స్థిరపడింది. వర్ణ వ్యవస్థ కఠినంగా మారింది. దీనికితోడు వర్ణాశ్రమ ధర్మ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. దీని ప్రకారం జీవితాన్ని బ్రహ్మచర్యం, గృహస్థం, వానప్రస్థం, సన్యాసం అనే నాలుగు దశలుగా విభజించారు. ఒకే వర్ణానికి చెందిన వారి మధ్య మాత్రమే వివాహాలను అనుమతించేవారు. గోత్ర సంప్రదాయం అమల్లోకి వచ్చింది. ఒకే గోత్రానికి చెందిన వారి మధ్య వివాహాలను అనుమతించేవారు కాదు. వర్ణాంతర వివాహాలు నిషేధించినా అవి ఆగలేదు. అందుకే వర్ణ సంకర సిద్ధాంతాన్ని రూపొందించారు. ఈ కాలంలోనే అష్ట వివాహ పద్ధతి ప్రాచుర్యంలోకి వచ్చింది. ఇందులో బ్రహ్మ, దైవ, అర్ష, ప్రజాపత్య, గాంధర్వ, అసుర, రాక్షస, పైశాచ అనే 8 రకాల పద్ధతులున్నాయి. వీటిలో గాంధర్వ, రాక్షస వివాహాలకు క్షత్రియులను అనుమతించారు. వర్ణాంతర వివాహాల వల్ల సమాజంలో అనేక మిశ్రమ కులాలు వచ్చి చేరాయి. రుగ్వేద కాలంతో పోలిస్తే స్త్రీల గౌరవ మర్యాదలు క్షీణించాయి. వారిపై అనేక రకాలైన ఆంక్షలను విధించారు. స్త్రీలకు సంబంధించి అనేక సామాజిక దురాచారాలు ప్రారంభమయ్యాయి. బాల్య వివాహాలు, సతీ సహగమనం, వితంతు వివాహాలను నిషేధించారు. వేదాధ్యయనం చేసే అవకాశం స్త్రీలకు లేదు. పున్నామ నరకాన్ని తప్పించేవాడు అని పుత్ర సంతానానికి ప్రాధా న్యం పెరిగింది. సభ, సమితి వంటి వాటిలోనూ స్త్రీలకు సభ్యత్వం లేకుండా పోయింది.

ఆర్థిక వ్యవస్థ: రుగ్వేద ఆర్యుల ప్రధాన వృత్తి పశుపోషణ. కాబట్టి గోవులకు అమిత ప్రాధాన్యతనిచ్చారు. రుగ్వేదంలో 'గోవ్' అనే పదాన్ని 176సార్లు ప్రస్తావించారు. వీరి సంపదకు మూలం పశువులే. కాబట్టి పశువుల దొంగతనాలను ఘోరాపరాధంగా పరిగణించేవారు. ఈ నేరానికి కఠినమైన శిక్షలుండేవి. ఆ కాలంలో 'పాణిలు' అనేవారు పశువుల దొంగతనాలకు పాల్పడేవారు. పశు సంపదను రక్షించడం రాజన్ ముఖ్య విధి. కాబట్టి రాజన్‌ను 'గోప, గోపతి' అనే పేర్లతో పిలిచేవారు. సంపన్నమైన వ్యక్తిని 'గోమత్' అనేవారు. 'గవిష్టి' అంటే గోవుల కోసం చేసే యుద్ధం లేదా గోవుల కోసం వెదకడం అని అర్థం. ఈ విధంగా వీరి ఆర్థిక వ్యవస్థలో సమస్త పదాలు గోవులతో ముడిపడి ఉండడాన్ని బట్టి చూస్తే పశువులు రుగ్వేదార్యుల ఆర్థిక వ్యవస్థలో ముఖ్య స్థానం ఆక్రమించినట్లు తెలుస్తోంది. పశుపోషణ తర్వాత ఆర్యుల ప్రధాన వృత్తి వ్యవసాయం. ఇంకా స్థిర జీవనం ఏర్పడనందున వ్యవసాయాన్ని పరిమితంగానే చేపట్టారు. వీరి ముఖ్య పంటలు గోధుమ, బార్లీ. తొలివేద కాలంలో అనేక రకాల చేతివృత్తుల వారు ఉన్నారు. చేతివృత్తుల్లో రథాలను తయారు చేసే రథకారులకు (వడ్రంగులు) ప్రముఖ స్థానముండేది.

ఇంకా ఇతర వృత్తుల్లో వస్త్రాలు, కుండలు, చర్మ వస్తువుల తయారీ మొదలైనవి పేర్కొనదగినవి. లోహాన్ని 'అయాస్' అని పిలిచారు. లోహ వస్తువులను తయారు చేసేవారిని 'కర్మార' అనేవారు. ఆ కాలంలో రాగి లేదా కంచును అధికంగా ఉపయోగించారు. తొలివేద కాలంలో పరిమిత స్థాయిలో వ్యాపార, వాణిజ్యాలు జరిగాయి. రుగ్వేదంలో 'నిష్క' అనే నిర్దిష్ట విలువ కలిగిన బంగారు ఆభరణం గురించి ప్రస్తావన ఉంది. దీన్ని నాణెంగా ఉపయోగించారని కొందరి అభిప్రాయం. అయినప్పటికీ వాణిజ్యం ప్రధానం వస్తు మార్పిడి పద్ధతిలోనే జరిగేది. వేదాల్లో 'ఫణి' అనే అనార్య జాతికి చెందిన వ్యాపారస్థుల ప్రస్తావన ఉంది.

మలివేద కాలానికి ఆర్యుల ఆర్థిక జీవనంలో పెనుమార్పులు సంభవించాయి. దీనికి ప్రధాన కారణం వీరు సప్త సింధూ నుంచి ప్రపంచంలోనే అత్యంత సారవంతమైన గంగా మైదానానికి విస్తరించడమే. ఈ విస్తరణకు ఇనుప పరిజ్ఞానం తోడై ఆర్యుల ఆర్థిక వ్యవస్థ వ్యవసాయాధార ఆర్థిక వ్యవస్థగా మారడానికి కారణమైంది. ఇనుమును వీరు 'కృష్ణ ఆయా' లేదా 'శ్యామ అయా' అని పిలిచారు. ఇనుప నాగళ్ల ఉపయోగం ప్రారంభమైంది. శతపథ బ్రాహ్మణంలో వివిధ రకాలైన వ్యవసాయ కార్యకలాపాల గురించిన ప్రస్తావన ఉంది. గోధుమ, బార్లీతోపాటు వరి ప్రధాన పంటగా రూపొందింది. ఈ వ్యవసాయాభివృద్ధి వల్ల ఆర్యుల సంచార జీవితం అంతమై స్థిర జీవనం ప్రారంభమైంది. తొలివేద కాలంతో పోలిస్తే వృత్తుల సంఖ్య కూడా పెరిగింది. లోహకారులకు ప్రాధాన్యం పెరిగింది. ఈ అభివృద్ధి అంతా కలిసి చిన్న చిన్న పట్టణాలు ఏర్పడటానికి దారి తీసింది. మలివేద గ్రంథాల్లో కనిపించే 'నగరం' అనే పదాన్ని ఈ పట్టణాలకు సంకేతంగా భావించవచ్చు. అయితే వాస్తవంగా పట్టణాలు ఏర్పడింది మాత్రం మలివేద యుగం చివరలో మాత్రమే. మలివేద గ్రంథాల్లో పేర్కొన్న కొన్ని ముఖ్య పట్టణాలు.. కాశీ, కౌశాంబి, వైదేహ, అయోధ్య, హస్తినాపూర్, ఇంద్రప్రస్థ మొదలైనవి. విస్తృత వ్యవసాయం, స్థిరమైన జీవన విధానం, పట్టణ జీవితం, చేతి వృత్తులు ఇవన్నీ కలిసి వ్యాపార వాణిజ్యాల అభివృద్ధికి దోహదపడ్డాయి. దీంతో వ్యాపార నిర్వహణకు వ్యాపారస్తులు 'శ్రేణులు' లేదా 'గణ'లుగా ఏర్పడ్డారు. రుగ్వేద కాలపు నిష్కతోపాటు అనేక రకాలైన నాణేలు వచ్చాయి. అవి.. శతమాన, క్రిష్ణాల, సువర్ణ, హిరణ్య పిండ మొదలైనవి. బృహదారణ్యక ఉపనిషత్‌లో 'పద' అనే నాణెం ప్రస్తావన ఉంది. అయితే వాస్తవంగా ఇవన్నీ నిర్ణీత విలువ కలిగిన ఆభరణాలు మాత్రమే. అసలైన నాణేలు వాస్తవంగా క్రీ.పూ. 6వ శతాబ్దంలో ప్రారంభమయ్యాయి. అవే విద్ధాంక నాణేలు. అథర్వణ వేదం సంతల గురించి, అక్కడి సందడిని గురించి ప్రస్తావిస్తోంది. ఈ కాలంలో వడ్డీ వ్యాపారం కూడా ఒక వృత్తిగా గుర్తింపు పొందింది. వడ్డీ వ్యాపారిని 'కుసిదిన్' అని పిలిచేవారు.

రాజకీయ వ్యవస్థ: రుగ్వేద కాలంలో పూర్తిస్థాయి రాచరిక వ్యవస్థ ఏర్పడలేదు. పాలక వర్గాలను రాజన్య అని పిలిచేవారు. ఈ వర్గాల నుంచే రాజన్‌ను ఎన్నుకునేవారు. రాజన్‌ను రాజుగా కంటే తెగ నాయకుడిగా పరిగణించడమే సబబుగా ఉంటుంది. రాజన్ ముఖ్య విధి ప్రజలను కాపాడడంతో పాటు వారి ప్రధాన సంపద అయిన గోవులను దొంగిలింపకుండా కాపాడటం. దీని కోసం గూఢచారులను నియమించేవారు. ఇంకా పురోహితుడు, సేనాపతి, ప్రజాపతి మొదలైన వారు రాజుకు సహాయకులుగా ఉండేవారు. 'ప్రజాపతి' ముఖ్య విధి గడ్డి మైదానాల పర్యవేక్షణ. రుగ్వేద కాలంలో వశిష్ఠుడు, విశ్వామిత్రుడు ప్రసిద్ధి చెందిన పురోహితులు. దశరాజ యుద్ధానికి వీరు పరోక్ష కారకులు. రుగ్వేద కాలంలో కుటుంబాన్ని 'కుల' అన్నారు. కుటుంబ పెద్దను 'కులప' అని పిలిచేవారు. కొన్ని కులాల కలయికతో ఏర్పడేదే గ్రామం. దీనికి 'గ్రామణి' అధిపతిగా ఉండేవాడు. కొన్ని గ్రామాల సమూహాన్ని 'విస్' అనేవారు. దీనికి విస్పతి అధిపతిగా ఉండేవాడు. ఇలాంటి విస్‌ల సముదాయంతో 'జన' లేదా'తెగ' ఏర్పడుతుంది. దీని నాయకుడే 'రాజన్'. అయితే రుగ్వేద కాలంలో రాజన్ అధికారం అపరిమితమైంది కాదు. సభ, సమితి, విధాత, గణ అనే ప్రజా సభలు రాజన్ అధికారాన్ని నియంత్రించేవి. రుగ్వేదంలో బలి, భాగ అనే పన్నుల ప్రస్తావన ఉంది. ఇవి వాస్తవంగా పన్నులు కావు. 'బలి' అనేది ప్రజలు రాజుకు ఇచ్చే కానుక. 'భాగ' అనేది యుద్ధంలో కొల్లగొట్టిన సంపదలో రాజు వాటా.

మలివేద కాలానికి ఆర్యులు స్థిర జీవనానికి అలవాటు పడ్డారు. కాబట్టి రుగ్వేద కాలం నాటి తెగల ఆధారిత పాలనా వ్యవస్థ స్థానంలో ప్రదేశం ఆధారిత పాలనా వ్యవస్థ ఏర్పడింది. వీటినే 'జనపదాలు' అంటారు. ఈ కాలంలో రాజన్ కేవలం గోవులను రక్షించే గోపతి మాత్రమే కాదు.. సుశిక్షిత సైన్యాన్ని కలిగి ఉండి పక్క రాజ్యాలను ఆక్రమించే స్థాయికి ఎదిగాడు. దీనికోసం రాజసూయ, అశ్వమేధ, వాజపేయ వంటి యజ్ఞ, యాగాలూ ప్రారంభమయ్యాయి. రాజుపై నియంత్రణాధికారమున్న సభలు క్షీణించి సభ, సమితులు మాత్రమే మిగిలాయి. అవి కూడా నామమాత్రపు సలహా మండళ్లుగా మారిపోయాయి. దీనివల్ల సభలతో ఎంపికయ్యే రాజన్ పదవి వంశపారంపర్య పదవిగా మారిపోయింది. ఈ కాలంలో రాజుకు సహాయ సహకారాలు అందించేందుకు 'ద్వాదశ రత్నిన్' అనే మంత్రి మండలి ఏర్పడింది. వీరిలో ప్రధాన పురోహితుడు, పట్టమహిషి, సేనాని, సూత, సంగ్రహిత్రి, భాగదుఘ, అక్షావాప, గోవికర్తన, గ్రామణి మొదలైనవారు సభ్యులుగా ఉండేవారు. బలి, భాగ అనేవి పూర్తిస్థాయి పన్నులుగా మారాయి. వాటి వసూలుకు బాగదుఘ అనే అధికారి ఉండేవాడు. అయినప్పటికీ ఈ కాలానికి పూర్తిస్థాయి అధికార యంత్రాంగం మాత్రం ఏర్పడలేదు.

మత వ్యవస్థ: రుగ్వేద కాలపు ఆర్యులు ప్రకృతి శక్తులను అర్థం చేసుకోలేకపోవడంతో వాటికి దైవత్వాన్ని ఆపాదించారు. మానవ రూపమిచ్చి పూజించారు. రుగ్వేదంలో మొత్తం 33 మంది దేవతల ప్రస్తావన ఉంది. వీరందరిలో అతిముఖ్య దైవం ఇంద్రుడు లేదా పురంధరుడు. ఇతడు యుద్ధ దేవత. రెండో ముఖ్య దైవం అగ్ని. ఇతడిని మానవులకు, దేవతలకు మధ్య వారధిగా భావించారు. వరుణుడు ప్రకృతిని క్రమబద్ధీకరించే దేవత. ఇంకా సోమ, ఉషస్,అదితి, పృథ్వీ, అరణ్యాని మొదలైన దేవతల ప్రస్తావన ఉంది. వీరి పూజా విధానంలో భక్తికి ప్రాధాన్యముండేది. భక్తి శ్లోకాలను ఆలపించడం, కానుకలను సమర్పించడం ద్వారా దేవతలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నించారు. తమకు ప్రీతిపాత్రమైన సోమ, సుర అనే పానీయాల్ని నైవేద్యంగా సమర్పించేవారు. వీరు ప్రధానంగా సంతానం, పశు సంపద కోసం దేవతలను ప్రార్థించారు.

మలివేద కాలానికి రుగ్వేదపు ప్రధాన దేవతల ప్రాధాన్యత తగ్గిపోయింది. ఇంద్రుడు, అగ్ని వంటి దేవతల స్థానాన్ని త్రిమూర్తులు ఆక్రమించారు. రుగ్వేదపు ప్రధాన దేవతలు అష్టదిక్పాలకులుగా మారిపోయారు. సృష్టికర్త అయిన ప్రజాపతి ప్రధాన దేవతగా, రుద్రుడు, విష్ణువు మొదలైనవారు ఇతర ముఖ్య దేవతలుగా అవతరించారు. ఈ కాలంలో వచ్చిన మరొక ముఖ్యమైన మార్పు వర్ణాల వారీగా దేవతలు ఏర్పడటం. ఈ విధంగా ఏర్పడిన దేవతే 'పుషాన్' అనే శూద్రుల దేవత. ఆర్యుల పూజా విధానంలోనూ మార్పులు సంభవించాయి. భక్తి ప్రాధాన్యత తగ్గి యజ్ఞ యాగాలు,బలిదానాలకు ప్రాధాన్యత పెరిగింది. విపరీతమైన జంతు బలుల వల్ల పశు సంపదకు పెద్ద నష్టం వాటిల్లింది. మోక్ష మార్గం సంక్లిష్టం, వ్యయభరితం అవడమే కాకుండా శూద్రులు, స్త్రీలు వంటి కొన్ని వర్గాలకు మోక్ష మార్గాన్ని నిరాకరించారు. మలివేద కాలంలో మత వ్యవస్థలో చోటు చేసుకున్న ఈ పరిణామాలన్నీ కలిసి వైదిక యుగం చివరినాటికి అంటే క్రీ.పూ. 6వ శతాబ్దం నాటికి వైదిక మతంపై తిరుగుబాటుగా అనేక మత ఉద్యమాలు రావడానికి కారణమయ్యాయి.

మాదిరి ప్రశ్నలు

1. వేద కాలం నాటి 'పాణిలు' అంటే?
   1) నాణేలు 2) సైనిక వర్గం
   3) వ్యాపారులు 4) పశువుల దొంగలు
2. రుగ్వేదంలో వ్యవసాయదారుడిని ఏ పేరుతో సూచించారు?
   1) కినాస 2) శూద్ర 3) క్షేత్రక 4) కర్షక
3. వీటిలో తప్పుగా జతపర్చిన దాన్ని గుర్తించండి?
   1) గోఘన - అతిథి 2) దౌహిత్రి - కూతురు
   3) గోప - పశుకాపరి 4) గవిష్టి - యుద్ధం
4. వీరిలో పురోహితుల దైవం?
   1) ఇంద్రుడు 2) అగ్ని
   3) వరుణుడు 4) సూర్యుడు
5. వైదిక యుగంలోని ఏ సభలను ప్రజాపతి (బ్రహ్మ) పుత్రికలుగా భావిస్తారు?
   1) సభ, సమితి 2) సమితి, విధాత
   3) విధాత, గణ 4) గణ, పరిషత్
6. వేద కాలంలో ఏ వృత్తి వారికి ఉపనయనం ధరించే అర్హతను కల్పించారు?
   1) స్వర్ణకారులు 2) రథకారులు
   3) చర్మకారులు 4) లోహకారులు
7. వీటిలో సరైన జతను గుర్తించండి?
   1) కులాల-కుండలు తయారు చేసేవారు
   2) నిషాద - చేపలు పట్టేవారు
   3) కైవర్త - బుట్టలు అల్లేవారు
   4) వేణ - వేటాడేవారు
8. కింద ఇచ్చిన జాబితాల నుంచి సరైన సమాధానాన్ని గుర్తించండి?

జాబితా -1	జాబితా-2
ఎ) సూత	1) మంగలి
బి) దౌహిత్రి	2) వధించరానిది (ఆవు)
సి) గోఘన	3) రథకారుడు
డి) అఘన్య	4) కూతురు
ఇ) వాప్త	5) అతిథి

కోడ్స్:	ఎ	బి	సి	డి	ఇ
1	5	4	1	2	3
2	3	4	5	2	1
3	3	4	1	2	5
4	1	2	3	4	5

9. దశరాజ యుద్ధానికి కారకుడైన పురోహితుడు?
   1) దుర్వాసుడు 2) విశ్వామిత్రుడు
   3) యజ్ఞవల్క్య 4) సుదాసు
10. వైదిక యుగ పాలనా విభాగాలను సరైన ఆరోహణ క్రమంలో అమర్చండి?
   1) రాష్ట్ర, జన, విశ్, గ్రామ, కుల
   2) జన, రాష్ట్ర, గ్రామ, కుల, విశ్
   3) కుల, గ్రామ, విశ్, జన, రాష్ట్ర
   4) కుల, గ్రామ, విశ్, రాష్ట్ర, జన

సమాధానాలు

1) 4; 2) 1; 3) 3; 4) 2; 5) 1; 6) 2; 7) 1; 8) 2; 9) 2; 10) 3.

బీభత్స, భయానక రసాలకు అనువైన శైలి?

కావ్య స్వరూపం - ప్రయోజనాలు - శైలి

కావ్య స్వరూపం

- 'కవిః కర్మమ్ కావ్యమ్' – కవి కలం నుంచి జాలువారిన అపూర్వ సృష్టి కావ్యం. కవి ఆత్మీయతలు కావ్యంలో ప్రతిఫలిస్తాయి. ప్రాచీనుల దృష్టిలో కవిత్వం అంటే కేవలం ఛందోబద్ధ రచనగా రూఢమైంది. పద్యం, గద్యం, పద్య గద్యాత్మక చంపూ కావ్యమైనా కావ్యమే.

కాంతా సమ్మితమైన కావ్యానికి భారతీయ ఆలంకారికులు,పాశ్చాత్య విమర్శకులు ఇచ్చిన నిర్వచనాల ద్వారా కావ్య స్వరూపాన్ని నిర్ధారించొచ్చు.

భారతీయ ఆలంకారికుల కావ్య నిర్వచనాలు

- **భరతుడు:**'ఇతివృత్తంతు కావ్య శరీరమ్'.. నాట్య శాస్త్రంలో ఇతివృత్తమే కావ్య శరీరమని చెప్పారు.
- **దండి:** 'కావ్యాదర్శం'లో 'ఇష్టార్థ వ్యవచ్ఛిన్న పదావళీ కావ్యమ్'.. మనోహరమైన అర్థంతో కూడిన పదాల సమూహమే కావ్యమన్నారు.
- **భామహుడు:** 'కావ్యాలంకారం'లో 'శబ్దార్థౌసహితౌ కావ్యమ్'.. హితంతో కూడిన శబ్దార్థాల సమూహమే కావ్యమని చెప్పారు.
- **రుద్రటుడు:** శబ్దార్థాల సమాహారమే కావ్యమన్నారు.
- **భోజుడు:** సరస్వతీ కంఠాభరణంలో 'నిర్దోషం గుణవత్కావ్యమలంకృతై రలంకృతమ్ రసాన్వితం కవిః కుర్వన్ కీర్తిం ప్రీతించవిదంతి'.. దోషరహితంగా, గుణసహితంగా, అలంకార యుక్తంగా రసాన్వితమైన కావ్యాన్ని రచించిన కవి యశాన్ని, ఆహ్లాదాన్ని పొందగలడు.
- **మమ్మటుడు:** 'తదదోషౌశబ్దార్థౌ సగుణావనలంకృతే పునఃక్వాపికావ్యమ్'.. దోష రహితంగా, గుణ సహితంగా ఉన్న శబ్దార్థాలే కావ్యమని, ఒక్కొక్కసారి అలంకార రహితమైనా దాన్ని కావ్యంగా పరిగణించవచ్చని చెప్పారు.
- **హేమచంద్రుడు:** మమ్మటుడిలా మరింత స్పష్టంగా 'అదోషౌసగుణౌ సాలంకారౌచ శబ్దార్థౌ కావ్యమ్'.. దోష రహితమైన, గుణసహితమైన, సాలంకారమైన శబ్దార్థాలే కావ్యమని చెప్పారు.
- **విశ్వనాథుడు:** సాహిత్య దర్పణంలో మమ్మటుడు, హేమచంద్రుడు చెప్పిన నిర్వచనాలను ఖండించారు. ఆయన అభిప్రాయంలో రస సంబంధ దోషమే దోషమని, శాబ్దిక దోషాలున్నా కావ్యత్వ హాని జరగదని రస ప్రాధాన్యంలో 'వాక్యం రసాత్మకం కావ్యం' అన్నారు. రస ప్రాధాన్య దృష్టితో రసవత్తరమైన ఒక మహావాక్యమే కావ్యమన్నారు.
- **జగన్నాథ పండిత రాయలు:** విశ్వనాథుడి నిర్వచనంలో అతివ్యాప్తి, అవ్యాప్తి దోషాలున్నాయని జగన్నాథ పండిత రాయలు విమర్శించారు. రసం లేకున్నా లోకోత్తర చమత్కార జనకాలైన వ్యంగ్య రచనలు లోకంలో కావ్యాలుగా గొప్పగా విలసిల్లుతున్నాయన్నారు. ఆయన 'రమణీయార్థక ప్రతిపాదక శబ్దఃకావ్యమ్'..రమణీయమైన అర్థాన్ని ప్రతిపాదించే శబ్దాల సమూహమే కావ్యమన్నారు. రమణీయమైంది రసవత్తరం కాకపోదని, విశ్వనాథుడి రస ప్రాధాన్యం కూడా ఇందులో ఉన్నందువల్ల దీన్ని నిర్దుష్టమైన నిర్వచనంగా ఆలంకారికులు నిర్ధారించారు.
- వామనుడు 'రీతి'ని కావ్యాత్మగా నిర్వచించారు. ఆనంద వర్ధనుడు 'ధ్వని' సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. పీయూష వర్ధనుడు పండిత రాయల అభిప్రాయానికి అనుగుణంగా కావ్యాన్ని నిర్వచించారు. శౌద్ధోదని.. విశ్వనాథుడి రస సిద్ధాంతానికి అనుగుణంగా కావ్యాన్ని ప్రతిపాదించారు. కుంతకుడు వక్రోక్తి సిద్ధాంతాన్ని వ్యక్తీకరించారు. క్షేమేంద్రుడు ఔచిత్య సిద్ధాంతాన్ని నిర్వచించారు.
- భారతీయ ఆలంకారికుల అభిప్రాయాలను అనుసరించి దోష రహితమైన, గుణ సహితమైన, రసవత్తరమైన రమణీయ శబ్దార్థాల సముదాయాన్ని కావ్యంగా పరిగణించడం సమంజసంగా ఉంటుంది.

పాశ్చాత్య విమర్శకులు - కావ్య నిర్వచనాలు

- **శామ్యూల్ జాన్సన్:** కవిత్వమంటే ఛందోబద్ధమైన రచన అన్నారు. బుద్ధి భావనలతో ఆనంద సత్యాలను సమైక్యంగా సంఘటించే కళగా పేర్కొన్నారు.
- **వర్డ్స్‌వర్త్:** ప్రశాంత మానసిక స్థితిలో ఉద్రిక్తత నుంచి ఆవిర్భవించే తీవ్ర అనుభూతుల స్వచ్ఛంద విజృంభణమే కవిత్వమని చెప్పారు.
- **షెల్లీ:** సాధారణంగా భావానుగుణమైన వ్యక్తీకరణమే కవిత్వం అన్నారు.
- **హాజ్లిట్:** షెల్లీ అభిప్రాయాన్ని మరికొంత స్పష్టంగా వివరిస్తూ భావనాశక్తికి అనుకూలమైన శబ్ద సముదాయమే కవిత్వం అని చెప్పారు.
- **కార్లయిల్:** సంగీత లయాత్మక భావనే కవిత్వం అన్నారు.
- **మాథ్యూ ఆర్నాల్డ్:** 'సత్య నిబంధనలతో కూడిన జీవిత విమర్శనమే కవిత్వం' అన్నారు.
- **కోల్‌రిడ్జ్:** ఉత్తమ పదాలను సముచిత రీతిలో అమర్చడమే కవిత్వం అని చెప్పారు.
- **ఎడ్గార్ ఎలెన్ పో:** లయాత్మక సౌందర్య సృష్టి కవిత్వం అని చెప్పారు.

పాశ్చాత్య విమర్శకుల్లో ఎడ్గార్ ఎలెన్ పో నిర్వచనాన్ని ఉత్తమమైందిగా విమర్శకులు పరిగణించారు.



కావ్య ప్రయోజనాలు

- ఆలంకారికుల్లో మమ్మటుడు, అభినవ గుప్తుడు, ఆనంద వర్ధనుడు, భామహుడు, జగన్నాథ పండిత రాయలు వంటివారు కావ్య ప్రయోజనాలను సవివరంగా చర్చించారు. పాశ్చాత్య విమర్శకులు లోవెల్, జాన్ డ్రైడెన్, స్కాలిజర్ వంటి వారు కావ్య ప్రయోజనాలను వివరించారు. వాటిని పరిశీలిద్దాం.
- **మమ్మటుడు:**
  1) యశస్సు, అర్థం లభిస్తుంది.
  2) వ్యవహార జ్ఞానం సిద్ధిస్తుంది.
  3) అమంగళ పరిహారం కలుగుతుంది.
  4) జీవన్ముక్తి ప్రదాయకాలైన ఆహ్లాద తన్మయత్వాలు కలుగుతాయి.
- **అభినవ గుప్తుడు:** కావ్యం కాంతా సమ్మితంగా ఉపదేశం చేస్తుంది.
- **భామహుడు:**
  1) సత్కావ్యం ధర్మార్థ కామమోక్షాదులైన చతుర్విధ పురుషార్థాలను కలిగిస్తుంది.
  2) లలిత కళా పరిజ్ఞానాన్ని అందిస్తుంది.
  3) సత్కీర్తిని, నిరంతర ఆహ్లాదాన్ని కలిగిస్తుంది.
- **జగన్నాథ పండిత రాయలు:** సాహితీవ్రతుడైన కవికి ఎనలేని గౌరవం కలుగుతుందని చెప్పారు. సాహితీవ్రతుడు కానివాడు వ్యాసుడైనా, గౌతముడైనా, పతంజలైనా కానిమ్ము వానికి తిరస్కారం, పురస్కారం చూపక నా శిరస్సు ఉదాసీనతను ప్రకటిస్తుందన్నారు.
- **లోవెల్:** కావ్యంలో తత్వబోధ ఉండాలన్నారు. తత్వబోధ లేని కావ్యం తనకు పాథేయం కాదన్నారు.
- **జాన్ డ్రైడెన్:** కావ్యానికి ముఖ్య ప్రయోజనం ఆనందం అని, అనుషంగిక ప్రయోజనం ఉపదేశమని చెప్పారు.
- **స్కాలిజర్:** 'ఆనందకరమైన బోధనే' కావ్య ప్రయోజనం అన్నారు.

పాశ్చాత్య విమర్శకులు ఆనందం, ఉపదేశం, తాత్వికత, బోధనలను కావ్య ప్రయోజనాలుగా భావించారు.

కావ్య శైలి

- ఆలంకారికులు కావ్య శైలికి సంబంధించి గుణాలు, రీతులు, పాకాలను పేర్కొన్నారు. ప్రాచీన, ఆధునిక పద్య కావ్యాల శైలికి సంబంధించి ఇవి ప్రామాణికాలు. ఆధునిక సృజనాత్మక వచన ప్రక్రియలైన కథానిక, నవల, నాటకం వంటి వాటిలో శైలికి సంబంధించి కథన చాతుర్యం, పాత్రలు, సంభాషణలు వంటివి ప్రధానమైనవి. ఆంగ్లంలో 'స్టైల్' అనే పదానికి సమానార్థకంగా 'శైలి' పదాన్ని విమర్శకులు పరిగణిస్తున్నారు.
- ఆలంకారికుల్లో భామహుడు మూడు కావ్య గుణాలను పేర్కొన్నారు.
  1) ప్రసాదం 2) ఓజస్సు 3) మాధుర్యం.

1. **ప్రసాదం:** ప్రసిద్ధ పదాల ప్రయోగంతో, సులువుగా అర్థాన్ని స్ఫురింపజేసే రచన ప్రసాద గుణం. **ఉదా:** మొల్ల, వేమన, కరుణశ్రీ వంటి వారి పద్య రచనలు ప్రసాద గుణభరితాలు.
2. **ఓజస్సు:** క్లిష్టమైన అక్షరాల కూర్పుతో, దీర్ఘ సమాస భూయిష్ఠమైన రచన ఓజో గుణం. **ఉదా:** శ్రీనాథుడు, శ్రీకృష్ణదేవరాయలు, భట్టుమూర్తి వంటి వారి పద్య రచనలు ఓజో గుణ ప్రధానాలు.
3. **మాధుర్య గుణం:** స్పష్టంగా అర్థమయ్యే విడివిడి పదాలతో కూడిన రచన మాధుర్య గుణం. తిక్కన, పోతన, కరుణశ్రీ వంటి వారి రచనలు మాధుర్య గుణభరితాలు.

- **రీతులు:** వామనుడు కావ్యాత్మగా రీతిని ప్రతిపాదించాడు. విశిష్ట పద రచనతో కూడిన కావ్యం రీతి ప్రధానం. రీతులు మూడు విధాలు. అవి..
  1) వైదర్భీ రీతి 2) గౌడీ రీతి
  3) పాంచాలి రీతి

1. **వైదర్భీ రీతి:** సమాస రహితమైన, సరళమైన అక్షరాల కూర్పుతో కూడిన రచన వైదర్భీ రీతి. **ఉదా:** మొల్ల రామాయణం, వేమన పద్యాలు.
2. **గౌడీ రీతి:** పరుషమైన అక్షరాల కూర్పుతో, మహా ప్రాణాక్షరాల బంధంగా, దీర్ఘ సమా స భూయిష్ఠమైన రచన గౌడీ రీతి. కాశీఖండం, భీమ ఖండం, ఆముక్తమాల్యద, వసు చరిత్ర, పాండురంగ మహాత్మ్యం, శ్రీమద్రామాయణ కల్పవృక్షం వంటి కావ్యాలు ఈ రీతికి ఉదాహరణలు.
3. **పాంచాలి రీతి:** కొంత సరళంగా, కొంత కఠినంగా, పై రెండు రీతులు కలయికగా ఉండే రచన 'పాంచాలి రీతి'. తిక్కన భారతం, పోతన భాగవతం, శివ భారతం వంటి కావ్యాలు ఉదాహరణలు.

- **వృత్తులు:** ఆలంకారికులు మూడు వృత్తులను పేర్కొన్నారు. కావ్య శైలికి సంబంధించిన రచనా విధానాలు వృత్తులు.
  1) కైశికీ వృత్తి 2) సాత్వతీ వృత్తి
  3) ఆరభటీ వృత్తి

1. **కైశికీ వృత్తి:** సరళమైన విడి పదాలతో కూడిన రచనా శైలి కైశికీ వృత్తి. శృంగార రస శైలికి అనువైంది.
2. **సాత్వతీ వృత్తి:** మరీ క్లిష్టంగా, మరీ సరళంగా కాకుండా మధ్యస్థంగా ఉండే శైలీ విధానానికి సంబంధించింది.. సాత్వతీ వృత్తి. వీర రస ప్రధానమైన రచనలకు అనువైంది.
3. **ఆరభటీ వృత్తి:** ప్రౌఢమైన సమాస భూయిష్ఠమైన రచనా శైలికి సంబంధించింది.. ఆరభటీ వృత్తి. బీభత్స, భయానక రసాలకు అనువైంది.

- **పాకాలు:** రసోచిత శబ్దార్థాల సమ్మేళనాలే కావ్య శైలికి సంబంధించిన పాకాలు. కావ్య గుణాలు, కావ్య రీతులు, వృత్తులు కలిపి పాకాలుగా ఏర్పడతాయి. ఆలంకారికులు మూడు పాకాలను పేర్కొన్నారు.
  1) ద్రాక్షాపాకం 2) కదళీపాకం
  3) నారికేళపాకం

1. **ద్రాక్షాపాకం:** సులువుగా అర్థమయ్యే రచనా శైలి ద్రాక్షాపాకం. మాధుర్య గుణం + వైదర్భీ రీతి + కైశికీ వృత్తుల సమ్మేళనమే ద్రాక్షాపాకం. శృంగార రసానికి అనువైన శైలి ద్రాక్షాపాకం.
2. **కదళీపాకం:** కొంత కఠినంగా, కొంత సరళంగా ఉండే రచనా శైలి కదళీపాకం. ప్రసాద గుణం + పాంచాలి రీతి + సాత్వతీ వృత్తుల కలయిక కదళీపాక శైలి. వీర రస స్ఫోరకమైన రచనలకు అనుకూలమైంది.
3. **నారికేళపాకం:** ప్రౌఢ రీతిలో ఉన్న పద్య శైలీ రచన నారికేళ పాకం. ఓజో గుణం + గౌడీ రీతి + ఆరభటీ వృత్తుల కలయిక నారికేళ పాకం. బీభత్స, భయానక రసాలకు అనువైన శైలి.

గత డీఎస్సీలో అడిగిన ప్రశ్నలు

1. విశ్వనాథుడి కావ్య నిర్వచనం?
   1) ఇష్టార్థ వ్యవచ్ఛిన్న పదావళీ కావ్యం
   2) రమణీయార్థక ప్రతిపాదక శబ్దం కావ్యం
   3) శబ్దార్థౌ సహితౌ కావ్యం
   4) వాక్యం రసాత్మకం కావ్యం
2. వేద పురాణ కావ్యాలు వరుసగా?
   1) ప్రభు కాంతా మిత్ర సమ్మితాలు
   2) కాంతా ప్రభు మిత్ర సమ్మితాలు
   3) మిత్ర కాంతా ప్రభు సమ్మితాలు
   4) ప్రభు మిత్ర కాంతా సమ్మితాలు
3. జగన్నాథ పండితరాయల కావ్య నిర్వచనం?
   1) నను శబ్దార్థేః కావ్యం
   2) నిర్దోష లక్షణ వతీస కావ్య శబ్దభాక్
   3) ఇష్టార్థ వ్యవచ్ఛిన్న పదావళీ కావ్యం
   4) రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యం

సమాధానాలు

1) 4; 2) 4; 3) 4.

మాదిరి ప్రశ్నలు

1. 'ఇష్టార్థ వ్యవచ్ఛిన్న పదావళీ కావ్యం' అని చెప్పిన ఆలంకారికుడు?
   1) విశ్వనాథుడు 2) దండి
   3) భోజుడు 4) భామహుడు
2. 'శబ్దార్థౌ సహితౌ కావ్యం' అని నిర్వచించిన ఆలంకారికుడు?
   1) అభినవ గుప్తుడు 2) దండి
   3) భామహుడు 4) భరతుడు
3. 'నిర్దోషం గుణ వత్కావ్య మలంకారై రలంకృతమ్' అని చెప్పిన ఆలంకారికుడు?
   1) రుద్రటుడు 2) భోజుడు
   3) వామనుడు 4) మమ్మటుడు
4. 'అపారే కావ్య సంసారే కవి రేవ ప్రజాపతిః' అని చెప్పిన ఆలంకారికుడు?
   1) విద్యాధరుడు 2) భట్టతౌతుడు
   3) ఆనంద వర్ధనుడు 4) వామనుడు
5. శృంగార రసానికి అనువైన కవిత్వ పాకం?
   1) నారికేళ పాకం 2) కదళీ పాకం
   3) ద్రాక్షాపాకం 4) కైశికి పాకం

సమాధానాలు

1) 2; 2) 3; 3) 2; 4) 3; 5) 3.

ఏ జీర్ణ రసంలో ఎంజైములు ఉండవు?

పోషణ- ఆహార సరఫరా వ్యవస్థ

- ప్రతి జీవి అనేక జీవన కార్యక్రమాలు నిర్వర్తించడానికి శక్తి అవసరం. ఈ శక్తి శరీరంలో ఆహార పదార్థాలు ఆక్సీకరణం చెందితే ఉత్పత్తి అవుతుంది.
- జీవులన్నింటికీ పెరుగుదల, శారీరక ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించుకోవడం, అనేక జీవక్రియలను నిర్వర్తించుకోవడానికి ఆహారం అవసరం.
- శక్తి విడుదల, పెరుగుదలకు, శరీర నిర్మాణానికి అవసరమైన రసాయనిక పదార్థాలను పోషకపదార్థాలు (లేదా) పోషకాలు (Nutrients) అంటారు. పోషకపదార్థాలు సేకరించడాన్ని పోషణ (Nutrition) అంటారు.
- అమీబా వంటి ఏకకణ జీవులు మొదలు మానవుల వంటి బహుకణ జీవుల వరకు ప్రతి జీవి అనేక రకాల పదార్థాలను ఆహారంగా తీసుకుంటాయి.
- మానవ శరీరంలో వివిధ కణాలకు తమ విధులను నిర్వర్తించడానికి వేర్వేరు రకాల పోషకాలు అవసరం అవుతాయి.
- ఆహార సేకరణ వేర్వేరు జీవుల్లో విభిన్నంగా ఉంటుంది.

ఈ పాఠంలో చేయదగిన ప్రయోగాలు

1. పిండి పదార్థాల ఉనికిని నిర్ధారించే అయోడిన్ పరీక్ష.
2. కిరణజన్య సంయోగక్రియకు కార్బన్ డై ఆక్సైడ్ ఆవశ్యకతను నిరూపించే ప్రయోగం.
3. కిరణజన్య సంయోగక్రియకు సూర్యరశ్మి ఆవశ్యకతను నిరూపించే ప్రయోగం.
4. కిరణజన్య సంయోగక్రియలో ఆక్సిజన్ విడుదలవుతుందని నిరూపించే ప్రయోగం.

కీలక పదాలు

- **గ్లూకోజ్:** ఒకే ఒక చక్కెర అణువు కలిగిన సరళ కార్బోహైడ్రేట్.
- **పిండి పదార్థం:** ఇది సంక్లిష్ట కార్బోహైడ్రేట్. మొక్కల్లో ఆహార పదార్థం పిండి పదార్థం రూపంలో నిల్వ ఉంటుంది.
- **సెల్యులోజ్:** వృక్ష కణ కవచంలో ఉండే సంక్లిష్ట కార్బోహైడ్రేట్.
- **గ్రానా:** హరిత రేణువులో థైలకాయిడ్ దొంతరలను గ్రానా అంటారు.
- **స్ట్రోమా:** హరితరేణువులో థైలకాయిడ్ దొంతరల మధ్య ద్రవంతో నిండిన భాగాన్ని స్ట్రోమా అంటారు.
- **కాంతి చర్య:** కిరణజన్య సంయోగక్రియలో కాంతి సమక్షంలో జరిగే చర్యను కాంతి చర్య లేదా కాంతి రసాయన దశ అంటారు. ఇది హరితరేణువులోని గ్రానా థైలకాయిడ్‌ల్లో జరుగుతుంది.
- **నిష్కాంతి చర్య:** కిరణజన్య సంయోగ క్రియలో కాంతి శక్తి అవసరం లేకుండా జరిగే చర్యను నిష్కాంతి చర్య అంటారు.
- **పర పోషణ:** ఇతర జీవులపై ఆహారం కోసం ఆధారపడే వాటిని పరపోషకాలు అంటారు. పరపోషకాల్లోని పోషణ విధానాన్ని పర పోషణ అంటారు.
- **హుస్టోరియా:** పరాన్నజీవి మొక్కల్లో రూపాంతరం చెందిన వేళ్లను హుస్టోరియా అంటారు. ఇవి అతిథేయి మొక్కనుంచి నీరు, పోషకాలను గ్రహిస్తాయి.
- **ఆహార నాళం:** మానవుడి జీర్ణవ్యవస్థలో నోటి నుంచి జీర్ణాశయం వరకు ఉన్న పొడవాటి నాళాన్ని ఆహార నాళం లేదా ఆహార వాహిక అంటారు.
- **లాలాజల గ్రంథులు:** ఇవి నోటిలో ఉండే 3 జతల గ్రంథులు. ఇవి లాలాజలాన్ని స్రవిస్తాయి. అవి.. 1. అధోజిహ్వక 2. అధోజంబిక 3. పెరోటిడ్ గ్రంథులు.
- **పెరిస్టాలిక్ చలనం:** ఆహారం ఆహార వాహిక ద్వారా ప్రయాణిస్తున్నప్పుడు అలలు లేదా తరంగాల మాదిరిగా ఉండే చలనాన్ని పెరిస్టాలిక్ చలనం అంటారు.
- **అమైలేజ్/టైలిన్:** లాలాజలంలో ఉండే ఎంజైమ్‌ను అమైలేజ్ లేక టైలిన్ అంటారు. ఇది సంక్లిష్ట కార్బోహైడ్రేట్‌లను సరళమైన పదార్థాలుగా మారుస్తుంది.
- **పెప్సిన్:** ప్రొటీన్‌లను చిన్న చిన్న అణువులు గా మార్చే ఎంజైమ్‌ను పెప్సిన్ అంటారు.
- **కైమ్:** పాక్షికంగా జీర్ణమైన చిక్కటి రూపంలో ఉన్న ఆహారాన్ని కైమ్ అంటారు.
- **సంవరణి కండరాలు:** జీర్ణాశయంలో ఆహార పదార్థాల ప్రసరణని నియంత్రించే కండరాలు.
- **జీర్ణక్రియ:** ఎంజైముల సహాయంతో సంక్లిష్ట పదార్థాలను సరళ పదార్థాలుగా విడగొట్టి శరీరం శోషించుకోవడానికి అనువుగా మార్చే విధానాన్ని జీర్ణక్రియ అంటారు.
- **క్లోమం:** ఆంత్రమూలం వంపులో ఉండే జీర్ణ గ్రంథి. ఇది క్లోమ రసాన్ని స్రవిస్తుంది.
- **ఎంజైమ్:** సంక్లిష్ట పదార్థాలను సరళ పదార్థాలుగా మార్చే రసాయన పదార్థాలను ఎంజైములు అంటారు.
- **సూక్ష్మ చూషకాలు:** చిన్న ప్రేగు గోడల్లో చిన్న వేళ్ల మాదిరిగా ఉండే నిర్మాణాలను సూక్ష్మ చూషకాలు అంటారు. ఇవి ప్రేగుల ఉపరితల వైశాల్యాన్ని పెంచుతాయి.
- **పైత్య రసం:** కాలేయం నుంచి విడుదలయ్యే జీర్ణ రసాన్ని పైత్యరసం అంటారు. దీనిలో ఎంజైములుండవు.



- **లైపేజ్:** కొవ్వులను కొవ్వు ఆమ్లాలు, గ్లిజరిన్‌గా మార్చే ఎంజైమ్‌ను లైపేజ్ అంటారు.
- **కొవ్వులు:** కొవ్వులు.. ఫాటీ ఆమ్లాలు, గ్లిసరాల్‌తో ఏర్పడతాయి. 20°C వద్ద కొవ్వులు ఘన రూపంలో ఉంటాయి. ఇవి ఆక్సీకరణం చెంది ఎక్కువ శక్తినిస్తాయి.
- **కాలేయం:** మానవ జీర్ణ వ్యవస్థలో అతి పెద్ద గ్రంథి. ఇది పైత్యరసాన్ని స్రవిస్తుంది.
- **ఎమల్సీకరణం:** కాలేయం ద్వారా విడుదలయ్యే పైత్యరసం కొవ్వు పదార్థాలను జీర్ణం చేసి చిన్న చిన్న రేణువులుగా మారుస్తుంది. ఈ విధానాన్ని ఎమల్సీకరణం అంటారు.

1 మార్కు ప్రశ్నలు

1. **కిరణజన్య సంయోగక్రియకు సమతుల్య సమీకరణం రాయండి? (A.S.I)**
జ. $6CO_2 + 12H_2O$ $C_6H_{12}O_6 + 6H_2O + 6O_2$
2. **ప్రయోగ అమరికను కదపకుండా పుదీనా మొక్కను గంటజాడీలో ప్రవేశపెట్టడానికి జోసఫ్ ప్రీస్టే ఏం చేసి ఉంటాడు?(A.S.II)**
జ. ప్రయోగ అమరికను కదపకుండా గంట జాడీని పక్కకు వంచి పుదీనా మొక్కను జోసఫ్ ప్రీస్టే లోపల పెట్టి ఉండవచ్చు.
3. **కొవ్వొత్తికి, ఎలుకకు, పుదీనా మొక్కకు మధ్య మీరు ఏమైనా సంబంధాన్ని గుర్తించారా? అది ఏమిటి? (A.S.II)**
జ. 1. కొవ్వొత్తి మండటానికి, ఎలుక శ్వాసక్రియకు కావాల్సిన ఆక్సిజన్ పుదీనా మొక్క నుంచి లభిస్తుంది.
2. ఎలుక శ్వాసక్రియకు ఆక్సిజన్‌ను వినియోగించగా, కొవ్వొత్తి నుంచి వచ్చే కార్బన్‌డై ఆక్సైడ్‌ను పుదీనా మొక్క వినియోగించుకొని ఆక్సిజన్‌ను విడుదల చేస్తుంది.
4. **కిరణజన్య సంయోగక్రియలో కార్బన్ డై ఆక్సైడ్ ఆవశ్యకత ప్రయోగంలో ఉపయో గించే పరికరాలు ఏవి? (A.S.III)**
జ. 1. కుండీలో పెరుగుతున్న పొడవాటి ఆకులు గల మొక్క
2. వెడల్పు మూతి గల గాజుసీసా
3. నిలువుగా చీల్చిన బెండు బిరడా
4. పొటాషియం హైడ్రాక్సైడ్
5. అయోడిన్

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
బయాలజీ

5. **వివిధ రంగులు కలిగిన ఆకులు కూడా కిరణజన్య సంయోగక్రియ నిర్వహిస్తాయా?(A.S.I)**
జ. ఎరుపు లేదా పసుపు, వివిధ రంగులు కలిగిన ఆకులు కూడా కిరణజన్యసంయోగ క్రియను నిర్వహిస్తాయి.
6. **మొక్కల్లో కిరణజన్య సంయోగ క్రియ జరిగే భాగాల పేర్లు చెప్పండి? (A.S.I)**
జ. మొక్కల్లో కిరణజన్య సంయోగక్రియ ముఖ్యంగా పత్రాల్లో జరుగుతుంది. వీటితోపాటు పత్రహరితం కలిగిన లేత కాండాలు, మొగ్గల్లో కూడా కిరణజన్య సంయోగక్రియ జరుగుతుంది.
7. **కాంతిచర్య (లేదా) కాంతి రసాయన దశ అంటే ఏమిటి? (A.S.I)**
జ. కిరణజన్య సంయోగక్రియలో కాంతి ద్వారా ప్రేరేపితమైన అనేక రసాయనిక చర్యలు ఒక దానివెంట ఒకటి అతి త్వరగా జరుగుతుంటాయి. కాంతి ప్రధాన పాత్ర పోషించే ఈ దశను కాంతి రసాయన చర్య అంటారు.
8. **అంతర గ్రహణం అంటే ఏమిటి? (A.S.I)**
జ. మనం ఆహారాన్ని తీసుకొనే విధానాన్ని అంతర గ్రహణం అంటారు.
9. **మనం తిన్న ఆహారం శరీరం లోపలికి వెళ్లిన తర్వాత ఏమవుతుంది? (A.S.I)**
జ. మనం తిన్న ఆహారం జీర్ణాశయం, చిన్నప్రేగుల్లో జీర్ణమైన తర్వాత రక్తంలోకి పీల్చుకుంటుంది.
10. **మన లాలాజలంలో ఉండే అమైలేజ్ పని ఏమిటి? (A.S.I)**
జ. అమైలేజ్ ఎంజైమ్ సంక్లిష్ట కార్బోహైడ్రేట్ లను సరళమైన పదార్థాలుగా మారుస్తుంది.
11. **జీర్ణక్రియ అంటే ఏమిటి? (A.S.I)**
జ. ఎంజైముల సహాయంతో సంక్లిష్ట పదార్థాలను సరళ పదార్థాలుగా విడగొట్టి శరీరం శోషించుకోవడానికి అనువుగా మార్చే విధానాన్ని జీర్ణక్రియ అంటారు.
12. **ఆహార వాహికలో ఆహారం కదలిక ప్రక్రియ ను ఏమంటారు? (A.S.I)**
జ. ఆహార వాహికలో ఆహారం కదలిక ప్రక్రియను పెరిస్టాలిక్ చలనం అంటారు.
13. **కింది సమీకరణాన్ని తుల్యం చేయండి? సమీకరణం నుంచి ఏమి గ్రహించారో రాయండి? (A.S.I)**
$CO_2 + 12H_2O$ $C_6H_{12}O_6 + H_2O + 6O_2$
జ. 1. $6CO_2 + 12H_2O$ $C_6H_{12}O_6 + 6H_2O + 6O_2$
2. మొక్కలు.. కాంతి, పత్రహరితం సమక్షంలో కార్బన్ డై ఆక్సైడ్, నీటిని వినియోగించుకొని, కార్బోహైడ్రేట్స్‌ను తయారు చేసుకుంటాయి.
14. **హరిత రేణువులో కాంతిని శోషించే పదార్థాలను ఏమంటారు? (A.S.I)**
జ. హరిత రేణువులో కాంతిని శోషించే పదార్థాలను కిరణజన్య సంయోగక్రియ వర్ణదాలు అంటారు.
15. **పత్రహరితం రక్తంలోని దేన్ని పోలి ఉంటుంది. వీటి మధ్య భేదం రాయండి? (A.S.I)**
జ. 1. పత్రహరితం.. రక్తంలో హిమోగ్లోబిన్ అనే వర్ణదంలోని హీమ్‌ను పోలి ఉంటుంది.
2. హిమోగ్లోబిన్‌లో ఐరన్ ఉంటే, పత్రహరితంలో మెగ్నీషియం ఉంటుంది.
16. **కాంతిచర్య, నిష్కాంతి చర్యల మధ్య సంబంధ పదార్థాలుగా పనిచేసేవి ఏవి? (A.S.I)**
జ. కాంతిచర్యలో అంత్య ఉత్పన్నాలుగా ATP, NADPలు ఏర్పడతాయి. ఇవి నిష్కాంతి చర్య ప్రారంభ పదార్థాలు.
17. **ఏ జీర్ణ రసంలో ఎంజైములు ఉండవు?(A.S.I)**
జ. కాలేయం నుంచి విడుదలయ్యే పైత్యరసం లో ఎంజైములు ఉండవు.
18. **జ్వరంతో బాధపడుతున్న వ్యక్తి కొవ్వులను జీర్ణం చేసుకోలేడు. ఎందుకు? (A.S.II)**
జ. 1. జ్వరంతో బాధపడుతున్న వ్యక్తి శరీరం ఉష్ణోగ్రత ఎక్కువగా ఉంటుంది.
2. ఎక్కువ ఉష్ణోగ్రత వద్ద కొవ్వులను జీర్ణం చేసుకొనే ఎంజైములు ఉత్పత్తి కావు. అందువల్ల అతడు కొవ్వులను జీర్ణం చేసుకోలేడు.

2 మార్కుల ప్రశ్నలు

1. **కిరణజన్య సంయోగక్రియ జరగడానికి కావాల్సిన ముడి పదార్థాలు ఏవి? మొక్కలు వాటిని ఎక్కడ నుంచి గ్రహిస్తాయి? (A.S.I)**
జ. 1. కిరణజన్య సంయోగక్రియ జరగడానికి కావాల్సిన ముడి పదార్థాలు.. కాంతి, కార్బన్ డై ఆక్సైడ్, నీరు, పత్రహరితం.
2. మొక్కలు సూర్యుడి నుంచి కాంతిని గ్రహిస్తాయి.
3. గాలిలోని కార్బన్‌డై ఆక్సైడ్‌ను మొక్కలు పత్రరంధ్రాల ద్వారా గ్రహిస్తాయి.
4. మొక్కలు నేల నుంచి నీటిని వేళ్ల ద్వారా గ్రహిస్తాయి.
5. మొక్కల్లో హరిత రేణువుల్లో పత్ర హరతం ఉంటుంది.
2. **కిరణజన్య సంయోగక్రియలో కార్బన్ డై ఆక్సైడ్ ఆవశ్యకత తెలిపే కృత్యంలోని గాజు సీసాలో పొటాషియం హైడ్రాక్సైడ్ ఉంచక పోతే ఏమి జరుగుతుంది? (A.S.II)**
జ. 1. గాజు సీసాలోని పొటాషియం హైడ్రాక్సైడ్‌కు కార్బన్ డై ఆక్సైడ్‌ను పీల్చుకొనే గుణం ఉంటుంది.
2. ఒకవేళ గాజు సీసాల్లో పొటాషియం హైడ్రాక్సైడ్ (KOH) ఉంచకపోతే సీ సాలో కార్బన్‌డై ఆక్సైడ్‌ను మొక్క ఆకు పీల్చుకొని పిండి పదార్థాలు తయారు చేసుకుంటుంది.
3. కాబట్టి కిరణజన్య సంయోగక్రియలో కార్బన్ డైఆక్సైడ్ ఆవశ్యకతను ఈ కృత్యం ద్వారా నిరూపించలేం.
3. **భూమిపైన ఆకుపచ్చని మొక్కలు లేకపోతే జీవ రాశి మనుగడ కష్టమవుతుందా? దీనిని ఎలా సమర్థిస్తారు? (A.S.5)**
జ. 1. భూమిపైన అన్ని జీవరాసులకు కావాల్సిన ఆహారం, ఆక్సిజన్, కలప, వంటచెరకు వంటివి మొక్కల నుంచి లభిస్తాయి.
2. భూమిపైన ఆకుపచ్చని మొక్కలు లేకపోతే ఆక్సిజన్, ఆహారం ఇతర ముఖ్యమైన పదార్థాలు లభించవు.
3. కాబట్టి మొక్కలపై ఆధారపడే జంతు వులు, సమస్త జీవరాశుల మనుగడ కష్టమవుతుంది.
4. **దాదాపు జీవ ప్రపంచమంతా ఆహారం కోసం మొక్కలపై ఆధారపడుతుంది కదా! ఆకుపచ్చని మొక్కలు ఆహారం తయారుచేసే విధానాన్ని నీవు ఎలా అభినందిస్తావు? (A.S.6)**
జ. 1. ఆకుపచ్చని మొక్కలు కిరణజన్య సంయోగ క్రియ ద్వారా ఆహారాన్ని తయారు చేసుకుంటాయి.
2. దాదాపు జీవ ప్రపంచమంతా ఆహారం కోసం మొక్కలపైనే ఆధారపడుతుంది.
3. ఆకుపచ్చని మొక్కలు ఆహారం తయారీతో పాటు, వాతావరణంలోకి ఆక్సిజన్‌ను కూడా విడుదల చేస్తాయి.
4. జీవుల మనుగడ మొక్కలపై ఆధార పడి ఉంటుంది కాబట్టి మొక్కలు ఎంతైనా అభినందనీయం.

That exactly represents the relationship..

BANK EXAMS
REASONING


Syllogism means inference or deduction. Questions on syllogisms generally consist of two or three statements from which the conclusions are to be derived. The statements and conclusions given may vary from the commonly known facts. Hence, we should not look into the facts or reality of the statements given while deriving conclusions. We have to consider the given statements as true, though they may be abstract, and analyze them carefully in order to check whether the given conclusions can be logically derived from the statements.



SYLLOGISMS

The questions on syllogisms are generally solved by using two methods:
1) Rules based method
2) Venn Diagram method
It is easy and preferable solving any kind of question by using Venn Diagram method.
Firstly, let us discuss how many types of statements are there.
1) All A's are B's
2) Some A' are B's
3) No A is B
4) Some A's are not B's
As you might have noticed above, there are four master statements of which two are affirmative statements and two are negative statements.
Sometimes, the given statements may look different. We have to observe the given statements for each question and find out under which of the above master statements they have to be treated.
Examples:
'Apple is Ball' is treated as 'All Apples are Balls'
'Many bats are cats' is considered as 'Some bats are cats'
'Cat is not Dog' is equivalent to 'No Cat is Dog'
'All Ears are not Fans' is understood as 'Some Ears are not Fans'
Venn Diagrams:
There are two kinds of diagrams..
1) Basic Diagram
2) Alternate Diagram
Basic Diagram: This diagram represents minimum relationship between the terms of the statement. Hence, the least possible relationship should be shown by minimum overlapping.
Alternate Diagrams: The Alternate Diagram/ Diagrams represent other possible ways of the extent of overlapping.
The master statements are represented in the form of venn diagrams as follows:
Checking the validity of conclusions:
There are two types of conclusions. Definite conclusions and Possible conclusions.
Let us discuss how to draw definite conclusions.
Based on the above diagrams we can draw the following definite conclusions for each statement.

Statement	Valid Definite conclusions	Conclusions which are definitely false
All A's are B's	Some B's are A's Some A's are B's ('some' is a part of 'all')	No A is B No B is A Some A's are Not B's
Some B's are C's	Some C's are B's	No C is B No B is C
No C is D	No D is C Some C's are Not D's Some D's are Not C's	All C's are D's All D's are C's Some C's are D's Some D's are C's
Some E's are Not F's	No definite conclusion	All E's are F's



As there are positive statements and negative statements even we have positive conclusions and negative conclusions.
Let us discuss how to draw the conclusions based on the given statements for each question.
The following points can be followed for easy understanding.
- Read the statements and try to find out whether any connecting terms are there between the statements.
- Draw the 'basic diagram' in a combined format that exactly represents the relationship of all the terms in the statements given.


NOW VERIFY THE VALIDITY OF THE GIVEN CONCLUSIONS
1. If Positive definite conclusion follows in the basic diagram, then, it is a VALID conclusion.
2. If Positive definite conclusion does not follow in the basic diagram, Then, it is NOT A VALID conclusion
3. If Negative definite conclusion does not follow in the basic diagram
Then, it is NOT A VALID conclusion. But, verify whether COMPLEMENTARY PAIR is there.
4. We know that there are two Negative conclusions.

i) If negative definite conclusion **'No C is D'** follows in the basic diagram, then see whether **'Some C's are D's'** diagram can be drawn. If we are able to draw then it is NOT A VALID conclusion. If we are unable to draw then it is a VALID conclusion.
ii) If negative definite conclusion **'Some E's are Not F's'** follows in the basic diagram, then see whether **'All E's are F's'** diagram can be drawn. If we are able to draw then it is NOT A VALID conclusion. If we are unable to draw then it is a VALID conclusion

Note: We need not draw alternate diagrams to check the validity of Positive definite conclusions because when they follow in the minimum overlapping then they definitely follows in the maximum overlapping diagram (alternate diagrams).


Model Questions

1. Statements:
1) All Pens are cars
2) All cars are dogs



Now, based on this 'Basic Diagram' we can draw the following Conclusions:
1) All Pens are dogs
2) Some dogs are Pens
3) Some cars are Pens
4) Some dogs are cars

2. Statements:
All chairs are Red
No Red is Spoon



Now, based on this 'Basic Diagram' we can draw the following Conclusions:
1) Some Red are chairs
2) Some chairs are Red
3) No Spoon is Red
4) No chair is Red
Note: 'No Spoon is Red' is valid as we cannot draw alternate diagram' some spoons are Red'. Same is the case with 'No chair is Red'

COMPLEMENTARY PAIR
Sometimes certain pair of conclusions is given which are contradictory to each other.
For Instance, 'Some A's are B's 'contradicts 'No A is B'.
If 'Some A's are B's is true then 'No A is B' cannot be true at the same time and vice versa.
Similarly, 'All A's are B's' contradicts 'Some A's are NOT B's'
If 'All A's are B's' is true then 'Some A's are NOT B's' cannot be true at the same time and vice versa.

3. Statements:
1) Some cans are bottles
2) Some bottles are lids

Diagram-1





Diagram-2



Conclusions:
1) No can is lid
2) Some cans are lids
Explanation: In Diagram-1, 'No can is lid' is TRUE whereas 'Some cans are lids' is NOT TRUE. In Diagram-2, 'NO can is lid' is NOT TRUE whereas 'Some cans are lids' is TRUE.
Hence, we can conclude that 'Either 1 OR 2 follows'.